శ్రీ

శ్రీరస్తు.

శ్రీపార్వతీ పరమేశ్వర సంవాదరూపంబును

శ్రీమద్వాల్మీకి మహర్షి ప్రణీతంబునయిన

# శ్రీమదానందరామాయణము.

## ఆంధ్రవచనము.

సద్గ్రంథప్రకటన కార్యాలయాధికారులగు

బ్ర॥ యం. జి. సుబ్బరాయశాస్త్రులవారిచే విరచితము.

చంద్రా ముద్రాక్షరశాలయందు ముద్రితము.

చెన్నపట్టణము.

1916.

# శ్రీమదానంద రామాయణమునందలి
# విషయానుక్రమణిక.

సారకాండము. ౧.


| విషయసంఖ్య. | విషయము. | | పుటసంఖ్య. |
|---|---|---|---|
| 1. | కౌసల్యాది పట్టమహిషీవివాహము | ... | 1 |
| 2. | శ్రీరామ చంద్రాదుల యుత్పత్తి | ... | 9 |
| 3. | సీతా స్వయంవరము | ... | 11 |
| 4. | బృందా శాపకథనము | ... | 36 |
| 5. | కైకేయీ దశరథుల పూర్వవృత్తాంతము | ... | 47 |
| 6. | శ్రీరామారణ్యవాసవర్ణనము | ... | 56 |
| 7. | విరాధాది రాక్షససంహారము | ... | 65 |
| 8. | వాలి సంహారము | ... | 74 |
| 9. | జానకీ వృత్తాంతము | ... | 82 |
| 10. | సేతు మాహాత్మ్య కాశీ విశ్వేశ్వరాగమములు | ... | 101 |
| 11. | రావణాది రాక్షస సంహారము | ... | 115 |
| 12. | శ్రీరాముఁడు సీతాసమేతముగ నయోధ్యకేఁగుచుట | ... | 132 |
| 13. | శ్రీరామ హనుమంతుల పరాక్రమవర్ణనము | ... | 142 |
| 14. | వాలిసుగ్రీవుల జన్మవృత్తాంతము | ... | 151 |
| 15. | హనుమంతుని జన్మవృత్తాంతము | .. | 152 |
| | యాత్రాకాండము. ౨. | | |
| 16. | వాల్మీకివలన ముందుగ శ్లోకము పుట్టుట | ... | 157 |
| 17. | శివుఁడు చేసిన రామాయణవిభాగము | .. | 159 |
| 18. | యాత్రకు వచ్చెదనని సీత రాముని ప్రార్థించుట | .. | 162 |
| 19. | రాముఁడు గంగానదికిఁ బయనమై పోవుట | .. | 166 |
| 20. | మునివాక్యాను సారముగ యాత్రాగమము నిశ్చయించుట. | | 171 |
| 21. | పూర్వదేశ తీర్థయాత్రా వర్ణనము | .. | 176 |
| 22. | దక్షిణ తీర్థయాత్రా వర్ణనము | .. | 182 |
| 23. | పశ్చిమదేశ యాత్ర | .. | 188 |

| విషయసంఖ్య. | విషయము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 24. | ఉత్తరదిగ్యాత్ర ... | 190 |
| | **యాగకాండము. 3.** | |
| 25. | యజ్ఞోపకరణ వర్ణనము ... | 195 |
| 26. | యాగారంభము ... | 198 |
| 27. | యజ్ఞాశ్వము భూప్రదక్షిణము చేయుట ... | 201 |
| 28. | అగస్తి రామ సంవాదము ... | 205 |
| 29. | రామ నామాష్టోత్తరశతము ... | 208 |
| 30. | యాగమునందలి దినచర్యావర్ణనము ... | 211 |
| 31. | ధ్వజారోపణ విధానము ... | 213 |
| 32. | శ్రీరాముని యవబృథ స్నానవృత్తాంతము ... | 218 |
| 33. | అశ్వమేధ సమాప్తి వర్ణనము ... | 222 |
| | **విలాసకాండము. 4.** | |
| 34. | శ్రీరామస్తవరాజము ... | 229 |
| 35. | జానకీ రతిశాలావర్ణనము ... | 233 |
| 36. | దేహ రామాయణము ... | 237 |
| 37. | దినచర్యా సీతాలంకారవర్ణనములు ... | 240 |
| 38. | జలయంత్ర క్రీడావర్ణనము ... | 242 |
| 39. | బ్రాహ్మణ పత్నికి నలంకార దానముచేయుట ... | 246 |
| 40. | సువర్ణ మూర్తి దానము, దేవతా శ్రీవరదానము ... | 249 |
| 41. | పింగళయను దానికి వరదానముచేయుట ... | 252 |
| 42. | కురుక్షేత్ర యాత్రయందు సీతాజయము కలుగుట ... | 257 |
| | **జన్మకాండము. 5.** | |
| 43. | సీతా దోహద క్రీడావర్ణనము ... | 261 |
| 44. | సీమంతోత్సవ వర్ణనము ... | 264 |
| 45. | సీతా పరిత్యాగము ... | 268 |
| 46. | కుశలవ జననము ... | 273 |
| 47. | కుశలవులకు రామరక్షను నిరూపించుట ... | 275 |
| 48. | కమల హారణమునందు లవునకు జయముకలుగుట ... | 277 |
| 49. | రామ కుశలవుల యుద్ధము ... | 281 |
| 50. | యజ్ఞశాలన సీతాదేవి ప్రమాణముచేయుట రామునకు సీతలభించుట. | 288 |
| 51. | కుశలవోపనయనాదికము ... | 293 |

| విషయసంఖ్య. | విషయము. | | పుటసంఖ్య. |
|---|---|---|---|
| | **వివాహకాండము. ౬.** | | |
| 52. | శ్రీరాముడు పుత్రాదులతోఁగూడ స్వయంవరమునకుఁ బోవుట. | | 301 |
| 53. | చంపికా స్వయంవర వర్ణనము | ... | 304 |
| 54. | సుమతీ స్వయంవర వర్ణనము | ... | 310 |
| 55. | కుశలవుల వివాహవర్ణనము | ... | 314 |
| 56. | గంధర్వ నాగకన్నియల మోహము | ... | 317 |
| 57. | గంధర్వ నాగకన్నియల వివాహ నిశ్చయము | ... | 319 |
| 58. | ద్వాదశ వివాహవర్ణనము | ... | 322 |
| 59. | యూపకేతు పరాక్రమవర్ణనము | ... | 324 |
| 60. | మదనసుందరీ వివాహవర్ణనము | ... | 329 |
| | **రాజ్యకాండము — పూర్వభాగము. ౭.** | | |
| 61. | శ్రీరామ సహస్రనామ కథనము | ... | 333 |
| 62. | శ్రీరాముడు దేవవృక్షములను దెచ్చుట | ... | 341 |
| 63. | రామకృష్ణోపాసకుల సల్లాపము | ... | 344 |
| 64. | పురస్త్రీలు శ్రీరామునిజూచి మోహించుట | ... | 351 |
| 65. | సీతా మహాదేవి విరహము | ... | 358 |
| 66. | శతముఖ రావణాసుర సంహారము | ... | 361 |
| 67. | శ్రీరాముడు భరత ఖండమును జయించుట | ... | 367 |
| 68. | శ్రీరాముడు జంబూద్వీపమును జయించుట | ... | 370 |
| 69. | శ్రీరాముఁడారుద్వీపములను జయించుట | ... | 373 |
| 70. | శ్రీరాముడు యతిశూద్ర గృధ్రముల శిక్షించుట | ... | 377 |
| 71. | శ్రీరాముడు నలుగురు స్త్రీలకు వరదానము చేయుట | ... | 384 |
| 72. | పదునాఱువేల స్త్రీలకు వరదానముచేయుట | ... | 388 |
| | **రాజ్యకాండము — ఉత్తరభాగము** | | |
| 73. | అశ్వత్థహాసితము, హాస్యముక్తియును చెప్పుట | ... | 393 |
| 74 | వాల్మీకి మునివరుఁడు స్వజన్మత్రయమును వర్ణించుట | ... | 399 |
| 75. | రామరాజ్య విస్తారవర్ణనము | ... | 408 |
| 76. | శ్రీరాముడు రాజనీతిని చెప్పుట | ... | 411 |
| 77. | కుశకన్యా స్వయంవర వర్ణనము | ... | 416 |
| 78. | బ్రాహ్మణునకు రామనాథపురమును దానముచేయుట | ... | 422 |
| 79. | ఆంజనేయుఁడవతరించి బ్రాహ్మణ రాజ్యమును స్థాపించుట... | | 427 |

| విషయసంఖ్య. | విషయము. | | పుటసంఖ్య. |
|---|---|---|---|
| 80. | శ్రీరామచంద్రుని దినచర్యాభి వర్ణనము | ... | 428 |
| 81. | శ్రీరామచంద్రుని సన్నిధికి వైద్యదైవజ్ఞాదులు వచ్చుట | ... | 429 |
| 82. | శ్రీరామసన్నిధిని దైవజ్ఞుఁడు పంచాంగమును జెప్పుట | ... | 430 |
| 83. | శ్రీరాముండు రాజ్య పీఠంబు నధివసించి రాజ్యపాలనము చేయుట. | | 431 |
| 84. | అన్ని యవతారములలో రామావతారము మిగుల గొప్పది. | | 433 |
| 85. | రామదాసికి వరదానముచేయుట | ... | 439 |
| 86. | శ్రీరాముఁడు సుగుణ యను దాసికి రాధయై సుఖించునట్లు వరము నిచ్చుట | ... | 441 |
| 87. | సపరివారుండగు శ్రీరాముఁడు రూపద్వయ మంది తన మహిమను జూపుట | ... | 441 |
| 88. | శ్రీసీతా రాములకు భూరికీర్తి పుష్పఫలాదుల నింపుట | ... | 444 |
| 89. | శ్రీనారదమునికృత పాపఘ్న పద్యనవకము | ... | 448 |
| 90. | నారదమునిచేఁ జేయఁబడిన శ్రీరామస్తోత్రము | ... | 449 |
| 91. | ఆనందరామాయణ పఠనముచే దూతుఁడు మంత్రియగుట... | | 450 |
| 92. | యమలోకము పాడగుట | ... | 451 |
| 93. | శ్రీరాముని సన్నిధికి శివాదులు వచ్చుట | ... | 452 |
| 94. | శ్రీరాముఁడు యమదూతల మొత్తి సుమంత్రుని విడిపించుట. | | 453 |
| 95. | పునర్జీవితుఁడైన సుమంత్రుఁడు దానధర్మము లాచరించుట... | | 454 |
| 96. | యముఁ డయోధ్యపై దండెత్తుట | ... | 454 |
| 97. | లవుఁడు యముని నోడించుట | ... | 455 |
| 98. | రాముఁడు సూర్యుని సమ్మానించి యముని మన్నించుట | ... | 456 |
| 99. | సుమంత్రులు వైకుంఠమునకుఁ బోవుట | ... | ,, |
| 100. | శ్రీరాముఁడు లోకులకు ధర్మంబుల నెఱింగించుట | ... | 457 |


మ నో హ ర కాం డ ము. ౮.


| | | | |
|---|---|---|---|
| 101. | శ్రీరాముఁడు పౌరులకు జ్ఞానోపదేశము చేయుట | ... | 469 |
| 102. | కైకేయికి శ్రీరాముఁడు తత్త్వోపదేశము చేయుట | ... | 472 |
| 103. | శ్రీరాముఁడు సుమిత్రకు బ్రహ్మతత్త్వ ముపదేశించుట | ... | 474 |
| 104. | శ్రీరాముఁడు కౌసల్యకు బ్రహ్మతత్త్వ ముపదేశించుట | ... | 475 |
| 105. | గురులక్షణ నిరూపణము | ... | 477 |
| 106. | దశావతార కాల నిరూపణము | ... | 479 |
| 107. | అగస్త్యోపదిష్ట రామోపాసనావిధి | ... | 480 |

| విషయసంఖ్య. | విషయము. | | పుటసంఖ్య. |
|---|---|---|---|
| 108. | శ్రీరామ పరబ్రహ్మ బహిఃపూజావిధి | ... | 482 |
| 109. | నవరామోపాఖ్యానము | ... | 485 |
| 110. | శ్రీరామ లింగతోభద్రాది ప్రస్తార నిరూపణము | ... | 487 |
| 111. | రామతోభద్రాకృతి వివరణము | ... | 494 |
| 112. | అధ్యాత్మ తత్త్వనిరూపణము | ... | 495 |
| 113. | రామతోభద్ర ముద్రా స్వరూపణము | ... | 496 |
| 114. | మానవజన్మ ప్రాశస్త్యము | ... | 497 |
| 115. | స్థూలసూక్ష్మ కారణాత్మక పురత్రయవిచారము | ... | 499 |
| 116. | రామలింగ నిర్వచన తన్మహిమాదికము | ... | 500 |
| 117. | ఐతరేయోపనిష దర్థవిచారము | ... | 501 |
| 118. | తైత్తరీయోప నిషదర్థవిచారము | ... | 502 |
| 119. | బృహదారణ్యకోప నిషదర్థ సంగ్రహము | ... | 504 |
| 120. | ముండకోప నిషదర్థసంగ్రహము | ... | 505 |
| 121. | శాంతి మంత్రార్థవిచారము | ... | 507 |
| 122. | భగవద్గీతా వాక్యార్థాది విచారము | ... | ,, |
| 123. | కఠోపనిషదర్థ సారనిరూపణము | ... | 508 |
| 124. | సర్వతోభద్ర యంత్ర వర్ణకల్పనా విచిత్రార్థ విచారము | ... | 509 |
| 125. | మోక్షసాధన చతుష్టయ నిరూపణము | .. | 510 |
| 126. | శ్రీరామ బ్రహ్మైక్యతత్త్వ ప్రబోధనము | ... | 511 |
| 127. | అష్టోత్తర శత పదరామతోభద్రాది నానాభేదములు | ... | 513 |
| 128. | రామతోభద్రాది రచనాక్రమము | ... | 515 |
| 129. | శ్రీరామాసన భవద్దైవతాది విచారము | ... | 519 |
| 130. | శ్రీరాముఁడు కోట్లకొలఁది లింగములఁ బూజించుట | ... | 521 |
| 131. | పరమాత్మ లింగతత్త్వ విచారము | ... | 529 |
| 132. | శ్రీరామప్రియ నవపదార్థ నిరూపణము | ... | 532 |
| 133. | శ్రీరాముని బ్రాహ్మణులయందారాధించుట | ... | 534 |
| 134. | శ్రీరామ వ్రతోద్యాపనాది విచారము | ... | 536 |
| 135. | బీదబ్రాహ్మణుఁడు శ్రీరామాదిమూర్తుల నారాధించి ధన్యుఁడగుట. | | 537 |
| 136. | బ్రాహ్మణాగ్రహమున మారుతిచే స్త్రీవేశ మేర్పడుట | ... | 539 |
| 137. | పుత్రోత్పత్తి విచారము | ... | 541 |
| 138. | శ్రీరామలక్ష నామోద్యాపనాది విధి | ... | 543 |
| 139. | వేదాధుల ఫలవర్ణనము | ... | 550 |

| విషయసంఖ్య | విషయము. | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 140. | రాముని డెబ్బదియైదుదినములు పూజింపవలయు ననుట | | 556 |
| 141. | చైత్రమాస మహిమావర్ణనము | ... | 564 |
| 142. | చైత్రస్నానము చేయువారికిఁ గల్గు సద్గతిని నిరూపించుట | ... | 571 |
| 143. | శ్రీరామదాస జననము | ... | 573 |
| 144 | పిశాచ త్రయోపాఖ్యానము | ... | 574 |
| 145. | శంభు శర్మోపాఖ్యానము | ... | 575 |
| 146. | చైత్రమాస తాంబూల దానమహిమ | ... | 578 |
| 147. | నవమీ భోజనమును, పౌరాణిక నిందనము | ... | 280 |
| 148. | చైత్రమాసదాన ప్రభావము | ... | 582 |
| 149. | అయోధ్యాపుర వర్ణనము | ... | 583 |
| 150. | రామశివుల కభేదమును జెప్పుట | ... | 586 |
| 151. | శ్రీరామమంత్ర సముద్రా వస్త్రధారణమహిమ | ... | 590 |
| 152. | శ్రీరామకవచ హనుమత్కవచములు | ... | 592 |
| 153. | హనుమత్ప్రార్థనము | ... | ,, |
| 154. | హనుమన్మంత్ర విధాన సహిత హనుమత్కవచము | ... | 593 |
| 155. | శ్రీరామ కవచము | ... | 596 |
| 156. | శ్రీ సీతా కవచము | ... | 598 |
| 157. | శ్రీసీతాష్టోత్తర శతనామస్తోత్రము | ... | 600 |
| 158. | రమానామ భద్రప్రకారము | ... | 602 |
| 159. | శ్రీ లక్ష్మణ కవచము | ... | 603 |
| 160. | శ్రీ భరతకవచము | ... | 605 |
| 161. | శ్రీ శత్రుఘ్నకవచము | ... | 606 |
| 162. | శ్రీరామ గరుడసంవాదము | ... | 609 |
| 163. | వానరుల పూర్వవృత్తాంతము | ... | 610 |
| 164. | హనుమద్వ్రిత పతాకలను వర్ణించుట | ... | 611 |
| 165. | శ్రీసార రామాయణ వర్ణనము | ... | 612 |
| 166. | హనుమదర్జునుల శపథము | ... | 613 |
| 167. | అర్జును గర్వభంగము | ... | 614 |


## పూర్ణకాండము.


| | | | |
|---|---|---|---|
| 168. | శ్రీ వాల్మీకి మునివరుఁడు సోమవంశమును విస్తరించి చెప్పుట. | | 617 |
| 169. | శ్రీరాముఁడు హస్తినాపురంబునకుఁ బయనమగుట | ... | 620 |

| విషయసంఖ్య. | విషయము. | | పుటసంఖ్య. |
|---|---|---|---|
| 170. | సూర్యసోమవంశజుల యుద్ధము | ... | 625 |
| 171. | సోమసూర్య వంశజులకు మైత్రికలుగుట | ... | 628 |
| 172. | శ్రీరాముఁడు కుశాదులను విడుచుట | ... | 631 |
| 173. | గంగయందు శ్రీరాముఁడు వైకుంఠము నారోహించుట | ... | 634 |
| 174. | ఈశ్వర కృత విష్ణుస్తోత్రము | ... | 635 |
| 175. | సూర్యవంశోద్భవ రాజుల వర్ణనము | ... | 637 |
| 176. | ఆనంద రామాయణానుక్రమణిక | ... | 639 |
| 177. | గ్రంథ శ్రవణఫలాది వర్ణనము | ... | 643 |


విషయానుక్రమణిక సంపూర్ణము.



శ్రీ

# శ్రీ స్కాందమహాపురాణముద్రణ ప్రకటనము.

ఆస్తిక సార్వభౌములారా!

మనదేశమున నిదివఱకెవ్వరు నచ్చువేయనిదియు, మహత్తరమును, లోకోత్తరమును, లక్షగ్రంథ పరిమితమును, నగు శ్రీస్కాందమహాపురాణమును తెనుఁగు తాత్పర్యము (ప్రతిపదార్థము కాని వచనరచన)తో బహుజన ప్రార్థనమున మా కార్యాలయమున ముద్రింప నారంభించి యున్నారము.

ఈ శ్రీ స్కాందమహాపురాణము మిగుల గొప్పది యగుటంజేసి సంచికలు సంచికలుగా వెలిపఱుచుటకంటె నొక్కొక్క కాండముగా ముద్రించి బయిండు చేయించి సరసమగు వెలకు సద్భక్తుల కందఁజేయుట మా యుద్దేశము. ఎంతటి కార్యమునకేని ద్రవ్యము ముఖ్యమైయుండ నిట్టి మహాప్రయత్నమున కెంత ద్రవ్యము వలయునో యెల్లఱకును తెల్లము. కావున విద్యాభిమానులగు భక్తులెల్ల శక్తి కొలఁది పోషకులుగను, చందాదారులుగను చేరి ద్రవ్యసహాయ మొనర్చి యీ సద్గ్రంథము సాంతముగ నచ్చొత్తింపించిన ఘనతకు పాత్రులుగాఁ గలరని వేడుచున్నారము.

ఈ స్కాందమహాపురాణము రమారమి 12000 పుటలు కావచ్చునని తోఁచుచున్నది. ఒక్కొక కాండముగ వెలువడును. కాలనిర్ణయము లేదు, ముద్రణమైనదే పుస్తకము (వాల్యుము) పంపఁబడును.

## చందా వివరములు.

(1) సంపూర్ణగ్రంథములు నాలుగు తీయువారు పోషకులుగా నుండనగును. అందులకు ప్రవేశ కట్నము ముందుగా రు.20. పంపవలెయును. నాల్గు పుస్తకములఁ దీయు పోషకులకు మాత్ర మొక పుస్తక మధికముగ నీయఁబడును. పోషకుల నామములు ప్రతికాండమున ముద్రింపఁబడును.

(2) చందాదారులుగ నుండువారు సంపూర్ణగ్రంథ మొకటి తీయవలయును. అందులకు ప్రవేశకట్నము క్రింద ముందుగా రు. 5. పంపవలయును. చందాదారుల నామములు వరుసక్రమమున నొకమారు కాండాంతమున ముద్రింపఁ బడును.

(3) పోషకులుగాని చందాదారులుగాని ప్రవేశ రుసుముక్రిందఁ బంపిన పైకమునకు దాఖలా నెంబరుతో రసీదు పంపఁబడును. ప్రతికాండమును ముద్రించినతోడనే యాయా కాండముల పుటల యల్పాధిక్యతలను బట్టి నిర్ణయింపఁబడిన క్రయమునకు పుస్తకములు వి. పి. చేయఁబడును.

(4) ఈ గ్రంథము రాయల్ సయిజు తెల్లగ్లేసు కాగితమున ఎనిమిది పుటలుగల ఫారము ఒకటికి వెల 0-0-6 అరణా. ముందుగా పోషకులై 20 రూపాయలను, చందాదారులై 5 రూపాయలను, పంపించిన వారలకు మాత్రము ఈ సులభమైనధరకు పంపఁబడును.

(5) గ్రంథముద్రణము పూర్తియైన తరువాత తీయువారికి 8 పుటలు గల ఫారము 1టికి వెల 0-0-9 ముక్కాలణా చొప్పున పంపఁబడును.

(6) గ్రంథముద్రణము మొదలు ముద్రణాంతములోఁగ మధ్యకాలమున (అనఁగా:—కొన్ని కాండలు ముద్రణమైన పిదప) చందాదారులుగా, పోషకులుగా చేరువారికి అదివరలో ముద్రించి తయారైన కాండలకు ఫారము 1-కి వెల ముక్కాలణా 0-0-9 వంతున తీసికొని యనంతరము ముద్రణమున తయారగు కాండలకు ఫారము 1టికి అరణా 0-0-6 చొప్పుననే తీసికొన గలము.

(7) తక్కువ వెలకిచ్చు కాండలకు వేరుగ బయిండుచార్జి మూడణాలు, లేక నాలుగణాలు వంతున ప్రతి వాల్యుమునకును ఈయవలయును. జాస్తివెల నిచ్చు కాండలకు బయిండుచార్జి యీయ నక్కరలేదు. పోస్టేజి ప్రత్యేకము.

(8) ప్రవేశకట్నముక్రింద పంపియుండు ద్రవ్యము కడపటి వాల్యుములో మినహాయింపఁబడును. కాన ముందుగా చందాదారులుగను పోషకులుగను చేరువారి కిది లాభముకదా?

(9) ఈ మహాగ్రంథము కలయు సత్పురుషులు శీఘ్రముగఁ జందాదారులై దమవిలాసములఁ దెలుప సంప్రార్థించుచున్నారము.



శ్రీరస్తు.

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

# ఆనందరామాయణము

## సారకాండము.

శ్లో. వామే భూమిసుతా పురస్తు హనుమాన్ పశ్చా త్సుమిత్రాసుతః
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయో ర్వాయ్వాదికోణేషుచ,
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్తారాసుతో జాంబవాన్
మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్.
ఆదౌ రావణమర్దనం ద్విజగిరా తీర్థాటనం సీతయా
సాకేతే దశవాజిమేధకరణం పత్న్యై విలాసాటనమ్,
స్త్రీపుత్రగ్రహణం స్వపార్థమటనం పృథ్వ్యాశ్చ సంరక్షణం
రామార్చాదినిరూపణం దయితయా స్వీయస్థలారోహణమ్.

కథాప్రారంభము.

### * కౌసల్యాది పట్టమహిషీ వివాహములు. *

ఒకనాఁడు పార్వతీదేవి సంతోషముకలదై కైలాసవాసి యగుపరమశివునకు నమస్కరించియిట్లనియె. ఓప్రాణనాథా! పరమేశ్వరా! నీవు ఇదివఱకు అనేకములయినపురాణములనునాకుఁజెప్పితివి, వానిసన్నిటినివిని యధికమైనఆనందమును పొందితిని. ఓప్రాణనాథా! పరమేశ్వరా! నాకు అధికముగా ప్రీతినికలుగఁజేయునట్టిదియును, ఆనందమునుకలుగఁజేయునట్టిదియును, అయినశ్రీరామునియొక్క జన్మవృత్తాంతమును రామునిచేతఁ జేయఁబడినకార్యములను చెప్పి నన్నుఁ గృతార్థురాలినిగాఁ జేయు మని ప్రార్థించిన పరమేశ్వరుఁడువిని మరలయిట్లనియె. ఓప్రాణనాయికా! పార్వతీ! నీవు శ్రీరామునియొక్క చరిత్రములను చెప్పు మనియడుగుట మిక్కిలి రమ్యముగానున్నది. ఓదేవీ! పార్వతీ! అధికమైనమంగళమును కలుగఁజేయునట్టి శ్రీరాముని చరిత్రమునుసంపూర్ణముగఁజెప్పెదను. సావధాన చిత్తముకలదానవై వినుము. ఓదేవీ! పార్వతీ! ఆదినారాయణునివలన బ్రహ్మయును, బ్రహ్మవలనమరీచియును, మరీచివలన కశ్యపుఁడును, కశ్యపునివలన సూర్యుఁడును, సూర్యునివలన శ్రాద్ధదేవుఁడనియును వైవస్వతుఁడనియును చెప్పఁబడునట్టి యమధర్మరాజును, ఆవైవస్వతునివలన ప్రతాపముకలయిక్ష్వాకుఁడును, ఆ యిక్ష్వాకునకు వికుక్షియును బుట్టిరి. ఆవికుక్షియే శశాదుఁడనిచెప్పఁబడును. ఓదేవీ! పార్వతీ! ఆవికుక్షికి శత్రువులపట్టణములను జయిం

చునట్టివాఁడును, ఇంద్రవాహనుఁడును అగుకకుత్స్థుఁడును, ఆకకుత్స్థునకు అస్తుఁడును, అస్తునకు విశ్వరంధియును, విశ్వరంధికి చంద్రుఁడును, చంద్రునకు ప్రతాపవంతుఁడైన యువనాశ్వుఁడును, యువనాశ్వునకు శాబస్తుఁడును, శాబస్తునకు మిక్కిలి గొప్పవాఁడగు బృహదశ్వుఁడును, బృహదశ్వునకు రాజోత్తముఁ డగుకువలయాశ్వుఁడును, కువలయాశ్వునకు దృఢాశ్వుఁడును, దృఢాశ్వునకు హర్యశ్వుఁడును, హర్యశ్వునకు నికుంభుఁడును, నికుంభునకు బర్హణాశ్వుఁడును, బర్హణాశ్వునకు కృతాశ్వుఁడును, కృతాశ్వునకు శ్యేనజిత్తనువాఁడును, శ్యేనజిత్తునకు యువనాశ్వుఁడును, యువనాశ్వునకు దొంగలను వధించునట్టి మాంధాతయును, మాంధాతకు పురుకుత్సుఁడును, పురుకుత్సునకు త్రిసదస్యువనువాఁడును, ఆత్రిసదస్యునకు అనరణ్యుఁడనువాఁడును, అనరణ్యునకు హర్యశ్వుఁడును, హర్యశ్వునకు అరుణుఁడును, అరుణునకు త్రిబంధనుఁడును, త్రిబంధనునకు త్రిశంకు వనుమారుపేరుకల సత్యవ్రతుఁడును, ఆసత్యవ్రతునకు ప్రతాపవంతుఁ డగుహరిశ్చంద్రుఁడును, హరిశ్చంద్రునకు రోహితుఁడును, రోహితునకు హరితుఁడును, హరితునకు చంపుఁడును, చంపునకు సుదేవుఁడును, సుదేవునకు విజయుఁడును, విజయునకు భరుకుఁడును, భరుకునకు వృకుఁడును, వృకునకు బాహుకుఁడును, బాహుకునకు సగరుఁడును, సగరునకు అసమంజసుఁడును, అసమంజసునకు అంశుమంతుఁడును, అంశుమంతునకు దిలీపుఁడును, దిలీపునకు భగీరథుఁడును, భగీరథునకు శ్రుతుఁడును, శ్రుతునకు నాభుఁడును, నాభునకు సింధుద్వీపుఁడును, సింధుద్వీపునకు అయుతాయువును, అయుతాయువునకు ఋతుపర్ణుఁడును, ఋతుపర్ణునకు సుదాసుఁడనియును మిత్రసహుఁడనియును కల్మాషపాదుఁడనియును చెప్పఁబడునట్టివాఁడును, ఆసుదాసునకు అశ్మకుఁడును, అశ్మకునకు మూలకుఁడును, మూలకునకు మిక్కిలి గొప్పవాఁడగు నారీకవచుఁడును, ఆనారీకవచునకు ప్రతాపవంతుఁడును ఐడబిడుఁడును అనుపేర్లుకల దశరథుఁడును, ఆ దశరథునకు విశ్వసహుఁడును, ఆ విశ్వసహునకు ఖట్వాంగుఁడును, ఖట్వాంగునకు దీర్ఘబాహుకుఁడగు దిలీపుఁడును, ఆ దిలీపునకు రఘువును, రఘువునకు అజుఁడును, ఆ అజమహారాజునకు దశరథుఁడును, ఆ దశరథునకు శ్రీరాముఁడునుపుట్టిరి. ఆ శ్రీరామునియొక్క గుణములను మహామునులందఱును కొనియాడుదురు. ఓ దేవీ! పార్వతీ! ఈ శ్రీరామునకు అఱువదియొక్కరు పురుషులు పూర్వమునందును, అఱువదియొక్కరు పురుషులు పరమందును కలరు. ఆ నూటయిరువదిమందికిని మధ్యయందు ఈ శ్రీరాముఁడు మిక్కిలి మనోహరుఁడై పుట్టి ప్రకాశించుచుండె. ఓ దేవీ! పార్వతీ! ఆ శ్రీరామునియొక్కచరిత్రమును సర్వమును నీకుఁజెప్పెదను వినుము. ఓ దేవీ! పార్వతి! ఇక్ష్వాకువంశమునందుఁ బుట్టినవాఁడును, రాజకులోత్తముఁడును, లోకమునందు ప్రసిద్ధుఁడును, బలవంతుఁడును, సరయూనదీతీరమునందుండు అయోధ్యాపట్టణమునకు అధిపతియును, శ్రీమంతుఁడును అగు దశరథుఁ డనురాజొకఁడుండె. ఆమహారాజగుదశరథుఁడు జంబూద్వీపమునకు అధిపతియై యుండె. ఆదశరథుఁడు

మిక్కిలి గొప్పదగు సైన్యముతోఁ గూడుకొనినవాఁడై ధర్మమునుదప్పక రాజ్యమును పరిపాలించె. ఓదేవీ! పార్వతీ! ఆ అయోధ్యాపట్టణమునకు సమీపమున కోసలదేశ మనుపేరుగల ఒకదేశముగలదు. ఆదేశమునందు కోసలయను ఒకపట్టణముగలదు. ఆపట్టణమున మిగుల గొప్పవాఁడగు కోసలుఁడను మహారాజు రాజ్యమును పరిపాలించుచుండె. ఆమహారాజునకు మిగుల రసికురాలును భర్తనుకోరునట్టిదియును, కౌసల్య యను పేరు కలదియును, అయినకుమార్తెకలదు. ఆకన్యకను దశరథమహారాజునకిచ్చి వివాహమునుచేయునట్లు ఆకోసలుఁడనుమహారాజు తనమనస్సున నిశ్చయించుకొని వివాహముకొఱకు దశరథమహారాజును వివాహదివసమునకు తీసికొని వచ్చుటకై అయోధ్యాపట్టణమునకుఁ తనదూతలను బంపెను. ఆసమయమునందు దశరథమహారాజు మంత్రిబంధువులతోఁ గూడ సాకేతపురమను పట్టణమునకు సమీపమునందుండు సరయూనదియందు ఓడనెక్కి జలక్రీడలాడుచుండె. మఱియు నాదశరథమహారాజు రాత్రియందు సేనతోఁగూడ ఆయోడయందున్నపుడు వంది మాగధులచేత స్తోత్రముచేయఁబడుచుండె. ఓదేవీ! పార్వతీ! ఆయోడయందు రత్నమయములగు దీపములు మహా ప్రకాశముగలవై వెలుఁగుచుండె. ఆదీపముల వెలుతురునందు వారకాంతలు నృత్యమును చేయుచుండిరి. ఓదేవీ! పార్వతీ! ఆసమయమునందు లంకాపట్టణమున నివసించియున్న రావణాసురుఁడు బ్రహ్మదేవునిజేరి యిట్లనియె. ఓదేవతాసార్వభౌమా! బ్రహ్మదేవుఁడా! నాకెవనివలన మరణము కలుగునో చెప్పుమనిప్రార్థించిన బ్రహ్మదేవుఁడు విని ఇట్లనియె. ఓరాక్షసరాజా! రావణాసురుఁడా! శ్రీమన్నారాయణుఁడు దశరథమహారాజువలన కౌసల్యయందు నలుగురు పుత్త్రులరూపమును ధరించి పుట్టి నిన్నుఁ జంపఁగలఁడు. నేటికి అయిదవ దినమునందు దశరథమహారాజునకును, కౌసల్యకును, వివాహముజరుగునట్లు కోసల మహారాజుయొక్క సభయందలి బ్రాహ్మణులు నిశ్చయించిరని బ్రహ్మదేవుఁడుచెప్పె. అంత రావణాసురుఁడు మహాకోపముగలవాఁడై ఆక్షణమున పుష్పకవిమానమును ఎక్కి అనేకవేలమంది రాక్షసులతోఁగూడ మిగుల శీఘ్రముగ అయోధ్యాపట్టణము నకుఁబోయె. పోయి మహాకోపముగలవాఁడై మిక్కిలిభయంకరములైన బాణముల చేత ఓడయందున్న దశరథమహారాజుతో యుద్ధముచేసి జయించి తనపాదముచేత ఆయోడను సరయూనదీజలమునందు పడునట్లు ఒకతన్నుతన్ని విరిచివైచె. అప్పుడు ఆయోడయందు ఉన్నవారందఱును సరయూనదియందుఁబడి ప్రాణములను విడచిరి. ఆసమయమునందు దశరథమహారాజును, సుమంత్రుఁడును వీరలిరువురును ఒకయోడకొయ్యను అవలంబించి ఆనదీవేగముచేత మెల్ల మెల్లగాఁబోయి భాగీరథీనదియందుఁబ్రవేశించిరి. అట్లు దశరథసుమంత్రులిరువురును ప్రవేశించి ఆభాగీరథీ నదీవేగముచేత ఒడ్డునకు రాఁజాలక సముద్రమునందుఁ బ్రవేశించి ఆతెప్ప కొయ్యను ఇటు అటు తోసికొనుచు ఈశ్వరానుగ్రహముచేత జీవించుచుండిరి.

ఆరావణాసురుఁడు ఈప్రకారముగా దశరథమహారాజు మొదలగువారినందఱిని భంగపఱిచి అక్కడినుండి కోసలదేశమునకుఁ బోయి మహాభయంకరమైన యుద్ధమును చేసి కోసలమహారాజును జయించి అతనికూఁతురగు కౌసల్యయను కన్యకను అపహరించె. అట్లపహరించి ఆరావణాసురుఁడు పరమ సంతోషముకలవాఁడై ఆకౌసల్యతోఁగూడ ఆకాశమార్గముచేత లంకాపట్టణమునకుఁ బోయె. అట్లుపోవునపుడు ఆరావణాసురుఁడు సముద్రమధ్యమునందుఁబోవుచు ఒక తిమింగిలమును చూచి తనమనస్సునందు ఇట్లనియాలోచించె. దేవతలు నాకు శత్రువులు కావున నేను ఈకన్యకను నాపట్టణమునకు తీసికొనిపోయి యుంచితినేని దేవతలు మారువేషముతోనైనను, అదృశ్యాకారములతోనైనను వచ్చి యీకన్యకను ఎత్తుకొని పారిపోవుదురు. కాఁబట్టి యీ కన్యకను ఈతిమింగిలమునకు ఇచ్చివేసెదనని మనస్సునందు నిశ్చయించి ఆ కౌసల్యను ఒకపెట్టెయందుఁబెట్టి యీతిమింగిలముమీఁదఁ బడవైచె. అట్లుచేసి అధికముగా సంతోషమును పొందినవాఁడై లంకాపట్టణమునకుఁ బోయె. అప్పుడు ఆతిమింగిలముఆపెట్టెను నోటకఱచుకొని సముద్రమునందు సంచరించుచుండె. అట్లు సంచరించుచు మఱియొక తిమింగిలము తనకెదురుగ వచ్చుచుండుటనుజూచి ఇది మనకు శత్రువు, దీనితో యుద్ధమునుచేయవలయునని మనస్సులోఁదలఁచి యీతిమింగిలము తనవద్దనున్న పెట్టెను ఒక ద్వీపమునందు ఉంచె. అట్లు ఉంచి యీతిమింగిలము తన శత్రువుతోఁగూడ యుద్ధమునుచేయుచుండె. ఇంతలోపల దైవవశముచేత దశరథమహారాజును, సుమంత్రుఁడును ఎక్కియుండిన, యోడకొయ్య యీద్వీపమునందుఁ బ్రవేశించె. అంతట దశరథమహారాజును, సుమంత్రుఁడును, ఆద్వీపముమీఁదికిఁ బోయిరి. పోయి అక్కడనున్న పెట్టెను తెఱచిచూచి అధికమైన ఆశ్చర్యమును పొందిరి. ఓదేవీ ! పార్వతీ ! దైవచిత్రమును నెఱుంగుట కెవరికిని శక్యముగాదు. అటుపిమ్మట ఆ పెట్టెయందున్న కౌసల్యను దశరథుఁడు చూచి ఒకరికొకరు తమకుఁగలిగిన ఆపదలను తెలిసికొని యీముహూర్తసమయమునందు దశరథమహారాజు సంతుష్టమైన మనస్సుకలవాఁడై ఆద్వీపమునందు కౌసల్యను గాంధర్వవివాహమును చేసికొనియె. పిమ్మట కౌసల్యాదేవియును, సుమంత్రుఁడును, దశరథమహారాజును వీరు ముప్వురును ఆపెట్టెను మూసివేసిరి. ఇంతలోపల ఆ తిమింగిలము తన శత్రువును జయించివచ్చి మరల నాపెట్టెను నోటకఱచుకొని సముద్రమునందుఁ దిరుగుచుండె. ఇక్కడ ఇట్లుండగా పెట్టెను తిమింగిలమువద్ద పారవేసినపిమ్మట రావణాసురుఁడు లంకాపట్టణమునకుఁబోయి సుఖముగానుండె. ఇట్లు సుఖముగానుండి ఒకనాఁడు కొలువుదీరి బ్రహ్మదేవునిబిలిపించి పకపక నవ్వుచు నిట్లనియె. ఓతాతా ! బ్రహ్మదేవుఁడా ! రావణాసురుఁడనైన నేను నీవాక్యమును అసత్యమైనదానినిగాఁ జేసితిని. దశరథుని సంహరించితిని. కౌసల్యను దాచిపెట్టితిని. అనిచెప్పిన విని యీబ్రహ్మదేవుఁడు నిట్టూర్పునువిడుచుచు నాసభయం దిట్లనియె. ఓరావణాసురుఁడా ! నామాట యెప్పటికిని అసత్యము కానేరదు. కౌసల్యకును, దశ

రథమహారాజునకును సరియగుకాలమునందే వివాహముజరిగెనని బ్రహ్మదేవుఁడు చెప్పిన, రావణాసురుఁడు విని మిక్కిలి తత్తరపాటు కలవాఁడై బ్రహ్మదేవునిఁజూచి యిట్లనియె. ఓతాతా! బ్రహ్మదేవుఁడా! ఇదియేమి? ఈప్రకారముగా నీవుచెప్పుచున్నావు. ఇది మిక్కిలి చిత్రముగానున్నదని రావణాసురుఁడుచెప్పిన బ్రహ్మదేవుఁడు విని ఇట్లనియె. ఓవత్సా! రావణాసురుఁడా! లేదులేదు, ఆదశరథునకు నేను నిర్ణయించిన కాలమునందే వివాహము జరిగినదని బ్రహ్మదేవుఁడుచెప్పె. అంతట రావణాసురుఁడు మహాకోపముగలవాఁడై బ్రహ్మదేవునియొక్క వాక్యమును అసత్యమైనదానినిగాఁ జేయవలయునని మిక్కిలి శీఘ్రముగ తనదూతలనుపంపి తిమింగిలముదగ్గరనున్న పెట్టెనుతెప్పించి బ్రహ్మదేవునియొద్దఁబెట్టి యాపెట్టెనుతెరచిచూచె. అప్పుడు ఆపెట్టెయందు కౌసల్యాదేవియును, సుమంత్రుఁడును, దశరథమహారాజును కనఁబడిరి. అంతట రావణాసురుఁడు ఆముగ్గురినిచూచి మిక్కిలి భయముకలవాఁడును, మహాకోపముకలవాఁడునునై, ఆముగ్గురిని చంపుటకొఱకు ఖడ్గమును చేతఁదీసికొనియె. అప్పుడు బ్రహ్మదేవుఁడు మిక్కిలి తత్తరపాటుకలవాఁడై రావణాసురునిచెయ్యిపట్టుకొని, రావణాసురుఁడా! ఏమిచేయుచున్నావు? నిలువుము, నిలువుము, అనిచెప్పి మరల నిట్లనియె. ఓరావణాసురుఁడా! సాహసమునుచేయకుము. నీవు కౌసల్యను ఒకదానినే పెట్టెయందుఁబెట్టితివి. పిమ్మట ఆపెట్టెయందు ముగ్గురైరి. కాఁబట్టి ఇప్పుడు నీవు సాహసమునుచేసితివేని పెక్కువేలమంది మనుష్యులుపుట్టుదురు. మఱియును శ్రీరాముఁడు ఇప్పుడేపుట్టి నిన్నువధియించును. సాహసమును చేయకుము. ఏదికాఁదగియున్నదో అట్టికార్యమైయుండును. కాఁదగినకార్యము కాకమానదు. కాఁబట్టి రావణాసురుఁడా! దూతలచేతికి ఈపెట్టెనిచ్చి అయోధ్యాపట్టణమునకుఁ బంపుము. నామాట యెన్నటికిని అసత్యముకానేరదు. కర్మముయొక్క గతి మిక్కిలిగహనమైనది. అని బ్రహ్మదేవుఁడు చెప్పెను. అంతట రావణాసురుఁడు భయముగలవాఁడై బ్రహ్మదేవునియొక్క వాక్యమును సత్యమైనదానినిగా నమ్మి తనభటులచేత ఆపెట్టెను అయోధ్యాపట్టణమునకుఁబంపె. పిమ్మట రావణాసురునిదూతలు ఆపెట్టెనుతీసికొనిపోయి అయోధ్యాపట్టణమునందుఁబెట్టిరి. వచ్చిరి. అట్లురావణాసురునిదూతలు అయోధ్యాపట్టణమునందు ఆపెట్టెనుపెట్టి తెఱచిపోయిన పిమ్మట అయోధ్యాపట్టణమునందుండు వారందఱును దశరథమహారాజును చూచుటచేత అధికమైన సంతోషమును పొందిరి. పిమ్మట ఈవృత్తాంతమును కోసలాధిపతివిని అధికమైన సంతోషముకలవాఁడయ్యె. అంతట కోసలమహారాజు మరల దశరథమహారాజునకును కౌసల్యకును వివాహమును నిశ్చయించి వివాహమునుజేసి తనపుత్త్రికతోఁగూడ తనరాజ్యమును సర్వమును దశరథునకు ఇచ్చె. అదిమొదలుకొని కోసలదేశాధిపతులు సూర్యవంశోద్భవులైరి. పిమ్మట దశరథమహారాజు మగధదేశాధిపతియొక్క కుమార్తెయగు సుమిత్రయను కన్యనుగూడ వివాహముచేసికొనియె. ఓదేవీ! పార్వతీ! ఇట్లు దశరథమహారాజు ఇద్దరుభార్యలను వివాహ

ముచేసికొనియును తృప్తినిబొందక కేకయమహారాజుయొక్క పుత్రికయగు కైకేయియను కన్యకనుగూడ మూఁడవభార్యనుగా గ్రహించె. మఱియును దశరథమహారాజు ఇటులనే యేడునూఱుల కన్యకలను బెండ్లియాడె. ఈప్రకారముగ అనేకభార్యలుగల దశరథమహారాజు భూలోకమును సర్వమును ధర్మయుక్తముగఁ బరిపాలించుచుండె. మఱియును అనేకవిధములగు దానధర్మములను చేయుచుండె. ఇట్లు రాజ్యపరిపాలనముచేయుచుండఁగా, చాలకాలముగడచిపోయె. పిమ్మట ఆ దశరథమహారాజు ముసలివాఁడయ్యె. ధార్మికుఁడైన యాదశరథమహారాజునకు సంతతిలేకపోయె. అట్లు సంతానములేకపోవుటచేత సత్కులమునందుఁబుట్టిన కౌసల్యా,సుమిత్రా, కైకేయీదేవులు పరితాపముకలవారై యుండిరి. ఇట్లుదశరథమహారాజు భూమిని పరిపాలించుచుండఁగా దేవతలకును రాక్షసులకును రాజ్యముకొఱకు యుద్ధముజరిగె. ఆసమయమునందు ఆకాశవాణియిట్లనియె. ఓదేవతలారా! అయోధ్యాపట్టణమునందు దశరథుఁడనుమహారాజుకలఁడు. ఆమహారాజును మీరు సహాయముగాఁ దెచ్చుకొనినయెడల జయముకలుగునని చెప్పె. ఆసమయమునందు ఆమాటను విని మహావేగముగలవాయుదేవుఁడు మిక్కిలి శీఘ్రముగఁబోయి దశరథమహారాజును ప్రార్థించి తీసికొనివచ్చె. అంతట దశరథమహారాజు రాక్షసులతోఁగూడ మిక్కిలిభయంకరమైనయుద్ధమునుచేసె. ఆయుద్ధమునందు దైవయోగముచేత దశరథమహారాజుయొక్క రథమునందుండు ఇరుసువిరిగిపోయె. అప్పుడు యుద్ధమునందలి ఆటోపముచేత దశరథమహారాజు తనరథముయొక్క ఇరుసు విరిగిపోవుటనుజూచికూడ లక్ష్యముసేయక యుద్ధముచేయుచుండె. ఆసమయమునందు సుందరాంగియును, చక్కని కనుబొమలుకలదియును నగు కైకేయి దశరథమహారాజుయొక్క సమీపమునందుండుటచేత రథముయొక్క ఇరుసు విరుగుటనుజూచి ఇట్లనియోజించె. ఓహోహో ఈరథము ఇఁక క్రిందఁబడును, మనభర్తకు అపాయముకలుగును. కాఁబట్టి ఈసమయమునందు మనభర్తకు సహాయముచేయవలయునని ఆలోచించి, జయముకలుగుటకొఱకు తనచేతిని ఇరుసుగాఁబెట్టె. ఓదేవీ! పార్వతీ! పూర్వము బాల్యదశయందుండునపుడు ఆకైకేయి విహారార్థము వనమునకుఁబోయె. ఆవనమునందు ఒక మునిశ్రేష్ఠుఁడు తపస్సుచేయుచుండె. అంత కైకేయి ఆమహామునియొక్కముఖమునందు మసినిపూసి నల్లనివానినిగాఁజేసె. అంతట నామునిశ్రేష్ఠుఁడు కనులు తెరచిచూచి మహాకోపముగలవాఁడై ఓకైకేయీ! ముందుగాఁ జూడఁదగిన నీముఖమును ఎవ్వరును చూడక పోదురుగాక అనిశపించె. అట్లుశపించి యామహాముని ఇంకొక వనమునకు పోవుటను ప్రయత్నించె. అప్పుడు కైకేయి మహాభయముగలదై మిక్కిలిభక్తితో ఆమునిశ్రేష్ఠునియొక్క హస్తమునందు తనయొక్క హస్తములచేత దండకమండలాదులను ఎత్తియిచ్చె. అంతట నామహాముని మిక్కిలి సంతోషించి ఓకైకేయీ! నీయొక్కహస్తములు వజ్రమువలె కఠినములైనవై దేనిచేతను నాశమును పొం

దకయుండుమని వరమిచ్చె. ఓదేవీ! పార్వతీ! అందువలన యుద్ధకాలమునందు కైకేయి ఆవరమును జ్ఞప్తికిఁదెచ్చుకొని తనయొక్క వామహస్తమును రథమునకు ఇరుసునుగాఁజేసె. అంతట దశరథమహారాజు యుద్ధమునందు రాక్షసులనందఱిని జయించి కైకేయిచేసిన కార్యమును చూచి మిక్కిలి ఆశ్చర్యమును పొంది మహాసంతోషముగలవాఁడై ఓకైకేయీ! నీకు రెండువరముల నిచ్చెదను, నీకు ఇష్టమైన దానిని కోరుమని చెప్పిన కైకేయి విని ఇట్లనియె. ఓమహారాజా! నీవు ఇప్పుడు ఇయ్యఁదలఁచిన రెండువరములను నేను ఎప్పుడుకోరుదునో అప్పుడు ఇయ్యవలసినదని చెప్పిన దశరథమహారాజు ఆమాటకు సమ్మతించె. అంతట దశరథమహారాజు తనయొక్క పరివారముతోఁగూడ తనపట్టణమునకుఁబోయి సుఖముగానుండె. పిమ్మట నొకనాఁటిరాత్రియందు దశరథమహారాజు వేటకుఁబోయి అనేకములయిన మృగములను వధియించుచుండె. ఆసమయమునందు ఒకవైశ్యమునికుమారుఁడు తాను నివసించుచున్న దేశమునందుఁ గలిగిన ధర్మలోపభయమువలన మిగులవృద్ధులగుతనయొక్క తల్లిదండ్రులను కావడియందుఁబెట్టి మోచికొని కాశీపట్టణమునకు తీసికొనిపోవుచుండె. అట్లు పోవుచున్న సమయమునందు వృద్ధులైనయాతల్లిదండ్రులు దాహమగుటచేత జలమును తెచ్చియిమ్మనికోరిరి. అంతట వారిపుత్త్రుఁడు వారిని ఒకచెట్టుక్రింద దింపి కడవనుదీసికొని సమీపమునందున్న తటాకమునకుఁబోయి యాతటాకములోని జలమునందు కడవను బుడబుడయనిముంచుచుండె. అప్పుడు దశరథమహారాజునకు ఆకుండయొక్క బుడబుడయనుశబ్దము ఏనుఁగుయొక్కశబ్దము వలె వినఁబడియె. ఆసమయమునందు దశరథమహారాజు వనమునందలి యేనుఁగును జంపఁగూడదని యెఱిఁగియును ఆవైశ్యకుమారుని ఏనుఁగునుఁగాఁ దలంచుకొని బాణమునువైచికొట్టె. అప్పుడు ఆవైశ్యకుమారుఁడు అయ్యో హా తండ్రీ పాపిష్ఠివాఁడు ఎవ్వఁడో నన్ను నిర్నిమిత్తముగాఁ జంపెనే? అని గట్టిగా అఱచుచుఁ గ్రిందఁబడియె. అంత ఆధ్వనిని దశరథమహారాజు విని మిక్కిలి భయముగలవాఁడై దిగులుపడుచు నావైశ్యకుమారుఁడు పడియున్న చోటునకు మిక్కిలివేగముతోఁ బరుగిడియె. అట్లుపరుగిడిపోయి యావైశ్యకుమారునిశరీరమునందు తగులుకొనియున్న బాణము నూడఁబెఱికి బయలునకుఁ దీసె. అంతట నతఁడు మరణమునుపొందె. అతఁడు మరణమును పొందినవృత్తాంతమును అతని తల్లిదండ్రులు దశరథమహారాజుచే విని మిక్కిలి దుఃఖమును పొందిరి. పిమ్మట ఆవృద్ధులైన తలిదండ్రులిరువురును ఆరాజుచేతనే చితిని కల్పించుకొని పుత్త్రునితోఁగూడ ఆచితియందుఁ బ్రవేశించిరి. అట్లు చితియందు ప్రవేశించునపుడు పుత్త్రశోకముచేత దుఃఖించుచున్న ఆవృద్ధులిరువురును దశరథమహారాజునుజూచి యిట్లనిరి. ఓదశరథుఁడా! మేము ఏవిధముగా పుత్త్రశోకముచేత మరణమును పొందుచున్నామో ఆవిధముగా నీవును మరణమును పొందుదువని శపించిరి. అంతట దశరథమహారాజు మిక్కిలి దుఃఖముగలవాఁడై తనపట్టణమునకుఁబోయి ఆవృత్తాంత

మును సర్వమును తనకు గురువగు వసిష్ఠమహామునికిఁ దెలియఁజేసె. అంతట వసిష్ఠమహాముని ఆదోషశాంతికొఱకు దశరథమహారాజుచేత అశ్వమేధయాగమును చేయించె. ఓదేవీ! పార్వతీ! ఆదశరథమహారాజునకు రోమపాదుఁడను నొకమిత్త్రుఁడు కలఁడు. దశరథమహారాజు ఆమిత్త్రునియొక్క కుమార్తెను తనకు పుత్త్రికనుగా స్వీకరించె. ఆసమయమునందు వర్షములు లేకపోవుటచేత అధికమైన క్షామముకలిగె. అప్పుడు కన్యాదానమును చేసిన యెడల వర్షము వచ్చునని మునులుచెప్పిరి. అప్పుడు దశరథుఁడు రోమపాదునితో ఈవృత్తాంతమునుజెప్పె. అప్పుడు రోమపాదుఁడు విభాండక ఋషియొక్క ఆశ్రమమునకు వేశ్యాస్త్రీలనుపంపి ఆవిభాండకమునియొక్క పుత్త్రుఁడగు ఋష్యశృంగునకు మోహమును కల్గించి అయోధ్యాపట్టణమునకు రప్పించె. అప్పుడు వేశ్యాస్త్రీలు అనేకవిధములగు చుంబనాలింగనాదులచేత విభాండకమునియొక్క పుత్త్రుఁడగు ఋష్యశృంగమహామునికి మిక్కిలి స్త్రీవ్యామోహమును కల్గించిరి. అంతట భూలోకమునందు సమృద్ధముగ మేఘుఁడువర్షించె. పిమ్మట రోమపాదుఁడు సంతోషమునుపొంది శాంతియను కన్యకను ఋష్యశృంగునకు ఇచ్చి వివాహమును చేసె. అంతట దశరథమహారాజుకూడ ఆఋష్యశృంగమహామునిని తనగృహమునకుఁ దీసికొనివచ్చె. అప్పుడు ఋష్యశృంగమహాముని సంతానరహితుఁడైన ఆదశరథమహారాజుచేత పుత్త్రికామేష్టినిచేయించె. అట్లు పుత్త్రికామేష్టినిచేయింపఁగా అగ్నిదేవుఁడుఅగ్నికుండమునుండి బయలువెడలివచ్చి దశరథమహారాజునకు పాయసమును ఇచ్చె. అంతట దశరథమహారాజు ఆపాయసమును తనయొక్క భార్యలకిచ్చె. ఆసమయమునందు కైకేయి అనునది ఆపాయసమును అనాదరణబుద్ధితోఁ గైకొనియె. అట్లుతీసికొని యాపాయసమునందు కొంతభాగమును తానుభుజించి కొంతభాగమును అంజనాద్రియందు నివసించియుండు ఒకగ్రద్ధపైవైచె. అందువలన గ్రద్ధయైయున్న దేవవేశ్యకు శాపమునివర్తించె. పూర్వము దేవవేశ్యయగు సువర్చలయనునది శపింపఁబడియె. అట్లుశపింపఁబడి అనేకవిధములచేత బ్రహ్మదేవుని స్తోత్రమునుచేయఁగా ఆబ్రహ్మదేవుఁడు నీమీఁద కైకేయి యెప్పుడు పాయసమును వైచునో అప్పుడు శాపము నివర్తించిపోవునని చెప్పె. కావున ఆకైకేయి పాయసమును అనాదరణబుద్ధితో గ్రహించి అంజనాద్రియందు వైచె. అందువలన గ్రద్ధయైయున్న యాదేవవేశ్య నిజరూపమును ధరించి స్వర్గలోకమునకుఁబోయె. అట్లు దశరథమహారాజుచేత విభజించి యీయఁబడిన పాయసమును అతనిభార్యలు ముప్పురును భక్షించిరి. అంతట నాదశరథునిభార్యలు ముప్పురును గర్భవతులైరి. అప్పుడు జనులందఱును ఆ కౌసల్యా సుమిత్రా కైకేయులయొక్క గర్భచిహ్నముల చేతనే పుట్టఁబోవు బాలురగుణములను తెలుపుచుండిరి.

ఇట్లు శ్రీమదానంద రామాయణమున సారకాండమునందు
మొదటిసర్గము ముగిసెను.

## ✷ శ్రీరామచంద్రాదులయుత్పత్తి. ✷

ఓదేవి! పార్వతీ! ఆదశరథమహారాజు పుత్త్రకామేష్టి మొదలగు కార్యములను చేయుచున్న కాలమునందు భూలోకమంతయును రావణాసురునిచేత నానావిధములుగా బాధింపఁబడుచుండె. అందువలనను భూమిదేవి బ్రహ్మదేవునిదగ్గరకుఁబోయి, ఓబ్రహ్మదేవుఁడా! యీభారమును పోఁగొట్టుమని ప్రార్థించె. అంతట బ్రహ్మదేవుఁడు శ్రీమహావిష్ణునిదగ్గఱకుఁ బోయి ఆ వృత్తాంతమును సర్వమును చెప్పఁగా శ్రీమహావిష్ణువివ్విని యిట్లనియె. ఓమహాత్మా! బ్రహ్మదేవుఁడా! రావణాసురుని సంహరించుటకు నేను భూలోకమునందుఁ బుట్టెదను. దేవతలందఱును వానరులై పుట్టవలయును. మఱియును, దుందుభియనుపేరుగల గంధర్వస్త్రీ నేను చేయఁబోవుకార్యములు నెరవేరుటకొఱకు భూలోకమునందు మంథరయను పేరుతోఁ బుట్టవలయును. ఇదియే ఇంకొకసూరి అనఁగా ద్వాపరాంతమందు కంసుని గృహమునందు కుబ్జయైపుట్టును అనిచెప్పె. అట్లు శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవునితోఁజెప్పి చైత్రశుద్ధనవమినాఁటి మధ్యాహ్న కాలమునందు కౌసల్యాదేవికి నవమాసములు నిండుటచే ఆకౌసల్యాగర్భమునుండి నాలుగుభుజములుకలవాఁడును, మేఘమువలె నల్లనివాఁడును, అధికమైన కాంతికలవాఁడునునై, ఆవిర్భవించె. ఆసమయమునందు కౌసల్యాదేవి ఆమహావిష్ణువును బాలభావమునుపొందుమని ప్రార్థించె. అంతట ఆ శ్రీమహావిష్ణువు రత్నములచేత అలంకరింపఁ బడినవాఁడును, పద్మపత్రములవంటి కన్నులుకలవాఁడును, సూర్యునియొక్క కాంతివంటికాంతికలవాఁడును, అగుబాలుఁడయ్యె. అటులనే ఆదిశేషువు సుమిత్రకెదుటను విష్ణుదేవునియొక్క శంఖచక్రములు అనఁబడ్డవారలై కైకేయియెదుటను ఆవిర్భవించి వారలచేత బాలభావమును పొందుఁడని ప్రార్థింపఁబడినవారై బాలురైరి. ఇవ్విధముగ శుభముహూర్తమునందు దశరథమహారాజునకు నలుగురు పుత్త్రులు పుట్టిరి. ఆసమయమునందు దేవదుందుభులు మ్రోఁగె. మిగుల పావనమగు పుష్పవర్షము కురిసె. అంతట దశరథమహారాజు తనకులగురువగు వసిష్ఠమహర్షిచేత ఆనలుగురుపుత్త్రులకును జాతకర్మాది సంస్కారములను చేయించె. ఆసమయమునందు వారస్త్రీలు నృత్యమును చేసిరి. మఱియును అప్పుడు వసిష్ఠమహర్షి జ్యేష్ఠుఁడగు కౌసల్యాపుత్త్రునకు శ్రీరాముఁడని నామకరణమునుచేసె. సుమిత్రాదేవికుమారునకు లక్ష్మణుఁడని పేరుపెట్టె. కైకేయికుమారులకు భరతశత్రుఘ్నులని పేరుపెట్టె. మఱియును, సకలజనులను రంజింపఁజేయును కనుక రాముఁడను నామధేయమును, శుభలక్షణములు కలవాఁడగుటచేత లక్ష్మణుఁడను నామధేయమును, సర్వమును భరించువాఁడగును కనుక భరతుఁడను నామధేయమును, శత్రువులను మర్దించును కనుక శత్రుఘ్నుఁడను నామధేయమును తగియుండు నని వసిష్ఠమహర్షి చెప్పె. అంతట లక్ష్మణుఁడు రామునితోడను శత్రుఘ్నుఁడు భరతునితోడను మిత్రత్వమును అవలంబించి బాలక్రీడల నాడుచు వృద్ధిని పొందుచుండిరి.

మఱియు నారామలక్ష్మణభరతశత్రుఘ్నులు నలువురును నానావిధములగురత్నాభరణములచేత అలంకరింపఁబడిరి. మఱియును ఆబాలురునలువురును అనేకవిధములయిన రత్నములచేతఁజెక్కఁబడి బంగారముతోఁ జేయఁబడిన తొట్లమంచములయందు ఊఁగుచు ప్రకాశించుచుండిరి. మఱియును ఆతొట్లమంచములకుఁ జుట్టును సువర్ణమయములగు రావియాకులకు ముక్తాఫలములను గ్రుచ్చికట్టిరి. అట్టి రావియాకులు ఆబాలకులను మిక్కిలి ప్రకాశింపఁజేయుచుండె. మఱియును ఆబాలకులయొక్క కంఠములయందు దివ్యములగు కంఠాభరణములు ప్రకాశించుచుండె. కర్ణములయందు రత్నములచేఁ దెల్లని నగు సోఁగులు ప్రకాశించుచుండె. మఱియును గజ్జెలు, అందెలును, మొలనూళ్లును, మిగులమనోహరములై యుండె. మఱియును ఆబాలకులు నలువురును చిన్నచిన్నదంతములచే నవ్వును చూపుచున్న ముఖములుకలవారును, ఇంద్రనీలమణులవంటి కాంతులుకలవారును, ముంగిళులయందు మెల్లమెల్లగదోఁగాడు వారును, నానావిధములగు సంస్కారములచేత అలంకరింపఁబడినవారును నైరి. ఆబాలకులు నలుగురును తల్లిదండ్రులకు పరమానందమును గలిగించుచుండిరి. మఱియును, కౌసల్యాదశరథులు నానావిధములగు వస్త్రములచేతను నానావిధములగు పెద్దపులిగోళ్లచేతను ఆబాలకుల నలంకరించుచుండిరి. ఇట్లుండఁగ నొకనాఁడు రాముఁడు భోజనము చేయుచున్న తండ్రియొక్క భోజనపాత్రమునందలి అన్నముయొక్క ముద్దను తీసికొని బయలునకుఁ బరుగెత్తె. అప్పుడు యోగులకుఁగూడ గోచరుఁడుకాని రాముఁడు కౌసల్యయొక్క చేతికి దొరకకపోయె. అంతట నారాముఁడు తిరిగివచ్చి మృదువైన తనహస్తముచే ఆఅన్నముయొక్కముద్దను సంతోషముతో తల్లియొక్కయును, తండ్రియొక్కయును నోళ్లయందుఁ బెట్టె. ఇట్లు అనేకవిధములయిన బాలక్రీడలచేత రాముఁడు తల్లిదండ్రులకు సంతోషమును గల్గించుచుండె. మఱియును లక్ష్మణభరతశత్రుఘ్నులుకూడ నానావిధములయిన బాలక్రీడలచేతను, బాలచేష్టలచేతను, బాలభాషితములచేతను, బాలయుద్ధములచేతను, నడకలచేతను, ముద్దులచేతను తల్లిదండ్రులకు నానావిధములగు సంతోషములను కల్గించుచుండిరి. మఱియును ఆబాలురు నలువురును తమ చరిత్రములచేతను వాహనారోహణములచేతను తల్లిదండ్రులకు సంతోషమును కల్గించుచుండిరి. అంతట నొకనాఁడు ఆబాలకులునలువురును వస్త్రాలంకారములచేత అలంకరింపఁబడినవారై సభలోనికిఁబోయి తండ్రికి నమస్కారమునుచేసి సింహాసనముమీఁదఁ గూర్చుండిరి. పిమ్మట నాదశరథమహారాజు తనపుత్త్రులను నలువురకును గర్భమాసములతోఁ గూడ నాఱవదగు సంవత్సరమునందు ఉపనయనమును, వసిష్ఠమహామునిని గురువునుగా నియమించుకొనిచేసె. బ్రహ్మవర్చసకాముఁడగు బ్రాహ్మణునకు అయిదవసంవత్సరమునందును, వీర్యకాముఁడగు క్షత్రియునకు ఆఱవ సంవత్సరమునందును ద్రవ్యార్థియగు వైశ్యునకు ఎనిమిదవసంవత్సరమునందును, ఉపన

యనమును చేయవలసినదను నియమమును అవలంబించి దశరథమహారాజు తనపుత్త్రులకు ఆఱవసంవత్సరమునందు ఉపనయనమునుచేసె. అంతట నాబాలకులు నలువురును వేదవేదాంగాదివిద్యలను విధ్యుక్తప్రకారముగఁ జదువుకొనిరి. అట్లు బ్రహ్మచర్యాశ్రమమును ముగించినపిమ్మట మిగుల ఆదరముతో తీర్థయాత్రలను సేవించుటకొఱకు వసిష్ఠుఁడు, సేనాపతి మొదలగువారితోడను గూడుకొనినవారై బయలువెడలి పోయిరి. పోయి సకలతీర్థములను సేవించి ఆఱుమాసములకు మరల నయోధ్యాపట్టణమునకువచ్చిరి. వచ్చినపిమ్మట ఆపుత్త్రులు నలువురును తండ్రియగు దశరథమహారాజుయొక్క అధీనమునందుప్రియులై సంచరించుచుండిరి. మఱియును, ఆనలువురును తల్లిదండ్రులకును పురజనులకును అధికముగ సంతోషమును కల్గించుచుండిరి.

ఇట్లు శ్రీమదానందరామాయణమున సారకాండమునందు
రెండవసర్గము ముగిసెను.

---

## * సీతాస్వయంవరచరిత్రము. *

పరమేశ్వరుఁడు పార్వతీదేవినిజూచి యిట్లనియె. ఓదేవీ! ఓపార్వతీ! ఈప్రకారముగా రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వృద్ధినిపొందుచుండఁగా ఒకనాఁడు విశ్వామిత్రమహాముని అయోధ్యాపట్టణమునకువచ్చి దశరథమహారాజునుజూచి తనయజ్ఞసంరక్షణముకొఱకు దశరథమహారాజుతో నిట్లనియె. ఓమహారాజా! దశరథుఁడా! నాయజ్ఞమును కాపాడుటకొఱకు రామలక్ష్మణులను, కొన్నిదినములవఱకు నాయొద్దనుంచుటకు పంపుమనిన దశరథమహారాజు విని వసిష్ఠమహర్షి మొదలగువారితో నాలోచించి యారామలక్ష్మణులను ఇరువురను విశ్వామిత్రునితోఁగూడ పంపె. అంతట నారామలక్ష్మణులు విశ్వామిత్రునితోఁగూడ సిద్ధాహూతులై యజ్ఞసంరక్షణముకొఱకు పోయిరి. అంతట విశ్వామిత్రుఁడు కామాశ్రమమునందలి మార్గమునందుండి పోవుచు అధికమైనసంతోషముకలవాఁడై తనయాశ్రమమునకుపోయె. పిమ్మట ప్రాతఃకాలమునకు ముందుగ రామలక్ష్మణులను స్నానముచేయించి తానును స్నానము చేసె. అంతట నారామలక్ష్మణులకు ధనుర్విద్యతోఁగూడ మహేశ్వరవిద్యను ఉపదేశించె. అంతట శస్త్రాస్త్రవిద్యలను రథగజాశ్వాదివిద్యలను గదావిద్యను ఉపదేశించె. పిమ్మట మంత్రాహ్వానవిసర్జనములను ఉపదేశించె. పిమ్మట ఆఁకలిదప్పులయొక్క బాధలను పోఁగొట్టునట్టి బలాతిబలలనియెడు విద్యలను ఉపదేశించె. ఈప్రకారముగా రామలక్ష్మణులు ఇరువురును సకలవిద్యలను చదువుకొని వనమునందు నివసించుచున్న మునులకు సంతోషమును కలుగఁజేయుటకొఱకు ఆవనములయందలి రాక్షసులనుకొట్టిరి. మఱియును, మార్గమునందు మార్గస్థులను హింసించుచున్న తాటకయను రాక్షసస్త్రీని ఒక్కబాణముచేత శ్రీరాముఁడు సంహరించె. ఆతాటక పూర్వము ఒక దేవవేశ్య. ఆదేవవేశ్య అరణ్యమునందు ఒకమహామునిని

క్షోభ పెట్టుటచేత ఆమహాముని రాక్షసివికమ్మని శపించె. అది మొదలుకొని యాదేవవేశ్య రాక్షస స్త్రీరూపమును ధరించి సుందుఁడను రాక్షసునకు భార్యయై మారీచసుబాహులను ఇరువురుపుత్త్రులను కనియె. అట్టిదేవవేశ్య రామునియొక్క బాణముచేత మరల తనయొక్క నిజరూపమును ధరించి తనవృత్తాంతమును సర్వమును చెప్పి రామునకు నమస్కరించి స్వర్గమునకుఁ బోయె. అంతట రాముఁడు విశ్వామిత్రునియొక్క ఆశ్రమమునందుఁ బ్రవేశించి విశ్వామిత్రునియజ్ఞమునకు విఘ్నములను చేయుచున్న రాక్షసులను మిక్కిలి తీక్ష్ణములగు బాణములచేత సంహరించె. అది మొదలుకొని రాముఁడు రణయజ్ఞమును ఆరంభించె. అంతట శ్రీరాముఁడు మిక్కిలి తీక్ష్ణములయిన బాణములచేత పెక్కు వేలమంది రాక్షసులను సంహరించి మారీచుఁడను రాక్షసుని తనబాణముచేత నూఱామడదూరమునను న్న సముద్రమునందుఁ బడవైచె. మఱియును, రఘుకులోత్తముఁడగు రాముఁడు ఒక్కబాణముచేతనే సుబాహువను రాక్షసుని వధించె. ఈప్రకారముగ శ్రీరాముఁడు సకలరాక్షసులను సంహరించి విశ్వామిత్రుని యాగమును సమాప్తిని పొందించె. ఆప్రకారముగా శ్రీరాముఁడు విశ్వామిత్రునియొక్క యజ్ఞమునుమాత్రము సమాప్తిని పొందించెనుకాని తనయొక్క రణయజ్ఞమునుపూర్తిని పొందించకయుండె.

అంతట కాలాగ్నివలె తృప్తినొందకయున్న యీరామునకు తృప్తిని కలిగించుటకొఱకు విశ్వామిత్రమహాముని జనకచక్రవర్తియొక్క గృహమునందు సీతాస్వయంవరము జరుగునని వినియుండుటచేత అచ్చోటునకుఁ దీసికొనిపోవఁదలఁచె. అట్లు పోఁదలఁచి ఆవిశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతోఁ గూడుకొనినవాఁడై జనకచక్రవర్తియొక్క పట్టణమునకుఁ బోయె. అట్లుపోవుచు మార్గమధ్యమునందు భర్తచేత శపింపఁబడి శిలారూపముతో నున్నదియును, మునీశ్వరునివేషము వేసికొనివచ్చిన ఇంద్రునిచేత అనుభవింపఁ బడినదియును, మిక్కిలి పావనురాలును, గౌతమునకు భార్యయును నగు, అహల్యయను స్త్రీయొక్క వృత్తాంతమును సర్వమును చెప్పి మఱియు నిట్లనియె. శ్రీరామలక్ష్మణులారా! పూర్వము బ్రహ్మదేవుఁడు రెండుముఖములుగల యహల్యయనుగోవును సృజించి ఆగోవును ఇంద్రుఁడు అడిగినను ఇయ్యక గౌతమమహామునికి ఇచ్చె. అందువలన దేవేంద్రుఁడు గౌతమమహామునియందు విరోధము కలవాఁడై గౌతముని భార్యయైన అహల్యను అనుభవించి గౌతమునిచేత వేయిభగములు (యోనులు) కల వాఁడవగు మని శపింపఁబడియె. అంతట ఇంద్రుఁడు గౌతమమహామునిని అనేకవిధములచేత ప్రార్థింపఁగా లోకులకు నేత్రములవలెఁ గనఁబడుననియును, నీకుమాత్రము భగములవలెఁ గనఁబడుననియును గౌతమమహామునిచెప్పె. అందువలన దేవేంద్రునకు సహస్రాక్షుఁడని పేరువచ్చె నని విశ్వామిత్రమహాముని చెప్పినపిమ్మట, శ్రీరాముఁడు తనకాలితోఁ దన్ని శిలారూపముతో నున్నదియును గౌతమునకు భార్యయు అగు అహల్యను పావ

నురాలినిఁగాఁ జేసె. మఱియును రాముఁడు గౌతమమహామునిశాపమువలన జనస్థానమునందు శిలారూపముతోనున్న అహల్యను అరణ్యమునందు సంచరించుచున్న శ్రీరాముఁడు తనయొక్కపాదస్పర్శముచేత పవిత్రురాలై శాపమునుండి విముక్తురాలగునట్టుచేసె నని కల్పభేదములనుపట్టి మహామునులు పలుకుదురు. మఱియును, శ్రీరామునిచరిత్రము కల్పభేదములచేత అనేకవిధములై యుండును. అట్లు శ్రీరాముఁడు అహల్యకు శాపవిమోచనమును చేసినకాలమునందు దేవగంధర్వులు పుష్పవర్షమును కురిపించిరి. అంతట నాఅహల్యను గౌతమున కిచ్చి రామలక్ష్మణవిశ్వామిత్రులు గంగానదియొద్దకుపోయిరి. అప్పుడు శ్రీరాముఁడు గంగానదిని దాఁటుటకు పడవను తెమ్మని పడవవానితోఁజెప్పఁగాఁ ఆపడవవాఁడు ఇట్లనియె. ఓరాముఁడా! నేను ముందుగా నీపాదరేణువులను కడిగి పిమ్మట నీపాదములను నాయోడయందుఁ బెట్టించెదను. అట్లుకాదేని నీపాదరేణువులచేత నాపడవకూడ ఆఁడుదియైపోవును. ఇదివఱకే నాకొకభార్యకలదు. దానిని సంరక్షించుకొనుటకే నేను శ్రమమును పొందుచున్నాను. ఇప్పుడింకొకభార్య కలిగనేని దానిని నేనేమిచేయుదు ననిచెప్పె. ఆమాటను శ్రీరాముఁడు విని నవ్వి ఆపడవవానిచేత పాదములను గడిగించుకొనినపిమ్మట ఆపడవమీఁదనెక్కె. అంతట రామలక్ష్మణ విశ్వామిత్రులు గంగానదినిదాఁటి మిథిలాపట్టణమునకుఁ బోయిరి. ఆరామలక్ష్మణులును విశ్వామిత్రుఁడును, మిథిలాపట్టణమునకుఁ బోవుటకు ముందె పెక్కువేలమందిరాజులు అచ్చోటికివచ్చియుండిరి. మఱియును, మిథిలానగరమునందలి సీతాస్వయంవరవృత్తాంతమును సారణుఁడనువానివలనవిని రావణాసురుఁడుకూడ మంత్రులను వెంటఁబెట్టుకొని సేనాపరివృతుండై పిలువకపోయినను వచ్చియుండె. ఆసమయమునందు పుత్త్రవిరహవ్యసనముచేత దశరథమహారాజు మాత్రము రాకపోయె. ఆదశరథుఁడు మిక్కిలి ప్రియముతోఁ బిలువఁబడినను పుత్త్రవిరహవ్యసనములు రాకుండునట్లు చేసె. అట్లు బయలువెడలిన రామలక్ష్మణవిశ్వామిత్రులు మెల్లమెల్లగఁబోయి మిథిలాపట్టణమునకు సమీపమునను్న ఉద్యానవనమునందుఁ బ్రవేశించిరి. అట్లువచ్చిన విశ్వామిత్రునివృత్తాంతమును తెలిసికొని జనకమహారాజు మంత్రులతోఁగూడివచ్చి తీసికొనిపోవుటకు యత్నించుచుండఁగానే విశ్వామిత్రునిశిష్యులుపోయి ఆవృత్తాంతమునుచెప్పిరి. అంతట జనకచక్రవర్తి మంత్రులుమొదలగువారితోఁగూడవచ్చి విశ్వామిత్రునకు నమస్కారముచేసె. పిమ్మట విశ్వామిత్రునిశిష్యుఁడు జనకచక్రవర్తియొక్క హస్తమునుపట్టుకొని యేకాంతస్థలమునకుఁ దీసికొనిపోయి యిట్లనియె. ఓమహారాజా! మాగురువగు విశ్వామిత్రుఁడు నీతో నిట్లుచెప్పుమని చెప్పె. దశరథమహారాజునకు పుత్త్రులును వీరులును అగురామలక్ష్మణులను తీసికొని వచ్చితిని. వీరిరువురును సీతను, ఊర్మిళను, పెండ్లియాడుదురు. సీతకు శుల్కమునుగాఁబెట్టిన ధనుస్సును ఈరాముఁడు విరిచివేయఁగలఁడు. కాఁబట్టి వరపూజనుచేసి యీరామలక్ష్మణులను పట్టణములోనికిఁ దీసికొనిపొమ్ము. ధనుస్సును రాముఁడు ఖండించు

మఱికిని ఈవృత్తాంతమును రహస్యముగ నుంచుము. అని మాగురువగు విశ్వామిత్రుఁడు చెప్పుమనిచెప్పెనని యాశిష్యుఁడు జనకచక్రవర్తితోఁజెప్పి గురుఁడగు విశ్వామిత్రునిదగ్గఱకువచ్చె. జనకచక్రవర్తి ఆవృత్తాంతమును విని మిక్కిలి సంతోషముకలవాఁడై తనపట్టణమును నిర్నిమిత్తముగ నలంకరించువానివలె తోరణాదులచేత నలంకరింపఁజేసె. అట్లుచేసి చతురంగసైన్యముతోడను కూడుకొనినవాఁడై పట్టపుటేనుఁగును ముందిడుకొని భార్య మొదలగువారితోడను నానావిధములయిన వాద్యములతోడను విశ్వామిత్రునియొక్క సమీపమునకు వచ్చె. అట్లువచ్చి విశ్వామిత్రునకు నమస్కరించి ఆవిశ్వామిత్రుని శాస్త్రోక్తప్రకారముగఁ బూజించి రామలక్ష్మణులను తెలియనివానివలెఁ జూచి వస్త్రాలంకారభూషణాదులచేత నారామలక్ష్మణులను శాస్త్రోక్తప్రకారముగఁ బూజించి ఆయిరువురిని పట్టపుటేనుఁగుమీఁదఁ గూర్చుండఁబెట్టి చామరాదులచే సేవచేయించుచు మిథిలాపట్టణమునకుఁ దీసికొనివచ్చె. ఆసమయమునందు వేశ్యాస్త్రీలు నృత్యమును చేసిరి. వందిమాగధులు స్తోత్రమును చేసిరి. నానావిధములగు వాద్యములుమ్రోఁగె. అప్పుడు రామలక్ష్మణులు ఏనుఁగునెక్కి రాజమార్గమునవచ్చుచున్నారను వృత్తాంతమును పురస్త్రీలువిని మేడలమీఁదనెక్కి చూచుచుండిరి. మఱియును పురస్త్రీలందఱును పుష్పవర్షమును కురిపించిరి. మఱియును ఆపురస్త్రీలు తమలోఁదాము ఈరాముఁడు సీతకుఁ దగినవరుఁడని చెప్పుకొనుచుండిరి. మఱియును రాముఁడు తగినవాఁడగుటచేత మనకందఱకును సంతోషమును కలుగఁజేయుచున్నాఁడనిరి. మఱియును, అనేకములయిన సులక్షణములుకల యీలక్ష్మణుఁడు ఊర్మిళకుఁ దగినవరుఁడని చెప్పుకొనుచుండిరి. మఱియును మనము అదృష్టముకలవారమగుటచేత మనసీతకును, ఊర్మిళకును తగినవరులు దొరకిరని చెప్పుకొనిరి. మఱియును రామలక్ష్మణులు మిక్కిలిరమ్యులుగను మిక్కిలిశ్రేష్ఠులుగను నున్నారని యనుకొనిరి. ఈప్రకారముగఁ జెప్పికొనుచున్న పురస్త్రీలయొక్క వాక్యములను విని రామలక్ష్మణులు ముఖములను పైకెత్తిచూచిరి. ఆసమయమునందు స్వయంవరమునకువచ్చిన రాజులందఱును ఒక్కటిగాఁజేరి పరస్పరమును ఇట్లనిరి. ఈజనకచక్రవర్తి మనలనుపట్టణములోనికి తీసికొనివచ్చినపుడు ఇట్టియుత్సవమును చేసినవాఁడు కాఁడు. ఈరాముని అంతఃపురములోనికిఁ దీసికొనిపోయి సీతనిచ్చి వివాహమును చేయునని తోఁచుచున్నది. ఇట్లు జనకచక్రవర్తి మనకందఱకును మానభంగమును చేసెనని యనుకొనుచుండిరి. ఈప్రకారముగ మాటలాడుకొనుచున్న రాజులయొక్క మాటలను రామలక్ష్మణులును విశ్వామిత్రుఁడును జనకచక్రవర్తియును వినిరి. అంతట కిటికీలయందలి స్త్రీలచేతఁ జూడఁబడుచున్న యారామలక్ష్మణులు వాద్యఘోషములతోఁగూడఁ మెల్లమెల్లఁగ జనకచక్రవర్తియొక్క సభామండపములోనికిఁ బోయిరి. అంతట వీరులగు నారామలక్ష్మణులు విశ్వామిత్రునితోఁగూడ ఏనుఁగులమీఁదనుండి దిగిరి. అంతట పెక్కుమంది

రాజులచేత అధిష్ఠింపఁబడిన యాస్వయంవరశాలలోనికి విశ్వామిత్రునితోఁగూడఁ బోయి మునులు నివసించినచోట నివసించిరి. ఇట్లు సకలరాజులును మునులును నివసించియున్న సభలోనికి యాజనకచక్రవర్తి వచ్చి యిట్లనియె. ఓ రాజశ్రేష్ఠులారా! మునిశ్రేష్ఠులారా! ఈసభలోనికిఁ దేఁబడిన యీధనుస్సును ఎక్కువెట్టినవానికి నేను నాకన్యక యగు సీతను ఇచ్చి వివాహము చేసెదను. నేను పరశురాముని వలన ధనుర్విద్యను అభ్యసించి యీశ్వరునిచేత త్రిపురాసురసంహారకాలమునందు ఉపయోగింపఁబడిన యీధనుస్సును పరశురామున కిచ్చితిని. ఆపరశురాముఁడు ఈధనుస్సును చేతఁబూని ఇరువదియొక్కపర్యాయములు భూమియందలి క్షత్రియులనందఱిని సంహరించెను. మఱియును ఆపరశురాముఁడు కార్తవీర్యార్జునుఁడు తనతండ్రిని చంపినందువలనఁ గలిగినకోపముచేత ఆకార్తవీర్యార్జునుని సంహరించె. పిమ్మట పరశురాముఁడు ఈధనుస్సును నాయింటియందుంచె. నాకుమార్తె యగుసీత యీధనుస్సును చేతఁబుచ్చుకొని క్రీడనుచేయుటనుచూచి పరశురాముఁడు ఈసీత మహాలక్ష్మియొక్క అవతారమని చెప్పె. అట్లు చెప్పుటవలన నేను ఈధనుస్సును కన్యాశుల్కముగాఁ బెట్టితిని. అనిచెప్పి యాజనకచక్రవర్తి మరల నిట్లనియె. ఓరాజశ్రేష్ఠులారా! మునిశ్రేష్ఠులారా! ఈధనుస్సును శస్త్రాగారమునుండి యేఁబదియొద్దులచే మోయించుకొని తెచ్చి యీసభాస్థలియందుఁ బెట్టించితిని. కావున ఈసభయందలి వీరులలో నెవ్వఁడు ఈధనుస్సును ఎక్కువెట్టునో అట్టివానికి సీతను ఇచ్చెదనని చెప్పె. అట్లు జనకచక్రవర్తి చెప్పిన మాటలనువిని అచ్చటనున్న రాజులందఱును పర్వతముతో సమానమైన ఆధనుస్సునుచూచిరి. అట్టి ధనుస్సునుచూచి రాజులందఱును అధోముఖులయిరి. మఱియును ఆరాజులలో కొందఱు ఆధనుస్సును భూమినుండి లేవఁదీయుటకు, సమర్థులుకాకపోయిరి. మఱి కొందఱు భూమియందలి ధనుస్సును కదలింపఁజేసియును మీఁదికెత్తఁజాలకపోయిరి. తుదకుఅందఱును ఆధనుస్సును చలింపఁజేయఁజాలకపోయిరి. చలింపఁజేయుటకే శక్తులుగాకయుండఁగా ఎక్కువెట్టఁజాలకపోయిరని చెప్పనక్కరలేదుకదా? కావుననే ఆరాజోత్తములందఱును ఆధనుస్సును ఎక్కువెట్టుటనుగుఱించి మనస్సుచేతఁగూడ నాలోచింపఁజాలకపోయిరి. అట్లు ఆరాజోత్తములందఱును ధనుస్సును ఎక్కువెట్టఁజాలక పోవుటను చూచి రావణాసురుఁడు గర్వోద్రిక్తుఁడై ధనుస్సుయొక్క సమీపమునకుఁబోయి జనకచక్రవర్తితో నిట్లనియె. ఓరాజోత్తమా! జనకమహారాజా! నేను దేవతలనందఱినిజయించితిని. ముల్లోకములును నాయధీనములగునట్లు చేయఁబడినవి. నాభుజములచేత కైలాసపర్వతమును అల్లలాడించితిని. అట్లు ప్రసిద్ధమయిన పరాక్రమముగల నాసామర్థ్యమును ఈస్వల్పధనుస్సునందుఁ జూడఁగోరితివా? అని పకపకనవ్వుచు వంగి యాధనుస్సును ఎడమచేతితోఁగదలించె. అప్పుడు ఆధనుస్సు కొంచెమైనను కదలకపోయె. అంతట దక్షిణహస్తముతోఁ గదలించిచూచె. అప్పుడు

ను కదలకపోయె. అప్పుడు రావణాసురుఁడు అధికమైన ఆశ్చర్యముకలవాఁడై రెండు
భుజములచేతను కదలించిచూచె. అప్పటికిని ఆధనుస్సు చలింపకపోయె. అంతట తన
యిరువదిభుజములచేతను ఆధనుస్సుయొక్క కొనను మీఁదికెత్తి భూమియందుంచఁ
బడి యున్న నారిని తీసికొనుటకు కొంచెము వంగి ఆనారినిపట్టుకొని లేచుచుండఁగా
ఆధనుస్సు వానిహృదయమునందుఁబడియె. అంతట నాధనుస్సును తనయిరువది భుజ
ములచేతను హృదయమునుండి తొలగించియును ఆభారమునకుఁ దాళఁజాలక వెల్ల
కిలఁబడియె. అప్పుడు ఆతనికిరీటము క్రిందఁబడియె. కట్టువస్త్రము వీడిపోయె. అంత
ట నాసభయందలి రాజులందఱును పకపకనవ్విరి. ఆసమయమునందు రావణునకు
ప్రాణములుపోవునట్లుండె. ముఖమునుండి చొంగకాఱుచుండె. అంతలో నతనిమం
త్రులువచ్చి యతనింజుట్టుకొని తగినఉపచారములను చేయుచుండిరి. ఈప్రకారముగ
నాధనుస్సును చలింపఁజేయుటకే యెవ్వరును సమర్థులు కాకపోయిరి. మఱియును ఆ
సమయమునందు రావణాసురుఁడు వెల్లకిలగానే తనవస్త్రములయందు మూత్రపురీ
షములనువిడచె. అప్పుడు జనకచక్రవర్తిలేచి మిక్కిలి భయముకలవాఁడగుచు నిట్ల
నియె. ఓ రాజశ్రేష్ఠులారా! భూలోకమునందు వీరుఁడెవ్వఁడైనఁగలఁడా! లేక ఈ
భూలోకము వీరుఁడు లేనిదయ్యెనా? ఈసభయందు సమర్థుఁడగువాఁడు ఎవ్వఁడైనఁ
గలడేని అట్టివాఁడువచ్చి యీరావణునకు జీవదానమును చేయవలయునని చెప్పె.
ఇట్లు జనకచక్రవర్తి చెప్పుచున్న మాటలనియెడు బాణములచేతఁ గొట్టఁబడి రామ
లక్ష్మణులు విశ్వామిత్రునియొక్క ముఖమునుజూచి కనుబొమలతో సైగనుచేసిరి. అ
ప్పుడు విశ్వామిత్రుఁడు రాముని లెమ్మనిచెప్పి యిట్లనియె. ఓరాముఁడా! నీవుసభాం
గణమునందు రావణాసురుఁడు మరణమును పొందుటను చూచుచున్నావే! ఇట్లు
చూచుట తగునా? తగదు. కాఁబట్టి ఓరాముఁడా! ఈరావణుని జీవింపఁజే
యుము. మఱియును ఈధనుస్సునెక్కువెట్టుము. అనిచెప్పిన యారాముఁడు విని
నీవు చెప్పినవిధముగఁ జేసెదనని చెప్పి మిక్కిలి శీఘ్రముగలేచి విశ్వామిత్రునకు నమ
స్కారమునుచేసి కంఠమునందలి హారాదులను దీసివైచి మొలనూలును దృఢముగ
బంధించి కిరీటాదికమును దృఢముగబంధించుకొని మెల్లగ సభయొక్క ముందరిప్రదే
శమునకుఁ బోయె. అట్లువచ్చిన రామునిచూచి సభలోనివారందఱును మిక్కిలి నా
శ్చర్యముకలవారును భయముకలవారునునై పద్మములవంటి నేత్రములతో ఱెప్ప
వేయకచూచిరి. మఱియును ఆరాజులందఱును దమలోఁ దా మిట్లనుకొనిరి. ఈశిశు
వుమూఢుఁడా! ఏమి? మనమందఱమును సాధ్యముకాదని వదలినకార్యమును ఈ
బాలుఁడు ఏమిచేయఁగలఁడు? అనిరి. కొందఱు ఈబాలుఁడు రావణాసురుని చూచు
టకు వచ్చెననిరి. మఱికొందఱు ఈబాలుఁడు పిల్లచేష్టలను చేయుననిరి. మఱికొంద
ఱు ఏమినిమిత్తముగ ఈబాలుఁడు హారములను విడిచిపెట్టెననిరి. కొందఱు విశ్వామి
త్రునివలన ధనుస్సునెక్కువెట్టి చచ్చుటకుఁబంపఁబడెననిరి. కొందఱు విశ్వామిత్రుఁడు

వీరిబలమును చూచుటకుఁ బంపెననిరి. విశ్వామిత్రునిచేతఁ బంపఁబడిన యీరాముఁడు ఏమిచేయునో చూతమనిరి. ఈప్రకారముగ రాజులందఱును మాటలాడుకొనుచున్న సమయమునందు జనకచక్రవర్తి శ్రీరామునిఁజూచి విశ్వామిత్రునితో నిట్లనియె. ఓమునిశ్రేష్ఠుఁడా! విశ్వామిత్రుఁడా! ఈబాలకులను ధనుస్సుదగ్గఱకు ఏలపంపితివి. రావణాదులుకూడ ఈధనుస్సును కదలింపఁజాలకపోయిరి. బాలుఁడుఇక్కడకు వచ్చి యేమిచేయఁగలఁడు. మఱియును, ఓమునిశ్రేష్ఠుఁడా! విశ్వామిత్రుఁడా! నీవు ఇదివఱకు పూర్వమునందు శిష్యునివలన చెప్పిపుచ్చిన మాటలన్నియును ఇప్పుడు అసత్యములై పోవును. మిక్కిలి సుకుమారములయిన అవయవములుకల యీబాలకుఁడు ఎక్కడ? భరింపశక్యముకాని యీధనువెక్కడ? "దప్పిఁగొన్న చాతకము సముద్రములోని యుదకమును సర్వమును త్రాగఁగలదా" అని జనకచక్రవర్తి చెప్పుచున్న సమయమునందు సుమేధమొదలుగాఁగల స్త్రీలందఱును మేడలమీఁద నుండి కిటికీలమార్గముగ సుకుమారమైన అవయవములు కలవాఁడును, పద్మములవంటి నేత్రములుకలవాఁడును అయిన రామునిచూచిరి. మఱియును, చంద్రబింబమువంటి మోముగలవాఁడును, భుజద్వయముచేత మిక్కిలి మనోహరముగఁ ప్రకాశించుచున్నవాఁడును, బంగారమువలె మెఱయుచున్న దేహకాంతికలవాఁడును, గజ్జలందెలు మొదలగు నాభరణములచేత నలంకరింపఁబడిన పాదములు కలవాఁడును, మురుఁగులచేతను, గొలుసులచేతను ప్రకాశింపఁ జేయఁబడిన హస్తములుకలవాఁడును, మిక్కిలి శ్రేష్ఠములయిన రత్నకుండలములచేత అలంకరింపఁబడినవాఁడును, మిక్కిలి మనోహరములయిన పిక్కలు, పాదములు, పిఱుఁదులు, ఉదరము, భుజశిరస్సులు, దవుడలు అనునట్టి అవయవములు కలవాఁడును, శంఖమువంటి కంఠము కలవాఁడును, నవ్వునుచూపుచున్న ముఖముకలవాఁడును, మృదువులగు పెదవులుకలవాఁడును, మనోహరమైన దంతపంక్తి కలవాఁడును, చక్కని ముక్కుకలవాఁడును, చక్కని చెక్కిళులుకలవాఁడును, పద్మపత్రములవలె విశాలములయిన నేత్రములు కలవాఁడును, చక్కనికనుబొమలు కలవాఁడును, మిక్కిలి మనోహరములయిన ముంగురులుకలవాఁడును, ముత్యాలహారమును తీసివేసినవాఁడును, పీతాంబరముకలవాఁడును, పద్మచిహ్నములచేతఁ ప్రకాశించుచున్న హస్తములుకలవాఁడును, సభాంగణమునందుఁ ప్రకాశించుచున్నవాఁడును అయిన రామునిచూచిరి. పిమ్మట తనచేతనున్న ధనుర్బాణములను క్రిందఁబెట్టి యీశ్వరుని ధనుస్సునకు అభిముఖుఁడైన రామునిగుఱించి అనేకవిధముల దైవమును ప్రార్థింపఁ దొడఁగిరి. మఱియును ఆ స్త్రీలందఱును ఆకాశమునకు ముఖమునెత్తి చేతులనుపైకిఁ బెట్టుకొని ఆకాశమునందున్న బ్రహ్మవిష్ణుమహేశ్వరులను ప్రార్థించుచుండిరి. మఱియును, తమ అవివేకముచేత రాముని సాక్షాన్నారాయణునిగాఁ దెలియఁజాలక పోయిరి. ఓపరమశివుఁడా! ఓనారాయణా! ఓబ్రహ్మదేవా! మేము పూర్వజన్మము

సందుఁ జేసినవ్రతదానాదిపుణ్యములచేత రాముఁడు ఈబాణమునెక్కు వెట్టునట్లుచేయుఁడు. మఱియును ఓ దేవతలారా! మాపుణ్యములచేత ఈధనుస్సును రామునకు పుష్పమువలె నుండునట్లుచేయుఁడు. ఈసమయమునందు మాసీత రామునికంఠమునందు పుష్పమాలికను వేయునట్లుచేయుఁడు. మఱియును ఓ దేవతలారా! ఇప్పుడు మానేత్రములు సఫలములగునట్లు చేయుఁడు. మఱియును సీతారాములు ఇరువురును వేదికయందుఁ గూర్చుండుటను మేముచూచునట్లు చేయుఁడు. అని యనేకవిధములఁ బ్రార్థించిరి. ఇట్లు స్త్రీలందఱును దేవతలను బ్రార్థించుచున్న సమయమునందు సీతామహాదేవి సభాంగణమందున్న రామునిచూచి మిక్కిలిశ్రేష్ఠమయిన మేడమీఁదనెక్కి చెలికత్తెలతోఁ గూడుకొనియున్నదయ్యును ఆనందముచేతఁ గలిగిన చెమటచేతఁ దడపఁబడిన శరీరముకలదై తానున్న యాసనమునుండి దిగ్గనలేచె. అట్లు లేచి తనచెలికత్తెయగు తులసి యనుదానికంఠమునందు మిక్కిలి ఆదరముతోఁ దన బాహులతలనుబెట్టి రత్నాలంకారములచేత అలంకరింపఁబడినదగుచు మిక్కిలి మనోహరముగ నిట్లనియె. ఆహా! ఓచెలియా! నాతండ్రియగు జనకచక్రవర్తి నాకు శత్రునివలె నావివాహమునకు ఏమశక్యమగు శుల్కమును నిర్మించె. మిక్కిలి మనోహరములయిన అవయవములుకల యీరాముఁడు ఎక్కడ? పర్వతముతో సమానమయిన యీధనుస్సు ఎక్కడ? ఓదైవమా! ఇప్పుడేమిచేయుదునోకదా! నీహృదయమునందు ఏమి పెట్టుకొనియుంటివోకదా? నేను రామునికంటె నితరుఁడగు పురుషుని మనస్సుచేతఁగూడఁ గోరను. ఒకవేళ మాతండ్రియగు జనకచక్రవర్తి బలాత్కారముగ నన్నుమఱియొకనికి ఇచ్చినయెడల నేను ప్రాసాదపతనాదులచేత ప్రాణత్యాగమును చేయుదును. ఓపరమశివుఁడా! ఓబ్రహ్మదేవా! ఓదుర్గాదేవీ! ఓసావిత్రీదేవీ! ఓసరస్వతీదేవీ! ఓగాయత్రీదేవీ! ఓసూర్యదేవుఁడా! ఓవరుణుఁడా! ఓకుబేరుఁడా! ఓఅగ్నిదేవుఁడా! ఓవిష్ణుదేవుఁడా! ఓగరుత్మంతుఁడా! ఓఫణీంద్రుఁడా! ఓచంద్రుఁడా! ఓసకలదేవతలారా! మిమ్ములనందఱిని ప్రార్థించుచున్నాను. మీరందఱును ఈధనుస్సును పుష్పతుల్యముగఁ జేయుఁడు. మఱియును ఈధనుస్సును రాముని భుజదండములయందుఁ బ్రవేశపెట్టుఁడు. అట్లుచేసినయెడల పదునాలుగుసంవత్సరములు మునివృత్తితో వనమునందు సంచరించుచు మిమ్ములఁ బ్రార్థించెదను. కావున శ్రీరాముఁడు ఈధనుస్సును ఎక్కువెట్టునట్లు చేయుఁడని సకలదేవతలకు మ్రొక్కె. ఈప్రకారముగా సీతామహాదేవి నానావిధములగు వాక్యములచేత దేవతలను ప్రార్థించె. ఈప్రకారముగా మేడమీఁదనుండి సీతచెప్పుచున్న నానావిధవాక్యములను స్త్రీలవాక్యములను రాజులవాక్యములను జనకునివాక్యములను విని రాముఁడు చిరునగవునవ్వుచు ధనుస్సునకుఁ బ్రదక్షిణముగఁబోయి పరమశివునకు నమస్కరించె. మఱియును దశరథకౌసల్యలను గురువునుస్మరించి నమస్కారమునుచేసె. అట్లు నమస్కారముచేసి ఆధనుస్సును ఎడమచేతిచేనెత్తి కుడిహస్తముచే అల్లెత్రాడును సంధించె.

మఱియును దనవామహస్తముచేత ఆధనుస్సునువంచె. ఆసమయమునందు నానావిధములగు వాద్యములు మ్రోఁగె. వందిమాగధులు స్తోత్రముచేసిరి. ఆసమయమునందు రాముఁడు వామహస్తముతో టంకారమునుచేయఁగా ఆధనుస్సు మూఁడుతునుకలయ్యె. అట్లు ధనుస్సు విరుగుఁపుడు మిక్కిలి భయంకరమైన గొప్పధ్వనియొక్కటికలిగె. అప్పుడు భూమిగడగడవణఁకె. పార్వతి భయభ్రాంతచిత్తయై పరమశివుని దృఢముగఁ గౌఁగిలించుకొనియె. సముద్రము లల్లకల్లోలములయ్యె. దశదిక్కులయందును ప్రతిధ్వనులు పిక్కటిల్లె. నక్షత్రములు భూమియందుఁబడియె. ఆదిశేషుఁడదరె. దేవతలు మిక్కిలిపరిమళముకల పుష్పములను కురిపించిరి. స్త్రీలు కిటికీలమార్గమున రామునిమీఁద పుష్పవర్షమును కురిపించిరి. దేవతలందఱును అధికానందమును పొందిరి. మిక్కిలి శ్రేష్ఠములగు భేరులును దుందుభులును మ్రోఁగె. దేవవేశ్యలు నృత్యముచేసిరి. మఱియు జయజయధ్వనులు సకలదిక్కులయందును పిక్కటిల్లె.

అంతలోపల రావణాసురుఁడు మూర్ఛఁదేరి సిగ్గుచేత శిరస్సును వంచుకొని క్రిందఁబడిన శిరోభూషణములను అక్కడనే విడిచిపెట్టి పీడినవస్త్రమును కట్టుకొనకయే క్షణమాత్రమున్నైనను అక్కడ నుండఁజాలక లంకాపట్టణమునకుఁబోయె. అట్లు రామునిచేత ధనుస్సు విరువఁబడుటను చూచి అచ్చటనున్న వారందరును పరమసంతోషము కలవారై జయధ్వనులను తెలుపునట్టి పాటలను పాడిరి. మఱియును ఆసమయమునందు సీతామహాదేవి సంతోషముచేత గగుర్పాటునొందిన దేహముకలదియును, తప్పపాటులేనిదియును, మిక్కిలి వేడుకకలదియును నయ్యె. ఆసమయమునందు జనకమహారాజు మంత్రులతో నిట్లనియె. ఓమంత్రులారా! ఆడయేనుఁగునెక్కించి ఉత్సవములచేత సీతను గౌరవింపుఁడు. మఱియును సీతాదేవికి నాలుగువైపులను సైన్యమునుంచి చక్కఁగఁ గాపాడుఁడని చెప్పె. ఆమాటలను మంత్రులందఱునువిని మిక్కిలి వేగముతో సీతాదేవియొద్దకుఁబోయి చేతులను ముకుళించుకొని యిట్లనిరి. పద్మపత్రములవంటి నేత్రములు కలదానవును, ఏనుఁగువలె నడుచుదానవును, అయిన యో సీతాదేవీ! సూర్యవంశమునందుఁ బుట్టినవాఁడును, దశరథమహారాజునకుఁ బుత్త్రుఁడును, అయిన రామునిచేత ధనుస్సు విఱువఁబడినది. కావున నీవు ఆడయేనుఁగు మీఁదనెక్కి రామునియొద్దకు రమ్ము.ఓసీతాదేవీ! సంతోషము కలదానవై వచ్చి రాముని కంఠమునందు పుష్పమాలికను ఉంచుమని చెప్పిరి. అంతట నామంత్రుల మాటలను సీతామహాదేవి విని తనతల్లికి నమస్కారమునుచేసి మిక్కిలి సంతోషము కలదై ఆడయేనుఁగుమీఁద చెలికత్తియలతోఁగూడనెక్కె. ఆసమయమునందు అనేకములును, మంగళకరములును అయిన నూతనవాద్యములు ముందుభాగమునందు మ్రోగుచుండె. మఱియును అనేకవిధములయిన వాద్యములు పృష్ఠభాగమునందు మ్రోగుచుండె. మఱియును సీతాదేవికి ముందుభాగమునందు మిక్కిలి విచిత్రములయిన శిరోవేష్టనవస్త్రములు కలవారును, కంచుకములుకలవారును, బెత్తములు

చేతులయందుఁగలవారును నై పెద్దగా కేకలను వేయుచుఁ బరుగిడుచుండిరి. మఱియును ఎల్లవారును సీతను చూచుటకొఱకు జనసమ్మర్దమును తొలఁగించుచుండిరి. మఱియును వేశ్యాస్త్రీలు నృత్యమును చేయుచుండిరి. మాగధులు స్తోత్రపాఠములను చేయుచుండిరి. గాయకులును, నటులును, గానమును చేయుచుండిరి. మఱియును పెక్కువేలు దాసీజనము సీతతోఁగూడ గుఱ్ఱములమీఁదనెక్కి వింజామరలను వైచుచుండిరి. మఱియును సీతాదేవియొక్క పెంపుడుతల్లులు అనేకమంది గుఱ్ఱములనెక్కి సీతతోఁగూడ బయలువెడలిరి. మఱియును పెక్కువేలమంది స్త్రీలు శస్త్రములను ధరించినవారును, బంగారపుకట్టులచేత ప్రకాశించుచున్న హస్తములుకలవారును, పురుషవేషములు కలవారునునై తిరుగుచుండిరి. మఱియును కొందఱు శస్త్రములు హస్తమునందుఁ గలవారును, చక్కఁగ నలంకరింపఁబడినవారును, ముఖములను తెలియకుండునట్లు మార్చుకొనినవారును, కంచుకములు కలవారును, అశ్వాదివాహనములను అధిష్ఠించినవారును నైరి. అంతట మంత్రులందఱును తమతమవాహనములనెక్కి సీతయొక్క యేనుఁగునకుఁ జుట్టును సైన్యములతోఁగూడఁ జుట్టుకొనియుండిరి. మఱియును, సీతాదేవియొక్క చెలికత్తియలు అందఱును వింజామరలచేత సీతను విసరుచుండిరి. మఱియును పురస్త్రీలందఱును గవాక్షములయందుండి పుష్పవర్షములను గురిపించిరి. ఈప్రకారముగ మెఱుపుతీఁగవంటి సీతాదేవి నానావిధములయిన ఉత్సవములచేత మెల్లమెల్లగాపోవుచుండె. మఱియును, కనకపుచేతియందు నవరత్నమాలను ధరించియుండె. మఱియును, అధికమైనసంతోషముతోఁగూడినముఖముకలదై కడకంటి చూపులచేత రామునిచూచుచుండె. ఇట్లు మహోత్సవముతో సీతామహాదేవి సభలోనికివచ్చి యేనుఁగుమీఁదనుండి మెల్లమెల్లఁగా రామునియొద్దకుఁబోయి మిక్కిలి సిగ్గుకలదియును, మిక్కిలి సంతోషముకలదియును నగుచు, రామునియొక్క కంఠమునందు నవరత్నమాలనువైచె. పిమ్మట రాముని పాదములయందు శిరస్సునుపెట్టి నమస్కారమునుచేసె. పిమ్మట నాసభయందు సీతాదేవి లజ్జచేత ముఖమును త్రిప్పుకొనియుండె. అప్పుడు రాముఁడు నవరత్నమాలికచేత ప్రకాశించుచున్న వక్షస్థలముకలవాఁడై యాసీతాదేవినిచూచె. అట్లు సీతాదేవినిచూచి విశ్వామిత్రునియొద్దకుఁబోయి నమస్కారమునుచేసె. అప్పుడు విశ్వామిత్రుఁడు రాముని కౌఁగిలించుకొని తొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని ప్రేమచేత శిరస్సునుముద్దుపెట్టుకొనియె. ఆసమయమునందు జనకచక్రవర్తి తనకుమార్తెయగు సీతాదేవినితీసికొనిపోయి విశ్వామిత్రమునియొక్క తొడమీఁద గూర్చుండఁబెట్టె. అప్పుడు విశ్వామిత్రుఁడు సీతారాములచేతఁ జక్కఁగఁ బ్రకాశించుచుండె. మఱియును విశ్వామిత్రుఁడు తనజన్మము ధన్యమయినదని తలఁచి సీతారాములను గౌరవించె. అప్పుడు జనకచక్రవర్తి యాసభలోపల విశ్వామిత్రమహామునితో నిట్లనియె. ఓమునిశ్రేష్ఠుఁడా! విశ్వామిత్రుఁడా! నీయనుగ్రహమువలన నాకు

రాముఁడులభించె. ఓమునిశ్రేష్ఠుఁడా ! నేను ధన్యుఁడనైతిని. నాకులమంతయును ధన్యమైనది. నా తల్లిదండ్రులు కృతార్థులైరి. ఓమహాత్మా ! విశ్వామిత్రుఁడా ! నేను భూలోకమునందు శ్రీరామునకు మామగారని ప్రసిద్ధిని పొందితిని. అని యిట్లు జనకమహారాజు చెప్పి విశ్వామిత్రునకు నమస్కారమునుచేసి రామునకుఁ గూడ నమస్కారమును చేసె. ఆసమయమునందు ఆసభయందుండు రాజులందఱును మెఱుపుతీఁగవంటి దేహకాంతి కలదియును, చంద్రబింబమువంటి ముఖము కలదియును, దొండపండువంటి పెదవులు కలదియును, అయిన సీతాదేవినిచూచి ఆసీతాదేవియొక్క నేత్రములనియెడు బాణములచేతఁ గొట్టఁబడినవారును వికలులునునై, తమకు దైవానుకూలతలేదని తమ్మును దాము నిందించుకొనుచుండిరి. ఆరాజులలో మఱికొందఱు మూర్ఛనుపొందిరి. అప్పుడు జనకచక్రవర్తి ఆరాజులయొద్దకుఁబోయి మిక్కిలి దుఃఖమును పొందుచున్నవారును, నష్టమైనముఖకాంతికలవారును, సిగ్గుచేత వంపఁబడిన ముఖములు కలవారును అయిన యారాజులను బహువిధములఁ బ్రార్థించి మఱియు నిట్లనియె. ఓరాజశ్రేష్ఠులారా ! మీరందఱును నాయందు దయకలవారలై నాకుమార్తెయగు సీతయొక్క వివాహమును నెరవేర్చి మీపట్టణములకుఁ బొండనిచెప్పె. అంతట నాసమయమునందు ఆరాజులందఱును తమలోఁ దాము ఇట్లని యాలోచించుకొనుచుండిరి. ఒకవేళ మనము ఇప్పుడు శ్రీరాముని జయింపవలయునని తలఁచి యుద్ధమునకు ప్రయత్నించితిమేని యిది మనకు అనుకూలమైన కాలము కాదు. కనుక మనకు జయము కలుగదు. మఱియును, మనము చెడ్డకాలమునందు బయలు వెడలితిమి. కాఁబట్టి మనము యుద్ధమును చేయకూడదు. మనపట్టణమునకుఁ బోవుట యుత్తమము. మఱియును, మనము తగిన ముహూర్తమును యోజించుకొని చతురంగబలములతోఁగూడ యుద్ధమునకుఁ బోవుదము. ఆసమయమునందు మనకు జయము కలుగును. మఱియును, అప్పుడు ఈరామజనకుల మర్మములను బ్రద్దలుచేతము. రాముని జయించితి మనుకీర్తిని పొందుదుము. ఇప్పుడు మనము వైరమును చూపుటఉచితముకాదని యోజించిరి. అట్లు యోజించి ఆరాజులందఱును జనకచక్రవర్తిచెప్పిన మాటలకు అంగీకారమును పొందిరి. మఱియును, సీతావివాహమును జరిపించి మనపట్టణములకు పోదమని నిశ్చయించిరి. అంతట జనకమహారాజు ఆరాజులను రామలక్ష్మణవిశ్వామిత్రులను శాస్త్రోక్తప్రకారముగఁ బూజించి దశరథమహారాజును పిలుచుకొనివచ్చుటకు మంత్రులను పంపి దశరథమహారాజురాకకు ఎదురుచూచుచుండె. అప్పుడు జనకమహారాజుయొక్క మంత్రులు అయోధ్యాపట్టణమునకుఁ బోయి దశరథమహారాజును జూచి నమస్కరించి జరిగినవృత్తాంతమును సర్వమును తెలిపిరి. ఆవృత్తాంతమును సర్వమును దశరథమహారాజు విని పరమానందమునుపొందె. అంతట నాదశరథమహారాజు చతురంగబలములతోడను, పురజనులతోడను పల్లెటూళ్లయందున్న వారితో

డను, గూడుకొనినవాఁడై మిథిలాపట్టణమునకుఁ బ్రయాణమైవచ్చె. అట్లు దశరథమహారాజు వచ్చినవృత్తాంతమును జనకచక్రవర్తి విని మహోత్సవముతో దశరథమహారాజును పురప్రవేశమును చేయించుటకొఱకు ఏనుఁగును ముందిడుకొని పరివారసమేతముగ బయలువెడలిపోయె. పోయి దశరథమహారాజునొద్ద ముందరఁగూర్చుండియున్నవారును, కైకేయికి పుత్త్రులును అయిన భరతశత్రుఘ్నులను చూచె. అట్లు చూచి మనసైన్యమునందున్న రామలక్ష్మణులు ఇక్కడికి యెప్పుడువచ్చిరని తలఁచె. అట్లు తలఁచి వెనుకఁదిరిగి చూడఁగా రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట వచ్చుచుండిరి. అప్పుడు జనకచక్రవర్తి మిక్కిలి ఆశ్చర్యముకలవాఁడై రామలక్ష్మణులకు తుల్యులగు ఇరువురుబాలురు దశరథునిసమీపమున నున్నారే? వారెవరని విశ్వామిత్రుని అడిగిన విశ్వామిత్ర మహాముని ఇట్లనియె. ఓజనకమహారాజా! ఆయిరువురిలో పెద్దవాఁడు రామునియంశమువలనఁ బుట్టినభరతుఁడు. రెండవవాఁడు లక్ష్మణాంశమువలనఁ బుట్టినశత్రుఘ్నుఁడు. ఆయిరువురును కైకేయియొక్క పుత్త్రులని చెప్పిన జనకమహారాజువిని మరల నిట్లనియె. ఓ విశ్వామిత్రుఁడా! అయోనిజురాలును, తనంతటఁ దానే వచ్చినదియును, అయిన సీతను రామున కిచ్చెదను. నాశరీరమునుండి పుట్టిన ఊర్మిళను లక్ష్మణున కిచ్చెదను. మఱియు నోమహాత్మా! విశ్వామిత్రుఁడా! నాబంధువగు కుశధ్వజునకు, శ్రుతకీర్తి, మాండవి అనునట్టి యిరువురు పుత్త్రికలు కలరు. ఆయిరువురును రూపయౌవనాదులచే ఈయిరుపురికిని తగియున్నారు. కావున ఆకన్యకలను ఈయిద్దరికిని ఇప్పించెదను. ఈవిషయమును దశరథునకు తెలిపి అంగీకరించునట్లు చేయుమని ప్రార్థించుచు దశరథునకుఁగూడ విన్నవింపఁగా దశరథుఁడు అందులకు అంగీకరించితినని జనకచక్రవర్తితోఁ జెప్పెను. పిమ్మట దశరథమహారాజు అహల్యకుపుత్త్రుఁడును, జనకచక్రవర్తియొక్క సమీపమునయున్నవాఁడును, పురోహితుఁడును నగు శతానందునితో నిట్లనియె. ఓమహాత్మా! శతానందుఁడా! సీత అయోనిసంభవురాలనియును, భూమిదేవివలనఁ బుట్టినదనియును విందుము. ఆవృత్తాంతమును సర్వమును చెప్పుమనిన శతానందుఁడు విని మీయాజ్ఞానుసారముగఁ జెప్పుచున్నానని యిట్లనియె. ఓమహారాజా! దశరథుఁడా! నీవు చక్కగనడిగితివి. ఏకాగ్రమనస్కుఁడవై వినుము. పూర్వమునందు పద్మాక్షుఁడను పేరుగలమహాప్రసిద్ధుఁడగు రాజొకఁడుకలఁడు. ఆమహారాజు సంపన్నములయిన సకలలోకములను చూచి తనమనస్సునందు లక్ష్మీదేవిని పుత్త్రికనుగాఁ జేసికొనవలయునని తలఁచె. అట్లుతలఁచి తపస్సుచేతనే లక్ష్మీదేవిని పుత్త్రికనుగాచేసికొని తొడమీఁదఁగూర్చుండఁబెట్టుకొని సంతోషించెదననితలఁచె. అట్లుతలఁచి ఆమహారాజు మిక్కిలి తీవ్రమైనదియును, మిక్కిలిగొప్పదియును అయిన తపస్సును చేసె. ఇట్లు ఘోరమైన తపస్సునుచేయుచుండఁగా లక్ష్మీదేవి ప్రసన్నురాలై యామహారాజునకెదుట నిలిచియుండఁగా లక్ష్మీదేవితో నిట్లనియె. ఓతల్లీ! లక్ష్మీదేవీ! నిన్నుఁ గుమార్తెనుగాఁ గైకొనవలయునని

అపేక్షించుచున్నాను. కాఁబట్టి నాకుఁబుత్త్రికవై నాఅభీష్టమును తీర్పుమనిన లక్ష్మీదేవి విని యిట్లనియె. ఓమహారాజా! నేను స్వాధీనురాలను గాను. విష్ణుదేవుని అధీనమునందు ఉన్నదానను. కావున నీవు విష్ణుదేవుని ప్రార్థింపుము. ఆవిష్ణుదేవుఁడు అంగీకరించినయెడల నేను నీకు పుత్త్రికనగుదును. ఈవిషయమునందు సందేహము యేమియును లేదనిచెప్పె. అంతట ఆమహారాజు మిక్కిలి ఉగ్రమైన తపస్సునుచేసి విష్ణుదేవుని ప్రత్యక్షమగునటులఁ జేసికొనియె. అంతట విష్ణుదేవుఁడు ప్రసన్నుఁడుకాఁగానే ఆమహారాజు విష్ణుదేవునకు నమస్కారమునుచేసి యిట్లనియె. ఓమహాత్మా! నారాయణుఁడా! నేను లక్ష్మీదేవిని పుత్త్రికనుగాఁ జేసికొనవలయునని తలఁచుచున్నాను. కావున లక్ష్మీదేవిని నాకుఁ బుత్త్రికనుగాఁ జేయుమని ప్రార్థించిన విష్ణుదేవుఁడు విని ఆమహారాజుచేతి కొకమాదీఫలమును ఇచ్చి అంతర్ధానమును పొందె. అంతట నామహారాజు ఆమాదీఫలమును భేదించిచూడఁగా అందులో బంగారమువంటి దేహకాంతికల కన్యక ఒకతె కనఁబడియె. అప్పుడు ఆమహారాజు ఆకన్యకను పుత్త్రికనుగాఁ దలంచె. అట్లుతలఁచి ఆకన్యకు పద్మయనుపేరుఁబెట్టి తనతొడయందుఁ గూర్చుండఁబెట్టుకొని పెంచుచుండె. మఱియును ఆకన్యక శుక్లపక్షమునందలి చంద్రునివలె వృద్ధిని పొందుచుండె. అట్లు దినదినప్రవర్ధమానయగు కన్యకను చూచి దీనికిఁ దగినవరుఁడు ఎక్కడలభించునా? అని తలఁచుచుండె. అంతట నామహారాజు చక్కగనాలోచించి స్వయంవరమును చేయింతమని తలఁచె. అట్లుతలఁచి ఆపద్మయను కన్యకయొక్క స్వయంవరమునందు యజ్ఞమును ఆరంభించె. అంతట నామహారాజు స్వయంవరముకొఱకును యజ్ఞముకొఱకును పెక్కుమందిరాజులను బిలిపించె. అప్పుడు సకలదేశాధిపతులును నానావిధములుగ అలంకారములను చేసికొని స్వయంవరమునకు వచ్చిరి. మఱియును ఆపద్మయొక్క స్వయంవరవృత్తాంతమును విని అనేకులు మునీశ్వరులు వచ్చిరి. మఱియును, ఆసమయమునందు దేవతలు, గంధర్వులు, దానవులు, మానవులు, ఖగములు, పర్వతములు, నదులు, సముద్రములు, వృక్షములు మొదలగునందఱును కామరూపములనుధరించి వచ్చిరి. మఱియును, యక్షులు, కిన్నరులు, రాక్షసులు మొదలగువారును రావణాసురుఁడు మొదలుగాఁగల రాక్షసశ్రేష్ఠులును వచ్చిరి. అట్లు వచ్చినవారల నందఱను చూచి ఆపద్మాక్షుఁ డనుమహారాజు ఇట్లనియె. ఓమహాత్ములారా! నిర్మలాకాశమువంటి పరిలేపద్రవ్యమును పూసికొని దేహచ్ఛాయను నిర్మలాకాశమునకు సమముగఁ జేసికొన్నవానికి నాపుత్త్రికను ఇచ్చెదను అనిచెప్పె. ఆమాటనువిని రాజులు మొదలగువారందఱును ఈకార్యమును జేయుట మిగుల దుర్లభము. మహాకష్టము అనిరి. అట్లు వారందఱునుతలఁచి యాపద్మయను కన్యకయొక్క సౌందర్యముచేత మోహితులై బలాత్కారముగ నాకన్యకను అపహరింపఁ దలఁచిరి. అట్లు తలఁచుటను ఆపద్మాక్షుఁడు తెలిసికొని యుద్ధసన్నద్ధుఁడయ్యె. అట్లు యుద్ధసన్నద్ధుఁడై మి

క్కిలి భయంకరమైన యుద్ధమును చేసె. అప్పుడు అతని బాణములచేత దేవతలు, మానవులు మొదలగువారందఱును మిక్కిలి గాఢముగఁ గొట్టఁబడినవారై యుద్ధమునుండి తొలఁగిపోయిరి. అంతట రాక్షసులు కలియఁబడి యుద్ధముఁ జేసి ఆపద్మాక్షరాజును రణభూమియందుఁ బడవైచిరి. పిమ్మట రాక్షసులందఱును ఒక్కటిగాఁ జేరి యాకన్యకను అపహరించుటకు ప్రయత్నించిరి. అట్లు తన్ను పట్టుకొనుటకు వచ్చిన రాక్షసులనుజూచి పద్మయను ఆకన్యక తనశరీరమును అగ్నియందుఁ బ్రవేశపెట్టెను. అంతటరాక్షసులు ఆకన్యక కనఁబడకపోవుటచే పట్టణమును సర్వమును వెదకి చూచిరి. పిమ్మట రాజులయొక్క ఇండ్లను అన్నిఁటిని విరిచివేసిరి. భూమిని సర్వమును అల్లకల్లోలముచేసిరి. అంతట నిమిషమాత్రములోపల ఆపట్టణమంతయును శ్మశానముతో సమాన మయ్యె. ఆహా! దైవయోగమునకు ఏమిచేయవచ్చును. పద్మాక్షరాజునకు లక్ష్మీసంయోగమువలన ఇట్టిదుర్దశ సంభవించెను. కావుననే మునులందఱును ఒకప్పుడును లక్ష్మీదేవిని కోరకయుందురు. మఱియును "శ్లో. లక్ష్మ్యాశ్చిత్తస్యచాంచల్యం భయంశోకోవధోఽపిచ, భవత్యేవ మహాదుఃఖం తస్మాత్తాంపరివర్జయేత్" లక్ష్మీసంబంధముచేత మనస్సునకు చాంచల్యము భయము దుఃఖము వధలనునవికలుగును. ఇంతియుఁగాక అధికమైనదుఃఖము కలుగును. కావున లక్ష్మీసంబంధమును విడిచిపెట్టవలయును. ఆప్రకారముగా పద్మాక్షమహారాజు మరణమును పొందినపిమ్మట అతనిభార్యలందఱును పెనిమిటితోఁగూడ మరణముపొందిరి. అంతట నారాక్షసులు మొదలగువారు అందఱును చేయఁదగిన కార్యము ఏదియును లేక తమతమపట్టణములకుఁబోయిరి. అంతటఁ గొన్నిదినములకు ఆయగ్నికుండమునుండి యాపద్మయనుకన్యక బయలువెడలి యాయగ్నికుండమునకు సమీపమునందుఁ గూర్చుండియుండె. అట్లుకూర్చుండియుండఁగా రావణాసురుఁడు పుష్పకవిమానమునెక్కి సకలదేశములను జయించుటకు ఆకాశమార్గమునఁ బోవుచు అగ్నికుండమునకు సమీపమునందున ఆకన్యకనుచూచె. ఆసమయమునందు రావణాసురునివద్దనున్న సారణుఁడనువాఁడుకూడ ఆకన్యకను రావణాసురునకుఁ జూపి యిట్లనియె. ఓమహాత్మా! రావణాసురుఁడా! పూర్వము ఏకన్యకకొఱకు పద్మాక్షమహారాజును రాక్షసులు మొదలగువారు చంపిరో ఆకన్యకయే ఈచిన్నదియనిచెప్పె. ఆమాటను రావణాసురుఁడువిని ఆకన్యకనుచూచి మోహించి పట్టుకొనుటకు ప్రయత్నించె. అంతలోపల నాకన్యక మరల అగ్నికుండమునందుఁ బ్రవేశించె. అట్లు అగ్నికుండమునందు ప్రవేశించినతోడనే రావణాసురుఁడు ఆస్థలమునకుఁబోయి ఇట్లనియె. ఓలక్ష్మీ! నీవృత్తాంతమంతయును తెలిసినది. దేవతలందఱును అగ్నియందు నివాసమును చేసికొని నీతోఁగూడనున్నారు. కాఁబట్టి ఓచిన్నదానా! పద్మా! నిన్నుఁ బట్టుకొనుటకు ఈయగ్ని కుండమును సర్వమును శోధించెదనని చెప్పె. ఇట్లు చెప్పి రావణాసురుఁడు నీళ్లకడవలచేత ఆయగ్నికుండమును సర్వమును తడిపె. అట్లుతడిపి

ఆయగ్నికుండమును సర్వమును పరిశీలించిచూచె. అట్లుచూడఁగా ఆయగ్నికుండము
నందు అయిదురత్నములు కనఁబడె. అంతట నారత్నములను తీసికొని పెట్టెయం
దుఁబెట్టుకొని విమానమునెక్కి మరల ఆకాశమార్గముచే తనపట్టణమునకుఁబోయె.
అట్లుపోయి ఆపెట్టెను దేవపూజాగృహమునందుఁబెట్టె. అంతట నాటిరాత్రియందు
పవ్వళించియున్న కాలమున మండోదరినిఁజూచి రావణాసురుఁ డిట్లనియె. ఓప్రాణే
శ్వరీ ! మండోదరీ ! నీకు సంతోషమును కలుగఁజేయునట్టి అయిదురత్నము
లను నీనిమిత్తము మిక్కిలి కష్టపడి సంపాదించితిని. ఆరత్నములు పెట్టెయందున్నవి.
నీవు పోయి తీసికొనిరమ్మనియె. ఆమాటను మండోదరివిని దేవపూజాగృహము
లోనికిఁ బోయె. అట్లుపోయి యాపెట్టెను తన పెనిమిటియగు రావణాసురునివద్దకు
దీసికొనివచ్చుటకు ప్రయత్నింపఁగా ఆపెట్టెకదలకపోయె. అంతట మండోదరి మహాసి
గ్గునుపొంది రావణునియొద్దకువచ్చి వృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. ఆమా
టను రావణాసురుఁడువిని మిక్కిలి ఆశ్చర్యముకలవాఁడై తానే ఆపెట్టెను తీసికొని
వచ్చుటకు ప్రయత్నించెను. అట్లు ప్రయత్నింపఁగా ఆపెట్టె అతనికిఁగూడ కదలక
పోయె. అంతట రావణుఁడు యిరువదిచేతులచేతను కదలించుటకు ప్రయత్నముచేసి
నను ఆపెట్టె కదలకపోయె. అప్పుడు రావణాసురుఁడు మిక్కిలి నాశ్చర్యముకలవాఁ
డును, మిక్కిలి భయముకలవాఁడును అయ్యె. అంతట రావణాసురుఁడు ఆపెట్టెను
పగులఁగొట్టుటకు ప్రయత్నించి పగులగొట్టగా అక్కడ సూర్యునియొక్క కాంతివంటి
కాంతిగల యొకకన్యక కనఁబడియె. ఆకన్యకయొక్క తేజస్సును చూచినతోడనే
రాక్షసులయొక్కయును, రావణాసురునియొక్కయును, మండోదరియొక్కయును
నేత్రములు మిరుమిట్లుగొనియె. అప్పుడు ఆకన్యకనుచూచుటకు రావణునిస్నేహితులు
పుత్రులు మొదలగువారందఱును వచ్చిరి. ఆసమయమునందు రావణాసురుఁడు ఆక
న్యకయొక్క వృత్తాంతముసర్వమును మండోదరితో జెప్పఁదలఁచి యిట్లనియె. ఓప్రా
ణనాయకీ ! మండోదరీ! ఈకన్యక పద్మాక్షుఁడను రాజుయొక్కకూఁతురు. ఈచిన్న
దానియొక్క స్వయంవరకాలమునందు దీనితండ్రి చంపఁబడియెను. అని ఇట్లు జరిగిన
వృత్తాంతమును సర్వమును చెప్పఁగా మండోదరివిని అధికమైన కోపముకలదియును
భయముకలదియును నై యిట్లనియె. ఓ ప్రాణనాథా ! రావణాసురుఁడా ! ఈకన్యక
మూలముగ తండ్రియొక్క కులమంతయు నశించుటచేత ఇది కులమును నాశన
ముచేయునట్టి దని తోఁచుచున్నది. ఇట్టికన్యకను మనలంకాపట్టణమునకు
ఏల తెచ్చితివి. దీనివృత్తాంతమును తెలిసికొనియును, ఇట్లు చేయుట నీకు తగు
నా ? తగదు. కాఁబట్టి, ఓప్రాణేశ్వరా ! రావణాసురుఁడా ! దీనిని అరణ్య
మునందు విడిచిపెట్టుము. ఈకన్యకబాల్యమునందె యింతబఱువుకలదై యు
న్నది. ఇట్టికన్యక వయస్సువచ్చెనేని యెట్టికార్యమును చేయునోకదా ? ఓనా
థా ! రావణాసురుఁడా ! మఱియును, ఈకన్యకవలన నీవు మరణమునుపొం

దుదుపవనియును, నీకు ఇది మృత్యువనియును తోఁచుచున్నది. అని యిట్లు మండోదరి చెప్పినమాటలను రావణాసురుఁడు విని మండోదరియొక్కమాట సత్యముగ నుండునని తలఁచె. అట్లు తలచి మంత్రులతో గూడ ఆలోచించి భటులను పిలిచి యిట్లనియె. ఓభటులారా! ఈపెట్టెను ఎత్తి విమానమునందుబెట్టి తీసికొని పోయి అరణ్యమునందు విడిచిపెట్టిరండు అనిచెప్పె. ఆమాటలు విని రాక్షసభటులందఱును ఆపెట్టెను పుష్పక విమానమునందుఁబెట్టి ఆకాశమార్గమున పోవుటకు నిశ్చయించుచుండఁగా మండోదరి రావణాసురునిఁజూచి యిట్లనియె. ఓప్రాణనాయకా! రావణుఁడా! ఈకన్యకను అరణ్యమునందు విడిచిపెట్టి వచ్చినయెడల ఏదో ఒకవిధముగా నిన్నుఁ జంపినను చంపును. కావున దీనిని ఈపెట్టెతోఁగూడ భూమియందు పూడ్చిపెట్టుట యుచితమని నాకుతోఁచుచున్నది. అట్లుచేసినయెడల జితేంద్రియుఁడగు గృహస్థుని గృహమునందు వృద్ధిని పొందగలదు. ఓనాథా! రావణాసురుఁడా! ఎట్లుచేసినను మిక్కిలి శుభకరమైన ముఖముకల యీకన్యక చరాచరాత్మకములగు సకలజంతువులయందును ఆత్మరూపముతో నున్న గృహమునందు వృద్ధినిపొందును. ఈవిషయమునందు సందేహములేదని చెప్పుచుండఁగా రాక్షసభటులు అధికవేగముతోఁ బోవుటకు యత్నించిరి. అప్పుడు ఆకన్యక యిట్లనియె. ఓ రాక్షసభటులారా! నేను రాక్షసవధకొఱకు మరల లంకాపట్టణమునకు వచ్చుచున్నాను. మఱియును, మరల లంకాపట్టణమునకువచ్చి పుత్రమిత్రబంధువులు మొదలగువారితోఁగూడ రావణాసురుని సంహరించుచున్నాను. పిమ్మట అనఁగా మూడవపర్యాయము నికుంభజుఁ డనుపేరుకలవాఁడును, నూరుతలకాయలు కలవాఁడును అయిన శతకంఠరావణాసురుని సంహరించుచున్నాను. పిమ్మట నాలుగవపర్యాయము మిక్కిలి ఆశ్చర్యకరుండగు మూలకాసురుఁడనురాక్షసుని సంహరించుచున్నాను. అయిదవపర్యాయము మహాశూరుఁ డగుకుంభకర్ణునికొడుకును సంహరించుచున్నానని చెప్పె. ఇట్లు ఆకన్యక చెప్పినమాట రావణాసురుఁడు విని మిక్కిలి పరితాపముకలవాఁడయ్యె. రాక్షసులందఱును మిక్కిలి భయముకలవారై అచ్చటనున్న పీనుఁగులవలె నిశ్చేష్టితులైరి. అప్పుడు రావణాసురుండును కన్యకను ఇప్పుడే చంపుట యుచితమని చెప్పి మిక్కిలి తీక్ష్ణమైన ఖడ్గమును చేతధరించి ఆకన్యకను తరుముటకు ప్రయత్నించె. ఆసమయమునందు మండోదరి రావణాసురునిహస్తమును చేతఁబట్టుకొని ఓరాక్షసేశ్వరా! రావణాసురుఁడా! ఆ, ఆ, నీవిప్పుడేమిచేయఁదలచితివి. ఇట్టిసాహసమును నీవెన్నటికిని చేయకుము. నీవు ఇప్పుడు సాహసమును చేసితివేని నీకిప్పుడే మరణముకలుగును. ఈవిషయమునందు, సందేహమేమియునులేదు. కాఁదగినకార్యము కాకమానదు. కాఁబట్టి యిప్పుడేమియునుచేయక యీకన్యకను అరణ్యమునందు విడిచిపెట్టుము. ఎన్నఁడో రాఁబోయెడుచావును నేడేతెచ్చుకొనుట యుచితముకాదని మండోదరి అనేకవిధములచెప్పె. అంత

రావణాసురుఁడు ఆమాటలనువిని యూరకుండె. అంతట నారావణాసురుని భటులు ఆపెట్టెనుతీసికొని అనేక అరణ్యములను చూచుచుఁబోయి మిథిలాదేశమునందువిడిపెట్టి మరల లంకాపట్టణమునకు పోయిరి. అట్లుపోయి యావృత్తాంతమును సర్వమును రావణాసురునకుఁ దెలిపి తమతమ యిండ్లకుఁబోయిరి. పిమ్మట ఆమిథిలాదేశము జనకచక్రవర్తిదగుటవలన ఆకన్యకనువిడిచిపెట్టినభూమిని ఒకనాఁడు సూర్యగ్రహణకాలమునందు జనకచక్రవర్తి యొకబ్రాహ్మణునకు దానముచేసె. అంతట నాబ్రాహ్మణుఁ డాభూమినిదున్నించుటకు ప్రయత్నించి మంచిముహూర్తమును విచారించి ఒకశూద్రునిచేత ఆభూమిని దున్నించె. ఆసమయమున ఆనాగేటియొక్కకొనయందు ఆపెట్టెతగులుకొని బయలువెడలె. అప్పుడు ఆపెట్టెనుతీసికొని శూద్రుఁడు గ్రామికధికారియగు బ్రాహ్మణునియొద్దకుఁ బోయె. అట్లుపోయి యాపెట్టెలో అధికముగ ధనమున్నదనుతలంపుతో నిట్లనియె. ఓమహాత్మా! బ్రాహ్మణోత్తమా! నీవు నియమించిన ముహూర్తము మిక్కిలి శ్రేష్ఠమైనది. కావుననే నీకు మహాభాగ్యము కలిగెను అనిచెప్పె. అంత ఆమాటను ఆబ్రాహ్మణుఁడు విని పరమానందముతో ఆపెట్టెను యెత్తించుకొనిపోయి సభామధ్యమందున్న జనకమహారాజునకు సమర్పించె. అట్లుసమర్పించి యాబ్రాహ్మణుఁడు ఆపెట్టె తనకు లభించినవిధమును సర్వమును చెప్పె. అప్పుడు జనకచక్రవర్తి యిట్లనియె. ఓమహాత్మా! బ్రాహ్మణోత్తమా! నేను మొట్టమొదట ఆభూమిని నీకుదానముచేసితిని. ఈపెట్టె ఆభూమియందు దొరికినది. కనుక ఈపెట్టెకూడ నీదే? అని జనకచక్రవర్తి చెప్పినమాటను యాబ్రాహ్మణుఁడు విని మరల నిట్లనియె. ఓమహారాజా! జనకచక్రవర్తీ! నీవు భూమిని నాకు దానముచేసితివి. వాస్తవమే? అయినను భూమియందుండు నిక్షేపము, ధనము మొదలగునవి రాజునకు సంబంధించినదనుటయందు సందేహమేమియును లేదు. కావున నేను ఈధనమును గ్రహించితినేని నాయందు అధర్మము ప్రవేశించినదగును. ఓమహారాజా! జనకచక్రవర్తీ! అధర్మము నాయందు ప్రవేశింపకుండునట్లు చేయుమని అనేకవిధముల నయముగా జెప్పినను ఆజనకమహారాజు విననందున మిక్కిలి గట్టిగాకూతలువేసి చెప్పె. ఈప్రకారముగ మాటలాడుచుండగా ఆరాజునకును బ్రాహ్మణునకును మిక్కిలి భయంకరమైన వాక్కలహము జరిగె. ఆసమయమునందు సభలోనున్న వారందఱును ఆజనకచక్రవర్తినిఁజూచి యిట్లనిరి. ఓమహారాజా! జనకచక్రవర్తీ! కలహమాడకుము. ముందుగా నీపెట్టెయందు ఏమియున్నదో చూతుము అని చెప్పిరి. అప్పుడు జనకచక్రవర్తి ఆపెట్టెను దూతలచేత తెరిపించె. అట్లు తెరవగానే ఆపెట్టెయందు మహాకాంతిగల ఒక కన్యక కనఁబడియె. ఆకన్యకనుచూచి జనకచక్రవర్తి మిక్కిలి ఆశ్చర్యమును పొందె. అంతట బ్రాహ్మణుఁడు పెట్టెతోఁగూడ ఆకన్యకను ఆసభయందేవిడిచిపెట్టి తనగృహమునకుఁ బోయె. అంతట జనకచక్రవర్తి ఆకన్యకను కాపాడుటకు నిశ్చయించె. ఆ సమయమునందు దేవ

వాద్యములు మ్రోగె. దేవతలు పుష్పవర్షమును కురిపించిరి. గంధర్వులు పాడిరి. దేవవేశ్యలు నృత్యములను చేసిరి. ఆసమయమునందు జనకచక్రవర్తి ఆకన్యకను తనకూఁతురుగా భావించె. మఱియును ఆసమయమునందు జనకమహారాజు బ్రాహ్మణోత్తములచేత శాస్త్రోక్తప్రకారముగ జాతకర్మమును చేయించె. అట్లు చేయించి బ్రాహ్మణులకు నానావిధములగు దానములనుచేసె. వేశ్యలచేత నృత్యమును సల్పించె. మఱియును, ఆకన్యక మాతులింగఫలమువలనఁ బుట్టుటవలన మాతులింగి యనునామధేయము కలదయ్యె. అగ్నియందు నివసించుటవలన అగ్నిగర్భయను నామధేయము కలదయ్యె. మఱియును, రత్నరూపముగ నుండినందున రత్నావతి యనియును పిలువఁదగినదయ్యె. మఱియును, భూమినుండి బయలువెడలిన దగుటచేత ధరణిజయను నామధేయము కలదయ్యె. జనకునిచేతఁ గాపాడఁబడుటవలన జానకియను పేరుకలదయ్యె. సీత అనఁగా నాగేటియొక్క కొననుండి బయలువెడలిన దగుటచేత సీతయను నామధేయము కలదయ్యె. పద్మాక్షుమహారాజునకు పుత్త్రికయగుటవలన పద్మయను పేరుకలదయ్యె. ఓమహారాజా! దశరథుఁడా! ఈప్రకారముగా ఈసీతకు అనేకనామములు కలిగినవి. ఈసీత ఆకాశమువంటి దేహచ్ఛాయకల రామునకు భార్యయగుటచేత పద్మాక్షమహారాజుయొక్క అభిప్రాయము సమకూరెె. ఓదశరథమహారాజా! నీవు అడిగినవిషయమును సర్వమును తెలియఁజేసితిని. ఈనలుగురు కన్యలను నీకుగోడండ్రనుగా గ్రహింపు మని శతానందుఁడు దశరథమహారాజునుఁజూచి చెప్పెనని పరమశివుఁడు పార్వతీదేవితో చెప్పి మరల నిట్లనియె. ఓదేవీ! పార్వతీ! అట్లు శతానందుఁడు మొదలగువారు మాటలాడుచున్నసమయమునందు దశరథమహారాజు తనసైన్యమును పంపి కోసల మాగధ కేకయరాజులను సపరివారముగఁ బిలిపించె. అప్పుడు జనకచక్రవర్తి యా దశరథమహారాజుయొక్క బంధువులనందఱిని సంతోషముతో గౌరవించె. పిమ్మట జనకమహారాజు దశరథరామలక్ష్మణ భరతశత్రుఘ్నులకు అనేక ఆభరణాదులనిచ్చి పూజించె. మఱియును సర్వోత్తమములయిన ఉత్సవములతో పట్టణములోనికిఁ దీసికొనివచ్చె. ఆసమయమునందు దశరథమహారాజు రాముని కౌఁగిలించుకొనియె. అంతట నారాముఁడు వసిష్ఠవిశ్వామిత్రులకు నమస్కరించి కౌసల్య మొదలగువారికిఁ గూడ నమస్కారమునుచేసె. అంతట ఎల్లవారును ఏనుఁగులనెక్కినవారలై మిథిలాపట్టణమునందుఁ బ్రవేశించుచుండిరి. ఆసమయమునందు అనేకములగు వాద్యములు మ్రోగుచుండె. వందిమాగధులు నానావిధములగు స్తోత్రములను చేయుచుండిరి. వేశ్యాస్త్రీలు నృత్యములను చేయుచుండిరి. శ్రీరామదర్శనముచేత పట్టణమునందుండు స్త్రీలకు మహాసంతోషముకలిగె. మఱియు పట్టణపు స్త్రీలందఱును తమతమకార్యములను విడిచిపెట్టి శ్రీరాముఁడు మొదలగువారిని చూచుటకు గోపురములమీఁదికి మిక్కిలివేగముతోఁ బోయిరి. అట్లుపోయి చంకలయందు బిడ్డలనెత్తు

కొని మిక్కిలి ఆదరముతో శ్రీరాముని జూచుచుండిరి. మఱియును రాజమార్గము నందు వచ్చుచున్న రామునిమీఁద పుష్పవర్షమును గురిపించిరి. ఇట్లు నానావిధములయిన ఉత్సవములు జరుగుచుండఁగా దశరథమహారాజు మొదలగువారు వస్త్రము, అన్నము, ఉదకము మొదలగువాటిచేత పరిపూర్ణమైనదియును, మనోహరమైనదియును అగు రాజభవనమునందుఁ బ్రవేశించిరి. అంతట జనకచక్రవర్తి జ్యోతిశ్శాస్త్రవేత్తలచేత శుభలగ్నమును నిశ్చయింపఁజేసి ఆకాలమున మంటపములను నిర్మింపఁజేసె. తోరణములను పతాకములను ధ్వజములను స్థాపింపఁజేసె. మార్గములయందు అంతటను చందనోదకములను చల్లించి పుష్పములను పఱపించిరి. మఱియును ఆసమయమునందు పుష్పమాలికలు మొదలగువాటిచేత శ్రీరాముఁడు మొదలగువారు మిక్కిలి మనోహరముగఁ బ్రకాశించుచుండిరి. ఆసమయమునందు కౌసల్య మొదలగువారు రాముఁడు మొదలగువారికి మంగళస్నానమును చేయింపఁదలఁచి ముందుగ తైలాభ్యంగనమును చేయించిరి. పిమ్మట నలుదిక్కులనుండి తేఁబడిన పూర్ణకలశములతో మహావాద్యములు మ్రోగుచుండఁగా జలములచే నభిషేకమును చేయించిరి. అట్లు రాముఁడు మొదలగువారికి మంగళస్నానమును చేయించి కౌసల్య మొదలగువారు నానావిధములగు ఆభరణములచేతను అలంకారములచేతను శృంగారించిరి. మఱియును, ఆసమయమునందు దశరథమహారాజుకూడ అభ్యంగనస్నానమునుచేసె. అచ్చటనున్న రాజస్త్రీలుకూడ మంగళస్నానమునుచేసిరి. ఆసమయమునందు గురుఁడగు వసిష్ఠమహాముని రాజస్త్రీలను పిలిపించి సభయందు ముత్యములచేత నిర్మింపఁబడిన స్వస్తికాసనమునందు రాజును వామభాగమునఁగూర్చుండఁబెట్టి వారిముందరిభాగమునందు రాముఁడు మొదలగువారిని కూర్చుండ నియమించె. మఱియును ఆసమయమునందు స్త్రీలందఱును పసుపుకుంకుమములచేత నలంకరింపఁబడిన పాదములుకలవారై సిగ్గుచేతఁ దలవంచుకొని మిక్కిలి మనోహరములుగఁ బ్రకాశించుచుండిరి. అంతట వసిష్ఠమహాముని బ్రాహ్మణోత్తములతోఁ గూడుకొనినవాఁడై దశరథమహారాజుచేతను రాముఁడు మొదలగువారిచేతను విఘ్నేశ్వరపూజను చేయించె. మఱియును, ఆసమయమునందు దశరథమహారాజు గ్రామాచార, కులాచార, వృద్ధాచార, దేశాచార, ప్రమదాచారములను విధ్యుక్తప్రకారముగ జరిపించె. మఱియును, జలకుంభములకును మండపాదికములకును శాస్త్రోక్తప్రకారముగఁ బూజలను సలిపించె. అట్టియెడ కౌసల్య మొదలగువారందఱును నానావిధములయిన వర్ణములుకలవియును, సరిగెలచేత నలంకరింపఁబడినవియును అగు వస్త్రములను ధరించిరి. ఆసమయమునందు జనకచక్రవర్తి అనేకమంది రాజులతోఁ గూడుకొనినవాఁడై నానావిధములగు మహావాద్యములను ముందునిడుకొని రాముఁడు మొదలగువారిని దనగృహమునకుఁ దీసికొనిపోవుటకు వచ్చె. అట్లువచ్చి కల్యాణమంటపమునందు నివసించియున్న రాముఁడు మొదలగువారిని పూజించె.

మఱియును, బంగారపు సరిగెలుకల వస్త్రములచేతను, నానావిధములయిన ఆభరణములచేతను, ఆరాముఁడు మొదలగువారు మిక్కిలి మనోహరముగఁ బ్రకాశించుచుండిరి. మఱియును రాముఁడు మొదలగువారు సంతుష్టములయిన ముఖములుకలవారైరి. మఱియును రామలక్ష్మణులు మొదలగువారు ఏనుఁగులపై నెక్కికొని వింజామరలచేత వీవఁబడుచు నానావిధములయిన వాద్యఘోషములను వినుచుండిరి. ఆసమయమునందు విశేషముగఁ బుష్పవర్షము కురియుచుండెను. ఆసమయమున రాముఁడు మొదలగువారి తల్లులు ఆడుపనుఁగులమీఁదనెక్కి పసుపుచేత చిహ్నితములయిన ధాన్యములచేతను, మంగళద్రవ్యములచేతను, ముత్యములు మొదలగువానిచేతను మాటిమాటికిని సముదాయమైన ఆచారములను జరిపిరి. పురస్త్రీలందఱును మేడలమీఁదనెక్కి సదాచారప్రకారముగ లాజలను (పేలాలను) చల్లుచుండిరి. రాముఁడు మొదలగువారు వారస్త్రీలయొక్క నృత్యమునుచూచి సంతోషముచేత నవ్వుచుండిరి. పుష్పవృక్షములయొక్క వాటికలు (తోటలు) మిక్కిలి మనోహరములైయుండెను. అనేకములగు వృక్షములను మృత్పాత్రలయందు (మట్టితొట్లు) బెట్టియుండుటను చూచి సంతోషించిరి. మఱియు కృత్రిమవృక్షములను పతాకములను ధ్వజములను చూచి సంతోషమును పొందిరి. మఱియును, శ్రీరాముఁడు మొదలగువారు నానావిధములగు ప్రాకారములనుచూచి మిక్కిలి ఆశ్చర్యమును పొందుచుండిరి. మఱియును, వెన్నెలయొక్క కాంతివంటి కాంతికలవియును, కృత్రిమములును అయిన దీపవృక్షములు నలుదిక్కులయందును మిగుల విచిత్రముగఁ బ్రకాశించుచుండెను. ఇంకను అనేకవిధములగు రమ్యమైనవస్తువులు ప్రకాశించుచుండెను. వానినన్నిటినిచూచి రాముఁడు మొదలగువారు మిక్కిలి సంతోషమును పొందిరి. ఆసమయమునందు దేవతలు విమానములయందుండి ఆమహోత్సవమును చూచుచుండిరి. ఇట్లు నానావిధములయిన యుత్సవములు జరుగుచుండఁగా. రాముఁడు మొదలగువారు జనకమహారాజుయొక్క గృహమునకుఁ బోయిరి. అట్లు పోయి యేనుఁగులనుండి దిగి మంటపముయొక్క ముంగిలిప్రదేశమునందు నిలిచిరి. ఆసమయమునందు వసిష్ఠమహర్షియును, శతానందుఁడును, శాస్త్రోక్తప్రకారముగ మధుపర్కవిధానాదులను, విష్టరాదులను, శాస్త్రోక్తక్రమముగఁజేసిరి. ఆసమయమునందు వాల్మీకి మొదలుగాఁగల అనేకవేలమునిశ్రేష్ఠులు ఆవసిష్ఠ శతానందులను చుట్టుకొని నిలిచియుండిరి. ఆమునిశ్రేష్ఠులు చుట్టును నిలిచియుండుటచేత వసిష్ఠుఁడును శతానందుఁడును పరమానందమును పొందిరి. అంతట దశరథమహారాజు గురువులగు వసిష్ఠులతోఁగూడుకొనినవాఁడై అధికసంతోషముతో మంటపముయొక్క ముంగిటియందు సువాసినీ పూజనుచేసె. అంత గొంతసేపటికి సుముహూర్తకాలము సమీపించె. ఆశుభలగ్నమునందు రాముఁడు మొదలగు పెండ్లికుమారులను సీతాదేవి మొదలగుపెండ్లికుమార్తెలను వేదికలయందు విడివిడిగాఁ గూర్చుండఁబెట్టి

వధూవరులకు నడుమ తెరలను వైచిరి. అట్లువైచి వసిష్ఠశతానందులు మునిశ్రేష్ఠులతోఁగూడ మంగళఘోషములు మిక్కిలి శ్రావ్యముగఁ జరుపుచుండిరి. ఆసమయమునందు శ్రావ్యములగు మంగళఘోషములను సభలోనివారందఱును వినిరి. మఱియు అచ్చటనున్న సువాసినీస్త్రీలందఱును పచ్చనిధాన్యములచేతను, పుష్పములచేతను వర్షమునుకురిపించిరి. అప్పుడు ఋషులందఱును మంగళవాద్యములు మ్రోఁగుచుండఁగామంగళాష్టకములను పఠించుచు శాస్త్రోక్తప్రకారముగ సీతారామాదులకు పాణిగ్రహణ మహోత్సవమును చేయించిరి. పిమ్మట లాజహోమము మొదలగు వానిని సర్వమును విధ్యుక్తప్రకారముగఁ జేయించిరి. ఆసమయమున సభాంగణమునందు మిక్కిలి గొప్పవగు మంగళఘోషములు మ్రోఁగె. వేశ్యాస్త్రీలు నృత్యములను సలిపిరి. వందిమాగధులు నానావిధములగు స్తోత్రపాఠములను సలిపిరి. నటులు మిక్కిలి గంభీరములయిన మంగళగానములచేత స్తోత్రములను చేసిరి. అంత జనకమహారాజును దశరథమహారాజును అనేకవిధములయిన దానములను చేసిరి. అప్పుడు పెండ్లికొమారులు పెండ్లికొమార్తెలను కటిప్రదేశములయందు ఎక్కించుకొని కౌసల్యాదులతోఁగూడ భోజనగృహమునకుఁ బోయిరి. అట్లుపోయి ముందుగ పార్వతీపరమేశ్వరులను పూజించిరి. అంతట రాముఁడు మొదలగు ఆయా పెండ్లికొమారులు ఆయాపెండ్లికొమార్తెలతో ఏకపాత్రయందు భోజనమును చేయుచుండఁగా సువాసినీస్త్రీలందఱును వారిచుట్టునుకూర్చుండి మిక్కిలి సంతోషముతో భుజించుచుండిరి. ఆసమయమునందు దశరథమహారాజు మిత్రులతోడను రాజులతోడను పురజనులతోడను ఇష్టజనులతోడను గూడుకొనినవాఁడై సరసాలాపములనాడుచు భుజించుచుండె. ఈప్రకారముగఁ బెండ్లివారందఱును జనకచక్రవర్తియొక్క యింటియందు మిక్కిలి సంతోషముగ భుజించిరి. మఱియు జనకచక్రవర్తిభార్యయగు సుమేధయను నామెచేత మాటిమాటికిని ప్రార్థితులైరి. జనకచక్రవర్తిఅనేకవిధములైన ఉత్సవములను చేయించె. పిమ్మట పెండ్లికుమారులందఱును తల్లులయొక్క సన్నిధియందు స్త్రీలవాక్యములవలనఁ దమతమభార్యలయొక్కపాదములయందు తమశిరస్సులనుపెట్టి నమస్కరించిరి. అంతట పెండ్లికొమార్తెలుగూడ భర్తలయొక్క పాదములయందు శిరస్సులనుపెట్టి నమస్కరించిరి. అట్లు నమస్కరించి ఆసీతాదేవిమొదలగువారు తమభర్తలయొక్కతొడలయందు కుంకుమాదులచేత చిహ్నితములైన తమపాదములను పెట్టిరి.అట్టిసమయమునందు సుందరాకారుఁడును, సర్వాత్ముఁడును దయచేత పూర్ణమైన చూపులుకలవాఁడును, మెఱపుతీఁగలవంటి వస్త్రిములచేత ప్రకాశించుచున్న శరీరముకలవాఁడును, ముల్లోకములకును శిరోభూషణమైనవాఁడును, ముత్యములచేతఁ బ్రకాశించుచున్న కంఠము కలవాఁడును, అగురాముఁడు సీతనుపొంది మిక్కిలి మనోహరుఁడై ప్రకాశించుచుండె. అంతట పెండ్లియొక్క నాలుగవదినమునందలి రాత్రియందు వెదురుపాత్రములయందుంచఁబడిన

దీపములచేత స్త్రీలందఱును రాముఁడు మొదలగువారలకు నీరాజనములను సలిపిరి. అప్పుడు జనకచక్రవర్తి రాముఁడు మొదలగువారలకు బహుమానములను చేసె. మఱియును అనేకములగు వస్త్రములను ఆభరణములను ఇచ్చె. అనేకములగు గోవులను దాసదాసీజనమును ఇచ్చె. ఈప్రకారముగా రాముఁడు మొదలగు వారలు జనకచక్రవర్తిచేత గౌరవింపఁబడినవారై పూర్వమునందువలెనే నానావిధములయిన ఉత్సవములును చూచుచు భార్యలతోఁ గూడుకొనినవారై యేనుఁగుల మీఁద నెక్కి నృత్యగీతాదులకు సంతోషించుచు తమమంటపములకుఁబోయిరి. పిమ్మట జనకచక్రవర్తి ప్రార్థించుటచేత దశరథమహారాజు పరివార సమేతముగఁ గొన్నిదినములు అచట నివసించియుండిరి. పిమ్మట తనసైన్యముతోఁగూడ తన పట్టణమునకుఁ బోవుటకు యత్నించె. ఆసమయమునందు సీతాదేవి మొదలగు వారలు కన్నీళ్లతోఁ గూడుకొనినవారును మిక్కిలి కలతనొందిన చిత్తములు కల వారునునై రాముఁడు మొదలగు వారలతోఁ గూడ బయలువెడలిరి. అంత జనకచక్రవర్తియొక్క భార్యయగు సుమేధయనునామె సీతాదేవి మొదలగు పుత్త్రికలను కౌఁగిలించుకొని ఊరార్చి, పుత్త్రికలారా? పోయిరండు అనిచెప్పె. అప్పుడు దశరథమహారాజు తమ్మును వెంబడించివచ్చుచుండు జనకచక్రవర్తిని నిలువుమని చెప్పుచుండఁగా జనకచక్రవర్తి కన్నీళ్లుకలవాఁడును, నిట్టూర్పులను విడుచుచున్నవాఁడును, విరహమువలన గద్గదస్వరముకలవాఁడును, అగుచు దశరథమహారాజుతో నిట్లనియె. ఓమహాత్మా! దశరథమహారాజా! ఇంతవఱకు సీతాదేవి మొదలగువారలు నాచేత లాలింపఁబడుచుండిరి. ఇది మొదలుకొని నీవు అత్యంతము దయగల చూపులచేత ఈసీతాదేవి మొదలగువారలను లాలింపుమని చెప్పి జనకచక్రవర్తి మిథిలాపట్టణమునకుఁబోయె. అట్లు జనకచక్రవర్తి తనపట్టణమునకుఁ బోయినపిమ్మట దశరథమహారాజు కోడండ్రు భార్యలు పుత్త్రులు మంత్రులు సేనలు మొదలగువారితోఁ గూడుకొనినవాఁడై మెల్లమెల్లఁగా అయోధ్యాపట్టణమునకుఁ బోవుచుండె.

అట్లు దశరథమహారాజు మొదలగువారలు పోవుచుండఁగా మిథిలాపట్టణమును వదలి మూఁడుయోజనముల దూరముపోయిన పిమ్మట మిక్కిలి భయంకరములయిన అపశకునములు కనఁబడియె. ఆసమయమునందు దశరథమహారాజు వసిష్ఠమహామునికి నమస్కరించి, ఓమహాత్మా! వసిష్ఠుఁడా! ఇదియేమి అనిచెప్పి మఱియు నిట్లనియె. ఓమునిశ్రేష్ఠుఁడా! వసిష్ఠుఁడా! ఈ సకలప్రదేశములయందును విపరీతములయిన అపశకునములు కనఁబడుచున్నవి. ఇట్లు కనఁబడుటకు కారణమేమి అని అడిగె. అంతవసిష్ఠమహాముని యిట్లనియె. ఓ దశరథమహారాజా! ఈ శకునములను ఆలోచించిచూడఁగా మొదట భయము కలుగుననియును, పిమ్మట శీఘ్రముగానే శుభము కలుగుననియును తోఁచుచున్నది. ఓమహారాజా! దశరథుఁడా! మృగములు నీకుఁ బ్రదక్షిణముగఁ బోవుచున్నవి. ఇట్లుపోవుటచేత రాఁబోవుశుభములును సూ

చింపఁబడుచున్నవి అని చెప్పె. ఈప్రకారముగ వసిష్ఠమహర్షి చెప్పుచుండఁగా మిక్కిలి భయంకరమైనగాలివీచె. ఆగాలివలన మిన్నుమన్ను తెలియకుండునట్లు దుమ్ము అధికముగా బయలువెడలి కన్నులయందుఁ బడుటచేత ఎల్లవారికి మార్గము కనఁబడకపోయె. అంతఁ గొంతసేపటికి ఆదుమ్ము అణఁగినతోడనే సర్వోత్తముఁడును, మిక్కిలి కాంతికలవాఁడును అయిన పరశురాముని చూచిరి. అప్పుడు ఆపరశురాముఁడు నల్లని మేఘమువంటిదేహకాంతి కలవాఁడును, జటామండలములచేత అలంకరింపఁబడిన వాఁడును, ధనుస్సు, పరశువు అనునవిహస్తమునందుఁ గలవాఁడును, ప్రళయకాలాగ్నివలె నున్నవాఁడును, కార్తవీర్యార్జునుని సంహరించినవాఁడును, క్షత్రియులను సంహరించినవాఁడునునై యుండె. మఱియును, ఆపరశురాముఁడు ఎఱ్ఱని ముఖముకలవాఁడును, ఎఱ్ఱనినేత్రములు కలవాఁడును నై యుండె. అట్టి పరశురాముఁడు ఎదుటికివచ్చుటను చూచి దశరథుఁడు మిక్కిలి భయముకలవాఁడయ్యె. అంతట దశరథమహారాజు ఆపరశురామునకు అర్ఘ్యపాద్యాదుల నిచ్చి పూజించువిషయమును మఱచి రక్షింపుము రక్షింపుము అని కూఁతలను బెట్టె. పిమ్మట సాష్టాంగదండప్రణామమునుచేసి నాపుత్త్రులకు ప్రాణముల నిమ్మని యాచించె. ఇట్లు పలుకుచున్నవాఁడును, రఘుకులోత్తముఁడును, అయిన దశరథమహారాజును అలక్ష్యముచేసి రామునియొద్దకువచ్చి కోపముచేత చలించుచున్న యింద్రియములుకలవాఁడై మిక్కిలి కఠినవాక్యములతో నిట్లనియె. ఓరీ క్షత్రియాధమా! నీవు నాపేరును పెట్టుకొని తిరుగుచున్నావఁట. ప్రాఁతదియును, విఱిగియున్నదియును నగు శివునివిల్లువిఱిచి అబద్ధమైన గౌరవమును పొందుచున్నావఁట. నీకు సామర్థ్యము కలదేని విష్ణుదేవుని సంబంధమైన విల్లును ఎక్కుపెట్టుము. అట్లు చేసితివేని నీతోఁ గూడ యుద్ధమును చేసెదను. ఇట్లుచేయకపోతివేని నీవారలనందఱితోఁగూడ నిన్ను వధించెదను. ఓరీ రాముఁడా! నేను క్షత్రియకులమును నశింపఁజేయువాఁడనుకదా? అని పరశురాముఁడు చెప్పగానే శ్రీరాముఁడు విని యిట్లనియె. ఓమునిపుత్త్రుఁడా! పరశురామా! మేము ఒక్కగుణముగలవారము. మీరు బహుగుణములు కలవారు. రఘుకులమునందుఁ బుట్టినవారు గోవులయందును, బ్రాహ్మణులయందును, స్త్రీలయందును బాణములను ప్రయోగించువారుకారు. ఓమునిశ్రేష్ఠుఁడా! పరశురామా! మే మందఱమును మాప్రాణములను మీపాదములయందు అర్పించితిమి. కావున నీయిష్టానుసారముగ వధింపుము. నేను బ్రాహ్మణులతోఁగూడ యుద్ధమును చేయువాఁడనుగాను. అని శ్రీరాముఁడు చెప్పుచుండఁగా మహాకోపముగలవాఁడును, క్షత్రియకులధ్వంసకుఁడును, అగు పరశురామునిచూచి భూమియంతయును గడగడవణఁకె. సర్వత్ర చీఁకట్లువ్యాపించె. సప్తసముద్రములును అల్లకల్లోలములయ్యె. ఆసమయమునందు దశరథమహారాజునకు పుత్త్రుఁడగు శ్రీరాముఁడు కోపముతో పరశురామునిఁజూచి, ఆపరశురామునిచేతియందుండు ధనుస్సును బలమున లాగితీసి

కొని నారిని కట్టి అమ్ములపొదిలోనుండి బాణమును తీసి మిక్కిలి వేగముగ నెక్కుపెట్టె. శ్రీరాముఁడు పరశురాముని చేతియందుండు ధనుస్సును తీసికొనునపుడే ఆపరశురామునియొక్క తేజస్సునంతయు తాను గ్రహించె. అట్లు ఎక్కుపెట్టి యిట్లనియె. ఓబ్రాహ్మణశ్రేష్ఠుఁడా! పరశురామా! నామాటను వినుము. నా బాణము అమోఘమైనది. కావున నా బాణమునకు లక్ష్యమును చూపుము. ఈబాణమును లోకములమీఁద విడిచిపెట్టుదునా? లేక నీపాదములమీఁద విడుతునా? చెప్పుమనియె. ఆసమయమునందు పరశురాముఁడు వెలవెలఁబోయిన ముఖముగలవాఁడై మునుపటివృత్తాంతమును సర్వమును స్మరణకు తెచ్చుకొని ఇట్లనియె. ఓ అధికభుజబలపరాక్రమసంపన్నుఁడా! శ్రీరాముఁడా! నీవు, పరమేశ్వరుఁడవును, సర్వవ్యాపకుఁడవును లోకములకు ఉత్పత్తిస్థితిలయములను చేయువాఁడవును అయిన నారాయణుఁడవని నేనెఱుఁగుదును. నేను బాల్యమునందు విష్ణుదేవుని సేవింపఁదలఁచి గోమతీతీరమునకుఁ బోయితిని. అట్లు గోమతీతీరమునకుఁబోయి తపస్సుచేత నారాయణునకు సంతోషమును కల్గించితిని. మఱియును, నారాయణాంశముచేత భూభారమును హరించుటకొఱకును కార్తవీర్యార్జునుని సంహరించుటకొఱకును జన్మించితిని. మఱియును శంఖచక్రగదాధరుఁడును దేవేశుఁడును అగునారాయణుఁడు నా తపస్సునకు సంతోషించి ప్రసన్నుఁడై యిట్లనియె. ఓబ్రాహ్మణశ్రేష్ఠుఁడా? పరశురామా! నీతపస్సు ఫలించినది. కావున తపస్సును వదలిపెట్టుము. నీవు నా అంశమును ధరించి కార్తవీర్యార్జునుని జయింపుము. పిమ్మట ఇరువదియొక్క మారులు క్షత్రియకులమును నశింపఁజేయుము. అట్లు చేసి యీభూమండలమును సర్వమును కశ్యపునకు దానముచేసి శాంతిని పొందుము. అంతఁ గొంతకాలమునకు త్రేతాయుగము వచ్చును. ఆయుగమునందు నేను దశరథమహారాజునకుఁ బుత్రుఁడనై శ్రీరాముఁడను పేరుతోఁ బుట్టుదును. అప్పుడు పరమభక్తితో నన్నుఁ జూడఁగలవు. ఆసమయమునందు ఇప్పుడు నీయందుఁ బ్రవేశపెట్టిన తేజస్సును నేను గ్రహింపఁగలను. అదిమొదలుకొని నీవు తపస్సును చేసికొనుచు నుండుమని చెప్పి ఆదేవదేవుఁడగు నారాయణుఁడు అంతర్ధానమును పొందెను. అంతట నేను సకలకార్యములను చేసితిని. ఓరాముఁడా? దేవదేవుఁడగు నారాయణుఁడే నీరూపముతోఁ బుట్టెను. ఓ రాముఁడా? పూర్వము నాయందుంచఁబడిన తేజస్సును ఇప్పుడు నీవు గ్రహించితివి. కావున నోరాముఁడా? ఇప్పుడు నాజన్మము సఫలమైనది. సకలలోకనాథుఁడవును, భక్తిచేత ధ్యానముచేయఁదగినవాఁడవును, దయచేత మితిలేనివాఁడవును, అయిన యోరాముఁడా? నీకు నమస్కారమును చేసెదను. ఓరాముఁడా? లోకములను జయించుటకొఱకు నేనుచేసిన సకలపుణ్యమును నీబాణమునకు సమర్పించెదనని చెప్పె. అంతట రాముఁడు బాణమును ప్రయోగించి పరశురామునికర్మమును సర్వమును భస్మమునుగాఁ జేసె. పిమ్మట భగవంతుఁడగు శ్రీరాముఁడు ప్రసన్నుఁడై నీ కభీష్టమైన వరమునిచ్చెద కోరుమని

ను. అప్పుడు పరశురాముడు ప్రీతియుక్తమైన మనస్సుతో నిట్లనియె. ఓ రాముఁడా! నీకు నాయందు అనుగ్రహముకలదేని నీభక్తులతో సాంగత్యమును నీపాదములయందు భక్తియును కలిగియుండునటుల ననుగ్రహింపుమనియె. అంతట శ్రీరాముడు అట్లగుఁగాక అనియె. పిమ్మట పరశురాముడు ప్రదక్షిణనమస్కారములను చేసి శ్రీరాముని యనుజ్ఞనుపొంది మహేంద్రపర్వతమునకుఁబోయె. పూర్వము సకలదేవతలను జయించి అధికగర్వమును పొందిన రావణాసురుని తనయొక్క వేయిచేతులచేతను బంధించి గర్వమునుపొందుచున్న కార్తవీర్యార్జునుని పరశురాముడు జయించె. అట్టిపరశురాముడు ఇప్పుడు శ్రీరాముని బాణప్రయోగముచేత జయింపఁబడియె. ఆహా! శ్రీరామునిపరాక్రమమును ఏమని చెప్పవచ్చును. శ్రీరాముని పరాక్రమము ఇట్టిదని యెవ్వరును చెప్పఁజాలరు. అట్లు పరశురాముడు పోయినపిమ్మట దశరథమహారాజు తనపుత్త్రుఁడగురాముడు మరణమునుపొంది మరలవచ్చెనని తలఁచె. పిమ్మట శ్రీరాముని దృఢముగఁ గౌఁగిలించుకొని ఆనందబాష్పములను విడిచె. అంతట దశరథుడు స్వస్థచిత్తుఁడై తనపట్టణమునకుఁ బోయె. ఇట్లు దశరథమహారాజు పుత్త్రమిత్రకళత్రాదులతోఁగూడ అయోధ్యాపట్టణమునకు వచ్చిన వృత్తాంతమును సుమంత్రుడు విని పతాకాధ్వజతోరణములచేత పట్టణము సర్వమును అలంకరింపఁజేసె. అట్లుచేసి పట్టపుటేనుఁగును ముందునిడుకొని మిక్కిలి వేగముతో శ్రీరాముడు మొదలగువారిలను పట్టణములోనికిఁ దీసికొనిపోవుటకు వచ్చె. అట్లువచ్చి మిక్కిలి శ్రేష్ఠములగు సకలవాద్యములును మ్రోగుచుండఁగా నృత్యాదికమును చూచుచు దశరథమహారాజు పుత్త్రమిత్రకళత్రాదులతోఁగూడ అయోధ్యాపట్టణమునకుఁబోయె. ఆసమయమునందు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు తమతమ భార్యలతోఁగూడ వేఱువేఱుగ ఏనుఁగులనెక్కి పట్టణములోనికిఁ బోయిరి. ఆసమయమునందు వందిమాగధులు స్తోత్రములను చేయుచుండిరి. ఈప్రకారముగ దశరథమహారాజు తనపుత్త్రుఁడు మొదలగువారలతోఁగూడ గృహమునందుఁ బ్రవేశించిన పిమ్మట లక్ష్మీపూజను చేయించి యనేకములగు దానములను చేసె. ఆసమయమునందు బంధువులు మిత్రులు మొదలగువారందఱును రాముడు మొదలగువారిలకు వస్త్రాలంకారాదులను సమర్పించిరి. అప్పుడు దశరథుఁడుకూడ వారలనందఱను నానావిధములగు వస్త్రాభరణాదులచేతఁ బూజించె. అంతట బంధుమిత్రులగు రాజులందఱును తమతమనగరములకుఁ బోయిరి. ఆసమయమునందు దశరథమహారాజు సాత్త్వికుఁడగు యుధాజిత్తను మహారాజునుమాత్రము కొన్నిదినములవఱకును నుండుమని ప్రార్థించి నిలుపుకొనియె. పిమ్మట రామలక్ష్మణభరతశత్రుఘ్నులు తమతమ భార్యలతోఁగూడ తమతమ గృహములయందు క్రీడించుచుండిరి. అని పరమశివుడుచెప్పె. అంత పార్వతీదేవి మరల నిట్లనియె. ఓ ప్రాణనాథా! పరమేశ్వరా! పరశురాముడు శ్రీవిష్ణుదేవునియొక్క చిదంశముచేత పు

ట్టినవాఁడని చెప్పితివికదా? రాముఁడుకూడ అటులనే శ్రీవిష్ణుదేవునియొక్క చిదంశముచేత పుట్టినవాఁడు? ఈవిషయమును తెలుపుమని ప్రార్థించిన పరమశివుఁడిట్లనియె. ఓ పార్వతీ? శ్రీవిష్ణుదేవుఁడు ఇరువదియెనిమిదిపర్యాయములు అవతరించె. ఆయవతారములలో రామకృష్ణాద్యవతారములు పూర్ణరూపముతోఁ గలిగినవి. మఱియు నోదేవీ! పార్వతీ! సకలమైన అవతారములలో రామకృష్ణావతారములు శ్రేష్ఠములైనవి. మఱియు నోపార్వతీ! ఆరెంటిలో మొదటిదగు రామావతారము మిక్కిలి శ్రేష్ఠమైనది. ఆరాముఁడు సత్యసంధుఁడనియును, జితేంద్రియుఁడనియును ప్రసిద్ధిని గాంచెను. ఓ పార్వతీ! రామావతారముతో సమానమైన అవతారము ఏదియును లేదు. ఓపార్వతీ! కృష్ణుఁడు నల్లని దేహకాంతికలవాఁడు. శ్రీరాముఁడు రుక్మకాంతి కలవాఁడు. ఓపార్వతీ! సీతాదేవియొక్క ఈ స్వయంవరాధ్యాయమును పఠించుటవలనను వినుటవలనను, సర్వోత్తమమైన మంగళములు కలుగును.

ఇ॥ శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానందరామాయణమున
సారకాండమునందు సీతాస్వయంవర మనునామధే
యముకల మూఁడవసర్గము ముగిసెను.

---

### * బృందాశాపకథనము. *

అంతట, అనఁగా వివాహమును చేసికొని తననగరమునకు వచ్చినపిమ్మట శ్రీమంతుఁడగురాముఁడు సీతతోఁగూడ సాకేతపట్టణమునందున్నవాఁడును, రాజసేవాపరుఁడును నై నానావిధములయిన భోగములను అనుభవించె. అంతట శరత్కాలాశ్వయుజమాసమునందు జనకుని యనుమతినిపొంది అతనిమంత్రులు దశరథమహారాజును చూచిపోవుటకు అయోధ్యకువచ్చిరి. అట్లువచ్చిన జనకచక్రవర్తియొక్క మంత్రులను దశరథమహారాజు మిక్కిలి ఆదరముతో సత్కరించి యిట్లనియె. ఓమంత్రులారా! మీరు ఏలవచ్చితిరి. అనిన నామంత్రు లిట్లనిరి. ఓదశరథమహారాజా! జనకచక్రవర్తి దీపావళిపండుగకు సకుటుంబముగ మంత్రి పౌరజానపదులతోఁ గూడ నిన్నుఁ దోడ్కొనిరండని మమ్ములనంపె నని యామంత్రులుచెప్పిరి. అంత దశరథమహారాజు దూతలను పంపి నగరములో నుండువారికిని, రాష్ట్రములో నుండువారికిని ఆవృత్తాంతమును సర్వమును తెలిపె. మఱియును మిథిలానగరమునకు దీపావళిపండుగకు పోయివత్తము రమ్మని పిలిపించె. అంతట పౌరులును జానపదులును మొదలగువారలతోఁగూడ సుముహూర్తమును విచారించుకొని ప్రయాణమయ్యె. పిమ్మట చతురంగబలములను వెంటఁబెట్టుకొని పౌరజానపదాదులకుఁ దగినవాహనములనిప్పించె. ఆసమయమునందు రామలక్ష్మణభరతశత్రుఘ్నులుకూడ చక్కఁగ నలంకృతులై యేనుఁగులమీఁదనెక్కి గజారూఢుఁడై పోవుచున్న దశరథమహారాజును వెంబడించిరి. మఱియును ఆసమయమునందు రాజభార్యలగు కౌసల్యమొదలగు

వారుకూడ చక్కఁగనలంకరించుకొని ఆఁడుయేనుఁగులమీఁదనెక్కిరి. సీతాదేవి మొదలగువారుకూడ ఈప్రకారముగా ప్రయాణమైరి. మఱియును ఆసమయమునందు వేత్రపాణులు మొదలగువారు కౌసల్య మొదలగువారికి నానావిధములగు ఉపచారాదులను చేయుచు బయలువెడలిరి. మఱియును అనేక దాసీజనముకూడ బయలువెడలెను. ఈప్రకారముగ దశరథమహారాజు పరివారజనముతోఁగూడ బయలువెడలి మిథిలాపట్టణమునకు పోఁగానే దశరథమహారాజువచ్చిన వృత్తాంతమును జనకచక్రవర్తి విని మహానందముతో మంత్రులు మొదలగు పరివారజనముతోఁగూడ నెదురుగ వచ్చి వారల నందఱను తనగృహములోనికిఁ దీసికొనిపోయె. అట్లు దశరథమహారాజాదులను తనగృహములోనికిఁ దీసికొని పోవునప్పుడు మార్గమునందు ఎక్కడఁజూచినను వాద్యములు దుందుభులు మొదలగువానియొక్క ధ్వనులు మ్రోగుచుండె. వేశ్యాస్త్రీలు నృత్యములను చేయుచుండిరి. గాయకులు గానములను చేయుచుండిరి. పురస్త్రీలందఱును మేడలమీఁద నెక్కి చూచుచు పుష్పవర్షములను గురిపించిరి. ఇట్లు జరుగుచున్న నానావిధమహోత్సవములను చూచుచు నగరమునందుఁ బ్రవేశించిరి. అంతట దశరథుఁడు మొదలగువారలు జనకచక్రవర్తిచేత అధికముగా గౌరవింపఁబడినవారై నానావిధములైన అన్నోదకాదులచేత నిండింపఁబడి మనోహరములైన గృహములయందుఁ బ్రవేశించిరి. పిమ్మట జనకచక్రవర్తి అల్లుండ్రను నలువురను నానావిధమైన యుత్సవములచేతను మిష్టాన్నములచేతను, నృత్యగానములచేతను వస్త్రాభరణాదులచేతను మిక్కిలి విశేషముగ గౌరవించె. మఱియును, మిక్కిలి పుణ్యకరమయిన దీపావళి యనుదినమునందు మణిరత్నాదిదీపములచేత విశేషముగఁ బూజించె. ఆజనకచక్రవర్తి, తలంట్లు, నలుగులు, వరపక్వాన్నభోజనములు మొదలగువానిచేతను, దాసదాసీదానములచేతను, గోదానముచేతను, చతురంగబలదానములచేతను అల్లుండ్రను విశేషముగఁ బూజించె. మఱియును, దశరథమహారాజునుకూడ అధికముగా గౌరవించె. దీపావళి అనుదినము సకలలోకములకును ఆనందమును కలుగఁజేయునట్టిది అగుటచేత ప్రతిగృహమునందును, మంగళోత్సవములుజరిగె. అంతట దశరథునిభార్యలు మొదలుగాఁగలవారందఱును జనకచక్రవర్తి చేసినమర్యాదకు పరమానందమునుపొందిరి. పిమ్మట దశరథమహారాజు తనపట్టణమునకుఁ బోవుటకుఁ బయనమయ్యె. అంతట దశరథమహారాజు సైన్యముతోఁ గూడుకొనినవాఁడును, మంత్రిపురోహితసామంతమంత్రులతోఁ గూడుకొనినవాఁడును నై బయలువెడలి మార్గమునందు అక్కడక్కడవిశ్రమించుచు మెల్లమెల్లఁగఁ బ్రయాణమై పోవుచుండె. ఇట్లు దశరథమహారాజు పుత్త్రమిత్రాదులతోఁగూడ అయోధ్యాపట్టణమునకు వచ్చుచున్నసమయమునందు పూర్వము సీతాస్వయంవరముకొఱకు వచ్చి నిరాశులైపోయిన రాజులందఱును మితిలేని చతురంగబలములతోఁ గూడుకొని దశరథమహారాజుతో యుద్ధముచేయుటకు వచ్చిరి. అట్లు యుద్ధసన్నద్ధులై

వచ్చినరాజుల నందఱను చూచి జనకచక్రవర్తి ఇది యేమి, ఇప్పుడియేల ఈరాజులు యుద్ధమునకు వచ్చిరి, అని మంత్రులతోడను తనబంధుజనులతోడను ఆలోచించుచుండె. అంత దశరథమహారాజు ఆశత్రురాజుల నందఱనుచూచి దుఃఖసముద్రమునందుమునిఁగె. ఆసమయమునందు శ్రీరాముఁడు దుఃఖసముద్రమునందు మునిఁగియున్న తనతండ్రిమొద్దకు లక్ష్మణునితోఁగూడ పోయి నమస్కరించి వినయముగలవాఁడై యిట్లనియె. ఓతండ్రీ! దశరథమహారాజా! నేనుండఁగా నీవు విచారమును పొందఁగూడదు. నాయుత్సాహమును చూడుము. క్షణముసేపులో ఈశత్రురాజుల నందఱను వధించెదనని చెప్పె. ఆమాటలను దశరథమహారాజు విని రఘుకులోత్తముఁడగురాముని కౌఁగిలించుకొని యిట్లనియె. ఓపుత్త్రుఁడా! శ్రీరామా! నీవు పదాఱుసంవత్సరముల బాలుఁడవు. నీవు అనేకశత్రురాజులతో యుద్ధము నెట్లు చేయఁగలవు. నేను అరణ్యమునందు కుటుంబముతోఁ గూడుకొని యుండఁగా, అందఱు శత్రురాజులువచ్చి గొగిరించిరి. ఓపుత్త్రుఁడా! శ్రీరామా! నీవు స్త్రీలు మొదలగువారలను కాపాడుచుండుము. నేను పోయి యీనీచరాజులతో యుద్ధమును చేసెదనని చెప్పిన, శ్రీరాముఁడు విని మరల నిట్లనియె. ఓతండ్రీ! దశరథమహారాజా! నేనుయుద్ధమును చేయునపుడు నాశక్తి తగ్గిపోయెనేని, అప్పుడు నాకు సాహాయ్యమును చేయుము. అంతవఱకును నీవు ఇక్కడ నుండుము. ఓతండ్రీ! దశరథమహారాజా! నామాటలను విని కుటుంబమును సైన్యమునుకూడఁ గాపాడుచుండు మనిచెప్పి తండ్రికి నమస్కారమును చేసి ధనుస్సును చక్కఁబట్టుకొని లక్ష్మణునితోఁగూడ రథారూఢుఁడై యుద్ధమునకు బయలు వెడలె. అట్లు రామలక్ష్మణు లిరువురును యుద్ధమునకుపోవుటను చూచి భరతశత్రుఘ్నులుకూడ బయలు వెడలిరి. ఆప్రకారముగ పుత్త్రులునల్వురును బయలువెడలుటను చూచి దశరథమహారాజు పదివేలసైన్యమును సాహాయ్యముగఁబంపె. ఆసమయమునందు యుద్ధమునకు వచ్చినశత్రురాజు లందఱును రథారూఢుఁడై వచ్చినశ్రీరామునిచూచి తమలోఁదా మిట్లనిరి. ఈరాముఁడుతండ్రియగు దశరథునియొక్క రథమునెక్కి వచ్చుచున్నాఁడు. శ్రీమంతుఁడును రఘుకులోత్తముఁడును నగుశ్రీరాముఁడు వృషమువలెఁ బ్రకాశించుచున్నాఁడు. మఱియు నీరాముఁడు మిక్కిలి మనోహరముగఁ బ్రకాశించుచున్నస్కంధములు (భుజశిరస్సులు) కలవాఁడై యున్నాఁడు. ఈ శ్రీరాముని రథమునందు కోవిదారధ్వజము ప్రకాశించుచున్నది. మఱియును, ఈరాముఁడు దశరథమహారాజుయొక్క ఆజ్ఞచేత నానావిధములయిన ఆయుధములతోఁ గూడినరథము నెక్కి వచ్చుచున్నాఁడని యొకరితో నొకరు చెప్పుకొనుచుండిరి. ఇట్లు చెప్పికొనుచు ఆరాజులందఱును రథారూఢులై యుద్ధమును చేయుటకు ప్రయత్నించిరి. అంతట మిక్కిలి భయంకరమైనయుద్ధము జరిగె. ఆసమయమునందు శత్రురాజులు అస్త్రములు శస్త్రములు భిండివాలములు శతఘ్నులు మొదలుగాఁగల నానావిధాయుధములచేత రా

మునిసైన్యమును దరిమి రామునిపైఁ గవిసిరి. అట్లు కవిసి రామునిమీఁద బాణవర్షమును కురిపించిరి. ఈప్రకారముగ రామునిమీఁద బాణవర్షమును కురిపించుచున్న శత్రురాజులను చూచి, లక్ష్మణ భరతశత్రుఘ్నులు యుద్ధసన్నద్ధులై మిక్కిలి భయంకరమగు యుద్ధమును చేసిరి. అంతట శత్రురాజులందఱును తమబాణపరంపరలచేత భరతునికొట్టఁగా భరతుఁడు మూర్ఛనొంది రథమునుండి క్రిందఁబడియె. ఆప్రకారముగ భరతుని క్రిందఁబడవైచినపిమ్మట బాణములచేత శత్రుఘ్నునిఁ గొట్టిరి. అంతట శత్రుఘ్నుని రథహీనునిగాఁజేసి లక్ష్మణునిమీఁదికిఁ బరుగెత్తిరి. అట్లు లక్ష్మణునిమీఁదికిఁబోయి బాణవర్షమును కురిపించిరి. ఆ బాణవర్షమును సహింపలేక లక్ష్మణుఁడు పరితపించుచుండె. పిమ్మట ఆరాజులందఱును శ్రీరామునిమీఁద గూడ బాణవర్షమును గురిపించిరి. ఆసమయము కౌసల్య దశరథుఁడు సీత మొదలగువారలు రాముఁడు ఏమగునో అనిభయముతోఁ జూచుచుండిరి. అప్పుడు శ్రీరాముఁడు దివ్యమగుధనుస్సునందు వాయవ్యాస్త్రములు సంధానముచేసి ప్రయోగించి శత్రురాజులనందఱను "ఎంటూకులవలె" సముద్రపుగట్టునఁ బడవైచె. మిగిలిన రాజులను మోహనాస్త్రముచేత మోహమును పొందించె. ఆసమయమునందు శత్రువులయొక్క చతురంగబలమును వ్యాకులతను పొంది మూలమూలలకుఁ బరుగెత్తె. అప్పుడు మూర్ఛనుపొందిన భరతునిఁజూచి కైకేయి మిక్కిలి వ్యసనముతోఁ బరుగెత్తుకొని వచ్చి భరతుని తనతొడమీఁదఁగూర్చుండఁబెట్టుకొని అధికముగా వ్యసనమునుపొందె. ఆసమయమునందు కౌసల్య దశరథుఁడు మొదలగువారలుకూడ వ్యసనమును పొందుచుండిరి. అప్పుడు శ్రీరాముఁడు వారలనందఱ నోదార్చి మిక్కిలి వేగముగ లక్ష్మణునితో నిట్లనియె. ఓతమ్ముఁడా? లక్ష్మణా! ఇక్కడకు సమీపమునందు తపోనిధియగు ముద్గలమహాముని ఆశ్రమము కలదు. నీవు అక్కడకుఁబోయి శుభమును కలుగఁజేయునట్టి సంజీవినీలతలను తీసికొనిరమ్ము. సంజీవినీలతలు ఆమహాముని మహిమచేత ఆయాశ్రమమునందు విశేషముగఁ గలవు. శీఘ్రముగఁ బొమ్మన లక్ష్మణుఁడు విని రథారూఢుఁడై ఆయాశ్రమమునకుఁబోయి రథమునుండి దిగి ఆశ్రమమునందుఁ బ్రవేశించె. ఆసమయమునందు ముద్గలమహామునియొక్క శిష్యులగు బ్రహ్మచారు లిట్లనిరి. ఓమహారాజా! నీవు సంజీవినీలతలను తీసికొనకుము. ఈముద్గలమహాముని సమాధినుండి లేచినపిమ్మట యాచించి తీసికొనుమని చెప్పిరి. ఆమాటలను విని లక్ష్మణుఁడు కాలాతిక్రమణమగుననియెడు భయముచేత మిక్కిలి శీఘ్రముగ రామునియొద్దకుఁబోయి ఆవృత్తాంతమును తెలుపఁగా రాముఁ డిట్లనియె. ఓతమ్ముఁడా! లక్ష్మణా! ఆశిష్యులమీఁద బాణములను వేయకయే నివారించి శుభకరములగు సంజీవినీలతలను తీసికొనిరమ్ము. ఆమహాముని యేమిచేయునో అని భయమును పొందకుమని చెప్పె. ఆమాటలను లక్ష్మణుఁడు విని మిక్కిలి శీఘ్రముగఁబోయి ఆశిష్యులను నివారించి బలా

త్కారముగ నాలతలను తీసికొని రామునియొద్దకు వచ్చె. అంతట శ్రీరాముఁడు ఆసంజీవినీలతలచేత భరతునిఁ జీవింపఁజేసె. పిమ్మట భరతుఁడు లేచికూర్చుండుటను కైకేయిచూచి పరమానందము కలదై భరతుని కౌఁగిలించుకొని శ్రీరామునికూడ కౌఁగిలించుకొనియె. అంత దశరథుఁడు కౌసల్య మొదలగువారలుకూడ రామభరతులను ఆలింగనము చేసికొనిరి. అప్పుడు దశరథమహారాజు వసిష్ఠునిచేతను, బ్రాహ్మణులచేతను నానావిధములైన యుత్సవములను చేయించె. అంతట నక్కడ ఆముద్గలమహామునిశిష్యులు హాహాకారములను చేయుచు ఆవృత్తాంతమును సర్వమును ముద్గలమహామునికిఁ దెలిపిరి. అంత ముద్గలమహాముని శిష్యులయొక్క మాటలను విని మిక్కిలి ఆశ్చర్యముకలవాఁడై శిష్యులతో నిట్లనియె. లక్ష్మణుఁ డనఁగా నెవ్వఁడు? ఎవ్వనియాజ్ఞ ననుసరించి నా ఆశ్రమమునందలి సంజీవినీలతలను అపహరించెను? ఈవృత్తాంతమును సర్వమును తెలిసికొని శీఘ్రముగ రండని ఆజ్ఞాపించె. అంతట శిష్యులందఱును మిక్కిలి శీఘ్రముగఁబోయి దశరథమహారాజునుచూచి యిట్లనిరి. ఓమహారాజా! నీవెవ్వఁడవు. ఏమి నిమిత్తముగ సంజీవినీలతలను దెప్పించితివి. అని మహాకోపముతో అడిగిన శిష్యులమాటలను దశరథమహారాజు విని మిక్కిలి విచారముకలవాఁడై యిట్లనియె. ఓ మునిశిష్యులారా! నేను దశరథుఁడను. నా అనుమతినిపొంది భరతునికొఱకు లక్ష్మణుఁడు సంజీవినీలతలను తీసికొనివచ్చె. ఈవిషయమును సర్వమును మీగురువగు ముద్గలమహామునికి నానమస్కారములతోఁగూడఁ దెలుపుఁడు. నేనుకూడ ఆమహామునియొక్క దర్శనమును చేయుటకొఱకు మిక్కిలి వేగముతో వచ్చుచున్నానని చెప్పుఁడని చెప్పె. అంతట నామహాముని శిష్యులు పోయి ఆవృత్తాంతమును సర్వమును ముద్గలమహామునికి తెలిపిరి. అప్పుడు ముద్గలమహాముని దశరథమహారాజును శ్రీరామునకు తండ్రినిఁగా దెలిసికొని కోపమును విడిచిపెట్టె. అంతట దశరథమహారాజు ఆమహామునిని జూచుటకొఱకు ఇచ్ఛకలవాఁడయ్యె. పిమ్మట చేతులనుకట్టుకొని ఆమహామునియొద్దకుఁబోయి సాగిలఁబడి నమస్కరించుచున్న దశరథుని అమ్ముద్గలమహాముని లేవఁదీసి మిక్కిలి ఆదరముతోఁ బూజించె. మఱియు నప్పుడు రాముఁడు మొదలగురాజపుత్త్రులు కూడ మిక్కిలి భక్తితో నమస్కారమును చేయుచు వినయముగా నిలిచియుండిరి. మఱియును, కౌసల్య మొదలగు రాజస్త్రీలును ఆముద్గలమహామునికి నమస్కారమును చేసి నిలిచియుండఁగా ముద్గలుని భార్యయగు సుమతి యనునామె వారలను సత్కరించె. అంతట దశరథమహారాజు ఆమహామునితో నిట్లనియె. ఓమునిశ్రేష్ఠుఁడా! నేను చేసిన అపరాధమును క్షమింపుమని చెప్పి ప్రార్థింపఁగా ఆమహాముని యిట్లనియె. ఓదశరథమహారాజా! నీచేత అధికమైన ఉపకారము చేయఁబడినది. నీవు ఈకార్యమును చేయక పోయినయెడల శ్రీరామునిదర్శనము మాకెట్లు లభించును. ఓదశరథమహారాజా! మానవవేషమును ధరించినవాఁడును, సీతాసమేతుఁడును అయిన శ్రీ

రామునిదర్శనము సామాన్యపుణ్యముచే లభింపదని యామహాముని చెప్పినమాటలను దశరథమహారాజు విని ముద్గలమహాముని మిక్కిలి సంతోషము గలవాఁడై యున్నాఁడని తలఁచి మరల నమస్కరించి యేదో యొకవిషయమును అడుగఁదలఁచిన వాఁడయ్యె. అప్పుడు ముద్గలమహాముని ఆదశరథునియొక్క హృద్గతాభిప్రాయమును తెలిసికొని ఆదశరథుని ఏకాంతస్థలమునందున్న తులసీవనమునకుఁ దీసికొని పోయి యిట్లనియె. ఓమహారాజా! దశరథుఁడా! నీకేమికోరిక కలదో చెప్పుమనిన దశరథమహారాజు యిట్లనియె. ఓమునిశ్రేష్ఠుఁడా! ఇఁకమీఁదట శ్రీరామునకు జరుగఁబోవునట్టి హితాహితములను తెలుపుమని ప్రార్థించిన ముద్గలమహాముని యిట్లనియె. ఓదశరథమహారాజా! నీపుణ్యవిశేషమువలన సర్వవ్యాపకుఁడును, జనులయందు దయకలవాఁడును, శ్రీమహావిష్ణువును అగునారాయణుఁడు భూభారమును హరించుటకొఱకు నీకుపుత్త్రుఁడై అవతరించె. ఓమహారాజా! నీపుత్త్రుఁడగురాముఁడు అధర్మనాశమును, ధర్మాభివృద్ధిని చేయును. మఱియును ఓదశరథమహారాజా! దుష్టనాశమును చేయును. సజ్జనులను పాలించును. మఱియును, అనేకములగు మహాకార్యములను చేసి పదునొకండువేలు సంవత్సరములు రాజ్యమును పాలించును. మఱియును రాముఁడు సప్తద్వీపములకును, అధిపతి యగును. ఈరామునకు ఇరువురు కుమారులును, నలుగురుకోడండ్రును, ఇరువదినలుగురు మనుమలును, ఇరువదినలుగురు మనుమరాండ్రును కలుగుదురు. ఇంతియగాక నీపుత్త్రుఁడగురామునకు లెక్కలేనిపుత్త్రపౌత్త్రాదులు కలిగియుందురు. కొన్నిదినములలోపల ఈబృందాశాపమును అనుభవించుటకు దండకారణ్యమునకుఁ బోవును. అట్లు పోయివచ్చిన పిమ్మట అధికమైనరాజ్యమును చేయఁగలఁడని ముద్గలమహాముని చెప్పె. అంతట ఆమాటలను దశరథమహారాజు విని యిట్లనియె. ఓమహాత్మా! ముద్గలుఁడా! బృందయనునది యెవతె? ఎవ్వనిభార్య? ఏమినిమిత్తముగ నారాయణుని శపించె? ఆవృత్తాంతమును సర్వమును తెలుపుమని ప్రార్థించిన ముద్గలమహాముని యిట్లనియె. ఓదశరథమహారాజా! పూర్వము జలంధరుఁడనువానికిని, పరమశివునకును మిక్కిలి భయంకరమైనయుద్ధము జరిగె. ఆయుద్ధమునందు ఆజలంధరుఁడు బృంద యనుపేరుగల తనభార్యయొక్క పాతివ్రత్యమహిమచేత ఓడిపోక మిక్కిలి భయంకరమగు యుద్ధమునుచేయుచునే యుండె. అప్పుడు పార్వతీదేవియొక్క ప్రేరణచేత నారాయణుఁడు బృందాపాతివ్రత్యమునకు భంగమును కలుగఁజేయఁదలఁచె. అట్లుతలఁచి ఆబృందకు స్వప్నము వచ్చునట్లుచేసె. ఆస్వప్నమునందు దున్నపోతునెక్కినవాఁడును, తైలముచేతఁ దడుపఁబడిన శిరస్సుకలవాఁడును, దిగంబరుఁడును, బోడితలకలవాఁడును, దక్షిణదిక్కునకుఁ బోవుచున్నవాఁడును అయిన తన భర్తను చూచె. అంతఁ గొంతసేపటికి బృంద మేల్కాంచి ఆస్వప్నము వలన తనకు కీడుగలుగు నని తలఁచి అధికముగా దుఃఖించి తనపట్టణమునం దెక్క

డను ఉండుటకులోఁ జక యిద్దరుచెలికత్తియలను వెంటఁబెట్టుకొని అరణ్యమునందుఁ బ్రవేశించి యొకవనమునుండి మఱియొకవనమునకుఁ బోవుచుండె. అట్లుపోవుచు అరణ్యమధ్యమునందు మిక్కిలి భయంకరులును, సింహనాదమును చేయుచున్నవారును నగు ఇరువురురాక్షసులనుచూచి అధికమయినభయముకలదై చెలికత్తియలతోఁగూడ పరుగెత్తుచు నొక్కచోట మౌనమును అవలంబించి శిష్యులతోఁగూడుకొని శాంతుఁడై యున్న ఒకమహామునినిఁ జూచె. అట్లుచూచి ఆబృంద మిక్కిలి భయముకలదై యుండుటచేత ఆమహామునియొక్క కంఠమును కౌఁగిలించుకొనియె. అట్లుకౌఁగిలించుకొని, ఓమహాత్మా. మునిశ్రేష్ఠుఁడా! నన్ను రక్షింపుము. రక్షింపుము. నేను శరణాగతురాల నైతినని చెప్పె. అప్పుడు ఆమునిశ్రేష్ఠుఁడు మౌనమును వదలి కన్నులు తెరచిచూచి ఆబృందనుచూచి యిట్లనియె. ఓ స్త్రీరత్నమా! నీవు భయమును పొందకుము. ఇక్కడ నా ఆశ్రమమునందుండు మనిచెప్పె. ఆసమయమునందు ఆమునిశ్రేష్ఠుఁడు గనఁగొనుట నిరువురురాక్షసులు ఆబృందను బెదరించుటనుచూచి అధికమైనకోపముతోఁ గూడుకొనినవాఁడయ్యె. అట్లు కోపోద్దీపితుఁడై 'హుం, హుం, అని హుంకారమునుచేయఁగా ఆరాక్షసు లిరువురును పరుగెత్తిపోయిరి. అట్లు రాక్షసులు భయముచేత పరుఁగిడిపోవుటను బృందచూచి ఆమహామునియొక్క ప్రభావమునకు మిక్కిలి ఆశ్చర్యమునుపొంది ఆమునిశ్రేష్ఠునకు సాష్టాంగ నమస్కారమునుచేసి యిట్లనియె. ఓమహాత్మా! మునిశ్రేష్ఠుఁడా! అధికమైనభయమునవలన నన్నుఁగాపాడితివి. కావున నోమునిశ్రేష్ఠుఁడా! ఒకవిషయమును మనవిచేయుచున్నాను. దానింజెప్పెదను. సావధానుఁడవై విని ప్రత్యుత్తరము నిమ్ము. ఓమహాత్మా! నాపెనిమిటి యగుజలంధరుఁడు రుద్రునితో యుద్ధమునుచేయుటకుఁ బోయెను. అతఁడు ఇప్పుడు ఎట్లున్నదియును తెలిసికొని చెప్పుమని ప్రార్థించె. ఆమాటలను విని అధికమైనకృపచేత కండ్లు పైకెత్తి ఊర్ధ్వలోకమును చూచె. అట్లు చూచినతోడనే, ఇరువురు వానరులు అక్కడకువచ్చిరి. అట్లు వచ్చి ఆమహామునికి నమస్కరించిరి. అంతట ఆమునిశ్రేష్ఠుఁడు జలంధరునివృత్తాంతమును తెలిసికొని రండని ఆజ్ఞాపించె. అంతట ఆవానరులు బయలువెడలిపోయి క్షణములోపల మరలి వచ్చిరి. అట్లు వచ్చినపుడు ఆజలంధరునియొక్క శిరస్సును, మొండెమును తీసికొనివచ్చిరి. అట్లు వానరులుతెచ్చిన శిరస్సును మొండెమును ఆబృందచూచి భర్తృవ్యసనముచేత మిక్కిలి దుఃఖముకలదై భూమియందుఁబడి పొరలిపొరలిదుఃఖించి మూర్ఛనుపొందె. అంతట ఆమహాముని తనకమండలమునందలిజలమును ఆబృందమీఁద ప్రోక్షించుటచేత బృంద మూర్ఛనుండి తేరె. పిమ్మట ఆబృందను ఓదార్పఁగా నాబృంద యిట్లనియె. మునిశ్రేష్ఠుఁడా! మునులయందుఁ బ్రియముకల యీనాభర్తను జీవింపఁజేయుము. నీకంటె నితరుఁ డెవ్వఁడును నాభర్తను జీవింపఁజేయఁజాలఁ డనిచెప్పిన ఆమహాముని యిట్లనియె. ఓ స్త్రీ

రత్నమా! ఈజలంధరుఁడు రుద్రునిచేత యుద్ధమునందుఁ జంపఁబడియె. కావున ఇతనిని బ్రతికించుటకు సాధ్యపడదు. అయినప్పటికిని నీయందలికృపచేత మరల నీభర్తను బ్రతికించెద నని చెప్పి ఆమహాముని అంతర్ధానమును పొందెను. అంతలోపల ఆజలంధరుఁడు లేచి భార్యయగుబృందను గాఢాలింగనముచేసికొని ఆ స్త్రీరత్నముయొక్క ముఖమును మిక్కిలిప్రియముతో ముద్దుపెట్టుకొనియె. అప్పుడు బృందకూడ భర్తనుచూచి అధికమైనసంతోషముకలదయ్యె. అంతట ఆజలంధరుఁడును బృందయును, ఆయరణ్యమునందు అనేకదినములు క్రీడించుచుండిరి. ఇట్లుండఁగా నొక్కనాఁడు తనివితీర సంభోగమునుచేసిన ఆజలంధరుని సంభోగాంతమందు ఆబృంద చూచి ఓహోహో వీఁడు జలంధరుఁడు కాఁడు జలంధరునివేషమును ధరించిన విష్ణువుగానున్నాఁ డని తెలిసికొని, ఆబృంద కోపోద్దీపితురాలై యిట్లనియె. ఓరీ! నారాయణా! నీవు మహానీచుఁడవు. ఛీ ఛీ! నీవ్యాపారము ఉచితముగనుండలేదు. పరునిభార్యను పొందుట నీకు ఉచితమగునా? నీవు మిక్కిలి దుర్మార్గుఁడవు. నీవు మాయావేషమును అవలంబించినమహామునివలెఁ గనఁబడితివి. నీమాయచేత నీభటులనే రాక్షసులనుగాఁ జేసి నన్నుఁ దరిమించితివి. కావున నిన్నిపుడు శపించెదను. ఓరీ నారాయణా! ఆయిరువురును రాక్షసులై నీభార్యను అపహరింతురుగాక. అని శపించి మరల యిట్లనియె. ఓరీ నారాయణా! రాక్షసులై నన్నుఁ దరిమిన యిరువురిని నీభృత్యులగు జయవిజయులనుగాఁ దెలిసికొంటిని. ఇట్టి దుష్కార్యమును చేసిన నీవు భార్యాదుఃఖమునుపొంది అరణ్యమునందు వానరసహాయుఁడ వగుదువు. ఇదివరలో నాకుఅగపడినవానరులు పుణ్యశీల సుశీలులను నిరువురును వానరరూపమును ధరించి నీకు సహాయులై రని తెలిసికొంటిని. నీవు ఇప్పుడు వానరసహాయుఁడవైనందుకు ఇఁకమీఁదట కుదుర్చుకొని నీకు వానరులతో సాంగత్యము కలుగుఁగాత. బ్రహ్మచారిరూపమును ధరించి నీయొద్ద శిష్యునివలెనుండినవాఁడు గరుత్మంతుఁ డని నేను తెలిసికొంటిని. ఓరీ నారాయణా! నీవు ఇంతసన్నాహముచేసి నాపాతివ్రత్యమునకు భంగమును కల్గించినందుకు నీవు నాశాపమునుతప్పక పొందుదు వని చెప్పి అగ్నిహోత్రమునందుఁ బ్రవేశించె. ఈప్రకారముగ బృందయొక్కపాతివ్రత్యమునకు భంగము కలుగుటచేత జలంధరుఁడు బలహీనుఁ డయ్యె. పిమ్మట పరమశివుఁడు యుద్ధమునందు జలంధరుని వధించె నని చెప్పి ముద్గలమహాముని మరల దశరథమహారాజుతో నిట్లనియె. ఓదశరథమహారాజా! అట్లు బృందయనునది శపించుటచేత ఆజయవిజయు లిరువురును సముద్రమధ్యమునన్న లంకాపట్టణమునందు రావణకుంభకర్ణు లనుపేరుకలరాక్షసులై పుట్టియున్నారు. ఆయిరువురును పంచవటీతీరమునందు రామునితోఁగూడ నుండునట్టి సీతామహాదేవిని లంకాపట్టణమునకుఁ దీసికొనిపోయి ఆఱుమాసములకాలము తల్లినికాపాడినవిధముగఁ గాపాడి శ్రీరామునిబాణములచేత మరణమునుపొందుదురు. ఈశ్రీరాముఁడు వాలి యనువానరుని

జంపి సుగ్రీవునితోఁ గూడుకొని రాళ్లచేత సముద్రమును బంధించి సీతను మఱల తీసికొనివచ్చును. పిమ్మట అనేకము లగుయాత్రలను చేయును. సప్తద్వీపసంయుత మగుభూమిని పరిపాలించును. బంధువులు మొదలగువారితోఁగూడ నానావిధసుఖ ములను అనుభవించును. ఓమహారాజా! దశరథుఁడా! ఈవృత్తాంతమంతయును మిక్కిలి రహస్యమైనది. దీనిని ఎవ్వరికిని జెప్పకుము. అని ముద్గలమహాముని చెప్పె నని పరమశివుఁడు పార్వతితో చెప్పి మఱలనిట్లనియె. ఓదేవీ! పార్వతీ! ఆముద్గలమహాముని ఇఁకమీఁద జరుగఁబోవు రామునివృత్తాంతమును సర్వమును చెప్పి మఱియును అనేకవిధముల రామచరిత్రమును వర్ణించె. ఆవృత్తాంతమును సర్వమును దశరథమహారాజు విని మిక్కిలి సంతోషమును పొంది ఓమహాత్మా! ముద్గలుఁడా! నేను పూర్వమునందు యెట్టిజన్మమును పొందియుంటిని. పూర్వజన్మ మునందు ఏయేకర్మములను చేసితిని. ఎట్టికర్మములనుచేయుటచేత నారాయణుఁడు నాకుఁ బుత్త్రుఁడయ్యె. ఆవృత్తాంతమును సర్వమును చెప్పు మనిప్రార్థించిన ముద్గల మహాముని మఱలనిట్లనియె. ఓమహారాజా! దశరథుఁడా! పూర్వము సహ్యపర్వత ముకలదేశమునందు కరవీర మనుపట్టణ మొక్కటికలదు. ఆపట్టణమునందు సకలధ ర్మములనుతెలిసిన ధర్మదత్తుఁ డనుబ్రాహ్మణుఁ డొకఁడు ఉండెను. మఱియును ఆబ్రాహ్మణుఁడు సర్వకాలములయందును విష్ణువ్రతములను చేయువాఁడును, విష్ణు పూజలను చేయువాఁడును ద్వాదశాక్షరీవిద్యనుజపించువాఁడును, అతిథి అభ్యాగ తులయందుఁ బ్రియముకలవాఁడునునై యుండె. ఇట్లుండఁగా కార్తికమాసమునందు ఒకనాఁడు శ్రీహరిపూజచేసి జాగరణమునుచేయుచుండె. అట్లుచేయుచుండఁగా నాఁటి రాత్రి కొంచెముప్రొద్దు నిలిచియుండఁగా విష్ణుదేవాలయమునకుఁ బోయె. అప్పుడు ఒకరాక్షసస్త్రీ విష్ణుదేవునియొక్క పూజాద్రవ్యములను అపహరించుకొనిపోవుటను చూచె. మఱియు నారాక్షసస్త్రీ వక్రములగు కోఱపన్నులుకలదియును, చలించు చున్న జిహ్వ గలదియును, ఎఱ్ఱనినేత్రములు కలదియును, దిగంబరురాలును, ఎండి నమాంసము కలదియును, దొండపండువంటి యధరోష్ఠము కలదియును, గురగుర ధ్వని కలదియునునై యుండె. అట్టిరాక్షసస్త్రీనిఁజూచి యాబ్రాహ్మణుఁడు మిక్కిలి భయముకలవాఁడును కంపింపఁబడుచున్న అవయవములుకలవాఁడును నయ్యె. అట్ల య్యును ధైర్యమును దెచ్చుకొని హరినామమును స్మరించుచు తులసీజలమును ఆరా క్షసస్త్రీమీఁద జల్లె. అంతట నారాక్షసస్త్రీకిఁ గలిగియున్న పూర్వజన్మమునందలి పాపమంతయునుపోయె. అప్పుడు ఆరాక్షసస్త్రీ తనపూర్వరూపమునుధరించి ఆబ్రా హ్మణునకు నమస్కరించి యిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! నేను పూర్వజన్మము నందలి పాపవశమువలన ఇట్టిజన్మమునుపొందితిని. ఇకమీఁదను ఉత్తమలోకమును పొందఁగల ననిచెప్పె. ఇట్లు నమస్కరించి తనయొక్కపూర్వజన్మవృత్తాంతమును చెప్పుచున్న రాక్షసస్త్రీ యొక్కమాటలను ఆబ్రాహ్మణుండు విని మిక్కిలి

ఆశ్చర్యముకలవాఁడై యిట్లనియె. ఓ స్త్రీరత్నమా! ఎట్టిపాపమును చేయుటచేత నీవు ఇటువంటి యవస్థనుపొందితివి? నీవు ఎట్టిస్వభావముకలదానవు? నీ కీ అవస్థ యెట్లు సంభవించెను. ఈవృత్తాంతమును సర్వమును చెప్పుమనిన ఆ స్త్రీవిని యిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! సౌరాష్ట్రనగరమునందు భిక్షు వనుపేరుకల బ్రాహ్మణుఁ డొక్కఁడు కలఁడు. కలహ యనుపేరుకల నేను ఆబ్రాహ్మణునకు భార్యనై యుంటిని. నేను ఒకప్పుడైనను మనస్సునందైనను భర్తకు ఇష్టమును చేయఁగోరినదానను గాను. మఱియును భర్తకు ఎన్నఁడును ఇష్టముగ అన్నమును పెట్టినదానను గాను. భర్తచెప్పినమాటలకు ఎప్పుడును వ్యతిరిక్తముగఁ బలుకుచుందును. మఱియును భర్తకంటె ముందుగ భుజించి పిమ్మట భర్తకు అన్నమును పెట్టుచుందును. ఇట్లుండఁగా నాభర్త ఒకనాఁడు ఈవృత్తాంతమును సర్వమును తనమిత్రునకుఁ దెలియఁ జెప్పఁదలఁచి ఆమిత్రునితో యిట్లనియె. ఓమిత్రరత్నమా! నాభార్య నామాటలు వినదు. నేనేమిచేయుదు నని చెప్పె. ఆమాటనువిని యామిత్రుఁడు తనమనస్సునందు గొంచెముసేపు ఆలోచించి నాభర్తతో నిట్లనియె. ఓస్నేహితుఁడా! నేను నీకు ఒకయుక్తిని చెప్పెదను. వినుము. నీకు కావలసినకార్యములను వద్దనిచెప్పుము. అట్లయిన నది నీకు వ్యతిరిక్తముగఁ జేయును. అందువలన నీకు మేలుకలుగు ననిచెప్పె. అంతట నాభర్త తనస్నేహితునియొక్క మాటనువిని యింటికి వచ్చి, ఓసీ! ఇఁకమీఁద నన్నును నామిత్రుని భోజనమునకుఁ బిలువవద్దని నీతోఁ జెప్పుమని నామిత్రుఁడు చెప్పెనని చెప్పె. అంత నేను ఛీ నీకును నీమిత్రునకును అన్నమును పెట్టెదను రండి అనిచెప్పితిని. అంతట నాభర్తయును అతనిమిత్రుఁడును అన్నము భుజించిరి. అదిమొదలుకొని నాభర్త తనకుఁ గావలసినకార్యములను వద్దనిచెప్పుటయును, నేను అందుకు వ్యతిరిక్తముగ జరుపుటయును సంభవించె. ఇట్లుండఁగా నాభర్తయొక్కతండ్రి శ్రాద్ధదినము తటస్థించె. అప్పుడు నాభర్త నన్నుఁ బిలిచి, ఓసీ! నేఁటిదినము నేను మాతండ్రికి శ్రాద్ధమును బెట్టనని చెప్పె. అప్పుడు నేను కోపోద్దీపితురాలనై బ్రాహ్మణులను పిలిచితిని. మఱియు నాభర్తను దిట్టి ఛీ! నీవు శ్రాద్ధమునుపెట్టవా? అని ధిక్కరించితిని. ఓరీ దుష్టుఁడా! పుత్త్రధర్మమును ఎఱుఁగవైతివి. అందువలన నీ వేగతిని పొందుదువో కదా? అని చెప్పితిని. అంతట నాభర్త, ఓసీ! నీయిష్టానుసారముగ శ్రాద్ధమును పెట్టెదను. అన్నమును వండకుము. బియ్యము మొదలగువానిని ఒకబ్రాహ్మణునకిత్తము. కావున ఒకబ్రాహ్మణుని పిలువుము. శ్రాద్ధవిస్తారము పనికిరాదని చెప్పె. ఆమాటలను విని ఛీఛీ నీయిష్టప్రకారము జరిపెద ననుకొంటివా? శ్రాద్ధమును శాస్త్రోక్తప్రకారముగ చేయక లోభించెదవా? అని చెప్పి పదునెనిమిదిమంది బ్రాహ్మణులను నిమంత్రితులనుగాఁ జేసితిని. మఱియును పక్వాన్నాదులను సిద్ధముగఁ జేసితిని. అప్పుడు నన్నుఁ బిలిచి యిట్లనియె. ఓప్రియురాలా! నీవు ముందుగ నాతోకూడ భుజింపుము. మిగిలిన

అన్నమును బ్రాహ్మణులకుఁ బెట్టుదము. ఆఁకలి నన్ను బాధించుచున్నది. కావున నాయిష్టమును నెరవేర్పుమని నాభర్త చెప్పె. అప్పుడు నేను కోపోద్దీపితురాలనై ఛీఛీ నీదగ్గర బ్రాహ్మణకృత్యములే లేవు. ముందుగ నీవుభుజించి పిమ్మట బ్రాహ్మణులకుఁ బెట్టుదవా? అని అంటిని. అట్లనుటచేత నాభర్త శాస్త్రోక్తప్రకారముగ శ్రాద్ధమును ఆచరించె. అంతట పిండదానాదికమును సర్వమును చేసి మఱల నాభర్త యిట్లనియె. ఓప్రియురాలా! కాలాతీతమగుటచేత నాకాఁకలితగ్గిపోయినది. కావున నేఁటి దినము నేను ఉపవసించెద నని చెప్పె. దానికి నేను ప్రతిహతముగ మాటలాడి నాభర్తను భుజింపఁజేసితిని. అంతట నాభర్త దైవవశముచేత మరచి యిట్లనియె. ఓ ప్రియురాలా! ఈపిండములను తీసికొనిపోయి సత్తీర్థముగలసరస్సునందు వేసిరమ్మని చెప్పె. అంతట నేను కోపోద్దీపితురాలనై ఆపిండములను తీసికొనిపోయి మలమూత్రములను వదలుచోట వేసివచ్చితిని! అప్పుడు నాభర్త ఖిన్నమైన మనస్సుకలవాఁడై హాహా! అని హాహాకారమును చేయుచు చిత్తరువులోని బొమ్మవలెఁ గొంతసేపు నిలిచి యాలోచించుకొని యిట్లనియె. ఓసీ! ప్రియురాలా! ఆపిండములను బయలునకుఁ దీయకుమని చెప్పె. అంతట నేను ఆపిండములను బయలునకుఁ దీసితిని. ఓప్రియురాలా? ఇఁకమీఁదట నీపిండములను సత్తీర్థమునందు వేయకుమని చెప్పె. అంతట నే నాపిండములను తీసికొనిపోయి సత్తీర్థముగల సరస్సునందుఁ బడవేసితిని. ఈ ప్రకారముగా నేను ఎన్నడును భర్తకు ఇష్టముగ సంచరింపనైతిని. మఱియును, సర్వకాలములయందును కలహమునందు ప్రియముకలదాననై యుంటిని. అంతట నాభర్త నాయందు మిక్కిలి కోపముకలవాఁడై మఱియొక స్త్రీని పెండ్లియాడుట కిచ్ఛయించె. అప్పుడునేను కోపముకలదాననై విషమునుపుచ్చుకొని మరణమును పొందితిని. ఆసమయమునందు యమకింకరులువచ్చి నన్ను బంధించి యమపురమునకుఁ దీసికొనిపోయిరి. అంతట యమధర్మరాజు నన్నుఁజూచి చిత్రగుప్తునితో నిట్లనియె. ఓచిత్రగుప్తుఁడా! యీయాఁడుది యేయేశుభకార్యములను చేసినదియును, ఏయే అశుభకార్యములనుచేసినదియును తెలియఁజేయుమనిన విని చిత్రగుప్తుఁ డిట్లనియె. ఓదేవోత్తమా! యమధర్మరాజా! దీనిచేత శుభకార్యము ఒక్కటియును చేయఁబడలేదు. ఇది మృష్టాన్నమును భుజించుచు భర్తకు ఒకనాఁడయినను కడుపునిండ అన్నము పెట్టినది కాదు. కావున నిదివల్గునీయోనియందుపుట్టఁదగినది. మఱియు నిది సర్వకాలములయందును భర్తతో కలహించుచుండును. కాఁబట్టి యోదేవోత్తమా! యమధర్మరాజా! ఇది నిస్సందేహముగ గాడిదయై పుట్టఁదగినది. మఱియు నిది సర్వకాలములయందును అన్నమును వండెడుభాండమునందే భుజించుచుండును. ఆదోషమువలన ఇదిమార్జారమై అనఁగా పిల్లియై పుట్టఁదగినది. ఓ యమధర్మరాజా! మఱియు నిది భర్తమీఁదికోపముచేత విషముతిని మరణమును

పొందె. కాఁబట్టి మిగుల నిందితమయిన ప్రేతశరీరమును అవలంబించి యుండఁదగి నది. మఱియు నో దేవోత్తమా! యమధర్మరాజా! ఇది నిర్జలభూమియందుఁ బడ వేయఁదగినది. మఱియును, ప్రేతశరీరమును అవలంబించి చిరకాలము ఉండఁదగినది అనిచెప్పె. అంత యమధర్మరాజు తనభటులనుపిలిచి నన్నుఁ గర్మానుసార మగుదేశమునఁ బడవేయునట్లు ఆజ్ఞాపించె. అంతట నేను క్షణమాత్రములోపల యమభటులచేత మరుభూమియందుఁ ద్రోయఁబడితిని. మఱియును, యమదూతలు నాకు ప్రేతశరీరమును ఇచ్చి తమస్థలమునకుఁ బోయిరి. అది మొదలుకొని నేను బహుకాలము ప్రేతశరీరమును అవలంబించియుంటిని. మఱియును, క్షుత్పిపాసలచేత అధికమైనదుఃఖమును పొందుచుంటిని. అట్లు శరీరములేనిదాననై తిరుగుచు నొకకోమటివానియొక్క మృతశరీరమునందుఁ బ్రవేశించి కృష్ణానది సముద్రమునందుఁ బ్రవేశించుచోటునకుఁ బోతిని. అట్లు నేనుపోయి కృష్ణాసాగరసంగమస్థలమునందు ప్రవేశించుచున్న సమయమునందు రుద్రవిష్ణుగణములు వచ్చి బలాత్కారముగ నన్ను వెడలఁగొట్టిరి. అదిమొదలుకొని నేను క్షుత్పిపాసలచేత పీడితురాలనై సంచరించుచు ఇప్పుడు నీయొద్దకు వచ్చితిని. వచ్చి నీచేతఁ జల్లఁబడిన తులసీజలముచేత పావనురాలనైతిని. ఓబ్రాహ్మణోత్తమా! ఇంకను మూఁడుజన్మములను ఈప్రకారముగాఁ బొందవలసియున్నది. అట్టిజన్మములను పొందకయే నేను పావనురాలనగునట్లు అనుగ్రహింపుము. నేను నిన్ను శరణమునుపొందితి నని మిగులదీనురాలై ప్రార్థించె. అట్లు ప్రార్థించుచున్న ఆకలహయొక్క మాటలను ధర్మదత్తుఁడను ఆబ్రాహ్మణుఁడు విని కలహయొక్కపాపమును తెలిసికొని భయవిస్మయదుఃఖములు కలవాఁడయ్యె. పిమ్మట బహుకాలము ఆలోచించి యిట్లనియె.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానందరామాయణమున
సారకాండమునందు బృందాశాపకథన మను నామధేయము *
కల నాల్గవసర్గ ముగిసెను.

---

✷ దశరథకైకేయులయొక్క పూర్వవృత్తాంతము. ✷

ఈప్రకారముగ బ్రాహ్మణుఁడు బహుకాల మాలోచించి యిట్లనియె. ఓకలహా! "శ్లో. విలయం యాంతిపాపాని తీర్థదానవ్రతాదిభిః" (తీర్థదాన వ్రతాదులచేత పాపములు నాశనమునుపొందుచున్నవి.) అను ప్రమాణానుసారముగ సకల పాపములును తీర్థదానవ్రతాదులచేత నాశమును పొందును. అయినను నీవు ప్రేతశరీరమునం దుండుటచేత నీకు ఆతీర్థదానవ్రతాదులయందు అధికారములేదు. నీకష్టమును చూచుటచేత నామనస్సు మిక్కిలిదుఃఖమును చెందుచున్నది. మఱియు నో కలహా! మిక్కిలి భయంకరమైన నీపాపమును పోఁగొట్టకపోతినేని నామనస్సు శాంతిని పొందదు. నీయొక్క పాతకమైతేనో మిక్కిలి భయంకరమైనదై మూఁ

మజన్మములదనుక బాధించునట్టిదియై యున్నది. కావున అల్పపుణ్యములచేత నీపాపము క్షీణించునట్లుండలేదు. అయినను నేను తగినవిధముచేత నీపాపమును పోఁగొట్టెదను వినుము. నేను పుట్టినది మొదలుకొని కార్తికవ్రతమును ఆచరించుచున్నాను. మఱియును అనేకములగు యజ్ఞదానతీర్థ వ్రతాదులను ఆచరించితిని. అయినను సకలపుణ్యములును కార్తికవ్రతమునకు సమానములయినవి కావు. కాఁబట్టి నాకార్తికవ్రతపుణ్యమునందలి సగముపుణ్యమును నీకు సమర్పించెదను. దానిచేత నీపాపము శాంతినిపొందునని ఆబ్రాహ్మణుఁడు చెప్పెనని ముద్గలమహాముని చెప్పి మఱల నిట్లనియె. ఓ దశరథమహారాజా! ఆధర్మదత్తుఁడు ఈప్రకారముగాఁ జెప్పి తులసీజలమును ద్వాదశాక్షరీమంత్రమును జపించుచు పిశాచరూపముతో నున్న కలహమీఁద ప్రోక్షించె. ఆయుదకమును ప్రోక్షించినవెంటనే, ఆకలహ ప్రేతత్వమును విడిచి ప్రజ్వలించుచున్న అగ్నిజ్వాలతో సమానమైనదేహము కలదయ్యె. మఱియును ఊర్వశివలె దివ్యరూపముకలదై ప్రకాశించుచుండె. అంతట నాకలహ దండమువలె భూమియందుఁబడి ఆబ్రాహ్మణునకు నమస్కరించి సంతోషముచేత గద్గదస్వరము కలదగుచు నిట్లనియె. ఓమహాత్మా! బ్రాహ్మణోత్తమా! నీఅనుగ్రహము వలన నేను పాపమునుండి విముక్తురాలనైతిని. మఱియు నోబ్రాహ్మణశ్రేష్ఠుఁడా! పాపసముద్రమునందు మునుఁగుచున్న నాకు నీవు ఓడవంటివాఁడవైతివని ఆకలహ చెప్పెనని ముద్గలమహాముని చెప్పి మఱల నిట్లనియె. ఓ దశరథమహారాజా! ఈప్రకారముగా నాకలహయను స్త్రీ చెప్పుచు ఆకాశమునుండి వచ్చుచున్న దివ్యవిమానమును చూచె. ఆవిమానమునందు విష్ణురూపముధరించి విష్ణుగణములు కూర్చుండియుండిరి. అంతట నావిమానమునందున్న వారు ఆకలహను విమానమునందుఁ గూర్చుండఁబెట్టిరి. పిమ్మట నాకలహ పుణ్యశీల సుశీల మొదలుగాఁగల వారిచేతను దేవవేశ్యలచేతను, సేవింపఁబడుచుండె. అప్పుడు ఆధర్మధత్తుఁడను బ్రాహ్మణుఁడు ఆవిమానమునుచూచి మిక్కిలి ఆశ్చర్యముకలవాఁడయ్యె. అట్లు ఆ ధర్మదత్తుఁడు ఆశ్చర్యముగలవాఁడై పుణ్యశీల సుశీల మొదలగు విష్ణుగణములకు భూమియందు దండమువలెఁబడి నమస్కరించె. అప్పుడు ఆపుణ్యశీల సుశీల మొదలగువారు భూమియందుఁబడియున్న ఆధర్మదత్తుని లేవఁదీసి ధర్మయుతముగ మాటలాడఁదలఁచి యిట్లనిరి. ఓమహాత్మా! బ్రాహ్మణోత్తమా! నీవు విష్ణుదేవునియందు ఆసక్తికలవాఁడవగుటచేత నీవు సర్వోత్తముఁడవైతివి. మఱియు నోబ్రాహ్మణోత్తమా! నీవు దీనులయందు దయకలవాఁడవును ధర్మమును తెలిసినవాఁడవును విష్ణుధర్మపరాయణుఁడవును నైతివి. ఓ బ్రాహ్మణోత్తమా! ధర్మదత్తుఁడా! నీవు బాల్యము మొదలుకొని చేసినకార్తికవ్రతమునందలి పుణ్యమునందు సగమును దానముచేసి రెండింతలు అధికమగు పుణ్యమును సంపాదించితివి. ఓబ్రాహ్మణోత్తమా! నీపుణ్యమునందలి అర్ధభాగముచేత ఈకలహ

యొక్క పూర్వకర్మమునందలి పాపమంతయును నశించినది. ఈ కలహాచేసిన పాపమంతయును నీస్నానముఫలముచేతనే పోయినది. హరిజాగరణాదిపుణ్యములచేత ఈ విమానమువచ్చినది. మఱియును నానావిధములయిన భోగములతోఁగూడిన వైకుంఠమునకు ఈకలహా మాచేఁగొనిపోఁబడును. ఓమహాత్మా! బ్రాహ్మణోత్తమా! దీపదానమువలనఁ గలిగినపుణ్యముచేత తేజోసంబంధమై దివ్యమైనరూపమును పొందెను. తులసీపూజనాదులచేతను పావనములయిన కార్తికవ్రతములచేతను, విష్ణుసాన్నిధ్యమును పొందెను. ఓబ్రాహ్మణోత్తమా! నీవుకూడ ఈజన్మముయొక్క అవసానకాలమునందు భార్యతోఁగూడ వైకుంఠలోకమునకుఁ బోయి విష్ణుసాన్నిధ్యమునందు విష్ణుసారూప్యమును పొందుదువు. మఱియు నోమహాత్మా! బ్రాహ్మణోత్తమా! నీవలె విష్ణుభక్తులగువారు ధన్యులును పుణ్యాత్ములును అగుదురు. మఱియు నట్టివారియొక్కజన్మము సఫలమగును. విష్ణుదేవుఁడు తన్ను ఆరాధించినవారలకు సకల శుభములను ఇచ్చును. తొల్లి ఔత్తానపాది విష్ణుదేవుని సేవించి ధ్రువస్థానమునందుఁ బ్రవేశించె. విష్ణుదేవునియొక్క నామస్వరూపమువలన సకలదేహులును సద్గతిని పొందుదురు. మఱియు నోబ్రాహ్మణోత్తమా! పూర్వము మొసలిచేత ఆక్రమింపఁబడిన గజేంద్రుఁడు విష్ణునామస్మరణచేత విముక్తుఁడై. విష్ణుసాన్నిధ్యమునుపొంది జయుఁడనుపేరుకల విష్ణుభటుఁ డయ్యె. శ్రీ మహావిష్ణువును చింతించుటవలన గజేంద్రునిపట్టుకొనిన మొసలి విజయుఁడను పేరుకల విష్ణుభటుఁడయ్యె. ఓబ్రాహ్మణోత్తమా! నీవువిష్ణుదేవుని ప్రార్థించుటవలన విష్ణుసాన్నిధ్యమును పొందఁగలవు. విష్ణులోకమును పొంది అనేకవేలుసంవత్సరము లుండగలవు. అంతటఁ గొన్నిదినములకు పుణ్యక్షయమగును. అప్పుడు భూలోకమునందు దశరథుఁ డనుపేరుతోఁ బుట్టుదువు. మఱియును ఆజన్మమునందు నీకు మూవురుభార్యలు కలిగియుందురు. ఇప్పుడు నీవు అర్ధపుణ్యమును దానముచేయుటచేత ఈకలహ నీకు భార్యయగును. మఱియు నోమహాత్మా! బ్రాహ్మణోత్తమా! విష్ణుదేవుఁడు నీకు పుత్త్రుఁడై పుట్టి దేవతలకార్యమును జక్కపెట్టును. మఱియును ఆపుత్త్రుఁడు శ్రీరాముఁ డను పేరు కలవాఁడై సకలరాక్షసులను సంహరించి రాజ్యపరిపాలనమును బహుకాలము చేయును. మఱియు నోబ్రాహ్మణోత్తమా! యజ్ఞదానతీర్థాదులు నీవు చేసినపుణ్యమునకు సమానములుగావు. ఇప్పుడు నీవుచేసిన పుణ్యములవలన ఇఁకమీఁదఁగూడ విష్ణుభక్తుఁడ వగుదువు. కావున దంభాహంకార మాత్సర్యములను వదలి సమదర్శనుఁడ వగుము. కార్తిక వైశాఖ చైత్ర మాఘమాసములయందు ప్రాతస్స్నానమునుచేసినపుణ్యము మితిలేనిది కనుక నీవు ఈనాలుగుమాసములయందును ప్రాతస్స్నానమును చేయుము. మఱియు నోబ్రాహ్మణోత్తమా! నీవు సర్వకాలములయందును ఏకాదశీవ్రతమును చేయుచు తులసీవనముచు పాలించుచుండుము. మఱియును గోబ్రాహ్మణులను సేవించుచుండుము. మఱియును వంకాయలు మొదలగు

దుష్టపదార్థములను భుజింపకుము. ఓబ్రాహ్మణోత్తమా! నీవుకూడ ఈదేహాంతమందు ప్రసిద్ధమగు విష్ణుపదమును పొందుదువు. అని యిట్లు ఆ పుణ్యశీల సుశీలకును జయవిజయులును చెప్పి కలహాతోఁగూడ విష్ణులోకమునకుఁ బోయిరి. అని ముద్గలమహాముని చెప్పి మరల యిట్లనియె. ఓదశరథమహారాజా! యీప్రకారముగా ఆవిష్ణుభక్తులు కలహాతోఁగూడ విష్ణులోకమునకుఁ బోయినపిమ్మట ధర్మదత్తుఁడుకూడ విష్ణుతత్పరుఁడై విష్ణువ్రతములను చేయుచు దేహాంతమందు భార్యతోఁగూడ విష్ణులోకమునకుఁ బోయె. అట్లు పోయి వైకుంఠలోకమునందు అనేకవేలుసంవత్సరములు నానావిధములగు సుఖములను అనుభవించె. పిమ్మట పుణ్యక్షయమగుటచేత యీప్రకారముగాఁ బుట్టితివి. ఓ మహారాజా! దశరథుఁడా! ఈజన్మమునందు నీకు ముగ్గురుభార్యలు కలిగిరి. విష్ణుదేవుఁడు నీకు ఈజన్మమునందు రాముఁడనుపేరుతో పుత్త్రుఁడయ్యె. ఆదిశేషువు లక్ష్మణుఁడయ్యె. శంఖచక్రములు భరతశత్రుఘ్నులైరి. ఓమహారాజా! ఈప్రకారముగా సర్వమును నీకుఁ దెలియఁ జెప్పితిని. సాక్షాత్ శ్రీమన్నారాయణుఁడు నీకుఁ బుత్త్రుఁడగుటచేత నీవు ధన్యుఁడవైతివని ముద్గలమహాముని చెప్పెనని పరమశివుఁడు పార్వతితో చెప్పి మరల పార్వతిని జూచి యిట్లనియె. ఓదేవీ! పార్వతీ! ఆముద్గలమహాముని ఈప్రకారముగాఁ జెప్పి ఆదశరథమహారాజును పూజించి రామలక్ష్మణులను కౌఁగిలించుకొని ధన్యుఁడనైతినని తలఁచె. అంతట దశరథమహారాజు తనసైన్యముతోఁగూడ మిక్కిలి సంతోషము కలవాఁడై గోపురాట్టాలకాదులచేత రమ్యమైన అయోధ్యాపట్టణమునకు పుత్త్రమిత్రకళత్రాదులతోఁగూడ దశరథమహారాజువచ్చుటను పట్టణములోనున్న మంత్రులు మొదలగువారందఱును విని పతాకాతోరణాదులచేతను,దివ్యచందనోదకములచేతను పట్టణమును సర్వమును అలంకరించిరి. పిమ్మట నృత్యగీతవాద్యాదులతోఁగూడ ఎదురుగాఁబోయి కుటుంబముతోఁగూడ దశరథమహారాజును దోడ్కొని పట్టణములోనికిఁ బోయిరి. ఆసమయమునందు స్త్రీలందఱును శ్రీరాముఁడువచ్చుటను విని బిడ్డలను కటిప్రదేశములయందుఁ బెట్టుకొని మేడలమీఁదికెక్కి సువర్ణపుష్పములచేత పుష్పవర్షమును కురిపించిరి. మఱికొందఱు స్త్రీలు మార్గమునందుండి కుంభదీపాదిమంగళములచేత హారతులెత్తి దశరథమహారాజుతోఁగూడ రామలక్ష్మణులు మొదలగువారల నందఱను పూజించిరి. మఱియును ఎల్లవారును రాజమార్గమునందు వేఱువేఱుగఁ బూజించిరి. ఈప్రకారముగా నానావిధములయిన యుత్సవములచేతను, వారస్త్రీలయొక్క నృత్యములచేతను, దుందుభిధ్వనులచేతను, గాయకులయొక్క గానములచేతను, గవాక్షములనుండి విడువఁబడిన పుష్పవర్షములచేతను పూజింపఁబడుచు దశరథమహారాజు తననగరునందుఁ బ్రవేశించె. ఆసమయమునందు అనేకులు వింజామరలనువీచుచుండిరి. అంతట దశరథమహారాజు తనతోఁగూడవచ్చిన జనకమహారాజుయొక్క మంత్రులను వస్త్రాలంకార వాహనములచే

తను, భోజనాదులచేతను సత్కరించి మిథిలాపట్టణమునకుఁ బంపె. ఈప్రకారముగా జనకచక్రవర్తి ప్రతిసంవత్సరమునందును శ్రీరాముఁడు మొదలగు వారలను తన నగరమునకు రప్పించి గౌరవించుచుండె. మఱియును, అంతకంతకు అధికముగ రాముని పూజించుచుండె. రాముఁడుకూడ విలాసములచేత జనకమహారాజునకు సంతోషమును కల్గించుచుండె. ఇట్లుండఁగా పదునొకండుసంవత్సరములును ఆఱుమాసములును అయినకాలమునందు సీతామహాదేవి పుష్పవతియయ్యె. ఆవృత్తాంతమును జనకచక్రవర్తి విని మిక్కిలి శీఘ్రముగ భార్యలు మంత్రులుమొదలగు వారితోఁగూడ అయోధ్యాపట్టణమునకు వచ్చె. అట్లు వచ్చినజనకుఁడు దశరథునిఁ జూచి పరస్పరాలింగనములను చేసికొనిరి. అంతట జనకచక్రవర్తి నృత్యవాద్య సముత్సాహములతోఁగూడ అయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించె. పిమ్మట దశరథమహారాజు అధికములయిన సముత్సాహములచేతను, నానామండపతోరణములచేతను, కదళీస్తంభమాలికలచేతను, చెఱకుగడలచేతను, వింజామరములచేతను, నాలుగుద్వారములు కలమండపములచేతను, ఘంటానాదములచేతను, అద్దములచేతను, చిఱుగంటలయొక్క ధ్వనులచేతను, చాందినీలచేతను, దీపపంక్తులచేతను నగరమును అలంకరింపఁజేసి వసిష్ఠమహాముని మునివరులతోడఁ గూడుకొనినవాఁడై సీతారాములకు గర్భాదానమహోత్సవమును చేయించె. ఆసమయమునందు జనకచక్రవర్తి భార్యలతోఁగూడుకొనినవాఁడై కోడండ్రుకొడుకులు మొదలగువారితోఁగూడుకొనిన దశరథమహారాజును వస్త్రాలంకారములు మొదలగువానిచేతఁ బూజించె. పిమ్మట జనకచక్రవర్తి నెలదినములు అక్కడనివసించి తరువాత తనపట్టణమగుమిథిలానగరమునకుఁబోయె. అంతట శ్రీరాముఁడు సువర్ణరత్నాదులచేత నిర్మింపఁబడిన గృహములయందు సీతామహాదేవితోఁగూడ మిక్కిలి సమృద్ధములయిన నానావిధ భోగములను అనుభవించె. మఱియును ఈప్రకారముగానే భరత లక్ష్మణ శత్రుఘ్నులకుఁగూడ యుక్తకాలములయందు గర్భాధానమహోత్సవములు జరిగె. ఆసమయములయందుఁగూడ జనకచక్రవర్తివచ్చి వారివారికిఁ జరుపఁదగిన సత్కారములను జరిపె. ఇట్లు దశరథమహారాజుయొక్కగృహమున శుభకార్యము లగుచున్నసమయమునందు అయోధ్యాపట్టణమునందలి ప్రతిగృహమునందును మంగళవాద్యఘోషమును మ్రోఁగుచుండె. మఱియును ఆపట్టణమునందు ఎక్కడను అమంగళకార్యములు జరుగవయ్యె. మఱియును, ఆకాలమున, అయోధ్యానగరమునందు దరిద్రుఁడును, ఋణవంతుఁడును, ఆధివ్యాధులచేత పీడింపఁబడువాఁడును లేకయుండె. అంతట రామ లక్ష్మణ భరత శత్రుఘ్నలు భార్యలతోఁగూడ వేఱువేఱు గృహములయందు గృహస్థధర్మములను ఆచరించుచుండిరి. మఱియును రాముఁడు ప్రాతఃకాలమునకు ముందుగ నిద్రనుండి లేచి శౌచాదిసత్క్రియలను ఆచరించి దివ్యమగు పాలకీయెక్కి సరయూనదిలో స్నానమును చేయుటకుఁ బోవును. అట్లుపోయి

యానదియొడ్డున పాలకీదిగి పావనమైన యాసరయూనదియొడ్డుననున్న యిసుకతిన్నెయందు మంత్రులతోఁగూడఁ బ్రవేశించి సరయూనదిలో స్నానమును చేయును. పిమ్మట బ్రాహ్మణులతోఁగూడ నిత్యకర్మానుష్ఠానమును నెఱవేర్చుకొని గో భూ దానాదులనుచేసి సరయూనదికిని బ్రాహ్మణులకును పూజలను చేయును. పిమ్మట బంగారముచేత నిర్మింపఁబడిన రథమునెక్కి బంగారపుతీఁగలచేతఁ గట్టఁబడినవియును, పీతాంబరములచేత నలంకరింపఁబడినవియును, అగు గుఱ్ఱములను స్నాతుండైన సారథితోఁలఁగా పట్టణములోనికి వచ్చును. ఆసమయమునందు చిఱుగంటలు మొదలగు వానిచేత నలంకరింపఁబడిన యారథముయొక్క ధ్వని మిక్కిలి మనోహరమైనదై యుండును. అట్టిసమయమునందు బంగారపుబెత్తములను చేతియందుఁ బట్టుకొనిన భటులు మార్గమును చూపుచుందురు. మఱియును అట్లు వచ్చునపుడు పట్టణములోని స్త్రీలందఱును ఆరామునకు హారతులెత్తి పుష్పవర్షమును గురిపింతురు. అంతట రాముఁడు రథమునుండి దిగి సూర్యప్రకాశముగల గృహమునందుఁ బ్రవేశించి పాదుకలనుధరించి సీతామహాదేవిచేత నీయఁబడిన పాద్యాచమనములను గ్రహించి అగ్నిహోత్రశాలయందుఁ బ్రవేశించి సీతతోఁగూడ ఆసనమునందుఁ గూర్చుండి అగ్నిహోత్రాదివిధిచేత అగ్నియందు హోమమును చేయును. పిమ్మట స్ఫాటికలింగమును లోకశిక్షణకొఱకు అభిషేకాదులచేత శాస్త్రోక్తప్రకారముగఁ బూజించి సీతామహాదేవిచేత సిద్ధముచేయఁబడిన పక్వాన్నాదికమును నివేదించును. పిమ్మట బ్రాహ్మణులను దానాదులచేత పూజించి సంతోషపఱచి ఆబ్రాహ్మణులయొక్క ఆశీర్వచనములను పొందును. పిమ్మట తులసిని, మహాధేనువును అశ్వత్థమును సూర్యదేవుని నమస్కరించి బ్రహ్మయజ్ఞమును చేయును. అంతట గురుముఖమువలన పుణ్యకరములయిన పురాణకథలను సీతామహాదేవితోఁగూడ విని గురుపూజను చేసి బంధువులతోడను బ్రాహ్మణులతోడను కూడుకొని సీతామహాదేవిచేత బ్రార్థింపఁబడి నారికేళ కపిత్థ ఖర్జూరాది ఫలములతోఁగూడ పక్వాన్నాదులను భుజించును. పిమ్మట తాంబూలమును గ్రహించి దివ్యవస్త్రములను ధరించి అద్దమునందు ముఖమును చూచుకొని సీతామహాదేవితోఁగూడ రథమునెక్కును. మఱియును మంత్రులు మొదలగువారినికూడ తనరథముమీఁద నెక్కించుకొని దివ్యవాద్యములు మ్రోఁగుచుండఁగా తల్లులుండు గృహమునకుఁ బోయి తల్లులకు ప్రదక్షిణనమస్కారములను చేయును. అట్లు చేసినపిమ్మట రాజగృహముచేరఁబోయి సింహాసనమునందున్న దశరథమహారాజునకు నమస్కారముచేసి ఆమహారాజుయొక్క ఆజ్ఞానుసారముగ పౌరకార్యములను నెఱవేర్చి రాజానుమతమును పొంది తూర్యగీతధ్వనులను వారస్త్రీలయొక్క నాట్యములను చూచి, ఆనందమును పొందుచు, మరల గృహమునకుఁ బోవును. అట్లుపోయి సీతామహాదేవిచేత నియ్యఁబడిన అర్ఘ్యపాద్యాదులను గ్రహించి నృత్యగీతాదులచేత

సీతామహాదేవికిఁగూడ సంతోషమును కల్గించును. మధ్యాహ్నసమయమునందు సరయూనదియందైనను గృహమునందైనను స్నానమునుచేసి మాధ్యాహ్నికకర్మము నెరవేర్చును.అని యిట్లు పరమేశ్వరుఁడు పార్వతీదేవితో చెప్పి మగల యిట్లనియె.ఓదేవీ! పార్వతీ! ఆరాముఁడు దినదినమును సరయూనదియందు ఎక్కడ స్నానమును చేయునో ఆచోటునకు రామతీర్థమని పేరుకలిగె. ఆరామతీర్థప్రభావమును ముల్లోకములవారును ఎఱుఁగుదురు. ఓపార్వతీ! చైత్రమాసమునందు ఆరామతీర్థము విశేషముగఁబూజలు ఇప్పటికిని జరుగుచుండును. అట్లు శ్రీరాముఁడు మాధ్యాహ్నికక్రియల నన్నిటిని నెరవేర్చికొని మంత్రిసామంతాదులతోఁగూడ నానావిధములైన ఆభరణధ్వనులచేత మనోహరురాలైన సీతామహాదేవిచేత బంగారుపాత్రములయందు వడ్డింపఁబడినపదార్థములను భుజించును. పిమ్మటఁ జేతులుకడిగికొని తాంబూలమును వేసికొని నూరడుగులునడిచి విశ్రమించును. అంతఁ గొంతసేపటికి లేచి దివ్యవస్త్రములనుధరించి ధనుర్బాణములను శస్త్రాస్త్రములతుగైకొని బంధువులతోఁగూడ రథమునెక్కి పుష్పారామోద్యానవనాదులను వినోదముగాఁ జూడఁబోవును. అట్లుపోయి వినోదస్థానముల నన్నిటినిచూచి మరల మంగళవాద్యఘోషాదులతోఁగూడ గృహమునకుఁబోయి సాయంసంధ్యావందనాదికమునుచేసి మఱల హోమకార్యములను నెరవేర్చును. పిమ్మట శివలింగమును పూజించి నైవేద్యాదులను సమర్పించును. అట్లుసమర్పించినతరువాత భోజనాదికృత్యములను నెరవేర్చి రత్నకాంచనమాణిక్యాదులచేత నిర్మింపఁబడిన శయ్యయందు సీతామహాదేవితోఁగూడ పరుండి హాస్యగీత వినోదములను చూచుచు నిద్రించును. ఈప్రకారముగా శ్రీరాముఁడు సీతతోఁగూడ పదిరెండుసంవత్సరములకాలము జరపె. ఇటులనే భరత లక్ష్మణ శత్రుఘ్నులుకూడ కాలమును గడపిరి. ఇట్లుండఁగా నొకనాఁడు దశరథమహారాజు వసిష్ఠముద్గలులవలన శ్రీరాముని సాక్షాన్నారాయణునిగాఁ దెలిసికొనినసంగతి తలంపునకువచ్చె.అట్లు తలంపునకువచ్చి, అత్యద్భుతములయిన చేష్టలుగల శ్రీరాముని సాక్షాన్నారాయణునిగాఁ దలఁచె. అంతట నొక్కనాఁడు శ్రీరాముని ఏకాంతస్థలమునకుఁ బిలిచి మిక్కిలి వినయమును అవలంబించి మనస్సునందు శ్రేష్ఠమైనతలంపుకలవాఁడై యిట్లనియె. ఓ రాముఁడా! నీవు సాక్షాత్ శ్రీమన్నారాయణుఁడవనియును, భూభారమును హరించుటకు అవతరించితివనియును తెలిసికొంటిని. అవివేకబుద్ధికలలోకులుమాత్రము నిన్ను నాపుత్త్రునిగాఁ దలఁచుచున్నారు. ఓ రాముఁడా! నేను అజ్ఞానముచేత మోహితుఁడనై యుంటిని. ఓరామా! నీవు సాక్షాన్నారాయణుఁడవు కనుక నాకు జ్ఞానమును ఉపదేశించి నా అవివేకమును పోఁగొట్టుము. భార్యాపుత్త్రాదులయందు సక్తమై దుఃఖమును పొందుచున్న మనస్సునకు, జ్ఞానోపదేశములేక, శాంతి కలుగదనిచెప్పిన శ్రీరాముఁడు విని యిట్లనియె. ఓతండ్రీ! దశరథమహారాజా! జ్ఞానోపదేశమును చేసెదను వినుము. నీకుఁ బ్రియురాలును, నాకు తల్లియును అగు కౌసల్యాదేవినికూడ

రప్పింపుము. ఆ పూజ్యురాలుకూడ వినును. అనిచెప్పి కౌసల్యాదేవిని రప్పించి యిట్లనియె. ఓ మహారాజా ! ఈదృశ్యప్రపంచమంతయును మాయవలనఁ గలిగినదగుటచేత నశించునట్టిదియై యున్నది. ఓతండ్రీ! దశరథమహారాజా ! ముత్యపుచిప్పయందు వెండియనుతలంపును,కాచభూమియందు ఉదకబుద్ధియును త్రాడునందు సర్పబుద్ధియును,ఎండమావులయందు ఉదకభ్రాంతియును కలిగినవిధముగ ఆత్మయందు జగద్భ్రాంతికలుగుచున్నది.అవివేకుల కెట్టిసంకల్పము కలుగుచున్నదికాని వివేకు లగువారికిఁ గలుగనేరదు. ఆత్మ శుద్ధుఁడును, కపటరహితుఁడును, సచ్చిదానందలక్షణములు కలవాఁడును, అయియున్నాఁడు. పరబ్రహ్మముయొక్క యంశముచేత బ్రహ్మాదిదేవతలును మనమును పుట్టితిమి. ఓ మహారాజా ! తండ్రీ! ఆపరమపురుషుఁడు జగదుత్పత్తిస్థితిలయములకొఱకు తనమాయచేత నటునివలె నానావేషములను ధరించును. మఱియును, పద్మము ఉదకమును స్పృశింపనివిధముగ నిర్మలుఁడును, నిత్యుఁడును, పరమానందవిగ్రహుఁడును అయిన పరమాత్మ మాయనుస్పృశించుటలేదు. దేహపుత్త్రమిత్రకళత్రాదులయందు, నాది, అనియెడు బుద్ధినివిడిచిపెట్టి, చిద్ఘనుఁడగు బ్రహ్మమందు మనస్సునుంచి యీదృశ్యప్రపంచమంతయును నారాయణస్వరూపమని తెలఁపవలయును. మఱియును నీవు సర్వమును బ్రహ్మమనియెడు నిశ్చయమైన అభిప్రాయముకలవాఁడవైన యెడల సంసారసాగరమునుండి ముక్తుఁడవగుదువు. మఱియును, ఓమహారాజా ! తండ్రీ! సత్యము, శౌచము, దయ, శాంతి, ఓర్పు, ఇంద్రియనిగ్రహము, అహింస, భగవద్భక్తి, వేదమార్గమును అనుసరించిపోవుట అనునట్టి సద్గుణములను అవలంబింపుము. మఱియును, చౌర్యము, ద్యూతము, వివాదము, మాత్సర్యము, దంభము, క్రౌర్యము, లోభము, భయము, క్రోధము, నింద్యకర్మము, వేదబ్రాహ్మణ యతినింద, పిశునత్వము అనునట్టిదుర్గుణములను దూరముగ విడిచిపెట్టుము. ఓమహారాజా ! తండ్రీ! నీవు పూర్వజన్మమునందు ఘోరమైన తపస్సుచేసి నన్నుఁ బుత్త్రునిగాఁ గోరితివి. కావున నేను నీవలన కౌసల్యయందు పుత్త్రుఁడనై పుట్టితిని. ఇప్పుడు నేను చెప్పినవిషయమంతయును పాపనాశకమైనది. దీనిని రహస్యముగ దాచిపెట్టుము. పరులకుఁ దెలియనీయకు మని రాముఁడు చెప్పినమాటలను విని దశరథమహారాజు మాయామల రహితుఁడయ్యె. అంతట సద్భావముచేత పరిపూర్ణమయిన వాఁడును, రోమాంచితమైన శరీరముకలవాఁడును నై దృఢమైన అభిప్రాయముతో శ్రీరామునిపాదములకు నమస్కరించె. అట్లునమస్కారము చేసిన నిర్మలాభిప్రాయముకల దశరథమహారాజుతో శ్రీరాముం డిట్లనియె. ఓమహారాజా ! తండ్రీ ! బాలుఁడనైననాకు నమస్కారమునుచేయుట ఉచితముకాదు. నీవు ఈప్రకారముగాచేసితివేని, నేను నరవేషమును అవలంబించియుండుటచేత పరిహసించినట్లగును. కావున నోమహారాజా ! తండ్రీ ! నన్ను మనస్సుచేతనే సేవించుచుండుము. మఱియును, నాయందు చిత్తముకలవాఁడవును నాయందే యుంచఁబడిన

ప్రాణములుకలవాఁడవును, నాయందు దృఢమైన భక్తికలవాఁడవును అగుము. అని చెప్పి తల్లిదండ్రు లగుకౌసల్యాదశరథులకు నమస్కరించి వారి యాజ్ఞనుపొంది రథారూఢుఁడై తనయొక్కగృహమునకుఁబోయె. అనియిట్లు పరమేశ్వరుఁడు పార్వతీదేవిని జూచిచెప్పి మఱియునిట్లనియె. ఓదేవీ ! రాముఁడు ఒకనాఁడు సీతతోఁగూడఁబోయి తల్లిగృహమునందు భుజించును. ఒకానొకనాఁడు సీతతోఁగూడ తమ్ములగృహమునందు భుజించును. ఒకానొకనాఁడు తండ్రిగృహమునందు భుజించును. మఱియు నొకనాఁడు దశరథమహారాజును పుత్త్రమిత్రకళత్రాదులతోఁగూడఁబిలిచి తనగృహమునందు భుజింపఁజేయును. ఇట్లుండఁగా తపోనిష్ఠులైన మహాత్ములగు మహాముని లందఱును శ్రీరాముని దర్శనముకొఱకు అయోధ్యాపట్టణమునకు వచ్చి అనేకవేల పర్యాయములు రాముని దర్శించి రామునివలన అతిథిపూజలను గైకొందురు. పిమ్మట, ఆశేషదినములు నివసించి పుణ్యకథలచేత రమానాథుఁడగు రాముని సంతోషపఱతురు. మఱియును ఆకాలమునందు రామునకు హాస్యక్రీడాభోజనాదులలో దేనియందుఁ బ్రియముకలదో తెలిసికొని రామునకు సంతోషము కలుగుటకొఱకు అన్యోన్యకార్యములను చేయుచుందురు. కృతయుగమునందలి వేయిసంవత్సరములు ఒక్కసంవత్సరమునకు సమమైయుండును. త్రేతాయుగమునందలి అనేకనూరుల సంవత్సరములు ఒకసంవత్సరమునకు సమమైయుండును. ద్వాపరయుగమునందు పది సంవత్సరములు ఒక్క సంవత్సరమునకు సమానమైయుండును. కలియుగమునందు నారాయణసాన్నిధ్యము లేకపోవుట శూన్యసంవత్సరమై యుండును. ఈప్రకారముగా శ్రీరాముఁడు దేవభోగములవంటి భోగములను అనుభవించె. మఱియును ప్రతికాలమునందును అన్నిఋతువులయందును కలుగునట్టి పుష్పాదులు రామునకు లభ్యములై యుండె. మఱియును భూలోకమునందెక్కడను అనావృష్టిభయమును దొంగలభయమును లేకయుండె. మఱియును పెద్దపులి మొదలగు ఘాతుకజంతువులవలని భయము యెక్కడను లేకయుండె. ఇట్లుండఁగా నొక్కనాఁడు కైకేయికి సహోదరుండైన యుధాజిత్తనువాఁడు భరతశత్రుఘ్నులను తననగరమునకుఁ బిలుచుకొని పోయె. ఈప్రకారముగా శ్రీరామునిచరిత్రము బాల్యమునందుఁగూడ సుఖకరమైయుండె. ఓపార్వతీ ! ఈశ్రీరాముని బాలచరిత్రమును వినువారికి అమంగళము లెన్నటికిని కలుగవు. ఓదేవీ ! పార్వతీ ! నీవు అడిగినవిధముగ రాముని బాల్యచేష్టలన న్నిటిని చెప్పితిని. ఈరామునిచరిత్రము సర్వకాలములయందును సుఖమును కలుగఁజేయును.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానంద రామాయణమున
సారకాండమునందు దశరథకైకేయులయొక్క పూర్వవృత్తాంత
మను నామధేయముకల అయిదవసర్గ ముగిసెను.

## ✱ శ్రీరామారణ్యవాసవర్ణనము. ✱

ఇట్లు శ్రీరాముఁడు సీతామహాదేవితోఁగూడ పదిరెండుసంవత్సరములు సుఖములను అనుభవించిన పిమ్మట, ఒకనాఁడు ఆకాశమార్గముచేత నారదమహాముని వచ్చె. అంతట శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ ఆనారదమహామునికి నమస్కరించి షోడశోపచారపూజలను చేసి పిమ్మట నారదమహాముని దేవతలచేతఁ జెప్పిపంపఁబడిన వృత్తాంతమును చెప్పఁదలఁచి యిట్లనియె. ఓ మహాత్మా! రాముఁడా! ముందుగ యుద్ధమునందు రావణుని వధించి పిమ్మట రాజ్యమును చేయుమని చెప్పె. ఆవృత్తాంతమును శ్రీరాముఁడు విని అంగీకారమును పొందిన పిమ్మట నారదమహాముని యథేచ్ఛముగఁ బోయె. అంతట శ్రీరాముఁడు సీతామహాదేవితో నిట్లనియె. ఓ ప్రాణేశ్వరీ! సీతా! నాతండ్రియగు దశరథమహారాజు నాకు పట్టాభిషేకమును చేయదలఁచియున్నాఁడు. నేను ఆకార్యమునకు విఘ్నమును చేసి రావణాసురుఁడు మొదలగు రాక్షసులను వధించుటకు లక్ష్మణునితోఁగూడ దండకారణ్యమునకుఁ బోయెదను. కావున నోసీతా! నీవు అయోధ్యాపట్టణమునందుండి కౌసల్యాదశరథులను సేవించుచుండుమని శ్రీరాముఁడు చెప్పె. ఆమాటలను సీతాదేవి విని రామునకు నమస్కరించి యిట్లనియె. ఓమహారాజా! హృదయేశ్వరా! నన్నుఁగూడ అరణ్యమునకుఁ దీసికొని పొమ్ము. నన్నుఁ దీసికొనిపోవుటకొఱకు మూఁడుకారణములు కలవు. వానిని జెప్పెదను. వినుము. కొందఱుబ్రాహ్మణులు బాల్యమునందు నాహస్తమునందుండు రేఖలను చూచిరి. ఆబ్రాహ్మణులలో సత్యవంతుఁడగు నొకబ్రాహ్మణుఁడు నన్నుచూచి, ఓసీతా! నీవు భర్తతోఁ గూడ అరణ్యమునకుఁ బోదువని చెప్పె. కావున నన్నుఁగూడ అరణ్యమునకుఁ దీసికొనిపోవుటకు అంగీకరింపుము. మఱియు, మహారాజా! ప్రాణేశ్వరా! స్వయంవరకాలమునందు రాముఁడు నాకు భర్తయయ్యెనేని దండకారణ్యమునందు పదునాలుగుసంవత్సరములు మునివృత్తితో నుండెద నని దేవతలను ప్రార్థించితిని. ఈహేతువుచేతఁగూడ నేను అరణ్యమునకు రావలసియేయున్నది. మఱియు, మహారాజా! ప్రాణనాథా! పూర్వము నేను రామాయణ మనుగ్రంథమును వినియుంటిని. దానియందు రాముఁడు సీతను వదలి దండకారణ్యమునకుఁ బోయినట్లు చెప్పియుండలేదు. ఆహేతువుచేతఁగూడ నీవు నన్ను దండకారణ్యమునకుఁ దీసికొని పోవలసియున్నదని చెప్పె. ఈప్రకారముగ సీతామహాదేవి చెప్పినమాటలను శ్రీమంతుఁడగు రాముఁడు విని అంగీకారమును పొంది నవ్వుచు సీతామహాదేవిని కౌఁగిలించుకొనియె. పిమ్మట ఒకనాఁడు దశరథమహారాజు శ్రీరామునకు పట్టాభిషేకముచేసి యౌవరాజ్యస్థానమునందుంచఁ దలఁచి గురువగు వసిష్ఠునితో నిట్లనియె. ఓ మునిశ్రేష్ఠుఁడా! శ్రీరామునకు పట్టాభిషేకమును చేసి యౌవరాజ్యపదమునం దుంచుమని చెప్పె. ఆమాటలను వసిష్ఠమహాముని విని, దశరథమహారాజును, కౌసల్యాగృహమునకుఁ దీసికొనిపోయి యేకాంతముగ

నిట్లనియె. ఓమహారాజా! కౌసల్యాసుమిత్రలతోఁగూడ నేను చెప్పఁబోవుమాటలను వినుము. రావణుని సంహరించుటకు శ్రీరాముఁడు రేపటిదినము దండకారణ్యమునకుఁ బోవును. కైకేయికి నీవు యిచ్చిన వరమును నెరవేర్చుటకుఁ బోవుచు సీతాలక్ష్మణులనుగూడ వెంటఁబెట్టుకొని పోవును. కావున నోమహారాజా! దశరథుఁడా! ఏమియును తెలియనివానివలె సుమంత్రుని పిలిచి పట్టాభిషేక మహోత్సవమునకు కావలసినవస్తువులను సిద్ధముచేసి రాజులు మొదలగువారల నందఱను రప్పింపుము. మఱియు నోమహారాజా! దశరథుఁడా! బ్రాహ్మణశాపానుసారముగ శ్రీరామునివిరహమువలన మిక్కిలి శీఘ్రముగ నీవు స్వర్గలోకమునకుఁ బోదువు. శ్రీరాముఁడు దండకారణ్యమునుండి వచ్చిన పిమ్మట పట్టాభిషిక్తుఁడగును. అప్పుడు శ్రీరాముని పట్టాభిషేకమహోత్సవమును ఈకౌసల్యాదేవి చూడఁగలదు. నీవు ఆకాశమునందు విమానమునందుండి చూడఁగలవు. ఓమహారాజా! దశరథుఁడా! బ్రహ్మమొదలగుదేవతలు చేసినయేర్పాటును తప్పించుటయందు నెవ్వరికిని శక్యముగాదని వసిష్ఠమహాముని చెప్పినమాటలను దశరథుఁడు విని యావసిష్ఠమహామునితోఁ గూడ సభలోనికిఁ బోయి శ్రీరామునిపట్టాభిషేకమునకు తగినసామగ్రులను సంతోషముతో సంపాదించుటకు యత్నించె. అంతట దశరథమహారాజు దూతలనుబంపి అనేకరాజులను రప్పించె. మఱియును ఆసమయమునందు అనేకాశ్రమములయందున్న ఋషీశ్వరు లందఱును వచ్చిరి. మఱియు నానావిధములగు విచిత్రములైన తోరణములచేత పట్టణమును అలంకరించిరి. అంతట వసిష్ఠమహాముని సుమంత్రునితో నిట్లనియె. ఓసుమంత్రుఁడా! రేపటిప్రాతఃకాలమునందు సువర్ణముచేత నలంకరింపఁబడిన పదునాఱుమంది కన్యకలు మధ్యతొట్టికట్టునందు ఉండునట్లుచేయుము. మఱియును సువర్ణరత్నాభరణాదులచేత నలంకరింపఁబడిన పదునాఱు ఏనుఁగులుకూడ వచ్చియుండునట్లు చేయుము. మఱియును, ఐరావతకులమునందుఁ బుట్టిన చతుర్దంతములుకల యేనుఁగునుకూడ రప్పింపుము. మఱియును, అనేకవేలుకలశములతో నానాతీర్థములనుండి ఉదకమును తెప్పింపుము. మఱియును మూఁడు పెద్దపులిచర్మములను, శ్వేతచ్ఛత్రమును, ముక్తామణులతోఁగూడిన రత్నదండమును సిద్ధపరుపుము. మఱియు, నోసుమంత్రుఁడా! దివ్యములగు వస్త్రమాల్యాభరణాదులను తెప్పింపుము. మునులందఱును దర్భలను చేతులయందుఁ బట్టుకొని సిద్ధముగ నుండునట్లు ప్రార్థింపుము. మఱియు నోసుమంత్రుఁడా! నాట్యమునందు సామర్థ్యముకల వేశ్యాస్త్రీలును, గాయకులును, వైణికులును, నానావిధములయిన వాద్యములయందు నిపుణులు మొదలగువారలను, మధ్యతొట్టికట్టునందు తమతమకృత్యములను నెరవేర్చునట్లు చేయుము. మఱియును చతురంగబలములను నగరబాహ్యమునందు సన్నద్ధులై యుండునట్లు చేయుము. మఱియు నోసుమంత్రుఁడా! అయోధ్యాపట్టణమునందలి సకలదేవాలయములయందును చక్కఁగఁ

పూజలు జరుగునట్లు చేయుము. మఱియును రాజులందఱును నానావిధములగు కానుకలు తెచ్చునట్లు చేయుమని చెప్పె. అట్లుచెప్పి వసిష్ఠమహాముని రథారూఢుఁడై శ్రీరామునియొద్దకుఁబోయి, యావృత్తాంతమును సర్వమును తెలియఁజేసి యిట్లనియె. ఓమహాత్మా! శ్రీరాముఁడా! నిమిత్తమాత్రముగ నీవు రేపటిదినము దండకారణ్యమునకుఁ బోయి, అక్కడ పదునాలుగు సంవత్సరములు నివసించి రావణుని సంహరించి మరల సీతాలక్ష్మణులతోఁగూడ వచ్చి చిరకాలము రాజ్యమును చేయుము. ఓదశరథరాజనందనా! రామచంద్రా! లోకవ్యాపారమును అవలంబించి పితృవాక్యమును పరిపాలింపుము. ఓరాముఁడా! నేఁటిదినము నీవు సీతామహాదేవితోఁగూడ ఉపవాసమును చేసి జితేంద్రియుఁడవై భూమియందు శయనింపుమని వసిష్ఠమహాముని చెప్పి మరల రథమునెక్కి సీతారామలక్ష్మణుల యనుమతమును పొంది దశరథమహారాజునొద్దకుఁ బోయె. అట్లు పోయి కౌసల్యాసుమిత్రలు వినుచుండగా శ్రీరామపట్టాభిషేకవృత్తాంతమును సర్వమును జెప్పె. ఆయబద్ధపుమాటలను కౌసల్యాసుమిత్రలు విని నిజమనుకొని సంతోషమును పొందిరి. అంతట కౌసల్యాసుమిత్రలు విఘ్నశాంతికొఱకు బ్రాహ్మణులచేత శాంతిపాఠములనుచేయించి దేవతాపూజలను చేయించిరి. అంతట మధ్యాహ్నకాలమునందు రాజగృహముయొక్క మేడయందు నివసించియున్నదియును, దాసీపుత్రికయును అయిన మంథర యనునది పట్టణమంతయును అలంకరించియుండుటను చూచి, ఒకముసలిదానిని యిదియేమి అని యడిగె. ఆముసలిది రేపు రామునకు పట్టాభిషేకము జరుగు నని చెప్పె. ఆమాటలను మంథర విని యధికదుఃఖము కలదై అతిశీఘ్రముగ కైకేయీగృహమునకుఁ బోయె. అట్లు పోయి కైకేయిని జూచి ఓకైకేయీ! రేపటిదినమున శ్రీరామునకు పట్టాభిషేకమహోత్సవము జరుగునని చెప్పె. ఆమాటలను కైకేయి విని మిక్కిలి సంతోషము కలదై శుభవృత్తాంతమును చెప్పిన యామంథరకు తాను వేసికొనియుండు దివ్యభూషణములను ఇచ్చె. ఆసమయమునందు దేవాజ్ఞానుసారముగ మోహితురాలైయా మంథర సంతోషముతోనున్న ఆకైకేయిని జూచి యిట్లనియె. ఓసీ! మూఢురాలా! కైకేయీ! శ్రీరామునకు పట్టాభిషేకము అగునని విని సంతోషమును పొందుచున్నావేమి? అయ్యయ్యో! నీభాగ్యమంతయును నశించిపోయినదని నేను తలఁచుచున్నాను. నీవు బాగుగానుండినకదా మాకందఱికి క్షేమము. ఓసీ పిచ్చిదానా! కైకేయీ! రామునకు రాజ్యము నిచ్చినపిమ్మట నీవు కౌసల్యకు దాసివి కావలసివచ్చును. కాఁబట్టి నామాటను వినుము. పూర్వము దశరథమహారాజు నీవుకోరినపుడు రెండువరముల నిచ్చెదనని చెప్పియుండెను కదా? ఇప్పుడు ఆరెండువరములను కోరుము. మఱియును భరతునకు పట్టణమును కట్టుట ఒకవర మనియును, రాముఁడు పదునాలుగుసంవత్సరములు మునివృత్తితో నరణ్యమునందుండుట మఱియొ

కవరమనియును చెప్పుము. నీవు ఇప్పుడు క్రోధాగారమునందు (కోపము వచ్చినపుడుండఁ దగినయింటియందు)ఉండుము.నామాటప్రకారముగఁ బ్రవర్తింపుము.అని చెప్పిన కైకేయి విని మాయామోహితురాలై అటులనే చేసెదనని చెప్పె. అంతట కైకేయి క్రోధాగారమునందుఁ బ్రవేశించె. అట్లు కైకేయి క్రోధాగారమునందుఁ బ్రవేశించిన వృత్తాంతమును దశరథమహారాజు ఆనాఁటిరాత్రి విని మిక్కిలి శీఘ్రముగఁబోయి కైకేయిని చూచె. ఆసమయమునందు కైకేయి వీడిపోయినకొప్పుకలదియును, ఆభరణాదులు లేనిదియును భూమియందు శయనించినదియును నై యుండె. అంతట దశరథమహారాజు కైకేయియొక్క మనోగతాభిప్రాయమును తెలిసికొని యీకైకేయి భరతునకు పట్టాభిషేకముకావలె ననియును, రాముఁడు అరణ్యమునకుఁ బోవలెననియును కోరుచున్నదని యెంచి, అయ్యయ్యో ! ఇట్టిక్రూరమైన అభిప్రాయము కలుగవచ్చునా యనిచెప్పి మూర్ఛనుపొందె. అంతఁ గొంతసేపటికి తెల్లవారె. ఆవృత్తాంతమును సుమంత్రుఁడు విని దశరథమహారాజునొద్దకుఁ బోయె. ఆసమయమునందు కైకేయి సుమంత్రుని జూచి యిట్లనియె. ఓ సుమంత్రుఁడా ! దశరథమహారాజు శ్రీరాముని చూడఁదలఁచియున్నాఁడు. కావున శ్రీరాముని ఇక్కడకుఁ బిలిచికొని రమ్మనిచెప్పిన సుమంత్రుఁడు విని రాజాజ్ఞలేకుండ పిలుచుకొని రానని చెప్పె. అంతట దశరథమహారాజు మెల్లగ కన్నులుతెరచి చూచి సుమంత్రుఁడా ! శ్రీరాముని శీఘ్రముగఁ దీసికొనిరమ్మని మెల్లఁగాఁజెప్పె. పిమ్మట సుమంత్రుఁడు బయలువెడలిపోయి రాజాజ్ఞానుసారముగ శ్రీరాముని దీసికొని వచ్చె. అప్పుడు శ్రీరాముని కైకేయి చూచి యిట్లనియె. ఓరాజపుత్త్రుఁడా ! రామా ! పూర్వము మీతండ్రియగు దశరథుఁడు నిన్ను దండకారణ్యమునకుఁ బంపెదనని నాకు వరమిచ్చె నని చెప్పిన రాముఁడు విని మంచిదని చెప్పి యిట్లనియె. ఓతల్లీ ! కైకేయీ ! నీవు విచారమును పొందకుము. ఓదశరథమహారాజా ! నీవుకూడ విచారమును పొందకుము. నేను దండకారణ్యమునకుఁ బోయెద నని చెప్పె. అట్లు శ్రీరాముఁడు చెప్పినమాటలను దశరథమహారాజు విని అయ్యయ్యో! పుత్త్రుఁడా ! యనుచు దుఃఖించి యిట్లనియె. ఓవత్సా ! రామచంద్రా ! నన్ను వదలి అరణ్యమునకుఁబోవ నెట్లు నిశ్చయించితివి ? నన్ను వదలి పోఁదగునా ? యని చెప్పి వ్యసనపడుచున్న తండ్రినిఓదార్చి శ్రీరాముఁడు యిట్లనియె. ఓతండ్రీ ! దశరథమహారాజా ! నేను ప్రతిజ్ఞను నెరవేర్చి శీఘ్రముగ వచ్చెదను. నేను బయలువెడలిపోవుటచేత మాతల్లియగు కైకేయియొక్క అభిప్రాయము నెరవేరును. ఓతండ్రీ ! నేను బయలువెడలిపోయి మాతల్లియగు కౌసల్యను ఓదార్చి సీతను సమాధానపఱచివచ్చి నీయొక్కపాదములకు నమస్కరించి అరణ్యమునకుఁ బోయెద ననిచెప్పి కైకేయీదశరథులకు నమస్కారముచేసి తల్లి యగుకౌసల్యను చూచుటకు బయలు వెడలిపోయె. అట్లు శ్రీరాముఁడు పోయి తల్లియగు కౌసల్యకు నమస్కారమును చేసి

తల్లియగు కౌసల్యను అనేకవిధముల నూరార్లు ప్రదక్షిణనమస్కారములను చేసి తల్లియనుమతిని పొంది తనయొక్క గృహమునకుఁ బోయె. అట్లు పోయి సీతాలక్ష్మణులను జూచి జరిగినవృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. అంతట సీతాలక్ష్మణులు కూడ వనమునకు వచ్చెదమని అనేకవిధముల నిర్బంధించుటచేత వారుకూడ వచ్చుటకు శ్రీరాముఁడు అంగీకరించె. అట్లు శ్రీరాముఁడు అంగీకరించి శీఘ్రముగఁ బయనమును చేయుఁడని చెప్పె. అట్లు చెప్పి తనద్రవ్యమును సర్వమును బ్రాహ్మణులకు ఇచ్చి అగ్నిహోత్రములతోఁ గూడుకొనినవాఁడై సీతాలక్ష్మణులతోఁగూడ పాదములచేతనే నడచుచు మెల్లగ మరల దశరథమహారాజునొద్దకుఁ బోయె. అట్లు సీతాలక్ష్మణులతోఁగూడ నడచిపోవుచున్న రామునిఁ జూచి పురజనులందఱును ఒకరివలన నొకరు ఆవృత్తాంతమును సర్వమును విని వ్యాకులమైన మనస్సు కలవారైరి. ఆసమయమునందు వామదేవుఁడు మిక్కిలి ఆదరముకలవాఁడై పురజనులతో నిట్లనియె. ఓజనులారా! రామునివనవాసమునుగుఱించి మీరు వ్యసనమును పొందకుఁడు. శ్రీరాముఁడు సాక్షాన్నారాయణుఁడు. రావణవధార్థముగ భూలోకమున అవతరించె. నిన్నటిదినము నారదమహాముని వచ్చి ఓరాముఁడా! రావణాసురుని వధించుటకుఁ బ్రయాణమైపోక యింటనుండుట తగునా? అని చెప్పె. అంతట శ్రీరాముఁడు వనమునకుఁ బోయి రావణుఁడు మొదలగు రాక్షసులను వధించెదనని చెప్పి నారదమునివరుని బంపె. అందువలన శ్రీరాముఁడు ఇప్పుడు అరణ్యమునకుఁ బోయెదనని చెప్పెననిన పురజనులందఱును విని దుఃఖమును విడిచిపెట్టిరి. అంతట రాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ దశరథునివద్దకుఁ బోయి నమస్కరించి కైకేయితో నిట్లనియె. ఓతల్లీ! కైకేయీ! అరణ్యమునకుఁ బోఁదలఁచివచ్చితిని. అరణ్యమునకుఁ బోవుటకు అనుజ్ఞ నిమ్మని అడిగె. అంతట కైకేయి సీతారామలక్ష్మణులకు వల్కలముల నిచ్చె. అప్పుడు రాముఁడు ఆవస్త్రములను ధరించి సీతామహాదేవినిచూచె. ఆసమయమునందు దశరథమహారాజు వల్కలములను ధరించినరామునిఁ జూచి కైకేయితో నిట్లనియె. ఓసీ! పాపాత్మురాలా! అరణ్యమునకుఁ బోవుటకు రామునికి వల్కలముల నిచ్చితివికదా! సీతకుఁగూడ నారచీరల నీయఁదలఁచితివా యని క్రోధోద్దీపితుఁడై చెప్పుచు సీతామహాదేవికి దివ్యవస్త్రములనిచ్చె. అట్లుయిచ్చి దశరథుఁడు సుమంత్రుని జూచి, సుమంత్రుఁడా! రథమును దీసికొనిరమ్ము. ఈరాముఁడు రథము నెక్కిపోవుననిన సుమంత్రుఁడు విని రథమును దోడ్కొని వచ్చె. అంతట శ్రీరాముఁడు కైకేయీదశరథులకు నమస్కరించి సీతాలక్ష్మణులతోఁగూడ నెక్కె. అంతట సుమంత్రుఁడు ఆరథమును తోలె. అప్పుడు శ్రీరాముఁడు దశరథకౌసల్యాసుమిత్రలను పురజనులను ఊరార్చి బయలువెడలె. ఆదినము మాఘశుద్ధపూర్ణిమ యయ్యె. అప్పటికి కొంచెమెచ్చుతక్కువగా శ్రీరామునకు పదునెనిమిది సంవత్సరముల వయస్సుగతించె. అట్టికాలమునందు శ్రీరాముఁడు

వనమునకుఁ బోఁదలఁచి తనపట్టణమునుండి తమసానదీతీరమునకుఁబోయె. అట్లు శ్రీరాముఁడు పోవునప్పుడు, ఇంద్రుఁడు మొదలగు దేవతలు మార్గమునందు సత్క్రియలనుచేసిరి. మఱియును ఆసమయమునందు శ్రీరామునకు అనేకములయిన శుభశకునములయ్యె. అట్లు బయలు వెడలిపోయిన రాముఁడు తమసానదీతీరమునందు ఒకదినమునివసించి మరునాఁడు శృంగిబేరపట్టణమునకుఁ బోయె. అట్లుపోయి అక్కడ గుహునిచేత సత్కరింపఁబడి, ఒకదినమంతయును అక్కడ నివసించె. అంతట శ్రీరాముఁడు గుహుఁడుతీసికొనివచ్చిన మఱ్ఱిపాలచేత జడలను బంధించి మరునాఁటి ప్రాతఃకాలమునందు సీతాలక్ష్మణులతోఁగూడ ఓడనెక్కి తాము యెక్కివచ్చిన రథమును తోలుకొని అయోధ్యాపట్టణమునకుఁ బొమ్మని సుమంత్రునితోఁ జెప్పె. పిమ్మట గుహునియొక్క ఆజ్ఞానుసారముగ అతనిభటులు ఓడను నడిపించిరి. అట్లు ఆయోడ గంగానదీమధ్యమునకుఁ బోయినసమయమునందు సీతామహాదేవి గంగను ప్రార్థింపఁదలఁచి యిట్లనియె. ఓతల్లీ ! గంగాదేవీ ! నీకు నమస్కారమును చేయుచున్నాను. నేను రామలక్ష్మణులతోఁగూడ వనవాసమునకు వచ్చితిని. కావున మేము ముప్పూరమును నిన్నుఁ బూజించెదము. ఓతల్లీ ! గంగాదేవీ ! సురామాంసోపహారముల చేత నిన్నుఁ బూజించెదము. పూజనుగ్రహింపు మని ప్రార్థింపుచు గంగానదినిదాఁటి, ఆగంగానదీతీరమునందు ఒకరాత్రియంతయును నివసించి గంగానదిని పూజించె. అంతట మరుదినమునందు సీతారామలక్ష్మణులు భరద్వాజాశ్రమమునకు పోయిరి. అప్పుడు భరద్వాజమహాముని రాముని విశేషముగఁ బూజించె. పిమ్మట శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ ప్రయాగక్షేత్రమునందు యమునానదిని దాఁటి ఆమహావనమునకు నమస్కారమునుచేసి వాల్మీక్యాశ్రమమునకుఁబోయి, ఆవాల్మీకిమహామునిచేత పూజింపఁబడి అచ్చోటనుండి బయలు వెడలిపోయి చిత్రకూటమునందు లక్ష్మణునిచేత మిక్కిలి రమ్యమైనపర్ణశాలను నిర్మింపఁజేసె. అంతట మాంసాదులచేత బలినిసమర్పించి వాస్తుపూజచేసి ఆపర్ణశాలయందు గృహమునందు నివసించియున్నవిధముగ నివసించె. మఱియును ఆస్థలమునందే, లక్ష్మణుఁడు శయనించుటకును, వంటచేయుటకును వేఱువేఱుగ పర్ణశాలలను నిర్మించె. మఱియును అక్కడ ఇంకను అనేకములగు గృహములు,వృక్షములచేతను, తీఁగెలచేతను ప్రకాశించుచుండె. మఱియును సీతారామలక్ష్మణులు తమ్మును చూచుటకు వచ్చిన మహామునులకు కందమూలఫలాదులచేత ఆతిథ్యమును ఇచ్చి పూజించుచుండిరి. ఇట్లు కొన్నిదినములు గడచినపిమ్మట ఒకనాఁడు శ్రీరాముఁడు సీతామహాదేవియొక్క తొడయందు శిరస్సును బెట్టికొని నిద్రించుచుండె. ఆసమయమునందు ఒకకాకము వచ్చి సీతామహాదేవియొక్క అంగుష్ఠమును చూచి మాంసమని తలఁచి తనయొక్క ముక్కుచేతను, గోళ్లచేతను, రక్తముకారునట్లు పొడుచుచుండె. అప్పుడు సీతామహాదేవి శ్రీరామునినిద్రకు భంగము కలుగు

ననియీతనితలంపుతో ఆకాకమును నివారింపక యూరకుండె. అంతఁ గొంతసేపటికి శ్రీరాముఁడు నిద్రనుండి మేల్కాంచి సీతామహాదేవియొక్క అంగుష్ఠమును మాంసాశచేత రక్తముకారునట్లు పొడుచుచున్న కాకమునుచూచె. అంతలో నాకాకము రక్తముచేత ఎఱ్ఱనగు, మోమును, ముక్కునుకలదై పరుగెత్తుచుండె. అంతట రాముఁడు కోపోద్దీపితుఁడై యిషీకాస్త్రమును ప్రయోగించె. అంతట కాకము మిక్కిలి వేగముగఁ బరుగెత్తి తన్ను వెంటనంటివచ్చుచున్న అస్త్రమును ఎవ్వరును నివారింపఁ జాలరనితలఁచి మిక్కిలి భయముకలదై నారదమునిచే బోధింపఁబడి మరల రామునొద్దకు వచ్చి నన్నుఁ గాపాడుము గాపాడుము అని పాదములమీఁదంబడి ప్రార్థించె. అప్పుడు శ్రీరాముఁడు కరుణించి ఆకాకమును కాపాడి దానినేత్రమును మాత్రము ఒక్కదానిని తన అస్త్రము అపహరించునట్లుచేసె. ఇట్లు నానావిధములగు కౌతుకములనుచేయుచు శ్రీరాముఁడు ఆయరణ్యమునందు సుఖముగ సంచరించుచుండె. అంతట సుమంత్రుఁడు రామునియొక్క ఆజ్ఞను పొందిన పిమ్మట అయోధ్యాపట్టణమునకుఁ బోయి రామునియొక్క వృత్తాంతమును సర్వమును దశరథమహారాజునకుఁ దెలిపె. అంతట దశరథమహారాజు హా రామా! హా రామా! యనుచు ప్రాణములను విడిచె. అప్పుడు వసిష్ఠమహాముని దశరథమహారాజు మరణమును పొందుటను తెలిసికొని ఆదశరథుని కళేబరమును తైలద్రోణియందుఁ బెట్టించె. పిమ్మట దూతలను బంపి యుధాజిన్నగరమునందున్నవారును, కైకేయీపుత్త్రులును నగు భరతశత్రుఘ్నులను రప్పించె. అంతట భరతశత్రుఘ్నులు దూతలవలన సకల వృత్తాంతమును తెలిసికొని అతివేగముగ అయోధ్యాపట్టణమునకు వచ్చి తల్లియగు కైకేయివలన ఈయనర్థమంతయును జరిగినదని తెలిసికొని తల్లిని ధిక్కరించిరి. పిమ్మట భరతుఁడు సరయూనదియందలి యిసుకయందు తండ్రియగు దశరథునకు దహనసంస్కారమును చేసె. ఆసమయమునందు దశరథునిభార్యలలో నొక్కతెయైనను సహగమనమును చేయకుండె. పిమ్మట భరతుఁడు తండ్రి యగుదశరథునకుఁ జేయఁదగిన ప్రేతకృత్యముల నన్నిటిని జేసె. మఱియును తల్లి యగుకైకేయి చూచుచుండఁగా మంథరను పలుమారులు కొట్టించె. పిమ్మట భరతుఁడు అనేకవిధములచేత ప్రార్థింపఁబడియును పట్టాభిషేకమును పొందుటకు అంగీకరింపకపోయె. అంతట మంత్రివరులను తల్లులను పురజనులను వెంటఁబెట్టుకొని శ్రీరాముని సీతాలక్ష్మణసమేతముగ పట్టణమునకుఁ దీసికొనివచ్చుటకు బయలువెడలి మార్గమధ్యమునందు గుహునిచేత సన్మానింపఁబడి భరద్వాజాశ్రమమునకుఁ బోయె. ఆసమయమునందు భరద్వాజమునివరుఁడు తనదు తపోమహిమచేత తనయాశ్రమమును భూస్వర్గమునుగాఁజేసి మంత్రిపురోహితాదులతోఁ గూడుకొనిన భరతుని పూజించె. పిమ్మట నాభరద్వాజమునివరునిచేతఁ జూపఁబడినమార్గమునుపట్టి చిత్రకూటపర్వతమునకుఁ బోయి సీతాలక్ష్మణసమేతముగ నొక్కశిలయందుఁ గూర్చుండియున్న శ్రీరా

మునిం జూచి నమస్కరించె. అప్పుడు శ్రీరాముఁడు తమ్ముఁడగుభరతుని కౌఁగిలించుకొని తండ్రి మొదలగువారివృత్తాంతము నడిగి భరతునివలనఁ దండ్రిమరణమును పొందినవృత్తాంతమును వినియె. అనంతరమందు శ్రీరాముఁడు గంగానదికిఁ బోయి స్నానమునుచేసి తిలోదకాదుల నిచ్చి మరలవచ్చి యెప్పటివలె శిలాస్థలమునఁ గూర్చుండె. అంతట భరతుఁడు వసిష్ఠమహామునితోఁగూడ రాముని ప్రార్థించె. అట్లన్నివిధములచేతఁ బ్రార్థించినను శ్రీరాముఁడు రాజ్యపరిపాలనమునకు నే నంగీకరింప ననియె. అప్పుడు భరతుఁడు మిక్కిలి దుఃఖముకలవాఁడై దర్భలయందు ప్రాయోపవేశమునుచేసె. అంతట రాముఁడు వసిష్ఠమునివరునిఁజూచి యోమునివర్యా! భరతుని ప్రాయోపవేశము నివారింపుము. అనవుడు వసిష్ఠమహాముని పోయి యిట్లనియె. ఓరాజనందనా! సాక్షాన్నారాయణుఁడు భూభారమును హరించుటకు రామరూపముతో నవతరించె. మఱియును, ఇప్పుడు దేవవచనానుసారముగ రావణాదులను సంహరించుటకుఁ బోవుచున్నాఁడు. కావున నీవు ఈవిధముగ రాముని నిర్బంధించుట యుచితముగాదనిన విని భరతుఁడు రాముని సాక్షాన్నారాయణునిగాఁ దెలిసికొని యిట్లనియె. ఓదేవోత్తమా! అగ్రజా! రామా! రాజ్యమును పాలించుటకొఱకు నీపాదుకల నిమ్ము. నేను జటావల్కలములను ధరించి యాపాదుకలను సేవించుచు పట్టణమునకు బయలున నుండెదను. మఱియు నోరాజేన్ద్రా! పదునాలుగుసంవత్సరము లెప్పు డతిక్రమించునాయని నిరీక్షించుచుండెదను. పదునాలుగు సంవత్సరములును గడచిన మరుదినపు సూర్యాస్తమయములోపల నీవు రానియెడల నేను అగ్నియందుఁ బ్రవేశించెద ననిన విని రాముఁడు నీయిష్టానుసారముగ వచ్చెద ననియును, పాదుకల నిచ్చెద ననియును చెప్పి పాదుకల నిచ్చె. అంతట నాభరతుఁడు రత్నభూషితములును దివ్యములును అగుపాదుకలను గ్రహించి శిరస్సునందుఁ బెట్టుకొని తన్ను ధన్యునిగాఁ దలఁచె. అనంతరమం దనేకపర్యాయములు శ్రీరామునకు నమస్కరించి మంత్రిపురోహితాదులతోఁగూడ బయలువెడలి పోయె. అట్లు భరతుఁడు పోవునపుడు కైకేయి రామునొద్దకు వచ్చి యిట్లనియె. ఓపుత్రోత్తమా! నేను అవివేకముచేత అపరాధమును చేసితిని. నాయపరాధమును సహింపు మనిన శ్రీరాముఁ డిట్లనియె. ఓతల్లీ! నీ వేమియును తప్పిదమును చేసినదానవు కావు. నాయభిప్రాయానుసారముగ మంథర వచ్చి నీకుఁ జెప్పె. నీ వామంథరవాక్యములను విని మోహమును చెందితివి. నీవు సుఖముగ అయోధ్యాపట్టణమునకుఁ బొమ్ము. నాకు నీయందుఁ గోప మేమియును లే దని చెప్పి భరతునితోఁగూడఁబంపె. అంతట భరతుఁడు వచ్చినమార్గముననే మరల నయోధ్యాపట్టణమునకుఁ బోయె. పిమ్మట రాజ్యపాలకుల నియమించి నందిగ్రామమును నిర్మింపఁజేసి యక్కడ నుండె. సింహాసనమునందు రామునిపాదుకల నుంచి కందమూలఫలాశనుఁడై రాజకార్యములను నెరవేర్చుచుండె. అట్లు నెరవేర్చుచు

సకలకార్యములను పాదుకలకు వినుపించుచుండెను. మఱియును రాముఁడు వచ్చుదినములను లెక్కించుచుఁ గాలమును గడపుచుండెను. అంత నక్కడ చిత్రకూటపర్వతమునందు శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ నివసించి మునివరులచేత సత్కరింపఁబడుచుండెను. మఱియు నారాముఁడు మిక్కిలి రమ్యమగుపర్వతమునందు సీతామహాదేవితోఁ గూడ నానావిధము లగు క్రీడలను చేయుచుండెను. సీతామహాదేవి మనశ్శిలతిలకముచేత ఫాలతలము నలంకరించుచుండును. మఱియును శ్రీరాముఁడు తనహస్తముతో సీతామహాదేవియొక్క చెక్కిళులయందు మకరికాపత్రరేఖలను వ్రాయుచుండును. మఱియు నాసీతారాములు నానావిధము లగుపుష్పాదులతో నానావిధము లగుక్రీడలను చేయుచుందురు. ఇట్లుండఁగా నాచిత్రకూటపర్వతమునకు సమీపమునందున్న నగరమునందలి జను లనేకులు సీతారామలక్ష్మణులను చూచుటకు వచ్చుచుఁ బోవుచుందురు. అందువలన జనసమ్మర్ద మధికమయ్యె. అప్పుడు శ్రీరాముఁడు జనసమ్మర్దము కాదనితలఁచి యాచిత్రకూటపర్వతమును విడిచిపెట్టి సీతాలక్ష్మణులతోఁగూడ బయలువెడలిపోయి యత్రిమహామునియొక్క యాశ్రమమునకుఁబోయె. పోయి యామునివరునకు నమస్కరించి యామునివరునిచేత సన్మానింపఁబడి యచ్చోట మూఁడుదినములు నివసించె. సీతామహాదేవి అత్రిమహామునికి భార్యయగు ననసూయకు నమస్కరించి యామహనీయురాలిచేత నాలింగనము చేసికొనఁబడియె. పిమ్మట నాయనసూయ సీతామహాదేవిని పూజించె. అనంతరమందు ఆయనసూయ విశ్వకర్మచేత నిర్మింపఁబడినవియును, మిక్కిలి శ్రేష్ఠములును అయినకుండలములను సీతామహాదేవికి సమర్పించె. మఱియును, మిక్కిలి నిర్మలములయిన దుకూలములను సమర్పించె. ఇంతియగాక దివ్యమైనయంగరాగమును సమర్పించి యిట్లనియె. ఓ సీతా! ఈయంగరాగద్రవ్యముచేత నీశరీర మెప్పుడును మిక్కిలి మనోహరముగఁ బ్రకాశించుచుండును. ఓజానకీ! పతివ్రతాధర్మమును విడువక సర్వకాలములయందు భర్తయగు శ్రీరామునకు నీడవలె సంచరించుచుండుము. శ్రీరాముఁడు నీతోడను లక్ష్మణునితోడను మరల శీఘ్రముగ నయోధ్యాపట్టణమునకుఁ బోవునని చెప్పె. అంతట నత్రిమహాముని శాస్త్రోక్తప్రకారముగ సీతారాములను భుజింపఁజేసె. పిమ్మట రాముఁ డయ్యత్రిమహామునికి నమస్కారమును చేసి యచ్చోటనుండి బయలువెడలి పోయె. ఇవ్విధముగ సీతారామలక్ష్మణులు ఒక్కసంవత్సరకాలము అరణ్యవాసమును సల్పిరి. ఓపార్వతీ! శ్రీరామచరిత్రమును ఇంతవఱకు కొంచెముగఁ దెలిపితిని.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానందరామాయణమున
సారకాండమునందు శ్రీరామారణ్యవాసవర్ణన మను నామ
ధేయముకల యాఱవసర్గ ముగిసెను.

## ✱ విరాధఖరమారీచాది సంహారము. ✱

అంతట నాశ్రీరాముఁడు సీతాలక్ష్మణులతో గూడుకొనినవాఁడై యత్యధికమగుధనుస్సును సన్నద్ధముచేసి దండకారణ్యమునకు బయలువెడలి పోయె. అట్లు పోవునపుడు, శ్రీరాముఁడు ముందుగను, ఆరామునివెంట సీతయును, సీతవెంట లక్ష్మణుఁడును నడుచుచుండిరి. అట్లు పోవుచున్న సమయమునందు కాసారాదులు కనఁబడినచోట స్నానాదుల నాచరించి కందమూలఫలముల భుజించుచుండురు. ఇవ్విధముగఁబోవుచు నాసీతారామలక్ష్మణులు ఆదండకారణ్యమధ్యమందు మిక్కిలిభయంకరుఁడును, అధికమైనబలము కలవాఁడును, పర్వతమువంటియాకారము కలవాఁడును, మిక్కిలిభయంకరము లగుకోరపన్నులు కలవాఁడును, మేఘధ్వనివంటి ధ్వనులచేత భయమును కల్పించుచున్నవాఁడును, ఎడమచంకయం దుంచఁబడిన శూలాగ్రమునం దనేకమానవశరీరములను గ్రుచ్చుకొని యున్నవాఁడును, అరణ్యమునందలి మహిషవ్యాఘ్రాదులను భుజించుచున్న వాఁడును అయినవిరాధుఁ డనురాక్షసునిఁ జూచిరి. అప్పుడు శ్రీరాముఁడు ధనుస్సు నెక్కువెట్టి లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా ! నీవు సీతను గాపాడుచుండుము. నేను ఈరాక్షసునిసంహరించెద ననియె. ఇంతలోపల ఆవిరాధుఁడు సీతారామలక్ష్మణులనుఁ జూచి మీ రెవ్వరని యడిగిన శ్రీరాముఁడు తమనామధేయములతోఁగూడ తమవృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. అట్లు చెప్పినమాటలు విని యావిరాధుఁడు పకపకనవ్వి యిట్లనియె. ఓ రాముఁడా, సర్వలోకప్రసిద్ధుఁడనైన విరాధుఁడనని నన్నుఁ దెలిసికొంటివా ? మునివరు లందఱును నావలనిభయముచేత ఈయరణ్యమును విడిచిపోయిరి. నీవు బ్రదుకఁ దలఁచితివేని సీత నిక్కడ విడిచిపెట్టి లక్ష్మణునితోఁగూడ బయలువెడలి పొమ్ము. అట్లు చేయనియెడల మిమ్ముల నిరువురిని భక్షించెద నని చెప్పి సీతామహాదేవిని ఆకర్షించుటకుఁ బరుగెత్త నారంభించె. అప్పుడు శ్రీరాముఁడు నవ్వుచు బాణముచేత ఆవిరాధుని బాహువులను ముందుగ ఖండించె. అంతట నావిరాధుఁడు కోపోద్దీప్తుఁడై తనదుముఖమును వికటముగఁ దెఱచికొని రామున కభిముఖముగ మిక్కిలి వేగముతో వచ్చుచుండె. అప్పుడు శ్రీరాముఁడు మఱియొకబాణమును ప్రయోగించి యావిరాధుని రెండుపాదములను ఖండించె. అంతట నావిరాధుఁడు సర్పమునలె నోరును దెఱచి శ్రీరాముని మ్రింగఁదలఁచె. అప్పుడు శ్రీరాముఁడు అర్ధచంద్రాకారమగుబాణమును ప్రయోగించి యావిరాధునిశిరస్సును ఖండించె. ఆసమయమునందు సీతామహాదేవి శ్రీరాముని కౌఁగిలించుకొని యనేకవిధములఁ బ్రశంసించె. దేవదుందుభులు మ్రోగె. అనంతరమాదు విరాధునిశరీరమునుండి యొకమహాపురుషుఁడు బయలువెడలి శ్రీరామునకు నమస్కరించి తనవృత్తాంతమును సర్వమును మిగులనాదరముతోఁ జెప్పఁదలఁచి యిట్లనియె. ఓదేవోత్తమా ! రామచంద్రా ! నేను విద్యాధరుఁడను, దుర్వాసోమునివరునిచేత శపింపఁబడి రాక్షసుఁడనైతిని. ఇప్పుడు నీచేత

శాపమునుండి విముక్తుఁడ నైతినని చెప్పి, శ్రీరాముని ననేకవిధములఁ బ్రార్థించి దివ్యవిమానము నెక్కి పోయె. అట్లు విరాధుఁడు స్వర్గమునకు పోఁగానే, శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ శరభంగమునివరునియాశ్రమమునకుఁ బోయె. పోయి సకలసుఖములను కలుగఁజేయునట్టి యా యాశ్రమమునందుఁ బ్రవేశించి శరభంగమహామునికి నమస్కారమునుచేసె. అంతట నాశరభంగమహాముని యనేకవిధములుగ సీతారామలక్ష్మణులను సన్మానించె. పిమ్మట నయాశ్రమమునందు శ్రీరాముఁ డొక్కదినము నివసించె. అప్పుడాశరభంగమునివరుఁడు తనపుణ్యమును సర్వమును శ్రీరామునకు సమర్పించి యగ్నియందుఁ బ్రవేశించి దివ్యవిమానము నెక్కి వైకుంఠలోకమునకుఁ బోయె. అనంతరమందు సీతారామలక్ష్మణులు మెల్లమెల్లగ సుతీక్ష్ణుని యాశ్రమమునకుఁ బోయిరి. పోయి యామునివరునకు నమస్కరించి యామునివరునిచేత సత్కరింపఁబడి యక్కడ నివసించియుండె. ఆసమయమునందు అనేకములగునాశ్రమములయందుఁ దపమునుచేయుచున్న మునివరు లక్కడకు వచ్చిరి. వచ్చినపిమ్మట నామునివరు లందఱును శ్రీరామునకు నమస్కరించి యనేకవిధముల స్తోత్రమునుచేసి తమతమయాశ్రమములకుఁ బోయిరి. అంతట శ్రీరాముఁడు ప్రతిమునివరుని యాశ్రమమునందును కొన్నిదినములు నివసించి, యన్యమునివరులకు సంతోషమును కల్పించుచుండె. ఇవ్విధముగ నరణ్యమునందు సంచరించుచుండఁగా తొమ్మిదిసంవత్సరములు గడచిపోయె. ఆతొమ్మిది సంవత్సరములలోపల ననేకు లగు క్రూరరాక్షసులను సంహరించె. ఆమధ్యకాలమునందు శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతోఁగూడ సంచరించుచు అనేకములగు నదినదీపర్వతాదులయందు సీతామహాదేవితోఁగూడ క్రీడించుచుండె. అనంతరమందు శ్రీరాముఁడు అగస్త్యభ్రాత యగుమునివరునియాశ్రమమునకుఁ బోయి యామునివరునకు నమస్కరించె. పిమ్మట నమ్మునివరుఁడు సీతారామలక్ష్మణులను మిక్కిలిభక్తితోఁ బూజించె. అంతట శ్రీరాముఁడు అగస్త్యమునివరుని యాశ్రమమునకుఁ బోయె. ఆసమయమునం దగస్త్యమునివరుఁడు సీతారామలక్ష్మణులు తమయాశ్రమసమీపమునకు వచ్చినవృత్తాంతమును విని యెదురుగఁ బోయి యనేకవిధములైన వృక్షములచేత మిగుల రమ్యమైనయాశ్రమములోనికిఁ దీసికొనిపోయె. అనంతరమునందు సీతారామలక్ష్మణుల ననేకవిధములఁ బూజించె. పిమ్మట రాముఁడక్కడఁ గొన్నిదినములు నివసించె. అంతట దినదినమందును నయ్యగస్త్యమహాముని లక్ష్మీపతి యగుశ్రీరాముని ననేకవిధములఁ బూజించుచుండె. అట్లుపూజించి శ్రీరామునికొఱకు మహేంద్రునిచేత స్థాపింపఁబడిన ధనుస్సును, అక్షయబాణతూణీరములను, రత్నములచేత నలంకరింపఁబడిన ఖడ్గమును ఇచ్చె. అనంతరమందు శ్రీరాముఁడు ఆయగస్త్యమునివరుని యాజ్ఞానుసారముగ వానిని గ్రహించె. పిమ్మట నామునివరుని వాక్యానుసారముగ గోదావరినదియొక్క యుత్తరపుతటమునం దున్న

దియును, మిక్కిలి రమ్యమైనదియును, అగు పంచవటీతీరమునకుఁ బోయె. పోయి యచ్చోటనివసించి యున్నవాఁడును, పర్వతమువంటియాకారము కలవాఁడును, అరుణునకు పుత్త్రుఁడును, శ్రేష్ఠుఁడును, దశరథమహారాజునకు మిత్రుఁడును అయిన జటాయు వనువానిని జూచి యతనితో సంభాషణమునుచేసి యాపంచవటీక్షేత్రము నందుఁ బ్రవేశించె. అనంతరము దక్కడ పర్ణశాలను నిర్మింపఁజేసి దానియందు నివసించి మృగమాంసాదులచేత దేవబలిని పెట్టుచు శ్రీరాముఁడు సీతాలక్ష్మణుల తోఁగూడ సుఖముగ నివసించె. అట్లు సీతారామలక్ష్మణు లక్కడ నివసించియున్న కాలమునందు జటాయువు స్వయముగ సీతామహాదేవిని కాపాడుచుండె. ఆపంచ వటీక్షేత్రమునందు మూడుసంవత్సరములకాలము సీతారాములు నానావిధములగు క్రీడలు సల్పుచుండిరి. అయ్యరణ్యమునందు సంచరించుదినములలో లక్ష్మణుఁడు తపస్సును చేయుచున్నవాఁడును, శూర్పణఖాపుత్త్రుఁడును, అయిన సాంబుఁ డనువా నినిఁజూచె. ఆసాంబునితపస్సునకు సంతసించి బ్రహ్మదేవుఁ డొకఖడ్గము నిచ్చె. ఆసాం బుఁడు ఆఖడ్గమును జూడక యే తపస్సును చేసికొనుచుండె. ఆసమయమునందు లక్ష్మణుఁ డాసాంబుని సంహరించి యాఖడ్గమును గ్రహించి శ్రీరామునిసమీపమునకు వచ్చి యిట్లనియె. ఓరామచంద్రా! తపస్సును చేయుచున్న సాంబుఁ డనువానిని సంహరించితిని. కావున బ్రహ్మహత్యాదోషము నాయందు వ్యాపించినది. కాఁబట్టి తగినప్రాయశ్చిత్తమును చెప్పుమనఁగవిని శ్రీరాముఁ డిట్లనియె. ఓతమ్ముఁడా! ఆసాంబుఁ డనువాఁడు రాక్షసుఁడుకాని బ్రాహ్మణుఁడుకాఁడు. కాఁబట్టి బ్రహ్మహత్యాదోషము నీకురాదని భయమును చెందకు మనియె. ఆవచనమును విని లక్ష్మణుఁడు పరమానం దమునుపొందెను. ఇంతలో ఆసాంబుని తల్లియగు శూర్పణఖ యావృత్తాంతమును సర్వమును విని పుత్త్రమరణమునకు అత్యధిక మగుదుఃఖమును పొందెను. అం తట పుత్త్రదుఃఖము కలయాతాటక యొకనాఁడు పంచవటీక్షేత్రమునందు సం చరించుచున్న శ్రీరామునిఁజూచి మిక్కిలి మనోహరమైనరూపమును ధరించి కపట బుద్ధిచేత రామలక్ష్మణులను చంపుటకు యత్నించి మృదుమధురవాక్యములతో నిట్ల నియె. ఓపురుషోత్తములారా! మీరిరువురును ఎవరు. మిగుల మనోహరులా లయిన యీనారీమణి యెవతె. మీ రెక్కడనుండి యిక్కడకు వచ్చితిరి. ఇ క్కడనుండి యెక్కడకుఁ బోవుచున్నా రనిన విని శ్రీరాముఁడు తమవృత్తాం తమును సర్వమును తెలిపె. అంతట నాశూర్పణఖ మరల నిట్లనియె. ఓమ హానుభావా! నాకు భర్త నగుమనిన విని శ్రీరాముఁడు మరల నిట్లనియె. ఓతరుణీ! నాకు భార్యకలదు. కావున నేను మఱియొకదానినిఁ బరిగ్రహిం పను. నాతమ్ముఁ డగులక్ష్మణుఁడు పర్ణశాలకు బయలున నున్నాఁడు. అతనిక సమీపమునందు భార్యలేదు. కాఁబట్టి నీవుపోయి యతనిం బ్రార్థింపు మనిన విని యాశూర్పణఖ లక్ష్మణునిమ్రోలకుఁ బోయి తనయభిప్రాయమును తెలుపఁగా

లక్ష్మణుఁ డిట్లనియె. ఓతరుణీ! నేను శ్రీరామునకుఁ దాసుఁడను. నీవు నన్నుఁబరిగ్రహించినయెడల సీతకు దాసివి కావలసివచ్చు ననిన విని యాశూర్పణఖ క్రోధోద్దీపితురాలై సీతను పట్టి బాధించుటకు యత్నించె. అప్పుడు రాముఁ డొకబాణమును ఆశూర్పణఖచేతికిచ్చి యోశూర్పణఖా! ఈఖడ్గమును నేను గుర్తుగా ఇచ్చితి నని చెప్పి లక్ష్మణునిచేతి కిమ్ము. అతండు నీకార్యము చక్కఁగ నెరవేర్చు ననిన విని యాశూర్పణఖ మరల లక్ష్మణునిదగ్గఱకుఁబోయి యాబాణమును రాముఁ డీయుమనియె నని యిచ్చె. అప్పుడు లక్ష్మణుఁడు శ్రీరాముని హృద్గతాభిప్రాయమును తెలిసికొని యాబాణమును ధనుస్సునందు సంధానముచేసి మిక్కిలివేగముగ బ్రయోగించె. అంతట నాబాణ మతివేగముగఁ బోయి శూర్పణఖయొక్కముక్కును, చెవులను త్రుంచి యాబాణము మరల రాముని యంబులపొదియందుఁ బ్రవేశించె. అట్లు నాసాకర్ణములు తెగఁగానే యాశూర్పణఖ హాహాకారమునుచేయుచు తనబంధువు లగుఖరదూషణాదిరాక్షసులకడ్డకుఁ బోయె. పోయి తనవృత్తాంతమును సర్వమును చెప్పిన విని ఖరదూషణత్రిశిరులు క్రోధోద్దీపితులైరి. పిమ్మట మిక్కిలి భయంకరు లగు పదునాలుగువేలమందిరాక్షసులను బంపిరి. ఆపదునాలుగువేలమందిని శ్రీరాముఁడు క్షణమాత్రములోపల సంహరించె. అవ్విధముగ పదునాలుగువేలమందిరాక్షసులును క్షణమాత్రములోపల మరణమును పొందినవృత్తాంతమును విని యాఖరదూషణత్రిశిరులు పదునాలుగువేలమందిరాక్షసులను వెంటఁబెట్టుకొని యుద్ధమునకుఁ బయలువెడలిరి. ఆసమయమునందు సీతామహాదేవిని లక్ష్మణునిగుహయందుండుమఁ డనిచెప్పి శస్త్రాస్త్రములనవలంబించి యారాక్షసులతో మిక్కిలి భయంకరమైనయుద్ధమునుచేసె. అట్టియుద్ధమునందు క్షణమాత్రములోపల మరల నాపదునాలుగువేలమందిని సంహరించె. అనంతరమందు ఖరదూషణత్రిశిరు లనుమువ్వురిని సంహరించె. ఆఖరదూషణత్రిశిరు లున్నక్షేత్రము త్ర్యంబకక్షేత్రమని యిప్పటికిని ప్రసిద్ధిని పొందియుండె. అంతట తపోనంతు లందఱును ఆజనస్థానమునందు నిష్కంటకముగ సంచరించునట్లు చేసె. అనంతరమందు సీతామహాదేవి శ్రీరాముని కౌఁగిలించుకొని యనేకవిధముల ప్రశంసించె. పిమ్మట శ్రీరాముఁడు ఏకాంతమునందు మిక్కిలి నాదరము కలవాఁడై సీతామహాదేవితో నిట్లనియె. ఓసీతా! నీవు మూఁడురూపములను ధరించి రజోరూపముతో అగ్నియందు నివసింపుము. సత్త్వరూపముతో నావామభాగమునందు నివసింపుము. తమోరూపముతో పంచవటీక్షేత్రమునందు రావణునకు మోహమునుకలిగించుటకు నివసింపు మనియె. ఆవచనమును విని సీతామహాదేవి శ్రీరామవాక్యానుసారముగఁ జేసె. అంత నక్కడ శూర్పణఖ ఖరదూషణత్రిశిరులు నశించుటకు దుఃఖించి లంకాపట్టణమునకుఁ బోయె. పోయి రావణునిఁ జూచి యిట్లనియె. ఓరాక్షసరాజా! నీవృత్తాంతమంతయును మిగుల నసహ్యాకరముగ నున్నది. నీవు చారులవలన లోకములోనివృత్తాంతమును తెలిసికొనకుండుట యుచితమా!

ఓరాక్షసోత్తమా! నీబంధువు లగుఖరదూషణత్రిశిరులు తమబంధువులతోఁగూడ మానవునిచేతఁ జంపఁబడిరి. నీవీవిషయమును విచారింపకుంటి వనిన విని రావణాసురుఁడు విరూపిణియై యున్నశూర్పణఖను చూచి కోపోద్దీపితుఁడై సింహాసనమునుండి చలించి చెలియలగు నాశూర్పణఖతో నిట్లనియె. ఓచెలియలా! యుద్ధముజరుగుట కు కారణమేమి? ఆవృత్తాంతమును సర్వమును చెప్పు మనిన నాశూర్పణఖ యిట్లనియె. ఓరాక్షసరాజోత్తమా! ఆమానవునిదగ్గర స్త్రీరత్న మొక్కటి కలదు. దానిని నీకుఁ దెచ్చియిచ్చిన బాగుండు నని తలఁచితిని. అట్లు తలఁచి నే నా స్త్రీరత్నమును పట్టుకొనుటకు యత్నించునంతలో ఆమానవునితమ్ముఁడు బాణమును ప్రయోగించి నా కీయవస్థను కల్పించె. మఱియును నాపుత్త్రుఁ డగుసాంబుఁడుకూడఁ జంపఁబడియె. అంతట నేను పుత్త్రశోకముచేత అధికముగా దుఃఖమును పొందితిని. అప్పుడు ఖరదూషణత్రిశిరులు నాకు సంతోషమునుకలిగించుటకొఱకు యుద్ధమును చేసిరి. అంతట నయ్యుద్ధమునందు బంధువులతోఁగూడ నతఁడుచంపఁబడియె. ఓరాక్షసరాజోత్తమా! నీకు సామర్థ్యము కలిగియున్నయెడల సీతను తీసికొనిరమ్ము. అట్లు చేయుటకు శక్తి లేదేని తలను వంచుకొని పెనిమిటి లేని యాఁడుదానివలె నుండు మనియె. ఆవచనమును విని రావణుఁడు ఆశూర్పణఖను అనేకవిధముల నూరార్చి యిట్లనియె. ఓచెలియలా! ఆరామలక్ష్మణులను చంపి నీదుఃఖమును పోఁగొట్టెదను. నీవు వ్యసనమును పొందకుమని నానావిధము లయినవాక్యములచేత ఆశూర్పణఖ నూరార్చి తనకు హితమును ఉపదేశించువాఁడును, తపస్సును చేయుచున్న వాఁడును అగుమారీచునిదగ్గరకుఁ బోయి యావృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. ఓరావణా! రాముని నామధేయమును వినినమాత్రముచేతనే నేను భయమును పొందెదను. లంకాపట్టణనాశక మైనయీబుద్ధిని నీ కెవ్వరు పుట్టించిరి. నీ కెవ్వఁడో ఆస్తరూపముతోనున్నశత్రు వగుచు నీకీబుద్ధిని పుట్టించెను. ఈవిషయమునందు నీబుద్ధిని ప్రవేశపెట్టకుము. రామునికథనుకూడ స్మరింపకుము. రాముని చూచిన వెంటనే నీవు మరణమును పొందుదువనిన విని యారావణుఁడు మరల నిట్లనియె. ఓమారీచుఁడా! నీవు రానియెడల నిన్ను నేను వధించెదను. కావున నావచనము నతిక్రమింపక చేయుము. మఱియు నోమారీచుఁడా! నీవు మృగరూపమునుపొంది రామునియొద్దకుఁ బొమ్ము. రాముఁడు నీ వెంటనంటును. అట్లు రాముఁడునీయొద్దకు వచ్చునపుడు, ఓలక్ష్మణుఁడా! అని రాముఁడు పిలిచినవిధముగఁ బిలువుము. అంతట లక్ష్మణుఁడు బయలువెడలి రామునియొద్దకు వచ్చును. ఆసమయమునందు సీతయొంటరిగ నుండును. అప్పుడు నేను సీతను ఎత్తికొని మిక్కిలివేగముతో లంకాపట్టణమునకు వత్తును. అనంతరమందు నీకు రాజ్యమునందు సగమును యిచ్చెద ననిన విని యామారీచుఁడు తనమనస్సున నిట్లని యోచించె. ఇప్పుడు నేను బయలువెడలక పోతినేని, యీరావణుఁడు నన్ను వధించును. వీనివలన మరణమునుపొందుట

కంటె, శ్రీరామునివలన మరణమును పొందుట యుచితమని నిశ్చయించి, యోరావణా! నీయిష్టానుసారముగఁ బ్రవర్తించెదనని చెప్పి రావణునితోఁ గూడ రథము నెక్కి పంచవటీక్షేత్రమునకుఁ బోయె. పోయినపిమ్మట సువర్ణమయమును చిత్రవర్ణమును కలమృగమయ్యె. అట్లు మృగరూపమును ధరించి సీతారాముల సమీపమునకుఁ బోయె. అప్పుడు ఛాయారూపముతో నున్నసీత యామృగమును చూచి శ్రీరామునితో నిట్లనియె. ఓరామచంద్రా! ఈమృగము మిక్కిలి మనోహరముగ నున్నది. కావున దీనిని పట్టుకొని రమ్ము. దీనితో నేను క్రీడించుచుండెదను. ఒకవేళ నీబాణముచేత ఈమృగము మరణమును పొందెనేని దీనిచర్మము నైనను దీసికొని రమ్మనిన విని, రాముఁడు రాఁబోవువృత్తాంతమును సర్వమును తెలిసికొనియును, తెలియనివానివలె, సీతాసంరక్షణయందు లక్ష్మణుని నియమించి తాను ధనుర్బాణధరుఁడై బయలువెడలె. అప్పుడామృగము శ్రీరామునిఁజూచి పరుగెత్త నారంభించె. అంతట రాముఁడును దానివెంటనంటి పోవుచుండె. అట్లు కొంతదూరము పోయినపిమ్మట నామృగము చేతికందక పోవుటచేత బాణమును ప్రయోగించె. అంత నామృగము ఆబాణముయొక్క వేగమునకుఁ దాళఁజాలక ఓలక్ష్మణా యని రాముఁడు పిలిచినవిధముగఁ బిలిచె. మఱియు నోలక్ష్మణా! నన్నుఁ జంపెనని యఱచె. ఆశబ్దమును సీతామహాదేవి విని లక్ష్మణుని పోయి చూచిరమ్మనిన లక్ష్మణుఁ డిట్లనియె. ఓమహాదేవీ! తల్లీ! ఈశబ్దము శ్రీరామునిశబ్దము కాదు. కావున నీవు భయమును పొందవలదనిన మరల నాసీత యిట్లనియె. ఓలక్ష్మణా! నీయభిప్రాయము నాకుఁ దెలిసినది. భరతునిమాటలను విని రామునిమరణమును కోరుచున్నావు. మఱియును నన్నుఁ గోరుచున్నావని తోఁచుచున్నది. అట్లయినయెడల నేను ప్రాణములను విడిచెదననియె. అట్టి క్రూరవచనమునువిని మిక్కిలి భయముకలవాఁడై యిట్లనియె. ఓతల్లీ! నావచనమును వినుము. నేను రామునాజ్ఞనవలంబించి నిన్నుఁ గాపాడుటకు నిక్కడ నుంటిని. ఇట్టినన్ను వాగ్బాణముచేతఁ గొట్టితివి. కావున దీనికిఁ దగినఫలమును శీఘ్రముగ ననుభవింపఁగలవు. అయినను నేను కొన్నిమాటలను చెప్పెదను. నావాక్యములను వినుము. నేను నీచుట్టును ధనుస్సుతో గీతను గీసెదను. ఈరేఖను దాటి పోకుము. పరులు ఈగీతనతిక్రమించి నీదగ్గరకు రాఁజాలరు. కావున ప్రాణములు కంఠగతము లయినను నీవు ఈరేఖనుదాటిపోకు మనిచెప్పి ధనుఃకోటిచేత సీతకుఁజుట్టును గీతను గీసె. అనంతరమందు సీతామహాదేవికి నమస్కారమునుచేసి మిక్కిలి వేగముగ రామునియొద్దకుఁ బోయె. ఆసమయమునందు రావణుఁడు భిక్షురూపమును ధరించినవాఁడై యాపంచవటీక్షేత్రమునందుఁ బ్రవేశించి యారేఖకు బయలున నారాయణా! అని నిలిచియుండె. అప్పుడు ఛాయామయమైనసీత భిక్షనుసమర్పించుటకొఱకు భిక్ష నెత్తికొనిపోయి యాగీతకు లోపలనుండి యాభిక్షను గ్రహింపుమనియె. ఆవచనమునువిని భిక్షువు మరల నిట్లనియె. ఓతరుణీ!

నేను దూరముగనుండి భిక్షను పెట్టినయెడల గ్రహింపను. నీకు రాముని గృహస్థధర్మమును కాపాడవలయుననియెడు తలంపు కలిగియున్నయెడల ఈరేఖను దాటి యీవలకువచ్చి భిక్షమును పెట్టుమనిన విని సీతామహాదేవి అధర్మము కలుగుననియెడు భయముతో ఆరేఖకుబయలున వామపాదమును పెట్టి చేతులను చాచి భిక్షమును గ్రహింపుమనియె. ఆసమయమునందు భిక్షువేషముతోనున్న సీతనుపట్టుకొని భిక్షురూపమును వదలి గాడిదెలచేత వహింపఁబడుచున్న రథముమీఁదఁబెట్టుకొని యచ్చోటనుండి బయలువెడలె. అట్లు బయలువెడలి మిక్కిలివేగముతో బోవుచుండఁగా జటాయు వా రావణునిఁజూచి కోపోద్దీపితుఁడై మిక్కిలి భయంకరమైన యుద్ధమును చేసె. తనపాదములచేత ఆరావణునిరథమును చూర్ణమునుగాఁజేసె. ఆరథమునకుఁ గట్టినగాడిదెల నెనిమిదింటిని పిండిపిండిగఁజేసె. ఆరావణుని కిరీటములను ఛేదించె. దేహమును జర్జరితమునుగాఁజేసె. ఇవ్విధముగఁజేసి రావణుని మూర్ఛనొందించి సీతను వెంటఁబెట్టుకొని బయలువెడలె. అంతఁ గొంతసేపటికి రావణాసురుఁడు స్వస్థచిత్తుఁడై మరలఁ దనపాదములచేత ఆజటాయువుయొక్క శరీరమును జర్జరితమునుగాఁ జేసె. అంతట నా జటాయువును క్రిందఁబడవైచె. ఆసమయమునందు జటాయువు నెత్తురును గ్రక్కుచుఁ గ్రిందఁబడియె. అంతట మరల సీతనుగ్రహించి, రామరామా! అని యఱచుచున్నను బలాత్కారముగ తీసికొనిపోవుచుండె. అప్పుడు సీత క్రిందఁజూచుచు తన యాభరణములనన్నిటిని ఉత్తరీయమునందు మూటఁగట్టి అయిదుగురువానరులు కూర్చునియున్న పర్వతముమీఁదఁ బడవైచె. అట్లు వానరమధ్యమునం దామూటను తనవృత్తాంతమును రామునకుఁ దెలుపుటకొఱకుఁ బడవైచె. అంతట రావణాసురుఁడు లంకాపట్టణమునకాసీతను గొనిపోయి యశోకవృక్షముక్రిందనుంచి యనేకవిధముల ప్రార్థించినను సీతామహాదేవి ప్రత్యుత్తరము నీయక యూరకుండె. పిమ్మట రావణాసురుఁ డాసీతను రక్షించుటకొఱకు అనేకరాక్షస స్త్రీలను నియమించి తనగృహమునకుఁ బోయె. ఆకాలమునందు బ్రహ్మవాక్యానుసారముగ దేవేంద్రుఁడు సీతామహాదేవికి సంతుష్టి కలిగియుండుటకు పాయసము నిచ్చుచుండె. అట్లు రహస్యముగ దేవేంద్రుఁ డిచ్చునట్టి పాయసముచేత సీతామహాదేవి సంతుష్టురాలై యుండె. మఱియు నాసీతామహాదేవి దేవేంద్రునిచేత నీయఁబడిన పాయసమును భుజించుటకు పూర్వమునందు రామలక్ష్మణుల నివేదించినట్లు స్మరించుచుండె. దానిచేత రామలక్ష్మణులకుఁగూడఁ దృప్తికలుగుచుండె. ఇట్లుండఁగా రావణుఁడు రాక్షస స్త్రీలను పదునార్గురిని పిలిచి యిట్లనియె. ఓరాక్షస స్త్రీజనోత్తములారా! మీరందఱును రామునిసంహరించుటకుఁబోయి పంచవటీక్షేత్రమునందు సంచరించునట్టి రామలక్ష్మణులను వెదకి చంపి రండనియె. అంతట నారాక్షస స్త్రీలు బయలువెడలిపోవుచు మార్గమధ్యమునందు కబంధునిచేత భక్షింపఁబడిరి. మృగరూపమునుధరించిన మారీచుఁడు ఏయేస్థలముల

యందు సంచరించెనో ఆస్థలములన్నియును ఇప్పటికిని కొన్నిగుర్తులుకల పట్టణములు కలిగియుండెను. మృగముయొక్క నూపురము పడినచోట నేటికిని నూపుర మనుగ్రామము నిర్మింపఁబడియుండెను. మఱియును రాముని బాణముచేత ఆమాయామృగము చంపఁబడినచోట చాపల్యగ్రామము నిర్మింపఁబడియె. ఇంతియగాక రామబాణముచేత మృగము చచ్చిపడినశిలయం దిప్పటికిని గుర్తుపడియుండెను. పంచవటీక్షేత్రమునకుచుట్టును లక్ష్మణుఁడు గీసినరేఖ నేటివఱకును నదీరూపమును పొందియున్నది. మఱియు నాటాటిభూమియందు నేటివఱకును రామపాదము కనఁబడుచుండును. ఖరదూషణత్రిశిరులతో యుద్ధమునకుఁబోవునపుడు సీతామహాదేవిని ఉంచిన గుహయందు నేటివఱకును శిలారూపముగ సీతామహాదేవి కనఁబడును. నేటివఱకును జ్ఞానదృష్టులగు మునివరులకు సీతారామలక్ష్మణులు పంచవటియందుఁదిరుగుచున్నట్లు కనఁబడుదురు. మఱియు నిప్పటికిని గోదావరియందు సీతారామలక్ష్మణులు స్నానముచేసిన స్థలములకు రామతీర్థ మనియును, సీతాతీర్థ మనియును, లక్ష్మణతీర్థ మనియు నామములు కలిగియున్న యవి. రాముఁడు సీతతోఁగూడఁ బరుండినపర్వతమునకు రామశయ్యాగిరియను నామధేయము కలిగియున్నది. ఆపర్వతమునం దిప్పటికిని శయ్యారూపములు కనఁబడుచున్నయవి. అంత నక్కడ సీతావచనానుసారముగ బయలువెడలిపోయిన లక్ష్మణునిజూచి సీతావాక్యములనువిని శ్రీరాముఁడు క్రోధవ్యసనములతోఁ గూడినచిత్తము కలవాఁడయ్యె. మఱియు నతిభయంకరములయిన నిమిత్తములనుచూచి పంచవటికిఁబోయి యక్కడ సీతామహాదేవి కనఁబడకపోవుటచేత మానవభావము నవలంబించి సకలస్థలములయందును సీతామహాదేవిని వెదకుచుండెను. మఱియును కనఁబడినవారినందఱను సీతను చూచితిరా యనియడుగుచుండెను. అవ్విధముగ నడుగుచుఁ బోయి జటాయువువలన జరిగినవృత్తాంతమును సర్వమును తెలిసికొని జటాయువునకు దహనాదికృత్యములనుచేసి యాజటాయువునకు తృప్తికలుగుటకొఱకు వన్యమృగమాంసమును బలినిగాఁబెట్టి యక్కడనుండి దక్షిణముగ బయలువెడలె. అట్లు బయలువెడలి పిచ్చివానివలె వెదకుచుఁబోయె. మఱియును దర్భమయ మగుసీతతోఁగూడుకొని యగ్నిహోత్రాదికర్మములను నెరవేర్చుచుండెను. ఓపార్వతీ! అట్లు రాముఁడు మూఢునివలె సంచరించుచున్న సమయమునందు సాక్షాన్మహావిష్ణు వగురాముఁడు లోకములకు సద్గుణములను బోధించువానివలెఁ దిరుగుచున్నాఁడు చూడుమని నీకుఁ జెప్పితిని. మఱియు నోపార్వతీ! స్త్రీలతో సాంగత్యమును వదలుకొనవలసిన దని లోకులకుఁ బోధించుటకొఱకు భ్రమను కలుగఁజేయునట్టిదియును, స్త్రీవిషయమును అగు దుఃఖమును అనుభవించుచున్నాఁడని నేను చెప్పినవాక్యమును విని నీవు శ్రీరాముని పరీక్షించుటకు యత్నించి వానిసమీపమునకు సీతారూపముతోఁ బోయి మృదుమధురవచనములతో నిట్లని నుడివితివి. ఓరాముఁడా! పద్మపత్రాక్షుఁడా! ఎదుటనున్న నన్నుఁ దెలిసికొనలేక విచారమును పొందుచున్నావు. ఇట్టి మూఢతనము

నీ కెట్లు పుట్టినది. నీవు విచారమును పొందక నన్నుఁ బొందుము. సుఖమును అనుభవింపుము. వ్యసనమును పొందకుము. అని నీవు చెప్పినవాక్యమును విని శ్రీరాముఁడు నవ్వి సీతతో నిట్లనియె. ఓ మహాదేవీ! నీవెవ్వరయినదియును నే నెఱుఁగుదును. నీవు సీతవుకావు. నీవు సీతారూపముతో వచ్చి నన్ను మోహపెట్టుచున్నావని రాముఁడు పలుమారులు చెప్పినపిమ్మట నీవు నేను చెప్పినమాటలను సత్యములైనవానినిగా నమ్మి శ్రీరామునకు నమస్కరించి యనేకవిధములఁ బ్రార్థించితివి. అనంతరమందు మరల నీవు నాయొద్దకువచ్చితివి. మఱియు నా శ్రీరాముఁడు నిన్ను జగదంబికనుగాఁ జెప్పుటచేత నీవు లజ్జను పొందితివి. అంతట నా రామలక్ష్మణులు దక్షిణదిక్కునకుఁ బోయిరి. అట్లు పోవుచు మార్గమధ్యమునం దనేకవేలమంది రాక్షసులను సంహరించె. ఆసమయమునందు కబంధుఁ డనురాక్షసుఁడు ఆరామలక్ష్మణుల నిరువురినిఁ బట్టుకొనియె. అప్పుడు ఆమడపొడుగుగల బాహువులతోఁగూడుకొని యున్నవాఁడును, శిరస్సులేనివాఁడును అగు కబంధునిబాహువులను శ్రీరాముఁడు ఖండించె. అంతట నా రాక్షసుఁడు దివ్యరూపమును ధరించి శ్రీరామునకు నమస్కరించి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! పూర్వజన్మమునందు నేను గంధర్వరాజునై యుండి యొకబ్రాహ్మణునిచేత రాక్షసుఁడవు కమ్మని శపింపఁబడితిని. అనంతరమందు నేను బహువిధముల బ్రార్థింపఁగా నా బ్రాహ్మణోత్తముఁ డిట్లనియె. త్రేతాయుగమునందు రామలక్ష్మణులువచ్చి నీచేతఁబట్టఁబడి నీబాహువులను ఖండింతురు. ఆసమయమునందు నీవు శాపవిముక్తుఁడ వగుదువనియె. అంతట నేను రాక్షసరూపమును ధరించి దేవేంద్రునిమీఁదికిఁ బోతిని. అప్పుడు దేవేంద్రుఁడు వజ్రాయుధముచేత నాశిరస్సును ఖండించె. అదిమొదలుకొని నేనిక్కడ సంచరించుచుంటిని. మఱియు నాసమయమునందు ముఖములేక యెట్లు జీవింపఁగల నని యనేకవిధముల నింద్రుని బ్రార్థించి యడుగఁగా దేవేంద్రుఁడు దయకలవాఁడై నీకు కుక్షియందు ముఖముకలిగియుండుననియె. మఱియు నీబాహువులు ఆమడవెడల్పు గలిగియుండుననియె. అదిమొదలుకొని నాచేతులకు దొరకినపదార్థములను భుజించుచుంటిని. ఓ రఘుకులోత్తమా! ఇక్కడకు సమీపమునందు మతంగమునివరుని పరిచారకులుకలరు. నీ వక్కడకు శబరీదర్శనార్థముగఁ బొమ్ము. ఆశబరియనునది నీకు సీతావృత్తాంతమును సర్వమును చెప్పునని చెప్పి యాగంధర్వరాజు మరల రామునకు నమస్కరించి స్వర్గలోకమునకుఁ బోయె. అనంతరమందు రామలక్ష్మణులు శబరియొద్దకుఁ బోయిరి. అప్పు డాశబరియనునది వనమునందలి వస్తువిశేషములచేత రామలక్ష్మణులను పూజించె. అనంతరమందు చితిని పేర్చుకొని దానిమీఁద నెక్కుటకు నుద్యుక్తురాలును మిగుల సంతోషముకలదియును నై శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఇక్కడకు సమీపమునందు ఋశ్యమూక మనుపర్వత మొక్కటికలదు. దానియందు మంత్రులతోఁగూడ సుగ్రీవుఁ డనువానరోత్తముఁడు నివసించియు

న్నాఁడు. వానితో స్నేహమును చేసినయెడల నీకు సీతలభ్యమగును. కావున నో రాముఁడా! ముందుగ నిక్కడకు సమీపముననున్న పంపాసరోవరమునకుఁ బొమ్ము. పోయి పంపాసరోవరముయొక్క తీరమునందు నానావిధములైన వృక్షములుకలవు. ఆవృక్షములయందలి నానావిధములైన ఫలములను భుజింపుము. మఱియు నా పంపాసరోవరమునందలి యుదకమును పానముచేయుము. అనంతరమందు సుగ్రీవునిసమీపమునకుఁ బొమ్మనిచెప్పి రామునకు నమస్కరించి యగ్నియందుఁ బ్రవేశించె. అనంతరమం దాశబరి యనునది రామదర్శనమాహాత్మ్యమువలన వైకుంఠమునుపొందె. అంతట రాముఁడు తమ్ముఁడగు లక్ష్మణునితోఁగూడ పంపాసరోవరమునకుఁబోయి స్నానపానాదులనాచరించి ఫలాదుల ననుభవించె. పిమ్మట మెల్లఁగ ఋశ్యమూకపర్వతమునకుఁబోయె. అట్లుపోవునపుడు మార్గమునం దనేకములగునయరణ్యములను చూచుచు సీతామహాదేవిని వెదకుచుండె.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానంద రామాయణమున
సారకాండమునందు విరాధఖరమారీచాదిసంహారమను నామ
ధేయముకల యేడవసర్గ ముగిసెను.

---

## * కిష్కింధలో వాలిసంహారము. *

అనంతరమునందు రాముఁడు లక్ష్మణునితోఁగూడ ధనుర్బాణములను ధరించి నలుదిక్కులనుచూచుచు ఋశ్యమూకపర్వతమునొద్దకుఁ బోయె. అట్లు ఋశ్యమూకపర్వతసమీపమునఁ బోవుచున్న రామలక్ష్మణులను సుగ్రీవుఁడు నలుగురుమంత్రులతోఁగూడ చూచి యాలోచించి హనుమంతునితో నిట్లనియె. ఓ ఆంజనేయుఁడా! ధనుర్బాణములను, అమ్ములపొదులను ధరించిన యీమహాపురుషు లిరువురును వాలి ప్రేరణచేత నన్నుఁజంపుటకు వచ్చుచున్నారని తోఁచుచున్నది. కావున నీవు శీఘ్రముగ బ్రహ్మచారివేషముతోఁబోయి వారివృత్తాంతమును సర్వమును తెలిసికొనుము. మఱియును మృదుమధురోక్తులతో సంభాషించి వారియభిప్రాయమును తెలిసికొని వారు దుష్టహృదయము కలవారైనయెడల హస్తాగ్రముతో సంజ్ఞను చేయుము. సాధుహృదయముకలవారైనయెడల చిఱునగవును చూపుమనిన విని యాహనుమంతుఁడు నీయిష్టానుసారముగ సంచరించెద ననిచెప్పి బయలువెడలిపోయి శ్రీరామునకు నమస్కరించి యిట్లనియె. ఓ పురుషోత్తములారా! మీరెవ్వరనిన, లక్ష్మణుఁడు తమ పూర్వవృత్తాంతమును సర్వమునుచెప్పి మఱియు నిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! శబరివచనానుసారముగ సుగ్రీవునితో స్నేహమునుచేయుటకొఱకు, ఈ శ్రీరాముఁడు వచ్చుచున్నాఁడనిన విని, హనుమంతుఁడు తన వృత్తాంతమును సుగ్రీవవృత్తాంతమును చెప్పి యిట్లనియె. ఓపురుషోత్తములారా! మీరిరువురును నాభుజములమీఁద నెక్కి సుగ్రీవునొద్దకురండు సుగ్రీవునితోఁగూడ మైత్రినిచేయించెద ననఁగానే రామలక్ష్మణు

లతనిభుజములమీఁదనెక్కిరి. అంతట నా హనుమంతుఁడు క్షణమాత్రములో, ఆఋ
శ్యమూకపర్వతము మీఁదికిఁబోయి వారి నొకచెట్టుక్రిందదించి సుగ్రీవునొద్దకుఁబోయి
రామవృత్తాంతమును సర్వమును తెలిపె. అంతట సుగ్రీవుఁడు అగ్నిని ప్రజ్వలింపఁ
జేసి రామునితో స్నేహమును అగ్నిసాక్షికముగఁ జేసె. పిమ్మట నాసుగ్రీవుఁ డొక
కొమ్మనువిరిచి క్రిందవైచి దానిమీఁద రామలక్ష్మణులను కూర్చుండఁబెట్టి తాను
కూడ మంత్రులతో వారికెదుటఁగూర్చుండి తనవృత్తాంతమును సర్వమును తెలియఁ
జేసె. ఆసమయమునందు వారందఱును అధికమైనసంతోషముతోఁ గూడుకొనియుం
డిరి. అట్లు ఒకరివృత్తాంతము నొకరు తెలిసికొనిన పిమ్మట సుగ్రీవుఁ డిట్లనియె. ఓరఘు
కులోత్తములారా! నాయన్న యగువాలి నాకుఁజేసిన యుపకారమును సర్వమును
తెలిపెదను వినుఁడు. మయునిపుత్రుఁడగు దుర్మదుఁ డనువాఁడు పూర్వ మొకసారి
కిష్కింధాపట్టణమునకు వచ్చె. వచ్చి యత్యధికముగ ధ్వనిచేయుచు వాలినియుద్ధము
నకు రమ్మని పిలిచె. ఆవచనమును విని వాలి యుద్ధమునకు బయలువెడలి దృఢము
ష్టిచేత వానినిబొడిచె. అంతట నాదుర్మదుఁడు తాను నివసించునట్టి గుహలోనికిఁ
బరుగిడిపోయె. అప్పుడు వాలికూడ వానితోఁగూడ ఆగుహలోనికిఁబోయె. ఆస
మయమునందు నేనుకూడ బయలువెడలి పోవుచుంటిని. అట్లువచ్చుచున్న
నన్నుఁజూచి వాలి యిట్లనియె. ఓతమ్ముఁడా! నేను గుహలోనికిఁబోయి యీ
దుర్మదుని చంపివచ్చునంతవఱకు నీ వీగుహయొద్ద కాచియుండుమనిచెప్పి యాగు
హలోనికిఁబోయె. అంతట నేనొక్కమాసకాల మక్కడ నివసించియుంటిని.
పిమ్మటఁ గొన్నిదినముల కాగుహనుండి యధికముగ రక్తము ప్రవహించుట
కారంభించె. ఆరక్తప్రవాహమునుచూచి దుర్మదునిచేత వాలి చంపఁబడెనని
నామనస్సునందుఁ దలఁచితిని. ఆసమయమునందు శత్రువులు వచ్చి కిష్కింధా
పట్టణమును ముట్టడించినవృత్తాంతమును విని దుర్మదుఁడు వాలినిఁ జంపి మమ్ములను
కూడ చంపుటకు వచ్చుననియెడు భయముచేత దుర్మదునకు వెలవిగాకుండునట్లుల
ఆగుహాద్వారమునకడ్డముగ పెద్దశిల నొక్కదాని వైచి కిష్కింధాపట్టణమునకు వచ్చి
తిని. అప్పుడు కిష్కింధానగరమును ముట్టడించిన శత్రువులు నన్నుఁజూచి పరుగిడిపో
యిరి. అంతట నేనుభ్రాతృవ్యసనముచేత రాజ్యమును కోరకయుండఁగా మంత్రులు
బహువిధములగు వచనములచేత నన్ను నూరార్చి నాకుఁ బట్టమును గట్టిరి. అంత
టఁ గొన్నిదినములకు దుర్మదునిఁజంపి నాయన్నయగు వాలి కిష్కింధానగరమునకు
వచ్చి నాయభిప్రాయమును తెలిపినను విశ్వసింపక నన్నుఁగొట్టి పట్టణమునుండి
పారఁదోలె. అంతట సకలలోకములయందును సుగ్రీవుఁడు చంపఁదగినవాఁడని దుం
దుభిఘోషముచేత చాటింపును చేయించె. అప్పుడు నేను మిగులభయము కలవాఁ
డనై సకలలోకములయందును సంచరించి, యెందును సుఖము లభింపకఁబోవుట
చేత, ఈఋశ్యమూకపర్వతమునందు ప్రవేశించితిని. ఈపర్వతమునందు సుఖముల

భించుటకు కారణమును చెప్పెదను, వినుము. పూర్వము మహిషరూపమును ధరించిన దుందుభి యను రాక్షసుఁడు యుద్ధమునకు వచ్చి వాలిని పిలిచె. అంతట వాలి బయలువెడలి మహిషాకృతితో నున్న యారాక్షసుని శృంగమును (కొమ్మును) పట్టుకొని వానిశిరస్సును ఛేదించి గిరగిరఁద్రిప్పి విసరివైచె. ఆసమయమునందు వానిశిరస్సు మతంగమునివరుని యాశ్రమసమీపమునందుఁ బడియె. మఱియు నామతంగాశ్రమమునందు అధికముగ రక్తము వర్షించె. అంతట నామునివరుఁడు కోపోద్దీపితుఁడై వాలి యికమీఁద నీపర్వతముమీఁదికి వచ్చెనేని మరణమును పొందునని శపించె. అందువలన వాలి యీపర్వతమునందు ప్రవేశింపకయున్నాఁడు. కావుననే నీపర్వతమునందు సుఖముగ నివసించియున్నాఁడను. ఓరఘుకులోత్తమా! నేను నీభార్యయగుసీతను తెచ్చియిచ్చెదనని యిప్పుడు ప్రతిజ్ఞను చేసెదను. రావణాసురుఁడు నీభార్యను తీసుకొనిపోవునపుడు ఆకాశమునందు నేనుచూచితిని. అట్లుపోవునపుడు తనయాభరణములను ఉత్తరీయపుకొంగున మూటగట్టి మాయొద్దపడునట్లు వైచె. ఆయాభరణములను చూడుమని చెప్పి యాభరణములను చూపె. అప్పుడు రాముఁడాయాభరణముల నన్నిటినిఁ జూచి లక్ష్మణునితో నిట్లనియె. ఓతమ్ముఁడా! లక్ష్మణా! నీవీయాభరణములలో దేనినెఱుఁగుదువో చెప్పుమనిన లక్ష్మణుఁ డోరఘుకులోత్తమా! నేను సీతామహాదేవియొక్క యంగుళీయకమునుమాత్రమెఱుఁగుదును. ఇతరములగు నాభరణములను నే నెఱుఁగను. మఱియు, నోరఘుకులోత్తమా! ప్రతిదినమందును నేను నమస్కరించునపుడు కొన్ని యాభరణములు ఇందుఁ గలవనిన విని శ్రీరాముఁడు పరమానందమును సీత యికలభ్యమగునని తలఁచె. ఆసమయమునందు శ్రీరాముఁడు సుగ్రీవునకు తనయందు నమ్మకముకలుగుటకొఱకు దుందుభియొక్క శరీరమును పాదాంగుష్ఠముచేతఁ బదియోజనముల దూరమునఁ బడునట్లు చిమ్మె. అనంతరమందు చక్రాకారముగనున్న యేడు తాటిచెట్లను ఒక్కబాణముచేత ఛేదించె. తొల్లి వాలిచేత గుహయందు దాచఁబడిన తాళఫలములేడును, ఏడువృక్షములయ్యె. ఆకాలమునందు ఆదిశేషునియొక్క యంశముతో నున్న సర్పము ఈవృక్షముల నొక్కబాణముచేత నెవ్వఁడు ఛేదించునో, అట్టివాఁడు వాలిని వధింపఁగలఁడని చెప్పియుండుటవలన, సుగ్రీవునకు రామునియందు నమ్మకముకలిగె. అంతట సుగ్రీవుఁడు పరమానందము కలవాఁడై యిట్లనియె. ఓరఘుకులోత్తమా! పూర్వము దేవేంద్రుఁడు వాలికి నొకపూలమాలిక నిచ్చి, యోవాలీ! ఈమాలిక నీ మెడయందుండఁగా నీతో యుద్ధమునకు వచ్చినశత్రువుల బలమంతయును నశించిపోవు నని చెప్పి మఱియు నిట్లనియె. ఓపుత్త్రుఁడా! వాలీ! పూర్వము కశ్యపప్రజాపతి దుష్కరమైన తపస్సునుచేసి శివునివలన నీమాలికను సంపాదించెను. కావున దీనియం దధికమైన సామర్థ్యము కలదు. నీయందలి ప్రేమచేత దీనిని నీకు సమర్పించితి ననియె. అది మొదలుకొని యామాలికను కంఠ

ముపందు వాలి ధరించుచుండును. కాఁబట్టి యోరఘుకులోత్తమా! నీవామాలికను చూచినతోడనే బలహీనుఁడవగుదువు. కావున దానికిఁ దగినయుపాయము నవలంబించి నీకు జయము కలుగునటుల యోచింపుమనిన విని రాముఁడు ఆతాళవృక్షములక్రింద సర్పరూపముతో నున్న యాదిశేషునితో నిట్లనియె. ఓనాగరాజోత్తమా! నీవు కిష్కింధాపట్టణమునకుఁబోయి వాలి నిద్రించుచున్నసమయమునందు, అతని మెడయందున్నమాలిక నపహరింపుమనిన, ఆసర్పము కిష్కింధాపట్టణమునకుఁబోయి వాలి నిద్రించుచున్నసమయమునందు మంచముమీఁదఁ బెట్టియున్న యామాలిక నెత్తికొనిపోయి దేవేంద్రున కిచ్చె. అనంతరమందు రామాజ్ఞ నవలంబించి సుగ్రీవుఁడుపోయి వాలితో యుద్ధమును చేయుచుండె. అప్పుడు శ్రీరాముఁడు వాలిసుగ్రీవులనుఁ జూచి యిరువురును సమానాకారములు కలవారై యుండుటచేత బాణమును ప్రయోగించినయెడల మిత్రద్రోహమును చేసినవాఁడనగుదు ననుభయముతో బాణమును ప్రయోగింపక యూరకుండె. అంతట సుగ్రీవుఁడు వాలితోఁ బోరఁజాలక మరల మతంగాశ్రమమునకు వచ్చి శ్రీరామునిఁజూచి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నన్ను వాలిచేత వధింపఁజేయఁదలఁచి యుద్ధమునకు పంపుటకంటె, నీవే నన్ను వధింపరాదా? నన్ను యుద్ధమునకుఁ బొమ్మనిచెప్పి నీవూరకుంట న్యాయమా? ఇది మిత్రధర్మమగునా? అని సుగ్రీవుఁడు చెప్పినవాక్యమును విని శ్రీరాముఁ డిట్లనియె. ఓవానరోత్తమా! నేను దుష్టబుద్ధిచేత అట్లు చేసినవాఁడనుకానని చెప్పి, తనయభిప్రాయమును తెలిపి, యితను సుగ్రీవుఁడని తెలియుకొనుటకై యతని మెడయందు మాలిక నొకదానిని వైచి మరల యుద్ధమునకుఁబంపె. అంతట నాసుగ్రీవుఁడు బయలువెడలి పోయి మరల వాలిని యుద్ధమునకు రమ్మనియె. అంతకుముందుగానే తార రామసుగ్రీవుల వృత్తాంతమును విని యుండుటచేత వాలితో నిట్లనియె. ఓమనోనాయకుఁడా! అంగదునివలన సుగ్రీవుని వృత్తాంతమును సర్వమును వింటినని, జరిగినవిషయమును సర్వమును తెలిపి యుద్ధమునకుఁ బోవద్దని యనేకవిధములఁ బ్రార్థించి యిట్లనియె. ఓవానరోత్తమా! నీవిప్పుడు సుగ్రీవునితోఁగూడ యుద్ధమును చేయక శ్రీరామునితో మిత్రత్వమును చేయుము. అందువలన మనకు మేలుకలుగుననిన వాలి యిట్లనియె. ఓతరుణీ! రాముఁ డనువాఁడు మానవరూపమును ధరించి వచ్చిననారాయణుఁ డని నే నెఱుఁగుదును. కావున రామునిమూలకముగ నేను మరణమును పొందెదను. రామహస్తమువలన మరణమును పొందినయెడల నేను పరమపదమును పొందుదును. నీవు విచారమునుపొందక నాయనంతరమందు సుగ్రీవునిపొంది సుఖముగనుండుము. ఓప్రియురాలా! సుగ్రీవుఁడు నీతోఁగూడ క్రీడించుచు నిన్ను సుఖింపఁజేయును. అట్లయినయెడల నతనిభార్యను అపహరించినందువలనఁ గలిగినఋణమును తీర్చికొనినవాఁడ నగుదును. మఱియు, తరుణీ! నాకు మరణకాలము సమీపించినది కనుకనే నాకంఠమునం

దలి మాలిక మాయమైపోయినది. నేనిప్పుడు రామబాణముచేత యుద్ధరంగమునందుఁ బడిపోదును. అందువలన నేనిప్పుడు ధన్యుఁడనగుదును. నాతల్లిదండ్రులు ధన్యులగుదురని యాతారనూరార్చి యావాలి మిగుల త్వరకలవాఁడై యనేకములైన మహోత్పాతములను చూచి యధికానందమును పొందె. అనంతరమంత యుద్ధమునకుఁ బయలు వెడలిపోయి సుగ్రీవునితోఁగూడ యుద్ధమును చేయుచుండె. అప్పుడు శ్రీరాముఁడు చెట్టుచాటుననుండి బాణమును ప్రయోగించి యావాలిని క్రిందఁబడవైచె. ఆసమయమునందు తార యక్కడకువచ్చి క్రిందఁబడియున్న వాలిని చూచి యధికముగాదుఃఖమును పొందె. వాలి లక్ష్మీపతి యగు రామునిచూచి గద్గదకంఠుఁడై యిట్లనియె. ఓ దేవోత్తమా ! నీవు చెట్టుచాటుననుండి బాణమును నా వక్షస్థలమునందు ప్రయోగించితివి. కావున నీకిప్పు డపకీర్తియును నాకు కీర్తియును కలిగినది. నీకు నేనేమియపకారమును చేయుటచేత నన్నుఁజంపితి వనిన శ్రీరాముఁ డిట్లనియె. ఓవానరాధమా ! నీవు సుగ్రీవునిభార్య యగురుమయందు ప్రియముకలవాఁడై బలాత్కారముగ నింటనుంచుకొని భ్రాత యగుసుగ్రీవునిఁ జంపుటకొఱకు యత్నించితివి. కావున ప్రయత్నించి నిన్నుఁ జంపితిని. ఓ వానరాధమా ! నీకు తార యేవిధముగా ప్రియురాలై యున్నదో యావిధముగానే రుమకూడ సుగ్రీవునకు ప్రియురాలే కదా ? కావున నీవిప్పుడు రుమనుపొందుచున్న విధముగ సుగ్రీవుఁడుకూడ తారను పొందును. నీవు దురాచారము నవలంబించుటచేత నిన్ను వధించితిని. ఓ వానరోత్తమా, నీవు ద్వాపరాంతమునందు భిల్లుఁడవై పుట్టి నాపాదాంగుష్ఠమును బాణముచేతఁ జాటుననుండికొట్టి యీ వైరమును తీర్చుకొనఁగలవు. అనంతరమందు నాచేత మరణమును పొందుటవలనఁ గలుగునట్టి వైకుంఠవాస మహాఫలమును పొందఁగలవనిన విని వాలి యిట్లనియె. ఓరఘుకులోత్తమా ! నీవు చెప్పినవిధముగ సర్వమును జరుగుననుటకు సందేహము లేదు. నీవు సీతావృత్తాంతమును నాకుఁ దెలిపినయెడల నేననాయాసముగ సీతను తెచ్చి నీకు సమర్పించియుందును. అట్లు చేయనైతివి. మిగిలినదానికి నేమిచేయనచ్చును. ఓ రఘుకులోత్తమా ! నాప్రార్థనను విని నాపుత్త్రుఁడైన యంగదుని పాలింపుమని చెప్పి యావాలి ప్రాణములనువిడిచె. అంతట శ్రీరాముఁడు అంగదునిచేత ఆవాలికి ప్రేతకృత్యములను చేయించె. పిమ్మట సుగ్రీవుఁడు కిష్కింధాపట్టణమున కధిపతివి కమ్మని శ్రీరాముని ననేకవిధములఁ బ్రార్థింపఁగా, నేను రాజ్యాధిపతినగుట యుచితముకాదని చెప్పి సుగ్రీవుని కిష్కింధాపట్టణమున కధిపతినిఁగాఁజేసి లక్ష్మణునితోఁగూడ వర్షాకాలపుదినములను గడపుటకొఱ కిచ్ఛయించె. అనంతరమందు రామలక్ష్మణులు బయలువెడలి ప్రవర్షణాచలముమీఁదికిఁ బోయి యాపర్వతమునందలి రమ్యమయిన గుహాయందు వర్షాకాలదినములను గడపె. అట్లు వర్షాకాలదినములను గడపుచున్న కాలమునం దొక్కనాఁడు లక్ష్మణుఁడు స్నానమునుచేసి రామునకు నమస్కారము

ను చేయుటకు వచ్చుచుండఁగా సాత్త్వికరూపమును ధరించియున్న సీతతో రాముఁడు క్రీడించుచుండుటను చూచె. చూచి లక్ష్మణుఁ డాసీతకు నమస్కారమునుచేసె. అంతలోపల నాసీత యంతర్ధానమును పొందె. అంతట మరల రామునకు వియోగము సంభవించె. అక్కడ సుగ్రీవుఁడు రాజ్యమునుచేయుచు హనుమంతుని వాక్యానుసారముగ సకలవానరులను పిలిపించుచుండె. ఆసమయమునందు శరదృతువు వచ్చుటయును సుగ్రీవుఁడు తమయొద్దకు రాకపోవుటయును చూచి శ్రీరాముఁడు కోపోద్దీపితుఁడై సుగ్రీవునొద్దకుఁ బోయి రమ్మని లక్ష్మణునిఁబంపె. అంతట లక్ష్మణుఁడు కిష్కింధాపట్టణమునకుఁబోయి వానరులనందఱను భయపఱచె. అప్పుడు లక్ష్మణుఁడు వచ్చినవృత్తాంతమును విని సుగ్రీవుఁడు మిగుల భయముకలవాఁడై లక్ష్మణుని కోపశాంతిని చేయుటకొఱకు హనుమంతునిఁ బంపె. అంతట హనుమంతుఁడుపోయి లక్ష్మణునకు శాంతిసికలిగించి కిష్కింధాపట్టణమునకుఁ దీసికొనిపోయె. అట్లు లక్ష్మణుఁడు సుగ్రీవునొద్దకుఁ బోవుచుండఁగా మధ్యకక్ష్యయందు తారయెదురుగవచ్చి యనేకవిధముల లక్ష్మణుని బ్రార్థించి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! రామకార్యమున కపరిమితముగ వానరసైన్యము రప్పింపఁబడినది. కావున సుగ్రీవునియందు దోషములేదు. శాంతిని పొందవలయునని లక్ష్మణునిహస్తమును పట్టుకొని సుగ్రీవునొద్దకుఁ దీసికొనిపోయె. అప్పుడు సుగ్రీవుఁడు మిగుల భయముకలవాఁడై సింహాసనమునుండి లేచె. అంతట లక్ష్మణుఁడు ఓ వానరోత్తమా! రాముని మఱచిపోతివా? వాలినిఁజంపిన రామునిబాణము నిన్నుఁజూచుచున్నది. నీ విప్పుడు వాలిపోయిన మార్గమునఁ బోదువని మిగులఁ గఠినముగ మాటలాడుచున్న లక్ష్మణునితో హనుమంతుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవీవిధముగ మాటలాడఁదగునా? సుగ్రీవుఁడు ప్రతిదినమును రామకార్యముకొఱకు విశేషముగ బ్రయత్నమును చేయుచున్నాఁడు. రామవృత్తాంతమును మరచినవాఁడు కాఁడని చెప్పి సుగ్రీవునిచేతఁ బూజింపఁజేసి లక్ష్మణుని శాంతునిగాఁజేసె. అంతట సుగ్రీవుఁడు లక్ష్మణునితోఁగూడ ననేకవానరవీరులను వెంటఁబెట్టుకొని రామునియొద్దకువచ్చి రామునకు నమస్కరించి వానరసైన్యమును సర్వమునుచూపి వానరాధిపతి యగుసుగ్రీవుఁడు శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! వానరసైన్య మపరిమితముగ వచ్చుచున్నది. చూడుము. ఈ వానరసైన్యమునందు యూథాధిపతులు పదునెనిమిది పద్మసంఖ్యలు కలవారై యున్నారని చెప్పి రామాజ్ఞానుసారముగ సీతనువెదకివచ్చుట కన్నిదిక్కులకును అనేక వానరవీరులనుఁ బంపె. మఱియును దక్షిణదిక్కునకు జాంబవంతుఁడు అంగదుఁడు ఆంజనేయుఁడు నలుఁడు సుషేణుఁడు శరభుఁడు మైందుఁడు మొదలగువారినిఁ బంపుచు నిట్లనియె. ఓవానరోత్తములారా! నెలదినము లతిక్రమింపకమునుపే మరలిరండు. అట్లు రానియెడల మిమ్ములనందఱను వధింతునని చెప్పె. అప్పుడు శ్రీరాముఁడు సీతకు విశ్వాసము కలుగుటకొఱకు అంగుళీయకమునుదీసి హనుమంతుని

హ స్తమునందుంబెట్టి యిట్లనియె. ఓయాంజనేయా! నానామముద్రితమైన యీయంగు
ళీయకమును రహస్యముగ సీతకిమ్మనిచెప్పి తనమంత్రమునుగూడ హనుమంతుని
కిచ్చి యీమంత్రమును లక్షపర్యాయములు జపించుచు వ్రాసినయెడల నిరుపమా
నమైన సామర్థ్యము కలుగుననియె. ఆవచనమును విని హనుమంతుండు పరమానం
దము కలవాండై శ్రీరామునకు నమస్కరించి బయలు వెడలె. ఆసమయమునందు
శ్రీరాముండు చిత్రకూటాదిపర్వతములయందు జరిగిన సకలరహస్య వృత్తాంతములను
కూడ సీతకు నమ్మకము కలుగుటకొఱకు చెప్పుమని హనుమంతునితోం జెప్పె.
అంతట వానరులందఱును బయలు వెడలి నలుదిక్కులకును బోయిరి. అంతటం గొన్ని
దినములలోపల తూర్పు పశ్చిమ కుబేరదిక్కులకుంబోయిన వానరులందఱునువచ్చి
సీత యెక్కడను కనంబడలేదని చెప్పిరి. అంగదాదివానరులు మాత్రము మరలిరాక
సకలారణ్యములయందును వెదకుచుండిరి. అట్లు వెదకుచు నొకగుహనుండి యనేక
వేలఖేచరులతోంగూడ వచ్చుచున్న యొకపురుషునిజూచి రావణుండని తలంచిరి. అనం
తరమందు రావణుండు కాదని విడిచిరి. ఈవిధముగం బదునెనిమిదిదినములు వెదకి యెం
దును సీతనుగానక చింతించుచు నొక్కచోట దివ్యమందిరమునందున్న దివ్యస్త్రీని
చూచి సీతయనితలంచి తమవృత్తాంతమును సర్వమునుచెప్పిరి. అంతట నాయంగనామ
ణి తనవృత్తాంతమును సర్వమును చెప్పి యిట్లనియె. ఓవానరోత్తములారా! తొల్లి
విశ్వకర్మయొక్క పుత్రిక యగు హేమ యనునది నృత్యముచేత పరమశివునకు
సంతోషమును కల్పింపంగా పరమశివుం డీపట్టణమునిచ్చె. అది చిరకాల మీపట్ట
ణమున నివసించి స్వర్గమునకుం బోందలంచి నన్నిక్కడనిలిపి యిట్లనియె. ఓతరుణీ!
నారాయణుండు రామరూపముతో నిక్కడకువచ్చును. అప్పుడు నీవు రామునిపూ
జించి యాపుణ్యవిశేషముచేత నీవును స్వర్గమునకు రమ్మనిచెప్పి తాను స్వర్గమునకుం
బోయె. నేనుస్వయంప్రభయను నామధేయముకలదానను. విశ్వకర్మపుత్రికయగు
హేమ యనుదానికి చెలికత్తియ ననియె. ఆవచనములను విని యంగదాదులు
తమకొక్కదినము వ్యర్థముగం గడచిపోయెనని తలంచి యిట్లనిరి. ఓ స్త్రీరత్నమా!
మే మీగుహనుండి బయలువెడలి పోవుటకు చిరకాలమగును. కావున శీఘ్ర
ముగం బోవుటకుందగిన యుపాయమునుచెప్పుమనిన, ఆ స్త్రీరత్నము ఆవానరుల
తోంగూడ క్షణములోపల గుహనుండి బయలునకుంబోయె. అంతట నావానరు లొ
క్కదినము వ్యర్థముగంబోవుటకు జంతించుచు సముద్రము దగ్గరకుంబోయి సీత
నుచూడక పోవుటకంటె మరణమునుపొందుట యుచితమనితలంచి ప్రాయోపవేశ
మునుచేసిరి. అట్లు ప్రాయోపవేశమునుచేసి రామకార్యమునకు యత్నించి జటాయు
వుకూడ మనవలెనే మరణమును పొందెనని చింతించిరి. అట్లు రామకార్యము కొఱ
కు జటాయువు మరణమును పొందినవృత్తాంతమును వానరులు చెప్పుకొనుచున్న వి
షయమును, అంతకుముందు వారిని జంపుట కుద్యుక్తుండై వచ్చిన సంపాతి విని

మిగుల విచారమును పొంది తమ్ముఁడగు జటాయువునకు ఉదకదానమునుచేసి పిమ్మట సీతావృత్తాంతమును సర్వమును ఆవానరులకుఁ దెలిపి, మఱియు నిట్లనియె. ఓ వానరోత్తములారా! ఇక్కడకు నూఱామడదూరమున సముద్రమధ్యమందు లంకాపట్టణము కలదు. ఆపట్టణమునందలి యశోకవనికామధ్యమందు సీతామహాదేవి కలదు. మీరు సముద్రమును దాఁటిపోయి సీతను జూడుఁడు. నేను ఱెక్కలులేనివాఁడను కనుక పోఁజాలను. నేను గృధ్రమునగుటవలన దూరదృష్టి కలవాఁడనగుటచేత, ఈపర్వతముమీఁద నుండియే సీతామహాదేవిని చూచుచున్నాను. పూర్వమునందు నా తమ్ముఁడగు జటాయువును నేనును సూర్యునొద్దకుఁ బోదమని తలఁచితిమి. అప్పుడు నేను సూర్యమండలసమీపమునకును నెగిరిపోతిని. ఎగిరిపోయి సూర్యునివేఁడిమిచేత కాల్పఁబడిన ఱెక్కలుకలవాఁడనై యిక్కడ పడితిని. నాతమ్ముఁడగు జటాయువు దేశాంతరమునకుఁ బడుటచేత నే నెక్కడఁబడినదియును తెలిసికొనలేకపోయె. నేనును వానిని దెలిసికొనలేకపోతిని. అట్లు ఱెక్కలులేకపడిన నేను చంద్రశర్మ యనుపేరు కల మునివరునకు నమస్కరించి నా వృత్తాంతమును సర్వమును తెలిపితిని. ఆసమయమునందు ఆమునివరుఁడు ఓ పక్షిరాజోత్తమా! నీవు సీతను వెదకుచువచ్చిన వానరులకు సీతావృత్తాంతమును చెప్పినకాలమునందు నీకు ఱెక్కలు మొలచుననియె. ఓవానరోత్తములారా! చూడుఁడు. నాకు ఱెక్కలు మిగులఁ గోమలములై పుట్టుచున్నవి. తొల్లి యాకాశమార్గమునందు రావణాసురుఁడు సీతను గొనిపోవుచున్నాఁడని నాపుత్త్రుఁడు చెప్పఁగానే నేను సీతనువిడిపింపక యూరకుండుట యుచితమాయని నేను నిందించితిని. అంతట నాపుత్త్రుఁడు కోపముకలవాఁడై లేచిపోయెను. కావున నేను పుత్త్రునిచూచుటకుఁ బోయెద నని చెప్పి యాసంపాతి యచ్చోటనుండి బయలువెడలిపోయె. అంతట నావానరులందఱును నూఱామడకల సముద్రమును దాఁటు విషయమై తమ సామర్థ్యములను చెప్పిరి. వారిలో నెవ్వఁడును దృఢముగ నూఱామడకలసముద్రమును దాఁటుటయందు సామర్థ్యములేదనిరి. ఆసమయమునందు అందఱివృత్తాంతమును చక్కఁగ నెఱిఁగినవాఁడును వృద్ధుఁడును అయిన జాంబవంతుఁడు హనుమంతుని మాటిమాటికిని స్తోత్రముచేసి నీవు లంకాపట్టణమునకుఁబోవ సమర్థుఁడవనియె. ఆవచనమును విని హనుమంతుఁడు లంకాపట్టణమునకుఁ బోవ యత్నించి పర్వతముమీఁద నెక్కి యెగురుట కుద్యమించె. అప్పుడు అతని పాదముల పూనికకు భూమి క్రుంగె. అంతట నాహనుమంతుఁడు శ్రీరాముని స్మరించె. మఱియును, పాపములు నశింపఁజేయునట్టి శ్రీరామచరిత్రమును సర్వమును స్మరించె.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానందరామాయణమున
సారకాండమునందు కిష్కింధలో వాలిసంహార మను
నామధేయముకల యెనిమిదవసర్గ ముగిసెను.

* జానకవృత్తాంతము. *

అంతట హనుమంతుఁడు ఎగిరి యాకాశమార్గముచేత పోవుచుండఁగా దేవతలు ఆహనుమంతుని బలమును పరీక్షించుటకు నాగమాతయగు సురస యనుదానిని బంపిరి. అప్పు డాసురసయనునది హనుమంతుని కడ్డముగవచ్చి యోహనుమంతుఁడా ! నే నాఁకలిగొనియున్నాను. కావున నావదనమునందుఁ బ్రవేశింపు మనిన, హనుమంతుఁ డిట్లనియె. నాగమాతా ! నేను శ్రీరామకార్యార్థముగఁ బోవుచున్నాఁడను. కావున కార్యమును నెరవేర్చుకొని వచ్చినపిమ్మట నీనోటియందుఁ బ్రవేశించి నీయభీష్టమును దీర్చెద ననియె. అంతట నాసురస ఆమాట వినక యనేకవిధముల నిర్బంధింపఁగా హనుమంతుఁడు దానివదనమునందుఁ జొరఁబడుటకు నలవికాకుండు నట్లు వృద్ధిపొందె. అంతట నదియును అధికముగ నోరునువృద్ధినిపొందించె. అప్పుడు హనుమంతుఁడు తగినయుపాయమును యోజించి యంగుష్ఠమాత్ర శరీరముకలవాఁడై దాని నోటియందుఁ బ్రవేశించి బయలునకుఁ బోయె. అంతట నాసురస హనుమంతుని బలమును తెలిసికొని యనేకవిధముల స్తోత్రముచేసి స్వర్గమునకుఁ బోయె. అంతట హనుమంతుఁడు బయలు వెడలిపోవుచుండఁగా హనుమంతునకు విశ్రాంతిని కలుగఁజేయఁ దలఁచి సముద్రుఁడు మైనాకుని బంపె. అప్పుడు హనుమంతునకు విశ్రాంతిని కలుగఁజేయుటకొఱకు నానావిధములగు మణిమయ శృంగములు కలవాఁడును పర్వతాకారుఁడును అగు మైనాకుఁడు సముద్రమధ్యమునుండి బయలువెడలె. అట్లు బయలువెడలివచ్చి యామైనాకుఁడు మానవాకారము నవలంబించి పర్వతముమీఁదఁ గూర్చుండి మార్గమునఁ బోవుచున్న హనుమంతుని జూచి యిట్లనియె. ఓ ఆంజనేయా ! ఈపర్వతముమీఁద కూర్చుండి అమృతతుల్యములును పక్వములును అయినఫలములను అనుభవించి అలతను తీర్చుకొని పొమ్ము. మఱియు నో యాంజనేయా ! పూర్వము ఇంద్రునకును పర్వతములకును మిగుల భయంకరమైన యుద్ధమయ్యె. అప్పుడు నేను దశరథమహారాజుచేత విడువఁబడితిని. కావున నేనిప్పుడు ప్రత్యుపకారమును చేయుటకు వచ్చితిని. నీవు రామునికార్యమునకుఁ బోవుచున్నావు. కనుక నాయందు విశ్రమించిపోతివేని నేను దశరథునకు ప్రత్యుపకారమును చేసినవాఁడ నగుదుననిన విని హనుమంతుఁ డిట్లనియె. ఓపర్వతోత్తమా ! నాకు రామకార్యమునందు శ్రమమేమియును లేదు. నేను స్వామికార్యమును ముగింపక భోజనవిశ్రాంతుల ననుభవింపననిన, మైనాకుఁడు మరల నిట్లనియె. ఓఆంజనేయా! నీవు మిగుల పావనుఁడవు కనుక నన్ను స్పృశించి పవిత్రునిగాఁ జేయు మనిన విని హనుమంతుఁడు హస్తాగ్రముచేత మైనాకుని స్పృశించిపోయె. అంతటఁ గొంతదూరముపోయిన పిమ్మట ఛాయాగ్రహరూపముతో నున్నదియును మిక్కిలి భయంకరమైనదియును అగు సింహిక యనురాక్షసస్త్రీ సముద్రమధ్యమునుండి హనుమంతుని ఛాయామూలకముగ నాకర్షించి ఆరాక్షసస్త్రీ ఛాయామూలక

ముగా నాకాశమున బోవుజంతువుల నాకర్షించి భక్షించుచుండును. కనుక హనుమంతునికూడ అదేవిధముగ భుజించుటకు యత్నించె. అట్లు సింహిక యనుఛాయాగ్రహము తన్ను ఆకర్షించుచున్న సమయమునందు ఛాయాయా పుడగు హనుమంతుఁ డిట్లని యాలోచించె. వీఁ డెవ్వఁడు, నావేగమునకు విఘ్నమును కల్పించుచున్నాఁడని యాలోచించి క్రిందచూచె. అప్పుడు క్రిందిభాగమునందు సింహిక యనురాక్షసస్త్రీ కనఁబడియె. అంతట నాహనుమంతుఁడు దీనితోఁ బోరుచున్నయెడల కాలహరణ మగునని తలఁచి దాని ముఖమునందుఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించి దానిపేగులను చించుకొని బయలు వకువచ్చి పోవుచుండె. అవ్విధముగఁబోయి సముద్రముయొక్క దక్షిణపుతీరమునఁ బ్రవేశించి సింహికను చంపినవిధముగ రావణునకు చెలియలగు క్రౌంచ యనుదానిని సంహరించె. అంతట లంకాపురి యనురాక్షసస్త్రీ యా హనుమంతుని బెదరించె. అప్పుడు హనుమంతుఁడు కోపోద్దీపితుఁడై యెడమచేతి పిడికిలిచేత ఆరాక్షసిని కొట్టె. ఆసమయమునందు ఆరాక్షసస్త్రీ బ్రహ్మవాక్యమును స్మరించి కన్నీళ్లను కార్చుచు నిట్లనియె. ఓహనుమంతుఁడా! పూర్వము బ్రహ్మదేవుఁడు నాతో నిట్లనియె. ఓ రాక్షసీ! వానరుఁడు ని న్నెప్పుడు జయించునో అప్పుడు శ్రీరాముఁడు రావణుని సంహరించుటకు వచ్చుననియె. కావున నోహనుమంతుఁడా! రాముఁడు ఇఁకమీఁదట రావణుని సంహరింపఁగలఁడు. నీ విప్పుడు నన్ను జయించితివి. కావున నిక్కడనుండి బయలువెడలిపోయి లంకాపట్టణమునందలి అశోకవనికామధ్యమందు నివసించియున్న సీతామహాదేవిని చూడుమనియె. అంతట హనుమంతుఁడు లంకాపట్టణమును చూచుచుఁ బోయె. మఱియు నాహనుమంతుఁడు చిత్రకూట పర్వతమునందున్నదియును, మిగుల రమ్యమైనదియును, గోపురాట్టాలకాదులచేత నలంకరింపఁబడినదియును, అయిన లంకాపట్టణమునందుఁ బ్రవేశించె. అంతట నాహనుమంతుఁడు ప్రతిదినమునందును ప్రతిగృహమునందును సీతామహాదేవిని వెదకుచు నొకానొకగృహమునందు నిద్రించుచున్నవాఁడును మిక్కిలి భయంకరుఁడును అయినకుంభకర్ణుని జూచె. అనంతరమందు రామచరిత్రమును గానముచేయుటయందు ప్రియముకల విభీషణుని జూచె. అప్పు డావిభీషణుఁడు ధర్మపత్ని యగు సులోచనతోఁ గూడ నిద్రించుచుండె. అనంతరమందు రాజమందిరమునకుఁ బోయి సభయందున్న రావణుని జూచె. అంతట వాయురూపుఁడై దీపములనార్చి యారావణాదులను వస్త్రహీనులనుగాఁ జేసె. మఱియు నాదీపముయొక్క కొడిచే రావణుని కూర్చమును భస్మమునుగాఁ జేసె. మఱియు ననేకవేలమంది రాక్షసస్త్రీల వస్త్రముల నపహరించి యచ్చటనున్న జలభాండములఁ బగులఁగొట్టె. మఱియును దనవాలముచేత రావణభటులను గొట్టె. ఆసమయమునం దెల్లవారును తమలోఁ దామిట్లనిరి. ఓహో దుర్మార్గుఁడగు నీరావణుఁడు చెఱసాలయందుఁ బెట్టి బాధించుచుండుటచేత నామహా

దేవి కోపోద్దీపితురాలై మనప్రాణములను బోఁగొట్టుచున్న దనిరి. ఆవచనములను విని హనుమంతుఁడు సంతుష్టచిత్తుఁడై రావణుని గృహములయందంతటను వెదకి సీతామహాదేవి నెందునుగానక మిగుల నుత్తమమగు పుష్పకవిమానముదగ్గరకుఁ బోయి లక్ష్మణుఁడు చెప్పినగుర్తుల నావిమానమునందుఁ జూచి సీతను వెదకుచు నావిమానమునం దొక్కయంగనను జూచి సీతయని తలఁచి విహ్వలచిత్తుఁ డయ్యెనని పరమేశ్వరుఁడు చెప్పినవాక్యములను విని పార్వతీదేవి యిట్లనియె. ఓ దేవోత్తమా! రాక్షసియగు మందోదరి సీతయని యెట్లు చెప్పఁబడినది. స్త్రీలందఱును సీతామహాదేవియొక్క యంశాంశజు లనుటకుఁ గారణమేమి? అనిన పరమశివుఁ డిట్లనియె. ఓపార్వతీ! నీ వడిగినదానికిఁ దగినకారణమును చెప్పెదను వినుము. సీతను సృజించిన విష్ణుదేవుఁడే మందోదరినికూడ సృజించె.కావున సీతవలె నున్నదని చెప్పఁబడియె. మఱియు నోపార్వతీ! ఒకనాఁడు కైకసి యనునది పుత్త్రుఁడగు రావణుని మిగుల దుఃఖముతో నిట్టూర్పుల విడుచుచు నిట్లనియె. ఓ పుత్త్రోత్తమా! నాచేత పూజింపఁబడుచున్న శివలింగము రసాతలలోకమునకుఁ బోయినది.కావున నీవు శివునిదగ్గరకుఁ బోయి మిక్కిలిశ్రేష్ఠమగు నాత్మలింగమును దెచ్చి యిమ్మని తల్లియగు కైకసి చెప్పినవాక్యమును విని యారావణుఁడు వరములనిచ్చునట్లె నన్ను సామగానముచేత ననేకవిధములఁ బ్రార్థించె.అంతట నేను ప్రసన్నుఁడనుకాఁగా నన్ను రెండు వరముల నడిగె.అవి యెవ్వియనిన:—ఓ దేవోత్తమా! మాతల్లి పూజనుచేసికొనుటకాత్మలింగము నిమ్ము? మఱియును పార్వతిని నాకుభార్యనుగానిమ్ము? అనియడుగుటచేత నోపార్వతీ! నిన్ను రావణున కిచ్చితిని.అనంతరము నాత్మలింగమునుసమర్పించి యోరావణా! మార్గమధ్యమునం దీలింగమును క్రిందనుంచితివేని యక్కడనుండి బయలువెడలదని చెప్పితిని. అంతట రావణాసురుఁడు వల్లెయని నిన్నును లింగమును కైకొనిపోవుచుండె. ఆసమయమునందు నీవు విష్ణుదేవుని స్మరించితివి. అప్పుడు విష్ణుదేవుఁడు చందనాదికముచేత మందోదరి యనుదానినిజేసి మయునిచేతి కిచ్చె. అంతట నామయుఁడు ఆమందోదరిని గైకొని పాతాళలోకమునందలి తనగృహమునకుఁ బోయె. అంత నిక్కడ విష్ణుదేవుఁడు బ్రాహ్మణరూపముతో రావణాసురున కెదురుగవచ్చి యిట్లనియె. ఓరావణా! పరమశివుఁడు నిజమైనపార్వతిని నీయక, కృత్రిమయగుపార్వతిని నీకిచ్చె. నిజమైన పార్వతి పాతాళలోకమునందలి మయునిగృహమునందు దాచఁబడియున్నది. నీవు భూలోక స్వర్గలోకములయందు దాచినయెడల వెదకుదువనియును, పాతాళలోకమును స్త్రీయలోకమనియెడు తలంపుతో వెదుకవనియును తలఁచి పాతాళలోకమునందు దాచె. ఈకృత్రిమదుర్గ నిక్కడవదలి, పాతాళలోకమునకుఁ బోయి మయునిగృహమునందుఁ జూడుము. చూచి మిక్కిలిని జక్కనిదియగు పార్వతిని భార్యనుగాఁ గైకొని సుఖమును పొందుమని యా బ్రాహ్మణుఁడు చెప్పినవాక్యమును, సత్యమునుగాఁదలఁచి, యారావణుఁడు నన్ను నుద్దేశించి

యిట్లనియె, ఓరీ శివుఁడా! నిజమైన పార్వతిని దాచి కృత్రిమయగు పార్వతిని నాకిచ్చితివి కనుక నీవే దీనిని పెట్టుకొనుము. నేను పాతాళలోకమునకుఁ బోయి యక్కడదాచఁబడియున్న పార్వతిని పొంది సుఖించెద నని చెప్పి, యాపార్వతి నక్కడ విడిచిపోవుట కుద్యుక్తుఁ డయ్యె. అప్పుడు మూత్రోత్సర్జనశంకకలవాఁడై యాబ్రాహ్మణునితో నిట్లనియె. ఓ బ్రాహ్మణోత్తమా! ఈ యాత్మలింగమును క్షణము సేపు నీ చేతియందుఁబెట్టుకొని యుంచుము, నేను పోయి మూత్రశంకను తీర్చుకొని మిగులవేగముతో వచ్చెదననిన నాబ్రాహ్మణుఁ డిట్లనియె. ఓరాక్షసరాజోత్తమా! నీవొకముహూర్తకాలమునకు రాకపోయినయెడల నే నీలింగము నిక్కడఁబెట్టిపోయెద ననియె. అందుకు రావణుఁ డంగీకారమును పొంది యాబ్రాహ్మణుని హస్తమునం దాత్మలింగమును బెట్టి బయలువెడలిపోయె. పోయి మూత్రమునువిడుచుచుండఁగ దైవయోగముచేత మూత్రధార శీఘ్రముగ రానందున కాలాతిక్రమమయ్యె. అంతట నాబ్రాహ్మణుఁడు సముద్రపుగట్టున నాలింగమును స్థాపించి వెడలిపోయె. అంతఁ గొంతసేపటికి రావణుఁడు మూత్రోత్సర్జనముచేసి యుదకస్పర్శాదుల నాచరించివచ్చి భూమియందుంచఁబడిన యాలింగమును కదల్చిచూచె. అప్పు డాలింగము కదలక పోయె. మఱియు నాలింగమును కదల్చునపు డాలింగముయొక్క శిరస్సునందు కరరంధ్రమునకు సమమగు రంధ్రమొక్కటి పడియె. అంతట నాలింగము భూమికి కర్ణోపమమైన లింగమయ్యె. దానంజేసి యాచోటునకు గోకర్ణమని నామము కలిగె. పిమ్మట రావణాసురుఁడు మిగుల ఖిన్నమైన మనస్సుకలవాఁడై యేమియును జేయఁజాలక నిజమైన పార్వతినైనఁ బొందుద మనితలంచి పాతాళలోకమునకుఁబోయె. పోయి మయునిగృహమునందున్నదియును మిగుల మనోహరురాలును నగు మందోదరినిచూచి యనేకవిధముల మయుని ప్రార్థించి యామందోదరి నిమ్మనియడిగె. అంతటమయుఁ డామందోదరి నిచ్చి వివాహమునుచేసి శత్రుసంహారమును చేయుటయందు మిక్కిలి సామర్థ్యముకలదియును మిక్కిలిదృఢమైనదియును నగు శక్తియను నాయుధమును పారితోషికముగ నిచ్చె. అప్పుడు రావణాసురుఁడు పరమానందమునుపొంది యామందోదరిని వెంటఁబెట్టుకొని లంకాపట్టణమునకుఁ బోయె. అట్లు లంకాపట్టణమునకుఁ బోఁగానే యతనితల్లి యగు కైకసి యాత్మలింగమును దెచ్చి యీయనందుకు నిందించె. అప్పుడు ఖిన్నుఁడై బయలువెడలి గోకర్ణమునకుఁ బోయి బ్రహ్మదేవునిగుఱించి మిక్కిలి ఘోరమైన తపస్సునుచేసి ముల్లోకములును స్వాధీనములై యుండునట్లు వరములను పొంది లంకాపట్టణమునకుఁ బోయి రాజ్యమును జేయుచుండె. ఓపార్వతీ! కావున మందోదరి సీతామహాదేవితో సమానముగ నెన్నఁదగియుండె. ఆమందోదరి రావణునిదగ్గఁ బరుండి నిద్రించుచుండె. ఓపార్వతీ! అట్లు మందోదరినిచ్చి వివాహమును చేసినపిమ్మట మయుఁడు లంకాపట్టణమునకువచ్చి మిక్కిలి రమ్యమగు గృహమునుగట్టుకొని దానియందు నివ

సించియుండెను. అట్లుండఁగా మయునకు బంధువును, అధికమైన పరాక్రమము కలవాఁడును అగు గయుఁడను రాక్షసుఁడు తనగృహమునందు నిద్రించుచుండఁగా హనుమంతుఁడు ఆ గయునకు రావణునివలన మరణము కలుగునని యెఱింగియుండుటంజేసి వానివస్త్రమును దీసికొనిపోయి రావణుని బంగారపు శయ్యయందు నుంచె. అనంతరమం దెక్కడను సీతను గానక లంకాపట్టణమునకుఁ బోయి శింశుపావృక్షమును జూచె. ఆవృక్షమూలమునందు రాక్షసస్త్రీలయొక్క నడుమ నేకవేణీధరురాలును, కృశించినదియును, దీనురాలును, మలినవస్త్రమును ధరించినదియును, భూమియందు శయనించియున్నదియును, రామ రామాయని చింతించుచున్నదియును అగుసీతామహాదేవినిఁజూచి కృతార్థుఁడనైతినని తలంచె. అనంతరమం దాహనుమంతుఁడు శింశుపావృక్షముయొక్క కొమ్మలనడుమఁ గూర్చుండి యాసీతామహాదేవియొక్క దేహమునందు పూర్వముకనఁబడిన యలంకారములు లేకపోవుటను జూచె. ఆసమయమునందు రావణాసురుఁడు కలకలధ్వనులతో నక్కడకు వచ్చె. అంతకు ముందుగ రావణుఁడు, వానరుఁడు వచ్చి సీతను జూచినట్లు కలఁగనుటచేత, రామునిహస్తమువలన శీఘ్రముగ మరణముకలుగునని నిశ్చయించి సీతామహాదేవిని మునుపటికంటె నధికముగ ధర్షింపఁదలఁచివచ్చె. మఱియును దన దౌష్ట్యమును వానరుఁడు పోయిచూచి రామునకుఁ జెప్పుననియును, అందువలన రాముఁడు శీఘ్రముగ వచ్చుననియును దలంచె. ఇట్లు నిశ్చయించుటచేత స్త్రీలతోఁ గూడ నక్కడకు వచ్చుచున్నసమయమునం దాస్త్రీలయొక్క నూపురధ్వనులను విని సీతామహాదేవి మిక్కిలి విహ్వలురాలయ్యె. ఆసమయమునందు సీతామహాదేవితో రావణుఁ డిట్లనియె. ఓతరుణీ ! నన్నుఁజూచి యేలసిగ్గునుపొందెదవు. వనచరుఁడును రాజ్యపదభ్రష్టుఁడును మిత్రబంధువులచేత విడువఁబడినవాఁడును తండ్రిలేనివాఁడును భోగహీనుఁడును నీయందు మిక్కిలి గతినుఁడును, ఏకాంతవాసియును, జటావల్కలధారియును నగురాముని వదలి నన్నుఁ బొందుము. ముల్లోకములకును బ్రభుఁడను, మహాబలుఁడను, అప్సరస్త్రీలచేత సేవింపఁబడుచున్నవాఁడను. భాగ్యవంతుఁడను నగు నన్నుఁబొందితివేని మందోదరి మొదలగువారందఱును నీకు బరిచర్యలనుచేయుదురు. నారాజ్యమును సర్వమును నీయధీనమునుగాఁ జేసెదను. కావున నన్నుఁబొందుము. మఱియు నోతరుణీ ! నాజీవితమునుకూడ నీయధీనమునుగాఁజేసెదనని నానావిధములయిన వాక్యములచేత ప్రార్థించె. ఆసమయమునందు సీతామహాదేవి యధోముఖురాలై తృణమును మధ్యమునందుఁబెట్టికొని యిట్లనియె. ఓరీ రావణా ! నీవు రామునకుభయపడి భిక్షురూపమునుధరించి వచ్చి నన్ను నపహరించితివి. రామలక్ష్మణులు లేనికాలమునందు కుక్క హవిస్సును దొంగలించినవిధముగ నపహరించితివి. ఓరీ ! నీచుఁడా ! నన్నుఁ దీసికొనివచ్చినందుకుఁ దగినఫలమును శీఘ్రముగ ననుభవింపఁగలవు. మఱియును, రామబాణములచేతఁ గొట్టఁబడిన శరీర

ముకలవాఁడవగుదువు. రాముని బాణములు తగులునపుడు రాముఁడు మానవుఁడై నదియును కానిదియును, తెలిసికొనఁగలవనియె. ఇవ్విధముగ సీతామహాదేవి మిగుల కఠినముగఁజెప్పిన పరుషవాక్యములను విని రావణాసురుఁడు కోపోద్దీపితుఁడై మరల నిట్లనియె. ఓసీతా! శీఘ్రముగ దేవతల ముఖముమాడిపోవును. రాముఁడు లక్ష్మణునితోఁగూడ యుద్ధమునందు నిలిచియుండఁజాలఁడు. నీవు శీఘ్రముగ విపత్తును పొందఁగలవు. నాకు సంతోషమును జయమును కలుగుననియె. అప్పుడు మరల సీతామహాదేవి యిట్లనియె. ఓరీ రావణా! శీఘ్రముగా నీవారిముఖములే వాడిపోవును. రాముఁడే లక్ష్మణునితోఁగూడ యుద్ధమునందు నిలిచి యుండఁగలఁడు. నీవే శీఘ్రముగ విపత్తును పొందఁగలవు. రామునకే సంతోషజయములు కలుగునని చెప్పఁగా విని రావణుఁడు కోపోద్దీపితుఁడై నిన్ను నింతటితో విడువనని చెప్పి బెదరించుచు ఖడ్గమునెత్తి ఖండించుటకు యత్నించె. ఆసమయమునందు మందోదరి యడ్డముగవచ్చి రావణునిహస్తమునుబట్టుకొని యిట్లనియె. ఓమనోనాయకా! రాక్షసరాజోత్తమా! నావంటిస్త్రీ లనేకులుగలరు. కావున మాతో రమింపుము. దీనురాలును కృశాంగియును అయిన యీసీతను విడిచిపెట్టుమనియె. అంతట రావణుఁడు సీతకుఁగావలియున్న రాక్షసస్త్రీలతో నిట్లనియె. ఓరాక్షస తరుణీమణులారా! ఈసీత నాకుస్వాధీనురాలగునట్లుచేయుఁడు. తర్జన భర్జనాదులచేత ప్రయత్నింపుఁడు. రెండు మాసములకాలము ఈవిధముగఁ జూచి అప్పటికిని స్వాధీనురాలుగాని యెడల దీనినికోసి నాకు ప్రాతఃకాలమునందలి యాహారముగఁ జేయుఁడనిన సీతామహాదేవి యిట్లనియె. ఓరీ! రావణా! బాల్యమునందు నన్నుఁ బెట్టెలోఁబెట్టి యొకపర్యాయము లంకాపట్టణమునకుఁ దీసికొనివచ్చితివి. అప్పుడు నేను చెప్పిన మాటలను మఱచితివి. ఇంకొకపర్యాయము నిన్ను పుత్రమిత్రాదులతోఁగూడ సంహరించుటకు వచ్చెద నని చెప్పియుంటిని. కావుననే నామాటను నిజముగఁ జేయుటకొఱ కిప్పుడువచ్చితిని. ఇప్పుడు రామునిచేత పుత్రమిత్రాదిసహితముగ నిన్నుఁ జంపించి యయోధ్యాపట్టణమునకుఁ బోయి మరలవచ్చెదను. వచ్చి నికుంభుఁడు పౌండ్రకుఁడు అనువారలను మాతామహమున ద్వీపాంతరమందున్న శతకంఠరావణుని సంహరించెదను. అంతట మరల నా నివాసస్థలమునకుఁ బోయి నాల్గవపర్యాయమువచ్చి వీరుఁడును కుంభకర్ణునిపుత్రుఁడును అగు మూలకాసురుని సంహరించెదను. మఱియు నోరావణా! ఏబ్రహ్మదేవునివాక్యములచేత నీవు కౌసల్యాదశరథులను దీసికొనివచ్చితివో ఆబ్రహ్మదేవునివాక్యములను మరచిపోతివా? వ్యర్థముగ మాటలాడక గృహమునకుఁబోయి యనుభవింపఁదగినవానినన్నిటి ననుభవింపుము. రాముఁడు శీఘ్రముగ వచ్చి నిన్నుఁజంపునని సీతామహాదేవి చెప్పినవాక్యములను విని యేమియును బలుకక తనగృహమునకుఁబోయె. అంతట రాక్షసస్త్రీలందఱును నానావిధములగు నాయుధాదులచేత సీతను అనేకవిధముల బెదరించుచుండిరి. అప

మయమునందు సద్గుణసంపన్నురాలగు త్రిజట యనునది యారాక్షస స్త్రీలను నివారించి యిట్లనియె. ఓరాక్షసాంగనలారా! వ్యసనమును పొందుచున్న సీతను బెదరింపకుఁడు. ఈసీతామహాదేవికి నమస్కారమును చేయుఁడు. రాముఁడువచ్చి రావణుని సంహారించి సీతనువిడిపించినట్లు కలఁగంటిని. మఱియును రావణుఁడు తైలాభ్యక్తుఁడును దిగంబరుఁడునునై గోమయపుగుంటయందుఁ బడినట్లు కలనుగంటిని. కావున మీరు సీతనువిడిచి పెట్టుఁడు. రామునివలన మరణము కలుగకుండునట్లు సీతామహాదేవిని సేవింపుఁడు. మీరు ఈసీతను దుఃఖపెట్టితిరేని రాముఁడు మిమ్ముల వధింపఁగలఁ డని చెప్పిన విని యారాక్షస స్త్రీలందఱును మిగుల భయముకలవారై యూరకుండిరి. ఆసమయమునందు సీతామహాదేవి మిగులదుఃఖముకలదై యిట్లనియె. ఇప్పుడు నాకే యుపాయముచేత మరణముకలుగును. మిగుల పొడవగు నాజడతో నురిపైచుకొని మరణమునుపొందవచ్చుననియె. అయ్యో! అన్యాయముగ లక్ష్మణుని వాగ్బాణములచేతఁ గొట్టితిని. కావున నన్నిప్పు డీరాక్షస స్త్రీలు బాధించుచున్నారు. నేను జేసినపాపమునకుఁ దగినఫలము ననుభవించుచున్నాను. నేను నిరపరాధుఁడగు లక్ష్మణుని గౌతమీతీరమునందు బెదిరించితిని. కావున దానికిఁ దగినప్రాయశ్చిత్తముగా నిప్పుడు ప్రాణత్యాగమునుచేసికొని పాపమును పోఁగొట్టుకొనియెద నని నిశ్చయించె. అప్పుడు హనుమంతుఁడు మెల్లఁగ నాసీతామహాదేవిని జూచి రామవృత్తాంతమును తెలియఁబఱిచె. మఱియు నాహనుమంతుఁడు సీతారాములు అయోధ్యాపట్టణమునుండి బయలువెడలినది మొదలుకొని తాను సీతామహాదేవిని చూచువఱకు కలవృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. ఆవృత్తాంతమును సర్వమును విని సీత మిగులనాశ్చర్యమును పొందినమనస్సుకలదై యిదియేమి? అంతరిక్షమునందు రామకథ వినఁబడుచున్నది. ఇది స్వప్నమా? (లేక) నిజమా? అనితలఁచె. మఱియు నాచెవుల కింపగునట్టి రామవృత్తాంతమునుచెప్పిన యీపుణ్యపురుషుఁ డెవ్వఁడో కదా? నాయెదుట నాకుఁ బ్రియమగునటుల రామకథనుచెప్పుచున్న యీపురుషుఁ డెవ్వఁడో కదా? అనితలఁచుచుండె. ఆసమయమునందు హనుమంతుఁ డెదురుగవచ్చి రామునివృత్తాంతమును సర్వమునుచెప్పి రాముని యంగుళీయకమును సమర్పించె. ఆయంగుళీయకమును చూచి సీతాదేవి మహాసంతోషముకలదై యావానరునితో నిట్లనియె. ఓ వాయుపుత్త్రా! నీవిక్కడఁ జూచిన నావృత్తాంతమును సర్వమును రామునకుఁ దెలుపుమనిన హనుమంతుఁ డనేకవిధముల సీతామహాదేవినూరార్చి యిట్లనియె. ఓసీతామహాదేవీ! నీవు వ్యసనమునుపొందక నాభుజములమీఁద నధిష్ఠింపుము. నిన్ను నతిశీఘ్రముగ రామునొద్దకుఁ దీసికొనిపోయెదను. ఇట్లు కాదేని శ్రీరాముఁడు నాభుజములమీఁద నెక్కి వానరోత్తములతోఁగూడ నీ లంకాపట్టణమునకువచ్చి రావణుని వధించి నిన్నుఁ దీసికొనిపోఁగలఁ డనిచెప్పి సీతకు విశ్వాసము కలుగుటకొఱకు తన

నిజరూపమును జూపె. అనంతరమందు మరల సీతామహాదేవికి విశ్వాసముకలుగుటకొఱకు చిత్రకూటపర్వతమునందు మణిశిలచేత నిర్మించిన తిలకవృత్తాంతాదికమును సర్వమును తెలియఁజేసె. అంతట సీతామహాదేవి సంతుష్టురాలయినదని తెలిసికొని మరల నిట్లనియె. ఓతల్లీ! నాకాజ్ఞనిమ్ము. శ్రీరామునకు గుర్తుగనొకవస్తువు నిమ్మనియె. అప్పుడు సీతామహాదేవి తనశిరోరుహములయందున్నదియును, జనకచక్రవర్తిచేత నీయఁబడినదియును, అయినచూడామణిని బయలునకుఁదీసి యాహనుమంతుని చేతి కిచ్చి పూర్వము కాకాసురునిచేతఁ జేయఁబడిన వృత్తాంతమును సర్వమును తెలియఁ జేసె. అనంతరమం దాహనుమంతుఁడు సీతామహాదేవికి నమస్కారమునుచేసి తన మనస్సునం దిట్లని యాలోచించె. ఇంతవఱకు స్వామికార్యమును సర్వమునుచేసితిని. ఇప్పుడు మఱియొకకార్యము దేనినైనను జేయుదునని చెప్పి సీతామహాదేవితో మరల నిట్లనియె. ఓమహాదేవీ! ఇప్పుడు నాకాఁకలియును దప్పియును కలిగియున్నది. కావున మఱియొకచోటలభ్యముకానివియును మిగులమధురమును అయినఫలములను భుజించెదను. ఆజ్ఞనిమ్మనిన విని సీతామహాదేవి తనచేతియందలి కడియమును బయలునకుఁదీసి యిట్లనియె. ఓహనుమంతా! ఈకంకణమును గ్రహించి ఫలములను క్రయమునకుఁ దీసికొనిభుజించి యుదకమును ద్రాగి సుఖముగఁ బొమ్ము. ఈవనమునందలి ఫలముల నపహరింపకుమనిన మరల నాహనుమంతుఁ డిట్లనియె. ఓతల్లీ! ఇతరులిచ్చినఫలములను నేను భుజించువాఁడనుగాను. ఓతల్లీ! నేను పరహస్తములనుండి భోజనపదార్థములను గైకొనిభుజింప నట్టి వ్రతమునవలంబించితిని. కావున నేనూరకయె పోయెదనని చెప్పి బయలువెడలిపోవుచుండె. అట్లు పోవుచుండఁగా సీతామహాదేవి మరల నిట్లనియె. ఓబాలుఁడా! వానరశ్రేష్ఠుఁడా! ఈవనమునకు రావణుఁ డధిపతియై యున్నాఁడు. నీకు సామర్థ్యము లేదు. నీకు సామర్థ్యముకలదేని భక్షించి పొమ్మనిన విని హనుమంతుఁడు మరల నిట్లనియె. ఓసీతా! శ్రీరామమంత్రమనియెడు శస్త్రము నాహృదయమందు నిలిచియున్నది. ఆయస్త్రముచేత రాక్షసులనందఱను తృణప్రాయులనుగాఁ జేయఁగలననిన జానకి మరల నిట్లనియె. ఓహనుమంతుఁడా! నీవు చెట్లనున్న ఫలములనుగోయక క్రిందఁబడియున్న ఫలములను భుజింపుము. చెట్లనుండు ఫలములను గోయకుమనిన హనుమంతుఁ డందుల కంగీకరించి బయలువెడలిపోయి తనతోకను వృక్షములకుఁజుట్టి కదల్చె. అట్లు వృక్షములను కదల్చినతోడనే యాఫలములన్నియును క్రిందఁబడియె. అంతట హనుమంతుఁడు క్షణములో నాఫలముల నన్నింటి ననుభవించె. అట్లు పొట్టనిండ భుజించినపిమ్మట నాహనుమంతుఁ డూరకుండక తనతోకచేత నావృక్షముల నన్నిఁటిని పెల్లగించి క్రిందఁబడవైచుచుండె. మఱియు నాసమయమునందు క్రిందఁబడినఫలముల నెల్లవారును భుజించుచుండిరి. అప్పుడు వనపాలకులందఱును మిగుల వేగముతోఁ బరుగిడివచ్చి యాహనుమంతుని పట్టుకొనుట కుద్యు

మించిరి. అట్లు వచ్చిన రాక్షసులనందఱను హనుమంతుఁడు వృక్షములచేతఁ జంపెను. అనంతరమందు క్షణములోపల నశోకవనమునందలి వృక్షములన్నింటిని నిర్మూలముగఁ బెల్లగించివైచెను. సీత నివసించియున్న వృక్షమునుదప్పఁ దక్కిన వృక్షములనన్నిటిని పెల్లగించివైచెను. అంతట నూరకుండక యక్కడనుండి బయలువెడలిపోయి చైత్యప్రాసాదమును విఱిచివైచి యందలిరాక్షసులనందఱను సంహరించెను. అప్పుడు రాక్షసస్త్రీలందఱును వనభంగమగుటను చూచి సీతతో నిట్లనిరి. ఓ సీతా! ఈవానరుఁ డెవ్వఁడు? ఎక్కడనుండి యిక్కడకువచ్చెనని యారాక్షసస్త్రీలడుగఁగా సీతామహాదేవి యిట్లనియె. ఓ రాక్షసాంగనలారా! వీఁడెవ్వఁడో నేనెఱుఁగను. రాక్షసులు కామరూపులై సంచరించుచుందురు. రావణుఁడుకూడ భిక్షురూపముతోవచ్చి పంచవటీక్షేత్రమునందున్న నన్నపహరించెను. కావున వీఁడెవ్వఁడో మీరే తెలిసికొనవలయుననిన విని యారాక్షసస్త్రీలందఱును భయముకలవారై యావృత్తాంతమును రావణాసురునకుఁ దెలుపుటకొఱకుఁ బోయిరి. అంతలోపల ప్రాతఃకాలమగుటచేత రావణుఁడు నిద్రనుండిమేల్కాంచి తన మంచమునందుఁ బడియున్న గయునికటిబంధనమును చూచి మిగుల భయముకలవాఁడయ్యె. అంతట గయుఁడు మందోదరి ననుభవించెనని తలఁచి యామందోదరిని చంపుటకొఱకు ఖడ్గముచేఁబూనెను. అప్పుడు స్త్రీలందఱును నడ్డముగవచ్చి స్త్రీహత్యను చేయఁగూడదని నివారించిరి. అంతట రావణుఁడేమియును బలుకక యతిశీఘ్రముగ గయునిగృహమునకుఁ బోయెను. పోయి నిద్రనుపొందుచున్న గయునిసంహరించి తనగృహమునకుఁబోయెను. ఆసమయమునందే విభీషణుఁడుకూడ మేల్కాంచి తనబంధువుయొక్క వస్త్రము తన భార్యపరున్న మంచముమీఁదఁ బడియుండుటనుజూచి తనభార్యయగు సరమ యనుదానిని జంపుట కుద్యుక్తుఁడయ్యె. ఆసమయమునం దక్కడనున్న స్త్రీలడ్డముగవచ్చి స్త్రీనిచంపుట యుచితముకాదనిరి. అది మొదలుకొని విభీషణుఁడు బంధువులయందుఁ గోపముకలవాఁడయ్యె. హనుమంతుఁడు చేసినకృత్యములు ఈవిధముగ లంకాపట్టణమునందంతటను జరిగె. అట్టిసమయమునందు సభాస్థలియందుఁ గూర్చున్న రావణునొద్దకు రాక్షసస్త్రీలు మిగులవేగముతోవచ్చి గద్గదస్వరములతో నశోకవనమునందలి వృత్తాంతమును సర్వమును తెలియఁజేసిరి. అప్పుడు వానరునిచేత నశోకవనమంతయును పాడుచేయఁబడిన దనుసంగతిని రావణాసురుఁడువిని కోపోద్దీప్తుఁడై వనపాలుఁడగుజంబుమాలినిపిలిచి యనేక లక్షలరాక్షసవీరులను వెంటఁబెట్టుకొనిపోయి యశోకవనమును పాడుచేయుచున్న వానరునిబట్టి తీసికొనిరమ్మనియె. అంతట నాజంబుమాలి వల్లెయని యతివేగమున నశోకవనమునకు సైన్యముతోఁ గూడఁ బోయెను. అప్పుడు వానరోత్తముఁ డగు హనుమంతుఁ డారాక్షససైన్యమునుచూచి ముల్లోకములును కంపించునట్లు దీర్ఘధ్వనిచేసెను. అంతట నారాక్షసులందఱును శస్త్రములచేత వానరోత్తముఁడైన హనుమంతుని గొట్టిరి. అనంతరమందు

హనుమంతుఁ డెగిరి యెనుఁగు దోమలను నలుపువిధముగ క్షణమాత్రములోపల యుద్ధమునకువచ్చిన రాక్షసులనందఱను పిండిపిండిగఁజేసె. అవ్విధముగ నారాక్షసులనందఱిని సంహరించి హనుమంతుఁడు మిగుల వేగముగఁబోయి యొకతాటివృక్షమును పెల్లగించి దానిచేత జంబుమాలినిసంహరించె. అట్లు జంబుమాలిమొదలగువారందఱును నశించిన వృత్తాంతమును విని రావణాసురుఁడు మరల సేనాపతులనైదుగురిని పంపె. అప్పు డాయైదుగురును నూరువేలసైన్యములతోఁగూడ యుద్ధమునకురాఁగా హనుమంతుఁడు క్షణముసేపటిలో వారలనందఱను సంహరించె. అవ్విధముగ సేనాపతులయిదుగురును నూరువేలసైన్యముతోఁగూడ మరణమును పొందినవృత్తాంతమును విని రావణాసురుఁడు నిజపుత్త్రుఁడగు నక్షుఁడనువానినిబంపె. అంత నాయక్షకుమారుఁడుకూడ సేనాసమేతముగ హనుమంతునిచేతఁ జంపఁబడియె. ఆవృత్తాంతమునువిని రావణాసురుఁడు మరల నింద్రజిత్తను కుమారునిబంపె. అంతట నాయింద్రజిత్తు రథారూఢుఁడై కోటిసంఖ్యాకరాక్షససైన్యముతోఁగూడుకొని యుద్ధమునకుఁబోయి నానావిధములగు శస్త్రాస్త్రములతో యుద్ధమునుచేసె. అప్పుడు హనుమంతుఁడు పుచ్ఛముచేత మిగుల శ్రేష్ఠమగు ప్రాకారమునునిర్మించి క్షణముసేపటిలో నారాక్షసులనందఱను సంహరించె. పిమ్మట మిగులగొప్పదగు వృక్షముచేత యింద్రజిత్తునుగొట్టె. ఆసమయమునందు యింద్రజిత్తు సర్వావయవములయందును కొట్టఁబడినవాఁడగుచు గుహాయందుఁ బ్రవేశించె. అప్పుడు బ్రహ్మదేవుఁడు హనుమంతునిడగ్గరకువచ్చి యోవాయుపుత్త్రా! యింద్రజిత్తు ఇప్పుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించును. దానిని తిరస్కరింపక దానిలోఁబడి లంకాపట్టణములోనున్న రావణునొద్దకుఁ బొమ్మనిన హనుమంతుఁ డంగీకారమును పొందె. అంతట నాబ్రహ్మదేవుఁడు యింద్రజిత్తు దగ్గరకుఁబోయి యోరాక్షసోత్తమా! నీపరాక్రమమిప్పుడెక్కడఁ బోయెను. నీవు విచారమునుపొందక నాసంబంధమైన యస్త్రమును అనఁగా బ్రహ్మాస్త్రమును ప్రయోగించి యీవానరునిబంధించి నీతండ్రియగు రావణునొద్దకుఁ దీసికొని పొమ్మనియె. అట్లు బ్రహ్మదేవుఁడు చెప్పినవాక్యమునువిని యింద్రజిత్తు మరలయుద్ధమునకు బయలువెడలిపోయె. పోయి బ్రహ్మాస్త్రమును ప్రయోగించి హనుమంతునిబంధించి రావణునొద్దకుఁ దీసికొనిపోయె. అప్పుడు రావణుననుమతినిపొంది ప్రహస్తుఁడు హనుమంతునితో నిట్లనియె. ఓవానరుఁడా! నీవెవ్వఁడవు. ఎవ్వఁడు పంపుటచేత నీవు వచ్చితివి? నీవృత్తాంతమును సర్వమును చెప్పుమనిన, హనుమంతుఁడు విశేషముగ రామవృత్తాంతమును సర్వమును చెప్పి యారావణాసురునితో నిట్లనియె. ఓరావణా! శత్రుత్వమును మనస్సునందుంచక శరణాగతులయందు ప్రియముకల రామునిసేవింపుము. సీతను ముందునిడుకొని పుత్త్రమిత్త్రాదులతోఁగూడ రామునొద్దకుఁబోయి ప్రార్థించితివేని రాముఁడు నిన్ను విడువఁగలఁడు. మఱియు నోరావణా! పర్వతములవంటి యాకృతులుకలవారును, మ

హాబలులును, నారాయణేంద్రులతో సమానులును, గోళ్లు కోరపన్నులు అనునవియే యాయుధములుగాఁ గలవారును, అగు వానరులువచ్చి లంకాపట్టణమును ఆక్రమింపకమునుపే సీతను గొనివచ్చి రామునకు సమర్పింపుము. శ్రీరాముఁడు యుద్ధమునకు వచ్చెనేని బ్రహ్మ విష్ణు మహేశ్వరులుకూడ నిన్ను విడిపింపఁ జాలరు. మఱియును మృత్యుదేవతకూడ నిన్నుఁ గాపాడఁజాలదని హనుమంతుఁ డెన్నివిధములఁజెప్పినను, మరణమును పొందువాఁడు ఔషధమును గ్రహింపనివిధముగ గ్రహింపకపోయె. ఇవ్విధముగఁజెప్పుచున్న హనుమంతునితో రావణుఁడిట్లనియె. ఓరీవానరాధమా! దేవతలనుజయించిన నాపరాక్రమవృత్తాంతమును తెలియకపోవుటచేత, ఇవ్విధముగఁబలుకుచున్నావు. కావున నాపరాక్రమవృత్తాంతమును వినుము. కొంచెముగఁజెప్పెదను. బ్రహ్మదేవుఁడు దినదినమందును నాకు పంచాంగమును వినిపించువాఁడై యున్నాఁడు. సూర్యుఁడు ప్రతీహారియును, చంద్రుఁడు ఛత్రధరుఁడునునై యున్నాఁడు. వరుణుఁడు వీథులయందు నీళ్లు చల్లువాఁడై యున్నాఁడు. వాయువు వీథులనుబాగుచేయువాఁడై యున్నాఁడు. అగ్నిదేవుఁడు వస్త్రములను బాగుచేయువాఁడై యున్నాఁడు. ఇంద్రుఁడు పూలమాలికలనుగ్రుచ్చియిచ్చుచున్నాఁడు. యముఁడు దండపాణియైయున్నాఁడు. దేవతాస్త్రీలందఱును దాసీత్వమును వహించియున్నారు. వసంతుఁడు మంగలవానికృత్యములనుచేయుచున్నాఁడు. గణాధిపతి కంచరగాడిదెలనుకాపాడుచున్నాఁడు. అంగారకాదిగ్రహములు సింహాసనమునకు సోపానములై యున్నారు. ఆఱవదగుదేవత శిశువులనుసేవించునదియైయున్నది. నేను కైలాసపర్వతమునూగించితిని. కుబేరునిజయించితిని. ఇట్టివంటి నాయెదుట భయరహితునివలె నదరుచున్నావు. ఇట్లుచేయుట తగునా? నీకుదుర్బుద్ధిపుట్టియుండుటచేత ఇట్టిదుష్కార్యమును చేసితివి? రాముఁడెంతగానెంతటివాఁడు. వానరుఁడు నెంతటివాఁడు. సుగ్రీవాదులతోఁగూడ శ్రీరాముని సంహరించెదనని చెప్పి యాహనుమంతునిజంపుట కుద్యుక్తుఁడయ్యె. ఆసమయమునందు విభీషణుఁడు వరులదూతను జంపఁగూడదని చెప్పుటచేత చంపుటమానుకొని సకలలోకములను ఏడ్పించునట్టి రావణుఁడు క్రోధోద్దీపితుఁడై దూతలనుపిలిచి యీవానరునితోకను కోసివేయుఁడని యాజ్ఞాపించె. అంతట రావణదూతలు నానావిధములయిన యాయుధములను చేఁబూని యాహనుమంతునితోకను గోయుటకొఱకు యత్నించి ఛేదింపనారంభించిరి. అప్పుడా ఖడ్గములన్నియును విరిగిపోయెనుగాని యాహనుమంతునితోకయందలి యొకరోమముకూడ తెగకపోయె. అట్లగుటను చూచి రావణాసురుఁడాహనుమంతునితో నిట్లనియె. ఓరీ! వానరాధమా! మహాపరాక్రమవంతులుకూడ తాము మరణమునుపొందువిధమును చెప్పకమానరు. కావున నీకుదేనివలన మరణముకలుగునో తెలుపుమనిన నాహనుమంతుఁడు అగ్నిదేవుఁడు నాతండ్రియగు వాయువునకు మిత్రుఁడు కనుక నన్నుఁ గాల్పఁడనియును, అగ్ని నాచేతదొరకెనేని లంకాపట్టణము

ను కాల్పవచ్చుననియును, యోజించి యిట్లనియె. ఓరాక్షసోత్తమా! నాతోఁక యగ్నిచేతకాలిపోవును. మఱిదేనిచేతను నాతోఁకకు హాని కలుగనేరదనియె. అంత నారావణుఁడు దూతలను పిలిచి యీవానరునితోఁకను కాల్చుచు లంకాపట్టణము నందలి వారలకందఱకును చూపుఁడు. ఇట్లు చేసినయెడల నాశత్రువులందఱును భయమును పొందుదురనియె. అప్పుడారాక్షసభటు లందఱును మిగులవేగముగ నానావిధములయిన వస్త్రాదులను తైలమునందుముంచి యాహనుమంతుని తోఁకకుఁజుట్టిరి. అవ్విధముగ నారాక్షసులు వస్త్రాదులను చుట్టినకొలఁదిని హనుమంతునితోఁక వృద్ధినిపొందుచుండె. అంతట నారాక్షసులు పట్టణమునందున్న వస్త్రములను, గృహములయందున్న వస్త్రములను అన్నిటిని తెచ్చి చుట్టిరి. అవియును చాలకపోవుటచేత రావణాజ్ఞనుపొంది స్త్రీపురుషులు ధరించియున్నవస్త్రములనుకూడ బలాత్కారముగఁ గొనివచ్చిచుట్టిరి. అనంతరమందు మంచములు మొదలగువానికివైచిన వస్త్రములనుగూడఁజుట్టిరి. పిమ్మట రాజమందిరమునందలి వస్త్రములనుకూడఁ దెచ్చిచుట్టిరి. అంతట నాహనుమంతునితోఁకను సంపూర్ణముగ వస్త్రములను కట్టితిమని తలఁచిరి. అంతలో మరల హనుమంతునివాలము వృద్ధినిపొందుటచేత బ్రాహ్మణులయొక్కయును, మందోదరి మొదలగువారియొక్కయును వస్త్రములను తెచ్చి చుట్టిరి. అవ్విధముగ నెన్నివస్త్రములను చుట్టినను చాలకపోవుటచేత రాక్షసభటులు సీతామహాదేవిధరించిన వస్త్రమునుకూడ తీసికొనిరాఁదలఁచిరి. ఆయభిప్రాయమును తెలిసికొని హనుమంతుఁడు తనతోఁక కొనవస్త్రములు చాలినట్లుకనఁబఱచె. ఆసమయమున ప్రతియింటియందును వస్త్రములకొఱకు అధికమైన కోలాహలధ్వనికలిగె. మఱియు నాతోఁకను కట్టినగుడ్డలను తడుపుటకొఱకు లంకాపట్టణమునందలి తైలమును సర్వమును తీసికొనివచ్చుటచేత నాపట్టణమునందు దీపములు బెట్టుకొనుటకును బిడ్డలకువేయుటకునుకూడ తైలములేకపోయె. ఇటులనే పట్టణమునందలి నేతినికూడఁ గొనివచ్చిరి. ఆసమయమునందు లంకాపట్టణమునందలి స్త్రీపురుషులందఱును దిగంబరులైరి. అంతట నారాక్షసభటులు రావణానుమతినిపొంది తోఁకకుమంటను పురికొల్పిరి. అప్పుడెంతమంటవైచినను ఆవస్త్రములు మండకుండుటచేత హనుమంతుఁడిట్లనియె. ఓ రాక్షసభటులారా! మీయజమానుఁడగు రావణాసురుఁడు తనముఖముచేత నాతోకను నూదినయెడల, ఈగుడ్డలన్నియు మండునని విని యాభటులావృత్తాంతమును రావణునకుఁ దెలిపిరి. అంతట రావణుఁడువచ్చి యాహనుమంతుని వాలమునకుఁజుట్టిన వస్త్రములను నిప్పునంటించి యూదుచుండె. అప్పుడు హనుమంతుఁడు తోఁకను కదల్చుటచేత రావణుని మీసములు కమలిపోయె. అంతలో రావణుఁడు తన యిరువది భుజములచేతను మీసములమంట చల్లాఱుటకు మూతిమీఁద గొట్టుకొనియె. ఆసమయమునందు పకపక నవ్వె. అంతట రావణాసురుఁడు కోపోద్దీపితుఁడై యావానరుని తీసికొనిపోయి యూరివారికందఱకును చూపి తోఁకను చక్కఁగ ద్ర

షముగ బంధించి నానావిధములయిన వాద్యఘోషములతో హనుమంతుని లంకాపట్టణములోనివారికందఱకును చూపుచుండిరి. ఈవిధముగా పగలంతయును లంకాపట్టణమును సర్వమును చూచి యాహనుమంతుఁడు సూక్ష్మరూపమును ధరించి యాకాశమున కెగిరె. అప్పుడు తోకకుఁ జుట్టిన వస్త్రము లన్నియును క్రిందఁబడె. ఇంతలోపల బ్రహ్మాస్త్రమువలనఁ గూడ విముక్తుఁడయ్యె. అంతట హనుమంతుఁ డామండుచున్న వస్త్రములను గైకొని లంకానగరముయొక్క పశ్చిమద్వారమునందుఁ బ్రవేశించె. ప్రవేశించి యాద్వారమును కాపాడుచున్న రాక్షసులనందఱను వధించె. అంతట నాహనుమంతుఁడు తనవాలముచేత సకల సౌధములయందును అగ్నిని పురికొల్పి లంకాపట్టణమును సర్వమును దగ్ధమునుగాఁ జేసె. ఆసమయమునందు లంకాపట్టణమునందలి ప్రతిగృహమునందును అధికమైన కోలాహలధ్వని పుట్టె. అప్పుడు నిద్రించుచున్న బాలురనుకూడ గృహమునందు వదలి బయలునకుఁ బరుగిడిపోయిరి. మఱియు నాపట్టణమునందలి స్త్రీపురుషు లందఱును తమతమ ప్రాణములను కాపాడుకొనుటకు నానాదిక్కులకును పరుగిడిరి. అంతట క్రమక్రమముగ హనుమంతుఁడు రావణాదుల సౌధములను కూడ మండింపఁజేసె. మఱియును రావణుని సభాస్థానముల నన్నింటిని కాల్చి తనతోకచేత సకలరాక్షసులను కొట్టుచుండె. ఆసమయమునందనేకులగు రాక్షసులను సంహరించె. మఱియును ముఖవాద్యములను చేసిరి. అప్పుడు రావణాసురుఁడు కోపోద్దీపితుఁడై తనకోటి సంఖ్యాకరాక్షసులతోఁగూడ హనుమంతునితో యుద్ధమును చేయుటకు బయలు వెడలిపోయె. ఆసమయమునందు హనుమంతుఁడు తోరణముచేత ఆరాక్షసుల నందఱను సంహరించె. మఱియు ననేకవేలమంది రాక్షసులను తనతోఁకకుఁ జుట్టి సంహరించె. ఇటులనే తనతోకచేత రావణుని శిరస్సునందుఁ గొట్టి శిరస్సు కాలునట్లు చేసె. అట్లు హనుమంతుని వాలానలముచేత దగ్ధుఁడై రావణుఁడు మూర్ఛనుపొంది క్రిందఁబడియె. అనంతరమందు తనప్రాణములను కాపాడుకొనుట కొఱకు ఇంద్రజిత్తుయొక్క గృహమునకుఁ బోయె. అప్పు డాహనుమంతుఁడు లక్ష్మణునకు ప్రీతిని కలిగించుటకొఱకు యింద్రజిత్తునుమాత్రము కొట్టక యూరకుండె. ఈవిధముగా హనుమంతుఁడు సకలరాక్షసులను సంహరించి లంకాపట్టణమును సర్వమును కాల్చె. అట్లు లంకాపట్టణమును సర్వమును దగ్ధముచేసి సముద్రము దగ్గఱకుఁ బోయి యాసముద్రమునందలి జంతువులకు హాని కలుగకుండునట్లు తరంగములచేత మెల్లమెల్లగఁ దోకను చల్లఁబడునట్లు చేసె. అనంతరమందు తన శరీరమునందలి మన్నును సర్వమును తుడుచుకొని క్షణముసే పూరకుండి సీతను తలఁచుకొని యయ్యో యని హృదయమునందుఁ గొట్టుకొనియె. అనంతరమందు సీతామహాదేవి దగ్ధురాలై యుండునని తలఁచె. అట్లు తలఁచి సముద్రపుగట్టునఁ గూర్చుండి తన్ను నిందించుకొనియె. పిమ్మట నయ్యో నేను స్వామికార్యమును కాల్చిన దుష్టుఁడనైతినే యని చింతించె.

అయ్యో రామునకు సంతోషమును కలుగఁజేయునట్టి సీతను నిశ్చయముగఁ గాల్చివేసితిని. అయ్యో లంకాపట్టణమును కాల్చుటకు పూర్వమునందు నా కీబుద్ధి పుట్టకపోయెను. కావున నిప్పుడు నాతోకను మెడకుఁ జుట్టుకొని నేను మరణమును చెందెదను. నేను మరణము పొందక బయలువెడలిపోయి సీతావృత్తాంతమును రామున కేమని చెప్పుదును. సీతామహాదేవి కాలిపోయిన దనువృత్తాంతమును చెప్పితినేని శ్రీరాముఁడు మరణమును పొందును. అన్న యగురాముఁడు మరణమును పొందినతోడనే తమ్ముఁడగులక్ష్మణుఁడుకూడ మరణమును పొందును. ఆ యిరువురును మరణమును పొందినందువలనఁ గలిగిన దుఃఖముచేత సుగ్రీవుఁడు మంత్రులతోఁగూడ మరణమునుపొందును. అనంతరమందు అంగదుఁడుకూడ మరణమును పొందును. పిమ్మట తార మరణమును పొందును.అనంతరమందు సకలవానరులును మరణమును పొందుదురు. పదునైదుసంవత్సరములవఱకును శ్రీరాముఁడు రాకుండుటచేత భరతుఁడుకూడ ప్రాణములనువిడుచును. రామలక్ష్మణులు మరణమును పొందుటవలనఁ గలిగిన దుఃఖముచేత కౌసల్యాసుమిత్రలుకూడఁ మరణమును పొందుదురు.అనంతరమందు సర్వానర్థములకును కారణురాలగు కైకేయికూడ మరణమును పొందును. పిమ్మట శత్రుఘ్నుఁడు మృతిఁజెందును. అవ్విధముగ జరుగుటచేత మునులును ప్రజలును మంత్రులును మఱియు నితరులును మరణమును పొందుదురు. అనంతరమందు సీతామహాదేవియును కౌసల్యాదులును పుట్టినకులమువారందఱును మరణమును పొందుదురు. ఇవ్విధముగ రాజకులము లన్నియును మరణమును పొందినతోడనే ప్రజలు స్వేచ్ఛాప్రవృత్తికలవారై యొకరినొకరు కొట్టుకొని మరణమును చెందుదురు. ఇవ్విధముగ భూమియందున్న వారందఱును మరణమును పొందుటచేత హవ్యకవ్యాదులు లోపించును గాన దేవతలుకూడ నాశమును పొందినవారితో సమానులగుదురు. మఱియు నివ్విధముగ నీకాలమునందు ప్రళయము జరుగుటచేత సకలలోకములను సృజించిన బ్రహ్మదేవుఁడుకూడ పశ్చాత్తాపముకలవాఁడై మరణమును పొందును. ఇవ్విధముగ బ్రహ్మాండమంతయును నాశమును పొందును. ఇట్టి యనర్థములను కలిగించుటకొఱకుఁగా దైవము నన్ను సృజించెనుకాఁబోలునని హనుమంతుఁడు అపరిమితముగ దుఃఖమును పొందె. ఇట్లు తలఁచుకొని హనుమంతుఁ డమితముగ దుఃఖమును పొంది దేహత్యాగమును చేయుటకొఱకుద్యుక్తుఁ డయ్యె. ఆసమయమునందు ఆకాశవాణి యధికసంతోషము కలుగునటుల నిట్లనియె. ఓ వానరోత్తమా! వ్యసనమును పొందకుము. సీతామహాదేవి మరణమును పొందలేదు. సుఖముగ నశోకవనమునందు జీవించియున్నది. కావున నీవుపోయి సీతామహాదేవిని చూచి శ్రీరామునొద్దకుఁ బొమ్మనియె. అవ్విధముగఁ బలికిన యాకాశవాణియొక్క మాటలను హనుమంతుఁడు విని పరమానందముకలవాఁడై సీతామహాదేవిని చూచుటకు మిగుల శీఘ్రముగ నశోకవనమునకుఁ

బోయె నని చెప్పి పరమశివుఁడు పార్వతితో నిట్లనియె. ఓపార్వతీ! ఆవిధముగ హనుమంతుఁడు అశోకవనమునకుఁ బోవుచు లంకాపట్టణమునందు బంగారముచేతఁ జుట్టఁబడిన యొక ప్రదేశమును చూచె. ఓపార్వతీ! దానికిఁ దగినకారణమును చెప్పెదను. సావధానచిత్తముకలదానవై వినుము. ఓపార్వతీ! సకలపర్వతములలో శ్రేష్ఠమగు చిత్రకూటమను పర్వత మొకటికలదు. అది నూరామడ పొడవుకలదై క్షీరోదకముచేత (పాలసముద్రముచేత) చుట్టఁబడి యున్నది. ఆపర్వతమునందలి మూఁడు శిఖరములచేత క్షీరసముద్రమంతయును వ్యాప్తమై యున్నది. ఆశృంగములు బంగారముచేతను వెండిచేతను వ్యాప్తములై యున్నవి. అట్టిపర్వతమునందు మహానుభావుఁడగు వరుణదేవుని యుద్యానవన మొక్కటి కలదు. మఱియు నాయుద్యానవనమునందు బంగారుపు పద్మములచేతఁ బ్రకాశించుచున్నదియును మిగుల విపులమైనదియును నగు సరస్సు కలదు. ఆసరస్సునందు నల్లకలువలు తెల్లకలువలుమొదలగు పుష్పము లనేకములు మిగుల మనోహరముగఁ బ్రకాశించుచున్నవి. అట్టి సరస్సును కృతఘ్నులును ఘాతుకులును నాస్తికులును నగు వారుచూడఁజాలరు. అట్టి సరస్సునందు దుష్టాత్మతకలదియును, వికారముకలదియును, అయినయొక మొసలి నివసించియుండె. అట్లుండఁగా నక్కడకు నొకనాఁడు అనేకగజములతోఁగూడ గజేంద్రుఁ డొకఁడు దాహశాంతికొఱకు నేగుదెంచె. అట్లు గజయూథములతోఁగూడ వచ్చి యామడుగునందుఁ దిగి యుదకమును పానమును చేయుచుండఁగా నొకమొసలివచ్చి యా గజేంద్రుని పట్టుకొనియె. అప్పు డాగజేంద్రుఁడు భయమునుపొంది తాను బయలునకు రాఁదలఁచి యామొసలిని బయలునకు లాగఁజొచ్చె. అంతట మొసలి లోనికా గజేంద్రుని నీడ్వఁజొచ్చె. ఆసమయమునందు ఆడయేనుఁగు లన్నియును నపరిమితముగ రోదనమును చేయుచుండె. మఱియు నాసమయమునందు, ఇతరములైన గజములుకూడ ఆయేనుఁగును బయలునకు లాఁగఁదలంచి యపరిమితముగఁ బ్రయత్నమునుచేసి తమప్రయత్నము విఫలమగుటచేత మిగుల దుఃఖమును పొందె. అంతట నామొసలికిని గజేంద్రునకును మిగుల భయంకరమైన యుద్ధముజరిగె. అట్టియుద్ధమునందు తుదకు గజేంద్రుఁడు మహాపదను పొందినవాఁడయ్యె. అవ్విధముగ నధికాపదను పొందినదై నిశ్చలచిత్తత నవలంబించి పరిశుద్ధమైన యంతరాత్మతో తన తొండముచేత కాంచనపద్మమును భగవంతుఁడగు విష్ణువునకు నైవేద్యముగాఁ దలఁచి జనార్దనుఁడగు నారాయణుని ననేకవిధములఁ బ్రార్థించె. మఱియును తన్ను మహాపదనుండి యుద్ధరింపుమని యనేకవిధముల స్తోత్రమును చేసె. అట్టి స్తోత్రపాఠములచేత భగవంతుఁ డగు నారాయణుఁడు సంతోషముకలవాఁడై గరుడునిమీఁద నెక్కి యచ్చోటునకు వచ్చె. వచ్చిన పిమ్మట ఆనారాయణుఁ డా మొసలిని విడిపింపఁజేసి యాగజేంద్రుని సంరక్షించె. మఱియును తనదు చక్రాయుధముచేత నీటియందు మునిఁగియున్న మొసలిని

సంహరించె. అట్లు చేసి యాగజేంద్రుని పాశములనుండి విముక్తునిగాఁజేసి, అట్లు నారాయణుఁడు చేసిన వెంటనే యాగజేంద్రుఁడు పూర్వజన్మమునందలి యింద్రద్యుమ్నమహారాజ రూపమును ధరించె. ఓపార్వతీ ! ఆయింద్రద్యుమ్నునివృత్తాంతమును చెప్పెదను. సావధానచిత్తముతో వినుము. పూర్వమునందు ఇంద్రద్యుమ్నమహారా జొకనాఁడు తపోనిష్ఠుఁడును, ధ్యానతత్పరుఁడును నై యుండె. అట్లుండఁగ నొక్కనాఁడు ఇచ్ఛానుసారముగ సంచరించుచు నగస్త్యమునివరుఁ డచ్చోటునకు వచ్చె. అప్పుడు ఆరాజు ధ్యాననిష్ఠుఁడై యుండుటచేత నమ్మునివరుఁడు వచ్చిన సంగతిని తెలిసికొనలేక పోయె. ఆసమయమునందు అగస్త్యమునివరుఁడు తనను జూచి లేవకయున్నందునకుఁ గోపోద్దీపితుఁడై యిట్లని శపించె. ఓ రాజోత్తమా ! తపోమదముచేత నేను వచ్చినవెంటనే లేచి నన్నుఁ బూజింపకుంటివి కనుక మదపుటేనుఁగునై పుట్టి యరణ్యమునందు సంచరించుచుండు మని శపించె. అంతలో నింద్రద్యుమ్నమహారాజు సమాధినుండి లేచి యమ్మునివరునకు నమస్కరించి నాకు శాపవిముక్తియగు నుపాయమును చెప్పు మనిన, నమ్మునివరుఁడు దయాళుఁడై మరల నిట్లనియె. ఓరాజోత్తమా ! విష్ణుదేవునివలన నీకు శాపవిముక్తియగును. నిన్ను నెప్పుడు మొసలి పట్టుకొనునో అప్పుడు నారాయణుఁడు వచ్చి నిన్ను విడిపించును. ఓపార్వతీ ! పూర్వమునందు హూహూనామకగంధర్వుఁడు స్నానముకొఱకు మడుగునొద్దకు వచ్చి యామడుగునందుఁబడియున్న దేవలుఁడను వానిని బయలునకుఁ దీయుటకు యత్నించె. అట్లు యత్నించి బయలునకుఁ దీయుచుండఁగా, ఆదేవలమునివరుం డాగంధర్వు నిట్లని శపించె. ఓ గంధర్వుఁడా ! నీవు మొసలివలె నాపాదములను పట్టుకొంటివి కనుక, నీవు మొసలివై యీమడుగునందుఁ బడియుండు మని శపించె. అంతట నాగంధర్వుఁడు భయముకలవాఁడై యమ్మునివరు ననేకవిధములఁ బ్రార్థింపగాఁ నమ్మునివరుఁ డిట్లనియె. ఓరీగంధర్వుఁడా ! నిన్ను నారాయణుఁడు మడుగునుండి లేదీయునపుడు నీకు శాపవిముక్తి కలుగుననియె. ఓపార్వతీ ! ఈ యిరుపురును ఈవిధముగా అధికములయిన కష్టములను పొందుచుండిరి. అట్లుండఁగా నారాయణుఁడు వచ్చి యీయిరుపురిని నుద్ధరించుటచేత పూర్వరూపములను ధరించి తమనివాసములకుఁ బోయిరి. ఆసమయమునందు గరుత్మంతుఁడు అధికముగ క్షుద్బాధకలవాఁ డగుటచేత నాయాఁకలిదీరుటకుఁ దగినయాహారమునిమ్మని ప్రార్థింపఁగా నారాయణుఁడు గజనక్రములయొక్క కళేబరములను భుజింపుమనియె. అంతట నాగరుత్మంతుఁడు ఆసరోవరముదగ్గరకుఁబోయి కాళ్లసందునఁబెట్టుకొని యాకళేబరములనుకొనిపోయి పరిశుద్ధమైన ప్రదేశమునందుఁ బెట్టుకొనఁదలచి పోవుచు క్షీరసముద్రమునందలి యొకజాంబూనద వృక్షమునుచూచె. అది నూఱామడవెడల్పుకలదై యుండె. అంతట నావృక్షముక్రిందనున్న యొకశిలయం దాకళేబరములనుపెట్టుకొని తినుటకుయత్నించె. అట్లు యత్నించుచుండఁగా ఆవృక్షమునందలి కొమ్మయొ

పునకుఁ దెలిపె. ఆవృత్తాంతమును సుగ్రీవుఁ డిట్లనితలఁచె. హనుమదాదులు నిశ్చయముగ సీతనుచూచిరి. కావుననే నిర్భయముగ వనమునందలి ఫలములను భుజించుచున్నారు. అట్లుకాదేని యిట్టి యకార్యమునుచేయ రనితలఁచి యాదధివక్త్రునితో నిట్లనియె. ఓదధివక్త్రా! నీవు హనుమదాదుల నడ్డగింపక శీఘ్రముగ నేను రమ్మని చెప్పితినని చెప్పుమనియె. అంతట దధివక్త్రుఁ డతిశీఘ్రముగఁ బోయి యాహనుమదాదులతో నావృత్తాంతమును తెలిపె. అప్పుటికి హనుమదాదులు సంపూర్ణముగ ఫలాదుల ననుభవించియుండుటచేత దధివక్త్రుఁడు చెప్పినమాటనువిని యతిశీఘ్రముగ రామాదులున్నచోటునకుఁ బోయె. అంతట హనుమంతుఁడు ముందుగఁబోయి రామునకు నమస్కరించి బ్రహ్మదేవుఁడిచ్చిన పత్రము నిచ్చె. పిమ్మట చూడామణినిచ్చి కాకవృత్తమును తెలిపె. ఆవిషయమును సర్వమును తెలిసికొని రాముఁడు హనుమంతునిచేతఁ జేయఁబడినకార్యముల నన్నిఁటిని తెలిసికొని యిట్లనియె. ఓ హనుమంతా! నీవు చేసిన యుపకారమునకుఁ దగిన ప్రత్యుపకారమును నేనెఱుఁగను. నీవు మిగులఁ బ్రసిద్ధుఁడవైతివని చెప్పి హనుమంతుని నాలింగనముచేసికొని యిట్లనియె. ఓ యాంజనేయా! పరమాత్ముఁడనైన నే నాలింగనమును చేసికొనుట ముల్లోకములలో నెవ్వరికిని లభ్యముకాదు. మఱియు నో యాంజనేయా! నీవు పరమాప్తుఁడవును పరమభక్తుఁడవును కనుక నిన్నుఁ గౌగిలించుకొంటిని. నారాయణుని పాదపద్మములను **తులసీదళముల**చేతఁ బూజించువారు శాశ్వతమగు విష్ణులోకమును పొందుదురు. సాక్షాన్నారాయణుఁ డగురామునిచేత నాలింగనమును చేసికొనిన వాని పుణ్యమునకు మితికలదా? అనిన విని యాహనుమంతుఁడు శ్రీరామునితో అత్యధికమైన భయముకలవాఁడగుచు నిట్లనియె. ఓరామచంద్రా! నేను మార్గమధ్యమునందు నే నొకయపరాధమునుచేసితినని మార్గమధ్యమునందుఁ జెప్పినవృత్తాంతమును సర్వమునుచెప్పిన శ్రీరాముఁడుకూడ నవ్వుచు నిట్లనియె. ఓ యాంజనేయా! నేనే మునిరూపముతో వేష కనుచూపించితిని. నిగర్వమును పోఁగొట్టఁదలఁచి యట్లుచేసితిని. నీవు తెచ్చినయుంగర మిదిగో చూడుమని తనచేతివ్రేలనున్న యుంగరమునుచూపె. అంతట హనుమంతుఁడు శ్రీరామునిహస్తమునందున్న యంగుళీయకమునుచూచి గర్వరహితుఁడై యారాముని విష్ణువునుగాఁదలఁచె. మఱియును తనయందుఁగలిగిన పరాక్రమము కూడ రామునివలననే కలిగినదనితలఁచె నని పరమశివుఁడు శ్రీరాముని నిమిత్తము హనుమంతునిచేతఁ జేయఁబడిన కార్యములనన్నిఁటిని పార్వతీదేవితోఁ జెప్పె.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానందరామాయణమున
సారకాండమునందు జానకీవృత్తాంత మను నామధేయము
కల తొమ్మిదవసర్గ ముగిసెను.

### * సేతుమాహాత్మ్య కాశీవిశ్వేశ్వరాగమములు. *

ఓపార్వతీ ! అనంతరమందు శ్రీరాముఁడు హనుమంతునితో నిట్లనియె. ఓయాంజనేయా ! లంకాపురవృత్తాంతమును సర్వమును సంపూర్ణముగఁ దెలుపుము. ఆవృత్తాంతమును సర్వమును తెలిసికొని చేయఁదగినకార్యమును చేయుదుననిన హనుమంతుఁడు మరల నిట్లనియె. ఓదేవోత్తమా ! లంకయనునది మిగులశ్రేష్ఠమైనది. అయ్యది త్రికూటాచలముమీఁద నున్నది. మఱియు నాలంకాపట్టణము స్వర్ణప్రాకారములతోఁ గూడుకొనినదియును, స్వర్ణాట్టాలకములతోఁ గూడుకొని నదియును, అత్యధికములయిన పరిఘలుకలదియును, నానావిధములయిన యుద్యానవనములతోఁ గూడుకొనియున్నదియును, దివ్యములగు దిగుడుబావులతోఁ గూడుకొనినది యును, విచిత్రములయిన కాంతులుకలవియును శుభకరములును అయిన మణిమయస్తంభములచేతఁ బ్రకాశించుచున్నదియును నై యున్నది. మఱియు నోరామచంద్రా! ఆలంకాపట్టణముయొక్క పశ్చిమద్వారమునందున ఏనుఁగులుప్రవాహాకారముగ వచ్చుచుఁ బోవుచునుండును. ఉత్తరద్వారమునందు పదాతులతోఁగూడ గుఱ్ఱపురౌతులు నివసింతురు. మఱియు ననేకవేలమంది తూర్పువాకిట నివసించి యున్నారు. రథికులు దక్షిణద్వారమునందు నివసించియున్నారు. మఱియు నోరాజోత్తమా ! నగరమధ్యమునందు మితిలేని చతురంగబలములును నివసించియుండును. నానావిధములయిన యస్త్రములయందు నేర్పుకల రాక్షసు లనేకులు లంకాపట్టణమునందు నివసించియున్నారు. మఱియు ననేకవేల శతఘ్నులా లంకాపట్టణమునందు నివసించియున్నవి. ఓరాజోత్తమా! ఇంకను లంకాపట్టణమునందు నాచేతఁ జేయఁబడినకార్యములను చెప్పెదను. లంకాపట్టణమునందలి నాల్గవభాగమైన సైన్యమును నేనుజంపితిని. లంకాపట్టణమును సర్వమును కాల్చితిని. మఱియు నాలంకాపట్టణమునందలి ప్రాకారములు ధ్వంసంబడఁబడెను. శతఘ్నులుమొదలుగాఁగల యనేకవేల యాయుధములు నశింపఁజేయఁబడినవి. మఱియు నోరఘుకులోత్తమా ! నీవుచూచినతోడనే లంకాపట్టణము మరలభస్మమైపోయినవి. ఆలంకాపట్టణమున కుత్తరపుభాగమునందు సువేలాద్రి యనుపర్వతముకలదు. ఓరఘుకులోత్తమా ! త్రికూటశిఖరమునందు మిగులరమ్యమైనదియును, నాతోఁకయందలియగ్నిచేత తగులఁబెట్టఁబడినదియును అయిన లంకాపట్టణమునుచూడుము. ఓరామచంద్రా ! లవణసముద్రతీరమునకుఁబోదము. పయనమునుచేయుమని హనుమంతుఁడు చెప్పినవాక్యమును యారాముఁడు విని సుగ్రీవునితో నిట్లనియె. ఓవానరోత్తమా ! సైనికులనందఱను పయనమునుచేయుము. ఇప్పుడే విజయముకలుగును. శ్రవణనక్షత్రముతోఁ గూడుకొనిన యాశ్వయుజశుక్లదశమియందు పయనమునుచేసిన యెడల మనకుజయముకలుగును. ఆదినమునందు మనము పయనమును చేయుట యుత్తమము. సేనానాయకులందఱను సేనలనందఱను పార్శ్వములయందుండి కాపాడునట్లుచేయుము.

మఱియు నోవానరోత్తమా! మనసైన్యమునకు నలుఁడు ముందరిభాగమునందును, నీలుఁడు వెనుకటిభాగమునందును కాపాడునట్లుచేయుము. మఱియును, సుషేణుఁడు సవ్యపార్శ్వమునందును జాంబవంతుఁడు వామపార్శ్వమునందును కాపాడునట్లు చేయుము. ఇంతయుగాక గజ గవయమైంద గవాక్షులు ఆగ్నేయాదిదిక్కులయందుఁ గాపాడునట్లు చేయుము. మఱియు నిటులనే ద్వివిధాదివానరోత్తములు కూడ వానరసైన్యమును కాపాడునట్లు చేయుము. నేను హనుమంతుని భుజములమీఁదనెక్కి ముందుగఁబోదును. లక్ష్మణుఁడు అంగదునిభుజములమీఁదనెక్కి నావెంటనంటివచ్చును. నీవు నాతోఁగూడరమ్ము? అని చెప్పి శ్రీరాముఁడు సేనామధ్యమందుఁ బ్రవేశించి పయనమయ్యె. అప్పటివానరుల కలకలధ్వని సకలలోకములవారికిని భయమునుకలుగఁ జేయునదియైయుండె. మఱియు నావానరసైన్యమునందు పణవానకగోముఖాదివాద్యముల ధ్వనులు చెలంగె. ఆసమయమునందు మదపుటేనుఁగులతో సమానులగువానరులందఱును దివారాత్రములువిడువకుండ నడచుచుండిరి. అట్లు లంకాపట్టణమునకు బయనమైపోవుచున్న రామునకనేకములగు శుభశకునములయ్యె. అంతట నారాముఁడు వానరసైన్యముతోఁగూడ సహ్యపర్వతము నతిక్రమించి మలయపర్వతమునకుఁ బోయె. పిమ్మట నావానరులందఱును సముద్రతీరమునకుఁబోయి సేనానివాసముల నేర్పఱచిరి. అనంతరమందు సముద్రమునుదాటుట కాలోచించుచుండిరి. అక్కడ రావణుఁడు హనుమంతుఁడు లంకాపట్టణమునందుఁజేసినదుష్కృత్యమునుచూచి ప్రహస్తాదిమంత్రివరులతో నిట్లనియె. ఓమంత్రిపుంగవులారా! ఒక్కవానరుఁడు వచ్చి మనలంకాపట్టణమును సర్వమును కాల్చిపోయె. అశోకవనమును సర్వమును విఱిచె. అనేకవేల రాక్షసులను వధించె. ఇఁకమీఁద నేమేమియాపదలు సంభవించునోకదా? అనిపలుకుచున్న రావణునకామంత్రులిట్లనిరి. ఓరాక్షసరాజోత్తమా! నీవు వ్యసనమునుపొందకుము. వీఁడు వానరుఁడని మే ముపేక్షించితిమి. అట్లుకాదేని యావానరుని నప్పుడే వధించియుందుము. రాజోత్తమా! నీవాజ్ఞనిచ్చెదవేని యీలోకమునందు వానరుఁ డనుపేరుకూడ లేకుండునట్లు చేయుదుమనిరి. ఆసమయమునందు కుంభకర్ణుఁ డిట్లనియె. ఓరావణరాజోత్తమా! నీవుసీతను తెచ్చునప్పుడే రామునివధింపకపోవుటచేత నిట్టి యనర్థము కలిగినది. అయినం గానిమ్ము. నాకాజ్ఞనిచ్చితివేని నేను రామలక్ష్మణ సుగ్రీవాదులవధించి వచ్చెదననియె. ఆవచనములను విని భగవద్భక్తులలో నుత్తముఁడును, శ్రీరామునియం దధికమైన భక్తికలవాఁడును, అగు విభీషణుఁడు కుంభకర్ణాది రాక్షసులనుచూచి కామాతురుఁడును, ప్రమత్తుఁడును, అయిన రావణునితో నిట్లనియె. ఓరాక్షసరాజోత్తమా! కుంభకర్ణుఁడు, ఇంద్రజిత్తు, మహాపార్శ్వుఁడు, మహోదరుఁడు, నికుంభుఁడు, కుంభుఁడు, అతికాయుఁడు మొదలగువారు యుద్ధరంగమునందు రామునకభిముఖముగ నిలువఁ

జాలరు. కావున నోరాక్షసోత్తమా! సీతతోఁగూడ సర్వోత్తమములయిన కా
నుకలను గొనిపోయి శ్రీరామునకు సమర్పించి సుఖవంతుఁడవగుము. అట్లుచేయవేని
నీవు రామునిచేత విడువఁబడవు. ఇంద్రాదులడ్డపడినను నీవుజయింపఁజాలవని విభీష
ణుఁడుచెప్పిన హితవచనములనువిని తనకు హితములైన వచనములనుగాఁ దలఁపక
పోయె. మఱియు నారావణునకు దుష్కాలమువచ్చియుండుటచేత విభీషణునితో నిట్ల
నియె. ఓరీ రాక్షసాధమా! నీవు బంధురూపముతోనున్న శత్రుఁడవు కాని వేఱొకటి
కాదు. అట్లుగాకున్న నివ్విధముగ నెవ్వఁడుచెప్పును. ఇఁక నిట్టిమాటలను చెప్పక లేచి
పొమ్ము. ఛీ! ఛీ! ఛీ! నీవులేచిపోవేని నిన్నుఁ జంపెద ననియె. అంతట విభీషణుఁ
డసహ్యమునుపొందుచు తనదు నల్వురుమంత్రులతోఁగూడ శ్రీరామునిసమీపము
నకుఁబోయె. అప్పుడు శ్రీరాముఁడు విభీషణునితలంపును తెలిసికొని యతనితో మిత్ర
త్వము నవలంబించె. అనంతరమందు సముద్రతీరమునందు హనుమంతునివలన నిసు
కతో లంకాపురమునుచేయించి యక్కడ విభీషణునకు పట్టాభిషేకమునుచేయించె.
అట్లుచేయించి నవ్వుచు శ్రీరాముఁడు విభీషణునితో నిట్లనియె. ఓరాక్షసోత్తమా!
నిజలంకనుజయించి నీకిచ్చువఱకును ఈకృత్రిమలంకను బదులుగాఁబెట్టికొనియుండు
ము. నీవు నిజలంకయందు ప్రవేశించినపిమ్మట నిది హనుమల్లంకయగుననియె. ఇట్లు
శ్రీరాముఁడు చెప్పుచుండఁగా శుకుఁడనువాఁ డంతరిక్షమునందుండి సుగ్రీవునితో నిట్ల
నియె. ఓవానరోత్తమా! నన్ను రావణుఁడు పంపఁగావచ్చితిని. రావణుఁడుచెప్పిన
మాటలను రావణుఁడు చెప్పినవిధముగానే చెప్పెదను వినుము. ఓవానరోత్తమా!
నీద్రవ్యమును నేనపహరింపలేదు. నేను రామునిభార్యను తెచ్చికొంటిని. అందువ
లన నీకేమియును హాని లేదుకదా? కావున నీవు నాతోవైరమును పెట్టుకొనక
కిష్కింధాపట్టణమునకుఁ బొమ్మనియె. ఆమాటలను విని వానరులందఱును గుమిఁ
గూడి శృంఖలములచేత నాశుకునిబంధించిరి. ఈవిషయమును సర్వమును శార్దూ
లుఁ డనువాఁడు తెలిసికొనిపోయి యావృత్తాంతమును సర్వమును రావణునకునెఱిం
గించె. ఆవృత్తాంతమును సర్వమును రావణుఁడు విని అత్యధికమైన విచారముకలవాఁ
డయ్యె. అంతనక్కడ రాముఁడు సుగ్రీవవిభీషణాదులతోఁగూడుకొని యేకాంతమునం
దిట్లనియాలోచింపఁదలఁచి యిట్లనియె. ఓమంత్రిపుంగవులారా! ఈసముద్రమును
దాటుటకు తగినయత్నమును చేయవలయును. వానికిఁదగిన యుపాయమును వెదుక
వలయు ననితలఁచుచుండె. ఆసమయమునందు సముద్రుఁడు మేఘమువలె గర్జనమును
చేయుచుండుటచేత రాముఁడు తనవచనములు తనమంత్రులకు వినఁబడవనితలఁచి వా
మహాస్త్రముచేత నాసముద్రము నూరకుండుమనియె. అదిమొదలుకొని సముద్రుఁ
డక్కడ ధ్వనిలేనివాఁడై యుండె. అంతట రాముఁడు సముద్రమునుదాటుటకుఁ దగిన
యుపాయమునుగానక సముద్రునిప్రార్థింపఁదలచి దర్భలనుపఱచుకొని ప్రాయోపవేశ
మునుచేసి మూఁడుదినములుప్రార్థించె. అట్లు మూఁడుదినములుప్రార్థించినను సము

ద్రుఁడు ననుగ్రహము రాకపోవుటచేత శ్రీరాముఁడు దర్భశయ్యనుండి లేచి లక్ష్మణునితో నిట్లనియె. లక్ష్మణా! తమ్ముఁడా! నీవు చూడుము. దుష్టస్వభావముగల యీ సముద్రుఁడు సమీపమునకు వచ్చిన నన్నుఁ దెలియఁజాలకున్నాఁడు. ఈదుష్టాత్ముఁడు నన్నుఁ జూచుటకుఁ గొంచెమైనను సంతోషములేనివాఁడై యున్నాఁడు. మఱియు నోతమ్ముఁడా! వానరులతోఁ గూడుకొనినవాఁడును అయిన యీరాముఁ డేమిచేయఁగలఁ డనితలఁచుచున్నాఁడు. కావున నిప్పుడు నేను నాబాణానలముచేత ఈ సముద్రమును శోషింపఁజేసెదను. అట్లుచేసితినేని వానరులందఱును భయరహితులై పాదములచేతనే సముద్రమునుదాటిపోదురని చెప్పె. అట్లుచెప్పి బాణమును సంధానమునుచేసె. ఆసమయమునందు భూమి కంపమును పొందె. దశదిక్కులయందును చీకట్లు వ్యాప్తములయ్యె. సముద్రము లల్లకల్లోలములయ్యె. మఱియును, భయమువలన సముద్రుఁడు యోజనదూరమునకుఁ బోయె. సముద్రమునందలి మకరమీనాదిక్రూరజంతువులు మిగులభయమునుపొందె. అంతలో సముద్రుఁడు దివ్యరూపమును ధరించినవాఁడై రత్నములనుగొనివచ్చి కానుకగాసమర్పించి నమస్కరించె. మఱియును దీనాత్ముఁడై యీరాముని ననేకవిధములఁ బ్రార్థించె. మఱియు నోరామచంద్రా! నీవు లంకానగరమునకుఁ బోవుటకుఁ దగినమార్గము నిచ్చెదను. నాకభయమునిచ్చి కాపాడుమనిన విని శ్రీరాముఁ డాసముద్రునితో నిట్లనియె. ఓసముద్రుఁడా! ఈబాణము అమోఘమైనది. కావున దీనినెక్కడ వైతునో చెప్పుము. శీఘ్రముగ నీబాణమునకు లక్ష్యమును చూపుమనిన సముద్రుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఉత్తరదేశమునందు ద్రుమకల్పమను దేశముకలదు. దానియందనేకులగు పాపాత్ములు నివసించియున్నారు. సర్వకాలములయందు నన్ను బాధించుచుందురు. కావున నోరామచంద్రా! ఈబాణము ఆపాపాత్ములయందుఁ బడునట్లుచేయుమనియె. అంతట రాముఁ డాబాణమును ప్రయోగింపఁగా నది క్షణమాత్రములో పలఁబోయి యాచోటనున్న రాక్షసులనందఱను జంపి మిగుల శీఘ్రముగవచ్చి యంబులపొదియందుఁ బ్రవేశించె. అంతట సముద్రుఁడు వినయముతోఁ గూడుకొనినవాఁడై శ్రీరామునితో మరల నిట్లనియె. ఓరామచంద్రా! నాయందు జాలతో సేతువును నిర్మింపుము. విశ్వకర్మపుత్త్రుఁడగు నలుఁడనువాఁడు సముద్రముమీఁద సేతువునుకట్టుటకు వరమునుపొందియున్నాఁడు. ఈనలుఁడు తొల్లి జాహ్నవీతీరమునందలి బ్రాహ్మణోత్తముల సాలగ్రామములను గంగయందుఁ బడవేయనారంభించె. అవి యన్నియును గంగయందు మునిగిపోవుచుండుటచేత నాబ్రాహ్మణులు వెదకికొనఁజాలక యీనలుఁడనువానరుఁడు నీళ్లయందువేయునట్టి శిలలు మొదలగునవి యన్నియును నీటిమీఁదనే నిలిచియుండునుగాక యనిరి. అట్లు మునివరులు శపించుట వరమయ్యె. కావున నలునిమూలముగ సేతువునుకట్టింపుమని చెప్పి శ్రీరామునకు నమస్కరించి యంతర్ధానమునుపొందె. అంతట శ్రీరాముఁడు సేతువుకొఱకు

నలునకాజ్ఞనిచ్చె. అప్పుడు సేతువునుకట్టుటకు ప్రయత్నించుటచేత నాకార్యము *నిర్విఘ్నముగఁ బరిసమాప్తిని పొందుటకు వినాయకుని స్థాపించి నవగ్రహములకు బదులుగా తొమ్మిదిశిలలను నలునిహస్తముచేత ముందుగాస్థాపింపఁజేసె. అనంతరమందు సాగరసంయోగమునందుఁ దనపేరుతో శ్రేష్ఠమైన లింగమును స్థాపింపఁదలఁచి హనుమంతునితో నిట్లనియె. ఓయాంజనేయా ! నీవు కాశీపట్టణమునకుఁబోయి శివునినడిగి రెండులింగములను దీసికొని రమ్మనియె. ఒక్కముహూర్తకాలములో రావలయును. ముహూర్తకాల మతిక్రమించకమునుపే రావలయుననివిని హనుమంతుఁడు గగనమార్గముచేత క్షణమాత్రములోపల కాశీపట్టణమునకుఁబోయె. పోయి విశ్వేశ్వరునకు నమస్కరించి రామకార్యముకొఱకు వచ్చితిననియె. ఆవచనమును విని విశ్వేశ్వరుఁడనగు నేను రెండులింగములనిచ్చితిని. మఱియు నోపార్వతీ! నేనుగూడ దక్షిణదేశమునకు పోఁదలఁచియుంటిని. కనుక రాఘవాజ్ఞచేత అగస్త్యితోఁగూడ దక్షిణదేశమునకు వచ్చెదనని చెప్పితిని. ఆవచనమును హనుమంతుఁడువిని విశ్వేశ్వరుఁడనగునాకు నమస్కరించి యిట్లనియె. ఓదేవోత్తమా ! ఆవృత్తాంతమును సర్వమును సవిస్తరముగఁ జెప్పుమని నన్నుఁ బ్రార్థించె. అంతట నేనిట్లంటిని. ఓయాంజనేయా ! పూర్వవృత్తాంతమును సర్వమును చెప్పెదను వినుము. తొల్లి యొకనాఁడు నారదమునివరుఁడు నర్మదాజలమునందు స్నానమునుచేసి సకలప్రాణులకును సర్వమును నిచ్చునట్టి యోంకారమును ప్రార్థించె. అట్లు ప్రార్థించి యథేచ్ఛముగఁ బోవుచు మార్గమధ్యమునందు వింధ్యమనుపేరు కలపర్వతమునుచూచె. ఆసమయమునందు చరాచర రూపములతోనున్న వింధ్యుఁడు ప్రత్యుత్థానమునుచేసి నారదమహామునిని తనగృహమునకుఁ దీసికొనిపోయి శాస్త్రోక్తప్రకారముగ నతిథిపూజనుచేసి యామునివరునకు మార్గాయాసమునుపోఁగొట్టి యిట్లనియె. ఓమునికులోత్తమా ! నీవు మాగృహమునకు వచ్చుటచేత మాగృహమంతయును పావనమైనది. మఱియును నీశరీరము స్థావరరూపముతోనున్న నాయందు సోకుటచేత నాయవివేకమంతయును పోయినది. ఈదినము సకలపాపములను పోఁగొట్టునట్టి సుదినమని చెప్పఁదగియున్నది. నాపూర్వజన్మమునందలి పుణ్యములచేత నిట్టిఫలముకలిగినది. కులపర్వతములలో నేఁడు నాకు ధన్యతకలిగెననిన విని నారదమహాముని నిట్టూర్పులనునిగుడ్చె. అంతట నావింధ్యుఁడు మరలనిట్లనియె. ఓమునికులోత్తమా ! నీవు నిట్టూర్పునువిడుచుటకు కారణమేమి ! తగినకారణమును చెప్పితివేని నీమనస్సునందలి దుఃఖమునుతీర్చెదను. భూమినిధరించు సామర్థ్యము మేర్వాదిపర్వతములకుఁగలదని వేదాదులయందు నిర్ణయింపఁబడి యున్నదికదా? అట్టిపర్వతములలో నాకొక్కనికే భూమిని సర్వమును ధరించుశక్తికలదు. మఱియు నోమునికులోత్తమా ! హిమవంతుఁడు పార్వతికి తండ్రియును, పరమశివునకు బంధుఁడును, సకలపర్వతములకును అధిపతి యగుటవలనను సర్వగిరులలో

పూజ్యుఁడయ్యె. మఱియు నాహిమవంతుఁడు సువర్ణపూర్ణుఁడును, రత్నసానువులుకలవాఁడును, దేవతలకు నివాసస్థానమును అగుటచేత హిమవంతునికంటె నధికుఁడెవ్వఁడును లేఁడు. ఇతరములగు పర్వతములన్నియును తమతమ దేశములయందుఁ బూజ్యములై యున్నవికాని వానికన్నిటికిని భూమినిభరించుటకుఁదగిన సామర్థ్యము లేదు. శ్రీశైలాదిపర్వతములయొక్క శిఖరములను చూచుటచేత ముక్తికలుగునని చెప్పఁబడియున్నను వానిలో దేనికిని నాకున్నసామర్థ్యము లేదని వింధ్యుఁడు చెప్పినవాక్యములను నారదమునివరుఁడువిని కొంచెముసేపాలోచించి యిట్లనియె. ఓవింధ్యుఁడా! సకలపర్వతములలో నీవు శ్రేష్ఠుఁడవనుటకు సందేహమేమియును లేదు. అయినను మేరుపర్వతము నీకంటెనెక్కువైనదానినని చెప్పుచు నిన్ను నవమానించుచుండును. కావున నీవిషయమును నీకుఁ దెలుపుటకు సంకోచమునుపొంది నిట్టూర్పులను విడిచితిని. ఇంతకంటె నాకువిచారమేమికలదు. నీకు సర్వమంగళములును కలుగుఁగాకయని చెప్పి తనయిష్టానుసారముగ బయలు వెడలిపోయె. అట్లుచెప్పి మునివరుఁడుపోఁగానే వింధ్యుఁడు అత్యధికముగ నుద్విగ్నమైన మనస్సుకలవాఁడై మేరుపర్వతము నాకంటెనధికమైనదెట్లగు ననివిచారమునుపొంది యిట్లనితలఁచె. సూర్యుఁడు గ్రహనక్షత్రములతోఁగూడ ప్రతిదినమందును మేరుప్రదక్షిణమును చేయుచున్నాఁడు. కావున తనకంటె నధికుఁడు లేఁడని మేరుపర్వతముకంటె పొడవుగనుండఁ దలఁచె. అట్లు నిశ్చయించి తానువృద్ధినిపొందఁదలఁచి సూర్యాదిగ్రహములమార్గము నతిక్రమించి పెరిగి సుఖముగనుండె. అంతట మరుదినము సూర్యుఁడుదయించి వింధ్యునిచేత తనమార్గము నాతంకపరుపఁబడియుండుటనుచూచి వికలచిత్తుఁడై యిట్లనితలఁచె. నేను అరనిమేషమునకు రెండువేల రెండునూరుల యోజనములదూరము నడువవలయును. మార్గమున కడ్డముకలిగెనుకదా? నేనేమిచేయుదు నని యోచించుచుండఁగా నలుదిక్కులవారును సూర్యుఁడురాకపోవుటచేత విచారమునుపొందుచుండిరి. మఱియును గ్రహనక్షత్రములుకూడ మార్గము లేకపోవుటచేత నెక్కడనున్నవి యక్కడనే నిలిచియుండె. అప్పుడు భూలోకమునందు వైదికకర్మములు నిలిచిపోయె. అందువలన ముల్లోకములును కంపమునుపొందె. ఆసమయమునందు దేవతలందఱును బ్రహ్మయొద్దకుఁబోయి యిట్టియుపద్రవముకలుగుటకుఁ గారణమేమనియడుగఁగా బ్రహ్మదేవుఁ డాలోచించి యాదేవతలతో నిట్లనియె. ఓదేవతలారా! వింధ్యుఁడు మేరుపర్వతముకంటె నధికుఁడై యుండఁదలఁచి వృద్ధినిపొందుటచేత నిట్టియనర్థముకలిగినది. కావున నీకార్యమగస్త్యమునివరునికంటె నితరునిచేతఁ జక్కఁబడదనియె. అంతట నాదేవతలందఱును వింధ్యునకు గురుఁడగు నగస్త్యమునివరునిఁ బ్రార్థించిరి. అప్పుడగస్త్యుఁడు విశ్వేశ్వరుఁడ నగునన్ను వదలిపోవుట కధికముగఁజింతించుచుండఁగా నేనాయగస్త్యమునివరునితో నిట్లంటిని. ఓ మునివర్యా! నీవు విచారమునుపొందక మాటలచేత నీశిష్యుఁడగు వింధ్యుని యౌన్నత్యమునుపోఁగొట్టి నీవు దక్షిణదిక్కునకుఁ

పొమ్ము? నేనును శీఘ్రముగానే బయలువెడలివచ్చెదనని చెప్పె. అంతట నమ్మునివరుఁడు భార్యాసహితముగ దక్షిణదిక్కునకు పయనమైపోవుచుండె. అట్లుపోవుచున్న యగస్త్యమునివరునిఁజూచి వింధ్యుఁడు మిగులభయమునుపొందినవాఁడై పొట్టితనమునవలంబించి యామునివరునితో నిట్లనియె. ఓమునివర్యా! నీవెక్కడకుఁ బోవుచున్నావు. ఇప్పుడు నేను చేయఁదగినకార్యమేదియో తెలిపి నన్నుఁ గృతార్థునిచేయుమనినవిని యామునివరుఁడిట్లనియె. ఓవింధ్యుఁడా! నీవు సజ్జనుఁడవును ప్రాజ్ఞుఁడవును నగుటచేత నే నొక్కవిషయమునుచెప్పెదను. సావధానుఁడవై విని నాయాజ్ఞనునెరవేర్పుము. ఓశిష్యోత్తమా! నేను దక్షిణసముద్రమునుచూడఁదలఁచి పోవుచున్నాను. కావున నేను మరలి వచ్చువఱకును నీవు పొట్టితనమునవలంబించియుండు మనిన వింధ్యుఁ డందులకంగీకారమునుపొందె. అంతట నగస్త్యమునివరుఁడు దక్షిణ దిక్కునకుఁ బోయె. అది మొదలుకొని వింధ్యుఁడు తనగురుఁడగు నగస్త్యమునివరుఁడు నేఁడో రేపో వచ్చుననితలఁచుచున్నాఁ డని తలఁచి యణఁగపడియున్నాఁడు. అది మొదలుకొని నేటివఱకును నగస్త్యమునివరుఁడు రాకుండుటచేత వింధ్యుఁడును వృద్ధినిపొందకయున్నాఁడు. అంతట సూర్యుఁడు యథాప్రకారముగ సంచరించుచున్నాఁడు. లోకములన్నియును స్వస్థచిత్తములై యున్నవి. ఆయగస్త్యమహాముని నావాక్యమునువిని పోయియుండుటచేత నీశ్వరుఁ డెప్పుడువచ్చునా యని విచారించుచున్నాఁడు. కావున వానరోత్తమా! నేనుకూడ దక్షిణదిక్కునకు రాఁదలఁచియున్నాఁడనని చెప్పి నీవుపొమ్మంటిని. అంతట హనుమంతుఁడు నాచేతఁజేయఁబడిన లింగములను రెంటినితీసికొని యాకాశమార్గముచేత నధిక వేగముతోఁ బోయె. అట్లుపోవునపుడు హనుమంతుఁడు కొంచెముగర్వముకలవాఁడయ్యె. అట్లు హనుమంతునకు గర్వముకలిగియుండుటను తెలిసికొని శ్రీరాముఁడు సుగ్రీవాదులతో నిట్లనియె. ఓవానరోత్తములారా! ముహూర్తకాల మతిక్రమించి పోవుచున్నది. కావున నేను సైకతలింగమునుచేసి స్థాపించెద నని చెప్పి మునివరులు మొదలగు వారితోఁగూడుకొనినవాఁడై సైకతలింగమునుస్థాపించె. ఆసమయమునందు మనస్సుచేత కౌస్తుభమణిని స్మరించె. అంతట నాకౌస్తుభము మిగులవేగముగ నాకాశమునుండివచ్చె. అట్లువచ్చిన కౌస్తుభమణిని కంఠమునందు బంధించె. అనంతరమందు కౌస్తుభమణివలనఁ గలిగిన దివ్యాన్న వస్త్రాదులచేత పరమశివునకును మునులకును సంతృప్తిని కలుగఁజేసె. అవ్విధముగ నమ్మునివరులందఱును శ్రీరాముఁడు చేసినపూజకు సంతోషించి తమతమ యాశ్రమములకుఁ బోయిరి. అట్లు తమతమయాశ్రమములకుఁ బోవుచున్నమునులతో కాశీపట్టణమునుండి వచ్చుచున్న హనుమంతుఁ డిట్లనియె. ఓమునివర్యులారా! మీ రెవ్వనిచేత పూజింపఁబడివచ్చుచున్నారనిన నమ్మును లిట్లనిరి. ఓ యాంజనేయా! శ్రీరాముఁడు శివలింగమును ప్రతిష్ఠించి మమ్ములఁబూజించెననిరి. ఆవచనమును విని హనుమంతుఁడు కోపోద్దీపితుఁడై యిట్లనితలఁచె. ఆహా నాశ్రమ

మంతయును వ్యర్థమయ్యె. శ్రీరాముఁ డిప్పుడునన్ను వంచించెనని తలఁచుచు నత్యధికమైన కోపముతో శ్రీరామునొద్దకుఁబోయి యిట్లనియె. ఓరాముఁడా! నన్ను కాశికిఁబోయి లింగమును తెమ్మనిచెప్పి యివ్విధముగ నవమానమును చేయుటయుచితమా? నీయభిప్రాయము నాకిదివఱకే తెలిసియుండెనేని నేను మిగుల దూరముననున్న కాశీపట్టణమునకుఁబోయి లింగము నేల తెత్తును. ఓ రాముఁడా! ఒకలింగమును నీనిమిత్తము తెచ్చితిని. మఱియొకలింగమును నానిమిత్తముగఁ దెచ్చికొంటిని. ఈరెండులింగములను నేనిప్పుడేమిచేయుదునని యధికకోపముతోఁ బలుకుచున్న హనుమంతునితో శ్రీరాముఁడిట్లనియె. ఓ యాంజనేయా! నీవు సత్యవాక్యములు కలవాఁడవనుటకు సందేహములేదు. ముహూర్తకాలమతిక్రమించిపోవునని నేనిట్లుచేసితిని. అయిన నిప్పుడు మిగిలిపోయినదేమికలదు. ఇప్పుడు నేనుస్థాపించినలింగమును పెల్లగించివేయుము. అనంతరమందు నీచేతఁ దేఁబడినలింగమును స్థాపించెదననియె. ఆవచనమునువిని హనుమంతుఁడు వల్లెయని రామునిచేత స్థాపింపఁబడిన లింగముయొక్క మస్తకమునందు తనతోకనుచుట్టి యనేకపర్యాయములు కదలించె. అట్లు బలాత్కారముగ లాగుటచేత హనుమంతునితోక త్రుటితమయ్యె. అందువలన హనుమంతుఁడు మూర్ఛనుపొందె. అంతట వానరులందఱును నవ్విరి. రామలింగేశ్వరుండు మాత్రము కదలకపోయె. అప్పుడు హనుమంతుఁడు గర్వరహితుఁడై శ్రీరామునకు నమస్కరించి యనేకవిధముల శ్రీరామునిప్రార్థించి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నేనపరాధమును చేసితిని. కావున నన్ను మన్నింపుమనిన శ్రీరాముఁ డిట్లనియె. ఓ యాంజనేయా! నీచేతఁదేఁబడిన విశ్వనాథాఖ్యలింగమును నేనుస్థాపించిన రామలింగేశ్వరున కుత్తరభాగమునందు స్థాపింపుమనియె. ఆమాటనువిని హనుమంతుఁ డవ్విధముగానేచేసె. ఆసమయమునందు శ్రీరాముఁడు హనుమంతునకు సంతోషమునుకల్పింపఁదలఁచి యిట్లనియె. ఓ యాంజనేయా! నీచేతస్థాపింపఁబడిన విశ్వనాథాఖ్య లింగమునకు పూజను చేసి రామలింగమును పూజించినయెడల ఆపూజయంతయును సార్థమగును. మఱియు నోహనుమంతుఁడా! నానిమిత్తముగ నీవు తెచ్చిన లింగము పూజాదులులేనిదై దేవాలయము నందుండును. ఆలింగమును నేను మఱియొకకాలమునందు స్థాపించెదను. అదిమొదలుకొని యాలింగమునకు పూజకలుగుననియె. ఓపార్వతీ! ఇప్పటికిని నాలింగము పూజాదులులేనిదై యున్నది. ఓ హనుమంతుఁడా! నీవు సర్వకాలములయందును గుప్తపాదుఁడవును ఛిన్నలాంగూలుఁడవును నై యిక్కడనుండుమనిన హనుమంతుఁడు విని సంతసించి తననిమిత్తముగఁ దెచ్చిన విశ్వనాథలింగమును స్థాపించె. అదిమొదలుకొని హనుమంతుఁ డాచోటగుప్తపాదుఁడును ఛిన్నలాంగూలుఁడును నై యున్నాఁడు. మఱియు నోపార్వతీ! హనుమంతుఁడు మూర్ఛనుపొందినచోటున హనుమత్తీర్థము పాపనాశకరమైయున్నది. మఱియు నక్కడనే రామతీర్థమనునామధేయముకల తీర్థముకూడ పాపనాశకరమై

యున్నది. మఱియు నక్కడ రాముఁడు స్వాంశముచేత స్వమూర్తినిస్థాపించె. ఆ మూర్తి యిప్పటికిని సేతుమాధవుఁ డనునామధేయముకలదై యున్నది. మఱియు నోపార్వతీ! అక్కడ లక్ష్మణుఁడుకూడ తన నామధేయముకల తీర్థమును నిర్మించె. అంతట శ్రీరాముఁడు తనహస్తముచేత హనుమంతునిలాంగూలమును స్పృశించుటచేత నాహనుమంతునిలాంగూలము రమ్యమైనదయ్యె. మఱియు నాహనుమంతుని తోకను చుట్టినచోట రామలింగేశుని మస్తకము కృశించినదై యున్నది. ఇప్పటికిని రామలింగేశుని మస్తకమునందు కార్శ్యము కనఁబడుచున్నది. అదిమొదలుకొని హనుమంతుఁడు గర్వరహితుఁడై యుండెను. ఓపార్వతీ! అట్లు శ్రీరామునిచేత స్థాపింపఁబడిన లింగమునందు నేనావిర్భవించియున్న రామునితోఁజెప్పినమాటలను నీకుఁ జెప్పెదను. వినుము. ఓరాఘవేంద్రుఁడా! రఘుశ్రేష్ఠుఁడా! పూర్వవృత్తాంతమును వినుము. పూర్వమునందు నే నొకపర్యాయము మలినములయిన వస్త్రములతోఁ గూడుకొనినవాఁడనై బ్రాహ్మణరూపముతో భిక్షార్థముగ నధికసంతోషముగాఁ దిరుగుచుంటిని. అట్లు ఋషుల యాశ్రమమునందుఁ దిరుగుచున్న నన్నుఁజూచి ఋషిభార్యలందఱును నారూపముచేత మోహమునుపొందిరి. అనంతరమందు భర్తలాతంకపరచినను నిలువక నావెంటనంటి రాఁజొచ్చిరి. అప్పుడు ఋషులందఱును క్రోధశోకములు కలవారై మిగుల భయంకరముగ నిట్లనిశపించిరి. ఓరీబ్రాహ్మణాధమా! నీచేత మాభార్యలందఱును రతికొఱకు మోహపెట్టఁబడిరి. కావున రతికంగమైన నీలింగము భూమియందు పడిపోవునుగాత మనిశపించిరి. అంతట వెంటనే నాలింగము మూఁడి క్రిందఁబడియె. అప్పుడు ఋషులభార్యలందఱును తమతమ గృహములకుఁబోయిరి. అంతట నాలింగము వృద్ధినిపొంది యాకాశమువఱకును వ్యాపించె. అట్లు వ్యాపించినలింగమునుచూచి బ్రహ్మదేవుఁడు భయమును పొందినవాఁడై యాలింగముయొక్క యగ్రభాగమునుచూచుటకుఁబోయె. అట్లు చూచుటకు ననేకకోటిసంవత్సరములు పయనమైపోయియును లింగాంతమునుచూడఁజాలక నాయొద్దకువచ్చి యిట్లనియె. ఓదేవోత్తమా! ఈలింగముచేత అకాలమునందు ప్రళయముకలుగునట్లుతోఁచుచున్నదనియె. అప్పుడు నేనుజరిగినవృత్తాంతమును సర్వమునుచెప్పి త్రిశూలమును బ్రహ్మచేతికిచ్చి యాలింగమునుఛేదింపుమని చెప్పితిని. అంతట బ్రహ్మదేవుఁడిట్లనియె. ఓదేవోత్తమా! నీయంగమును నే నెట్లు ఛేదింపఁగలను. ఛేదింపఁజాలను. కావున నీలింగమును నీవేఛేదింపుమనియె. ఓరాముఁడా! అంతట నాలింగమును పదిరెండుఖండములనుగాఁ జేసితిని. అట్లుచేసి యాఖండములను త్రిశూలముచేతవిసరి భూమియందుఁబడ నైచితిని. ఆలింగములు పదిరెండును భూమియందు జ్యోతిస్సంజ్ఞకలలింగములయ్యె. మఱియు నోరాముఁడా! ఓంకారమనియును, సోమనాథమనియును, త్య్రంబకమనియును, మల్లికార్జునమనియును, నాగేశమనియును, వైద్యనాథమనియును, విశ్వేశ్వరమనియును, కేదారేశమనియును, మహాకాలమనియును, భీమేశమ

నియును, ఘృష్ణేశ్వరమనియును, ఆ యాలింగములు పదునొకండు భూలోకమునందుఁ బ్రసిద్ధింగాంచియున్నయవి. పదిరెండవది గంధమాదనలింగమనునామధేయముతో మేరుపర్వతమున నీశాన్యదిక్కునందుండెడి. అది మానవులకు గోచరముకాకయున్నది. అప్పుడు మునులందఱును లింగమువలన శివుని తెలిసికొని అనంతరమం దాలింగములు శివుఁడనగు నాకు ప్రియములై యుండునట్లు వరమునిచ్చిరి. అంతట నొకనాఁడు ప్రళయకాలవాయువుచేత గంధమాదనలింగముకల మేరుపర్వతశృంగము ఇక్కడఁబడెను. అందువలన సముద్రతీరమునందలి యీపర్వతమునకు గంధమాదనమను నామధేయము కలిగియుండెను. ఓరాముఁడా! ఆగంధమాదనలింగము నీచేత స్థాపింపఁబడిన లింగమునకు ఈశాన్యభాగమునందున్నది చూడుము. ఇంతవఱకును నీలింగ మెవనిచేతను చూడఁబడలేదు. మోక్షమునిచ్చునట్టి యాలింగము ఇప్పుడు నీచేతను వానరులచేతను జూడఁబడి స్పృశింపఁబడియున్నది. ఓ రాముఁడా! నీచేత స్థాపింపఁబడిన లింగముయొక్క ప్రసాదమువలన నీలింగము ప్రసిద్ధినిపొందినది. కావున నాసంబంధమైన గంధమాదన లింగమునందలి తేజస్సు నీచేత స్థాపింపఁబడిన సైకత లింగమునందుఁ బ్రవేశించునట్లుచేసి నేనును దానియందుఁ బ్రవేశించితిని. ఇది మొదలుకొని నీచేత స్థాపింపఁబడిన లింగమును లోకములోనివారందఱును పూజింతురు. నేనుకూడ అగస్త్యమునివరుని వాక్యానుసారముగను నీప్రార్థనానుసారముగను కాశి నివిడిచిపెట్టి రామేశ్వరస్థానమునందలి యీలింగమునందుఁ బ్రవేశించియుండెదను. ఓ రఘుకులోత్తమా! ఈసేతుబంధనమునందలి రామేశ్వరునకు నమస్కరించువాఁడు నాయనుగ్రహమువలన బ్రహ్మహత్యాదిపాపములనుండి విముక్తుఁడగును. ఓ రాముఁడా! ఈ రామలింగమునకు నభిషేకమునుచేయుటకు మణికర్ణజలమును సర్వకాలములయందును మానవులిచ్చునటుల వరమునిమ్మనిచెప్పిన శ్రీరాముఁడు విని సంతోషముకలవాఁడై యిట్లనియె. ఓదేవోత్తమా! మానవుఁడు సేతుబంధమునందు స్నానమునుచేసి రామేశ్వరుఁడనుశివునిజూచి నియతుఁడై సంకల్పమునుచేసి సేతువునందలి యిసుకనుగ్రహించి పెట్టెయందుఁబెట్టుకొని కాశీపట్టణమునకుఁబోయి యాయిసుకను గంగయందువిడిచిపెట్టి యాపెట్టెతో నుదకమును తీసికొనివచ్చి రామేశున కభిషేకమును చేసినయెడల నిస్సందేహముగ బ్రహ్మలోకమునుపొందును. సంకల్పమునుచేయకయే గంగోదకమును తెచ్చి రామేశున కభిషేకమునుచేసినయెడల అట్టివాఁడు పూర్వజన్మమునందు సంకల్పమును చేసినవాఁడనఁబడునని చెప్పి యారాముఁడింకను ననేకములయిన వరములనిచ్చుచుండఁగా నక్కడకు నగస్త్యమునివరుఁడువచ్చి శంకరరాములకు నమస్కరించె. అప్పుడు రాముఁడు కూడ ఆయగస్త్యమునివరునకు నమస్కరించె. ఆసమయమునం దాయగస్త్యమునివరుఁడిట్లనియె. ఓరాముఁడా! నీయనుగ్రహమువలన చిరకాలమునకు నాకు విశ్వేశ్వరునిదర్శనములభించినది. కావున నిప్పుడు నేను సంతోషమునుపొందితిని. ఇక్కడ

నేనును లింగమునుస్థాపించెదనని చెప్పి మిగులశ్రేష్ఠమగు లింగము నొకదానినిస్థాపించె. అట్లుస్థాపించి యా యగస్త్యమునివరుఁడు అగస్త్యేశ్వరుఁడను లింగమును రామలింగేశునకు నాగ్నేయభాగమునందుఁబూజించె. అనంతరమందు పురాతనమును గంధమాదనమను నామధేయముకలదియును అగు రామలింగమునకు నమస్కారాదులను చేసి యిచ్ఛానుసారముగ బయలువెడలిపోయె. ఓపార్వతీ! ఆరామలింగేశుని దేవాలయమునందలి యాగ్నేయభాగమునందలి యగస్త్యేశుఁడు ఈశాన్యదిక్కునందలి గంధమాదనేశుఁడును నేటివఱకును ఉండుటను తెలియనిమానవుఁ డెవ్వఁడునులేఁడు. ఓపార్వతీ! రామేశ్వరమనునది స్వర్గ మర్త్య పాతాళలోకముల మూటియందును ప్రసిద్ధమైయున్నది. ఓపార్వతీ! అటుపిమ్మట నలుఁడు రామాజ్ఞచేత సేతువును బంధించుటకుయత్నించె. ఆసమయమునందు నలుఁడనువానరుఁడు మనస్సునందుఁ గొంచెముగ గర్వముకలవాఁడగుటను రాముఁడు తెలిసికొనియె. అనంతరమందు నలుఁడు సముద్రమునం దొక్కశిలనునైచి మఱియొక్కశిలను వేయఁబోవునపుడు సముద్రమునందలి తరంగములచేత ఆశిలలు ఇటునటు కదలుచుండె. అట్లు కదలుటనుచూచి నలుఁడు ఖిన్నమానసుఁడును గర్వరహితుఁడునునై రామునొద్దకుఁబోయి యావృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. అప్పుడు రాముఁడిట్లనియె. ఓనలుఁడా! రెండుశిలలను సంధానముచేయునపుడు రామ యను నక్షరద్వయమునువ్రాసి సంధానమునుచేయుము. ఆరెండు శిలలును సంధించుననియె. ఆవచనమును విని నలుఁ డావిధముగానేచేసెదనని చెప్పె. అంతట నైదుదినములలోపల నాసేతువుసంపూర్తినిపొందె. అందు మొదటిదినమునందు పదునాలుగామడదూరము సేతువుకట్టఁబడియె. రెండవదినమునందు ఇరువదామడదూరముకట్టఁబడియె. మూఁడవదినమునం దిరువదొక్కయామడదూరముకట్టఁబడియె. నాల్గవదినమునం దిరువదిరెండామడదూరముకట్టఁబడియె. అయిదవదినమునందు ముప్పదిమూఁడామడదూరముకట్టఁబడియె. ఆసేతువు పదిరెండామడ వెడల్పుకలదైయుండె. ఈవిధముగా వానరోత్తముఁ డగునలుఁడు సేతువునుపూర్తినొందించె. ఓపార్వతీ! ఆసముద్రమునందు శిలలు సేతురూపమునుపొందియుండుటకు వానరులయొక్కయును శిలలయొక్కయును గుణములుకారణములుగావు. మఱియేమనిన, దశరథరాముని ప్రభావగుణమే కారణము. అంతట వానరులందఱును నూరామడవెడల్పుకల సముద్రమునుదాటిరి. ఆసమయమునందు శ్రీరాముఁడు హనుమంతుని భుజములమీఁదను, లక్ష్మణుఁడు అంగదునిభుజములమీఁదను నెక్కిపోయిరి. ఈవిధముగా రాముఁడు సకలసేనాసమేతుఁడై వాయువువలె మిగులవేగముగ లంకాపట్టణముదగ్గఱకుఁబోయె. అంతట నపరిమితసంఖ్యకలవానరులు సువేలాద్రిపర్వతముమీఁదనెక్కిరి. పిమ్మట శ్రీరాముఁడుకూడ సేనాసమేతుఁడై సువేలాద్రిమీఁదికిఁబోయిరి. ఆశ్రీరాముఁడు లంకాపట్టణమును చూచుటకు సువేలాద్రిమీఁదనెక్కె. అవ్విధముగ సువేలాద్రిమీఁదనెక్కి మిగులరమ్యమైనదియును,

చెట్లచేతను తీఁగలచేతను ప్రకాశించుచున్నదియును అయిన సువేలాద్రిని మిగుల విశాలములయినదియును, విచిత్రములయిన ధ్వజములుకలదియును అగు లంకాపట్టణమునుచూచె. ఆలంకాపట్టణము చిత్రములయిన ప్రాకారములతోఁ గూడుకొనియున్నదియును, బంగారముచేతనిర్మింపఁబడిన ప్రాకారతోరణములుకలదియును, అగడ్తలతోడను, శతఘ్నులతోడను కూడుకొనియున్నదియును, అయియుండె. అట్టి లంకాపట్టణమునందలి మేడమీఁదనెక్కి వానరసైన్యమునుచూచుచున్న రావణాసురుని శ్రీరాముఁడుచూచె. ఆసమయమునందు రామునిచేత విడువఁబడిన శుకుఁడనురాక్షసుఁడు రావణునొద్దకుఁబోయి వానరసైన్యమునుచూపుచు నిట్లనియె. ఓరావణా! సీతను రామునికిమ్ము. విభీషణుని లంకారాజ్యమునకుఁ దీసికొనిరమ్ము. రాముని శరణమునుపొందుము. అట్లుకాదేని నీవు విడువఁబడ వనియె. ఆవాక్యములను రావణుఁడువిని ఛీ ఛీ! అవ్వలఁబొమ్మని మూఁతిమూఁతికిని ధిక్కరించె. అనంతరమాదూతలచేత బయలునకుఁబంపి రామునిసైన్యమునుచూచె. ఓపార్వతీ! శుకుఁడనువాఁడు పూర్వజన్మమునందు వసిష్ఠుఁడనుబ్రాహ్మణోత్తముఁడై యుండె. అప్పుడాశుకుఁడు క్రతువులచేత దేవతలను జయించె. మఱియును, రాక్షసులతో విరోధముకలవాఁడయ్యె. అట్టికాలమునందు వజ్రదంష్ట్రుఁ డనురాక్షసుఁడు మాంసాన్నమును యాచించె. అంతట శుకుఁడు తనభార్యనుఛేదించి దానిమాంసముతో మిశ్రితమైనయన్నమునుపెట్టె. ఆవృత్తాంతమునువిని యగస్త్యమునివరుఁడువచ్చి నీవు రాక్షసుఁడవగుమనియె. అంతట నాశుకుఁడు పలువిధములఁ బ్రార్థింపఁగా నమ్మునివరుఁ డిట్లనియె. ఓశుకుఁడా! రామునిచూచి రావణునకు నీతినిబోధించినపిమ్మట నీవు నిజరూపమును పొందఁగలవనియె. అందువలన నాశుకుఁడనువాఁడు బ్రాహ్మణుఁడయ్యె, అంతట నాశుకుఁడు వానరులయనుమతినిపొంది సువేలశిఖరమునందుండె. అప్పుడు రాముఁడు శత్రువులను సూచనచేయుటకొఱకు అంగదుని లంకాపట్టణమునకుబంపె. అంతట హనుమంతుఁడు రామానుమతమునుపొంది నానావిధములయిన నీతివాక్యములచేత రావణునకు జ్ఞానమునుపదేశించె. మఱియు నాయంగదుఁడు లాంగూలాసనమునందుఁ గూర్చుండె. ఈవిధముగా వాలిపుత్త్రుఁడును భయమునుపొందనివాఁడై స్వస్థచిత్తతనవలంబించి యారావణునితో నిట్లనియె. ఓరావణా! నావాక్యములనువినుము. నీకు హితమునుబోధించెదను. ధనముతోఁగూడ సీతామహాదేవినితీసికొనిపోయి మిగులశీఘ్రముగ రామునకుసమర్పింపుము. రాముఁడు సాక్షాన్నారాయణుఁడు కాని సామాన్యమానవుఁడు కాఁడు. జ్ఞానులందఱును రామపాదము లనియెడు నావ నవలంబించి భక్తిపూతులై సంసారసముద్రమునుదాఁటుదురు. కావున రాముఁడు మానవుఁడుకాఁ డనితలఁపుము. నీకులమునకు సర్వమునకును మేలును చేయునట్టి నావాక్యమును వినుమనియె. ఈవిధముగా నంగదుఁడు చెప్పినవాక్యములను రావణుఁడువినక క్రోధోద్దీపితుఁడై యాయంగదునితో నిట్లనియె. ఓరీ! వానరాధమా!

ఇప్పుడు నిర్నిమిత్తముగ నన్ను బెదరించుచున్నావు. నేను సకలలోకములను పడ్పించు నట్టి రావణుఁడ ననియెఱుఁగవా ? నేను సకలదేవతలనుజయించితిని. కైలాసపర్వత మును గడగడవణఁకునట్లుచేసితిని. ఇట్టినాయెదుట నీబిభీషికావచనముల నేలపలికెదవు నిమేషమాత్రములోరామలక్ష్మణులను సుగ్రీవాదివానరులను సంహరించెదను. మఱియు నోవానరాధమా! నిన్నును విభీషణుని సంహరించి సకలవానరులనుభక్షించెదననియె. ఈవిధముగా రావణుఁడుచెప్పిన వాక్యముల నాయంగదుఁడు విని మరలనిట్లని యె. ఓరాక్షసాధమా ! బలిపాశములచేత మూర్ఛనుపొందిన నీపౌరుషమును నేనె ఱుఁగుదును. పరమశివుని పాదాంగుష్ఠముచే నదచిపెట్టఁబడిన కైలాసపర్వతముక్రిందఁ బడి మొరలిడిననీ ధైర్యమును నేనెఱుఁగుదును. కార్తవీర్యార్జునునకు క్రీడామృగమైన నీపరాక్రమము నాకుఁదెలియును. ఓరాజా ! శ్వేతద్వీపమునందలి స్త్రీలచేత పరా భవమునుపొందిన నీపరాక్రమము సకలజనులకును చక్కఁగఁ దెలిసియేయున్నది. విష్ణువునకు బ్రహ్మదేవుఁడును, బ్రహ్మదేవునకు మరీచియును, మరీచికి కశ్యపప్రజాప తియును, కశ్యపున కింద్రుఁడును పుత్రులైరి. అట్టి యింద్రునిచేత కారాగృహము నందుఁ బెట్టఁబడిన నీపరాక్రమము నాకుబాగుగఁ దెలిసియేయున్నది. మఱియు నోరావణా ! నీవు మంచముకోటికి కట్టఁబడి మూత్రలాలాపీడితుఁడవైన నీవృత్తాంత మును నేనెఱుఁగుదునని యనేకవిధముల నిందించుటచేత రావణుఁడు కోపోద్దీపితుఁడై యారావణుఁడు దూతలనుపిలిచి యిట్లనియె. ఓదూతలారా ! ఈవానరుని ముఖము మీఁదఁ గాలితోఁదన్నుఁడనియె. ఆవాక్యమునువిని రాక్షసభటులందఱును శస్త్రము లను ధరించినవారై యంగదునిమీఁదికి దుమికిరి. ఆసమయమునందు వానరోత్త ముఁ డగునాయంగదుఁడు క్షణమాత్రములో తనతోకచేత నా రాక్షసభటుల నందఱను సంహరించె. అనంతరమందు రావణుని మోముమీఁద కాలితోఁదన్ని తోకచేత నారావణుని హస్తపాదములను బంధించి తాము కూర్చున్నసౌధము ను నెత్తినిపెట్టుకొనియెగిరి రామునొద్దకుఁబోయె. అప్పుడు సువేలాద్రిమీఁద నున్న రాముఁడు అంగదునిచూచి యిట్లనియె. ఓయీ వానరోత్తమా ! సౌధమునే లతెచ్చితివి. ఈసౌధమును నేను స్పృశింప ననినవిని యంగదుఁడిట్లనియె. ఓరఘుకు లోత్తమా ! నేను మేడనుతీసికొని రాఁదలఁచి తెచ్చినవాఁడనుకాను. రావణుని తెచ్చు నపుడు లంకాపట్టణముకూడ పెల్లగిలివచ్చినది. మరల నీమేడనుతీసికొనిపోయి లంకా పట్టణమునందుఁ బెట్టివచ్చెదనని చెప్పి మరలపోయి యామేడతొలుతనున్న చోటఁ బెట్టి యనంతరమందు రామునిదగ్గరకుఁబోయె. పోయి సువేలాద్రియందున్న రామునకు నమస్కరించి లంకాపట్టణమునందు జరిగినవృత్తాంతమును సర్వమును తెలిపె. ఆవృత్తాంతమునువిని శ్రీరాముఁడునవ్వి యంగదుని కౌఁగిలించుకొనియె. అంతట శ్రీరాముఁడు సువేలాద్రియందుండియే విలాసముగ ధనుస్సునెత్తికొని మిగులశీఘ్రమగుబాణమును సంధానముచేసి ప్రయోగించె. ఆబాణముపోయి

లంకాపట్టణమునందలి మేడయందుఁ దిరుగుచున్న రావణుని ఛత్రములను వేయింటిని కిరీటములను పదింటిని ఛేదించె. అట్లు నిమిషార్ధములోపల నాబాణము చేసిన కార్యమునుచూచి వానరులందఱును మిగుల నాశ్చర్యమునుపొందిరి. ఆసమయమునందు సుగ్రీవుఁడు అంగదుఁడు చెప్పినవృత్తాంతమును సర్వమును విని కోపోద్దీపితుఁడై రాక్షసులతోఁ గూడుకొని మేడమీఁదఁ దిరుగుచున్న రావణునొద్దకుఁబోయె. పోయి దృఢమైన పిడికిలితో రావణునిబొడిచె. ఆదెబ్బకుఁ దాళఁజాలక రావణుఁడు సింహాసనమునుండిక్రిందఁబడె. అంతట నాసుగ్రీవ రావణులకు మిగులభయంకరమైన యుద్ధముజరిగె. అప్పుడు రావణుఁడు సుగ్రీవునిపాదకరతాడనములచేత జర్జరితమైన శరీరముకలవాఁడయ్యె. ఆసమయమునందు సుగ్రీవుఁడు రావణుని కిరీటమునుగైకొని రామునొద్దకుఁబోయి జరిగినవృత్తాంతమును సర్వమును తెలియఁజేసిన రాముఁడువిని పరమానందమునుపొందిసుగ్రీవునికౌఁగిలించుకొని యిట్లనియె. ఓమిత్రుఁడా! నాకుఁ జెప్పఁబడకయే రావణునొద్దకుఁబోతివి. నీజీవితమునకు హానికలిగినయెడల నాకుసీతతో ప్రయోజనమేమి? నీవుపోయినపిమ్మట నాకు సౌఖ్యమేమికలుగును? ఇఁక నెన్నటికిని ఇట్టిసాహసమునుచేయకుమనియె. అంతఁ గొంతసేపటికి వానరులందఱును భేరీమృదంగాది నానావిధవాద్యములతోఁ గూడ లంకాపట్టణమును ముట్టడించిరి. ఆసమయమునందు శ్రీరాముఁడు రావణునికిరీటమును అంగదునకిచ్చె. అనంతరమందు లంకాపట్టణమును ముట్టడించుటకు సకలవానరులకును నాజ్ఞనిచ్చె. అప్పు డంగదుఁడు దక్షిణద్వారమును, హనుమంతుఁడు పశ్చిమద్వారమును నలుఁడు పూర్వవాకిలిని, సుషేణుఁ డుత్తరద్వారమును నాక్రమించునట్టుల నాజ్ఞనిచ్చె. అంతట నావానరోత్తములు శ్రీరామునకు నమస్కరించి తమతమసైన్యములతోఁ గూడ నొక్కొక్క రొక్కొకద్వారమును నాక్రమించుటకుఁబోయిరి. పోయి యాలంకాపట్టణమునందలి నాలుగుద్వారములను నాక్రమించిరి. అంతట నక్కడ రావణుఁడు సుగ్రీవునిచేత జర్జరితముగాఁ జేయఁబడిన శరీరముకలవాఁడై నగరములోనికిఁబోయి సుగ్రీవుని పరాక్రమమునుస్మరించుచు నూరకుండె. ఆసమయమునందు మాలి సుమాలులును మాల్యవంతుఁడును నొక్కటిగాఁజేరి రావణునొద్దకుఁ బోయి యాలోచింపఁదలఁచిరి. అంతట నాముగ్గురిలో మిగులఁ బరాక్రమముకలవాఁడును, బుద్ధిమంతుఁడును, అధికమైన ప్రేమకలవాఁడును నగుమాల్యవంతుఁ డనువాఁడు రావణునొద్దకుఁబోయి యారావణునితో నిట్లనియె. ఓరాక్షసరాజోత్తమా! నావాక్యమునువినుము. నావాక్యమునువిని నీయిష్టానుసారముగఁ బ్రవర్తింపుము. ఓరాక్షసోత్తమా! రామునకుఁ బ్రియురాలగు సీత లంకాపట్టణమునందుఁ బ్రవేశించినది మొదలుకొని యనేకములగు దుశ్శకునములు కనఁబడుచున్నవి. అవియన్నియును మిగులభయంకరములును నాశమునకు కారణములును నై యున్నవి. మేఘములు పిడుగులయొక్క ధ్వనులచేత మిగుల భయంకరములై యున్నవి.

రక్తమును వర్షించుచున్నవి. దేవలింగములన్నియును ఖేదమును పొందుచున్నవి. నక్కలు విపులముగ నఱచుచున్నవి. కాలికములు (కాకులు) తెల్లనిదంతములను చూపుచునవ్వుచున్నవి. గోవులయందు గాడిదలుపుట్టుచున్నవి. ఎలుకలు ముంగిసలతోడను పిల్లులతోడను యుద్ధమునుచేయుచున్నవి. సర్పములు గరుడపక్షులతో యుద్ధమునుచేయుచున్నవి. మిగుల భయంకరుఁడును వికటుఁడును ముండుఁడును కృష్ణపింగళవర్ణములు కలవాఁడును నగు పురుషుఁడు ప్రతిగృహమునందును సంచరించుచున్నాఁడు. మఱియు ననేకములయిన దుర్నిమిత్తములు పుట్టుచున్నవి. కాఁబట్టి యోరావణా! కులమును కాపాడుటకొఱకు శాంతినిచేయుము. ఓదశాననా! ధనముతోఁగూడ సీతామహాదేవిని ముందునిడుకొనిపోయి రామునకు సమర్పింపుమని మాతామహుఁడగు మాల్యవంతునివాక్యములనువిని యారావణుఁడిట్లనియె. ఓరీ! మాల్యవంతుఁడా! నీవు రామునిచేతఁ బంపఁబడి యీవిధముగ మాటలాడుచున్నావు. వృద్ధుఁడవగుటచేత నీవివ్విధముగ మాటలాడుచున్నావు. నీవాక్యములు నాచెవులను కాల్చివేయుచున్నవనియె. అంతట మాల్యవంతుఁడు స్వగృహమునకుఁ బోయె. అప్పుడు రావణుఁడు సభలోనికిఁబోయి తనభటులతో నిట్లనియె. ఓధూమ్రాక్షుఁడా! నీవు పూర్వద్వారమునకు సైన్యసమేతముగఁబొమ్ము? ఓవజ్రదంష్ట్రుఁడా! నీవుపశ్చిమద్వారమునకుఁబొమ్ము? ఓనరాంతకుఁడా! నీవు దక్షిణద్వారమునకుఁబొమ్ము. ఓమహోదరుఁడా! నీవు ఉత్తరద్వారమునకుఁబొమ్ము? అనియె. ఇవ్విధముగ నాభటుల కాజ్ఞనిచ్చి వారలను వస్త్రాద్యాభరణములచేత సంతోషమునుకల్పించి సైన్యసమేతముగఁ బంపె. అంతట నానలుగురు భటోత్తములును రావణునకు నమస్కరించి సైన్యసమేతముగ యుద్ధమునకు బయలు వెడలిపోయిరి. ఇవ్విధముగ రామరావణులసైన్యములు పరస్పర యుద్ధాభిముఖములయినవయ్యె.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానందరామాయణమున
సారకాండమునందు సేతుమాహాత్మ్య కాశీవిశ్వేశ్వరాగమ
మను నామధేయముకల పదియవసర్గ ముగిసెను.

---

### ✱ రావణాదిరాక్షసులవధ. ✱

ఓపార్వతీ! అవ్విధముగ రావణానుమతమునుపొంది భయంకరమైన యాకృతికల రాక్షసభటులందఱును కోపోద్దీపితులై తమతమకు నియమింపఁబడిన ద్వారములకుఁబోయి భిండివాలములు ఖడ్గములు పరశువులు బాణములు కుంతములు శతఘ్నులు సంక్రమము మొదలగు నాయుధములచేత వానరులనుకొట్టిరి. ఆసమయమునందు వానరులు వృక్షములు పర్వతములు పిడికిళ్లు కరతాడనము మొదలగువానిచేతఁగొట్టిరి. అంతట రథగజతురగపదాతులతోఁగూడ రాక్షసభటులు యుద్ధమును చేసిరి. ఈవిధముగా వానరులును రాక్షసులును అత్యధికమైన యుద్ధమును చేసిరి.

అంతట నాయుద్ధమునందు నలుఁడు ధూమ్రాక్షునిఁగొట్టె. హనుమంతుఁడు వజ్రదంష్ట్రునిఁగొట్టె. అంగదుఁడు నరాంతకునిఁగొట్టె. సుషేణుఁడు మహోదరుఁడను వానినిగొట్టె. అప్పుడు రాక్షససైన్యమునందలి నాల్గవభాగము మిగులునట్లుగా చంపఁబడియె. అప్పుడు అంగదుఁడు మొదలుగాఁగల వానరులందఱును మహావాద్య మహోత్సవములతో రామునొద్దకు వచ్చి నమస్కరించి జయఘోషముతో నావృత్తాంతమును సర్వమును చెప్పిరి. అట్లు రాక్షససైన్యము సర్వమును మరణమును పొందినపిమ్మట నింద్రజిత్తనువాఁడు యుద్ధమునకు బయలు వెడలిపోయె. పోయి నాగాస్త్రమును ప్రయోగించి వానరసైన్యమును సర్వమును మూర్ఛను పొందించె. అప్పుడు రాముఁడు విహ్వలుఁడై గరుత్మంతునిస్మరించె. ఆసమయమునందు గరుత్మంతుఁడువచ్చి యానాగాస్త్రమువలనఁ బుట్టిన సర్పముల నన్నిటిని పోఁగొట్టె. అంతట వానరులందఱును లేచి యెప్పటియట్ల యుద్ధసన్నద్ధులయిరి. అప్పు డింద్రజిత్తు బ్రహ్మదేవునివరమువలన నంతర్ధానమును పొందినవాఁడై సర్వాస్త్ర కుశలతకలిగియుండుటచేత బ్రహ్మాస్త్రమును ప్రయోగించె. అప్పు డాబ్రహ్మాస్త్రమువలన ననేకములయినయస్త్రములు వర్షమువలెఁ గురియుచుండె. ఆసమయమునందు రాముఁడు బ్రహ్మాస్త్రమును గౌరవించుటకొఱకు క్షణమునేపూరకుండె. అంతట తెలివినొంది శ్రీరాముఁడు స్వస్థచిత్తుఁడై తనసైన్యమును సర్వమునుచూచి బ్రహ్మాస్త్రముచేత మూర్ఛనుపొందినవానినిగాఁ దెలిసికొని లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! ధనుస్సును తీసికొనిరమ్ము? బ్రహ్మాస్త్రమును ప్రయోగించి సకలరాక్షసులను సంహరించెద. మఱియు నీలంకాపట్టణమును సర్వమును కాల్చివేసెద ననియె. ఆవచనమును యింద్రజిత్తువిని మిగుల భయముకలవాఁడై లంకాపట్టణమునకుఁ బరుగిడిపోయె. అంతట రాముఁడు తనసైన్యమందు ఎవ్వరెవ్వరు బ్రదికియున్నారో చూతమని వెదకుచుండఁగా నొక్కచోట హనుమద్విభీషణులు బ్రహ్మవరమువలన బ్రహ్మాస్త్రమునకులోఁబడక వానరసైన్యము మూర్ఛను పొందియుండుటకు విలపించుచుండగాఁ జూచె. అప్పుడు రాముఁడు వారలతో నిట్లనియె. ఓమంత్రివర్యులారా! మీరుపోయి మఁసైన్యమునం దెవ్వరెవ్వరు జీవించియున్నారో చూడుఁడు. చూచి వానరులను జీవింపఁజేయుటకుఁదగిన యాలోచనముచేయుఁ డనిన నాహనుమద్విభీషణులు ఆయర్ధరాత్రమునందు వానరసైన్యమునందంతటను వెదకుచుండఁగా నొక్కచోట జాంబవంతునిచూచిరి. చూచి శ్రీరాముఁడు చెప్పినవాక్యములను చెప్పిరి. జాంబవంతుఁడు ఆరామవచనమునువిని యధికసంతోషముకలవాఁడును నిమీలితాక్షుఁడునునై యిట్లనియె. మీరలెవ్వరు, హనుమంతుఁడొక్కఁడుమాత్రము బ్రదికియున్నయెడల సకల వానరులును జీవింపఁగలరనినవిని విభీషణుఁ డిట్లనియె. ఓజాంబవంతుఁడా! అంగదాదివానరోత్తము లనేకులుండఁగా మిగులనాదరముతో హనుమంతునికుశలమునుమాత్ర మడుగుటకు కార

ణామేమనిన జాంబవంతుఁ డిట్లనియె. ఓవిభీషణా! హనుమంతుఁడనువాఁడు రుద్రునం
శమువలనఁ బుట్టెను. కావున వాయుపుత్త్రుఁ డగుహనుమంతుఁడు ప్రతాపవంతుఁ
డయ్యె. హనుమంతుఁడు సాధారణుఁడని తలఁపఁగూడదనిన హనుమంతుఁడు విని
జాంబవంతునకు నమస్కరించి యిట్లనియె. ఓజాంబవంతుఁడా! నీవే హనుమంతుని
గుఱించి యడుగుచున్నావో యాహనుమంతుఁడను నేనే. హనుమంతుఁడనగు నేను
బ్రదికియున్నాఁడను. ఈరెండవవాఁడు విభీషణుఁడనిన జాంబవంతుఁడు విని పరమసం
తోషముకలవాఁడై హనుమంతునితో నిట్లనియె. ఓయాంజనేయా! మిగులవేగము
గ క్షీరసముద్రముదగ్గరకుఁబోయి ద్రోణపర్వతమును నిక్కడకుఁ దీసికొనిరమ్మనియె.
ఆవచనమునువిని హనుమంతుఁడు వల్లెయని యాపర్వతమునుతీసికొని వచ్చుటకుఁబో
యి గంధర్వులచేతఁ గాపాడఁబడుచున్నదియును, కామధేనువుచేత సంచరింపఁబడు
చున్నదియును అగు ద్రోణపర్వతమును పెల్లగించి పుష్పమును తెచ్చినవిధముగఁ దె
చ్చె. అట్లు హనుమంతుఁ డాపర్వతమును తెచ్చుటకుముందుగ జాంబవంతుఁడు హ
నుమంతుఁడు తెచ్చునట్టి పర్వతమునందలి యమృతవల్ల్యాదుల గంధమును ఆఘ్రా
ణించినయెడల రాక్షసులుకూడ జీవింతురనియును, అందువలనఁ గీడుకలుగుననియు
నుతలఁచి యాయభిప్రాయమును రామునకుఁదెలిపి రామానుమతమునుపొంది చచ్చి
పడియున్న రాక్షసులనందఱను సముద్రమునందుఁ బడవైచె. అంతలోపల హనుమం
తుఁడు పర్వతమును తీసికొనివచ్చె. అప్పుడు సుషేణుఁడు ఆపర్వతమునందలి యమృ
తవల్లులచేత వానరులనందఱను జీవింపఁజేసె. అంతట వానరులందఱును జీవించి తే
చికూర్చుండిరి. అట్లు వానరులందఱును జీవించినపిమ్మట హనుమంతుఁ డాద్రోణా
చలమును మునుపున్నచోటఁబెట్టె. ఆసమయమునందు రామాదులు కుబేరునిచేతనీ
యఁబడిన యుదకములచేత కన్నులుదుడిచికొని యంతర్ధానమును పొందియున్న దే
వాదులను చూచిరి. ఇవ్విధముగ వానరసైన్యమంతయును జీవించిన వృత్తాంతమును
రావణుఁడు విని తనమంత్రులు మొదలగువారినిపిలిచి యుద్ధమునకుఁబంపె. అప్పు
డు అతినాథుఁడు, ప్రహస్తుఁడు, మహానాథుఁడు, దరీముఖుఁడు, దేవశత్రువు, నికుం
భుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు, సారణుఁడు మొదలగువారందఱును నానావి
ధ సైన్యములతోఁగూడ బయలువెడలి వానరులతో మిగుల భయంకరముగ యు
ద్ధమునుచేసిరి. అట్టియుద్ధమునం దంగదాదులు ఆరాక్షసవీరులనందఱను రూపుమాపి
రి. అప్పుడు కుంభకర్ణునిపుత్త్రులగు కుంభ నికుంభులను రావణుఁడు మరలయుద్ధము
నకుఁబంపె. అంతట వారిరువురును నమితసంఖ్యాకమైన సైన్యముతోఁగూడ యు
ద్ధమునకువచ్చి యతిభయంకరమగు యుద్ధమును చేయుచుండిరి. అట్టియుద్ధమునందు
కుంభుఁడనువానిని జాంబవంతుఁడు సంహరించె. అంగదుఁడు నికుంభునివధించె. ఆ
వృత్తాంతమును రావణుఁడు విని కొంతసేపుదుఃఖించి పిమ్మట ధైర్యమును తెచ్చుకొ
ని తనపుత్త్రుఁడగు నతికాయుఁడనువానిని యుద్ధమునకుఁ బంపె. అంత నాయతికా

యుఁడు సైన్యముతోఁగూడ బయలువెడలి యుద్ధమునకుఁ బోయి లక్ష్మణునితోఁగూడ మిగుల భయంకరమైన యుద్ధమయ్యె. అట్టియుద్ధమునందు లక్ష్మణుఁడు కోపోద్దీపితుఁడై యొక్క బాణమును బ్రయోగించి యాయతికాయుని శిరస్సును లంకాపట్టణమునందుఁ బడవైచె. అప్పుడు రావణుఁడు మిగుల వేగముకలవాఁడై సకలసైన్యమును వెంటఁబెట్టుకొని యుద్ధమునకుఁబోయి యుద్ధరంగమునందు సంచరించుచున్న విభీషణునిజూచి కోపోద్దీపితుఁడై శక్తియను నాయుధంబును బ్రయోగించె. ఆసమయమునందు లక్ష్మణుఁ డాశక్తి విభీషణునిమీఁదికిఁ బోకుండునట్లు చేయఁదలఁచి తాసడ్డముగఁబోయె. అప్పు డాశక్తియను నాయుధముచేత లక్ష్మణుఁడు వక్షస్థలమునందుఁ గొట్టఁబడి భూమియందుఁబడె. అంతట రావణుఁ డాలక్ష్మణుని తనపట్టణములోనికిఁ దీసికొనిపోవుటకు యత్నించె. అట్లుయత్నించి యెత్తికొనఁబోఁగా శేషరూపుఁ డగు నాలక్ష్మణుని లేవఁదీయఁజాలకుండె. ఆసమయమునందు హనుమంతుఁ డతివేగముగఁబోయి తనముష్టిప్రహారముచేత రావణుని బొడిచె. అప్పుడు రావణుఁ డాదెబ్బకుఁ దాళఁజాలక క్రిందఁబడి మూర్ఛనొందె. ఇంతలో హనుమంతుఁ డాలక్ష్మణుని వానరసైన్యములోనికిఁ దీసికొనివచ్చె. అంతఁ గొంతసేపటికిఁ దెలివొంది రావణుఁడు రథముపై నెక్కి హనుమంతునిమీఁద నపరిమితముగ బాణవర్షమును గురిపించె. అంతట రాముఁడు కోపోద్దీపితుఁడై యొక్క బాణమును హృదయమునందుఁ బ్రయోగించె. అంతట నారాముఁడు రావణునిరథమును రథాశ్వములను ఛత్రములను పతాకమును కిరీటమును ద్రుంచివైచె. అప్పుడు రావణుఁడు తనరొమ్మునఁదగులుటచేతఁ గలిగినవేదనచేత విహ్వలుఁడయ్యె. ఆసమయమునందు శ్రీరాముఁ డారావణునితో నిట్లనియె. ఓరీ రావణా! నీవీదినము లంకాపట్టణమునకుఁబొమ్ము? రేపువచ్చి నాపరాక్రమమును చూడవచ్చునని. అంతట రావణుఁడు లజ్జచేత వంపఁబడిన శిరస్సుకలవాఁడై లంకాపట్టణమునకుఁబోయె. అంతట రాముఁడు మూర్ఛనొందిన లక్ష్మణునిజూచి హనుమంతునితో నిట్లనియె. ఓయాంజనేయా! ద్రోణాచలమును దీసికొనివచ్చి వానరులను బ్రదికించినవిధముగ నీలక్ష్మణునిగూడ జీవింపఁజేయుమనినవిని హనుమంతుఁడు వల్లెయని యధికవేగముగ బయలువెడలిపోయె. ఈ వృత్తాంతమును తెలిసికొని రావణుఁడు హనుమంతునకు విఘ్నముకల్పింపుమని కాలనేమిని బ్రార్థించె. అంతట నాకాలనేమి హిమవత్పర్వతపార్శ్వమునందు తపోవనమును కల్పించుకొని ఆయాశ్రమమునందు మునివేషముధరించి శిష్యులతోఁగూడుకొనియుండె. హనుమంతుఁ డామార్గమునఁబోవుచు నుదకమును పానమును జేయవలయు ననియెడుతలంపుతోఁబోయి యుదకమును బ్రార్థించె. అప్పు డామునివరుఁడు జలకుంభమును చూపించె. అంతట హనుమంతుఁ డోమునివర్యా! ఈకుంభములోనిజలము నాదప్పిని తీర్పఁజాలదనిన నమ్మునివరుఁ డిట్లనియె. ఓవానరోత్తమా! సమీపమునం దొక తటాకముకలదు. దానియొద్దకుఁబొమ్ము. పోయి కన్ను

లనుమూసికొని యాతటాకమునందలి యుదకమును పానమునుచేసి మరల నీవొచ్చోటునకు రమ్మనిచెప్పి మరల నిట్లనియె. ఓవానరోత్తమా! లక్ష్మణుఁడుజీవించి యెప్పటివలె నున్నాఁడు. ఈవిషయమును నేను జ్ఞానదృష్టిచేతఁ దెలిసికొంటిని. నీవు నావలన మంత్రములను గ్రహింపుము. ఆమంత్రముల బలముచేత ద్రోణాచలమును జూడఁగలవు. ఇప్పు డాపర్వతము గంధర్వులచేత కాపాడఁబడుచున్నది. అట్టి పర్వతమును నీవు తీసికొనిరాఁదలఁచి యున్నావు. కావున నీవక్కడకుఁబోక లంకాపట్టణమునకుఁ బోయిచూచివచ్చి పిమ్మట నాకు గురుదక్షిణ నిమ్మనియె. అంతట హనుమంతుఁడుపోయి యామడుగునందలి యుదకమున్ద్రాగె. అట్లు జలమున్ద్రాగునపుడు కన్నులను మూసికొనుటచేత నొకముసలివచ్చి యాహనుమంతుని పట్టుకొనియె. అప్పుడు హనుమంతుఁడు ఆమొసలియొక్క నోటియందుఁ బ్రవేశించినపిమ్మట నామొసలియొక్క పొట్టనుచించి దానిఁజంపె. అంతట నామొసలి యంతరిక్షమునందు దివ్యరూపముతో స్త్రీరూపమును ధరించియుండి హనుమంతునితో నిట్లనియె. ఓ యాంజనేయా! నేను ధాన్యమాలియను దేవాంగనను. నేను పూర్వమునందొకమునివరునితో రమింపఁగోరితిని. అంతట నామునివరుఁడు నన్ను మొసలివై యీమడుగునందుఁబడియుండు మనిశపించె. అంతట నేను బహువిధములఁ బ్రార్థింపఁగా నాంజనేయునివలన నీకుశాపమోక్షము కలుగుననియె. అదిమొదలుకొని నీరాగమమును కోరుచుంటిని. దైవయోగముచేత నీవిచ్చోటునకువచ్చి నన్ను ముక్తునిగాఁ జేసితివనిచెప్పి యాధాన్యమాలి మఱియు నిట్లనియె. ఓయాంజనేయా! నీచేతఁజూడఁబడిన యాశ్రమమునందున్నవాఁడు కాలనేమియనురాక్షసుఁడు. వాఁడు రావణానుమతిచేత వచ్చి నిన్నుమోసపుచ్చుటకు మునివేషమును ధరించియున్నాఁడు. కావున నీవు శీఘ్రముగఁ బోయి వానింజంపి యిఁకమీఁద నితరుల వాక్యములను నమ్మక ద్రోణాచలమును గొనిపొమ్మనిచెప్పి యాధాన్యమాలి స్వర్లోకమునకుఁబోయె. అంతట మిగుల వేగముతోఁ బోయి యిట్లనియె. ఓమునివర్యా! మిగుల దృఢమైనదియును నిన్నుఁ జంపునట్టిదియును నగు పిడికిలిని నీకు గురుదక్షిణగానిచ్చెద ననిచెప్పి యాకాలనేమియొక్క రొమ్మునగులునట్లు పిడికిలితోఁబొడిచె. అప్పు డా కాలనేమి నెత్తురును గ్రక్కుచుఁ గ్రిందఁబడి ప్రాణములనువిడిచె. అంతట నాహనుమంతుఁడు క్షీరసముద్రముదగ్గరకుఁబోయి గంధర్వులనుజయించి ద్రోణాచలమునుగైకొని వచ్చుచుండఁగా మార్గమధ్యమునందు భరతునిబాణముతగిలి యాపర్వతముక్రిందఁబడియె. అప్పుడు హనుమంతుఁడు భరతునిజూచి రాముఁడనితలఁచి విహ్వలుఁడై మృదుమధురవచనములతో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవిక్కడకెందుకు వచ్చితివి. రావణునిచేత నీవు జయింపఁబడితివా? ఏమి? యుద్ధమునుండి తరుమఁబడితివా? ఏమి? అని హనుమంతుఁడు చెప్పినమాటలనువిని రాత్రికాలమగుటచేత నాహనుమంతుని

రాక్షసునిగాఁదలఁచి మఱియొకబాణమును ప్రయోగింపఁదలఁచి సంధానముచేసె. అప్పుడు హనుమంతుఁడు బాణహస్తుఁడైన భరతునిఁజూచి యితఁడు రాముఁడు కాఁడనితలఁచి క్షణముసేపుఁ హృదయమునం దాలోచించి యిట్లనియె. ఓరాజోత్తమా! నీ వెవ్వఁడవో నేనెఱుఁగను. నేను రామదూతను రామానుగ్రహముచేత నాబలమును జూపెదను. చూపుమనినవిని భరతుఁ డాహనుమంతునితో నిట్లనియె. ఓపురుషోత్తమా! రాముఁడునాకగ్రజుఁడు. నాయన్నయగు రామునకును నీకును నెట్లుస్నేహముకలిగెనో యావృత్తాంతమును సమగ్రముగఁ దెలుపుమనిన హనుమంతుఁడువిని జరిగినవృత్తాంతమును సర్వమును తెలిపె. ఆవృత్తాంతమును సర్వమును భరతుఁడువిని సంధానముచేసినబాణముచేత క్రిందఁబడిన ద్రోణాచలమును పైకిలేవనెత్తి హనుమంతునిచేతికిచ్చె. అంతట హనుమంతుఁడు లంకాపట్టణమునకుఁ బోయి సంజీవినీలతలచేత లక్ష్మణుఁడును వానరులును జీవించినపిమ్మట భరతునివృత్తాంతమును సర్వమును రామునకుఁ దెలిపె. అనంతరమందు రామునకు నమస్కరించి యాద్రోణాచలమును గొనిపోయి మరల స్వస్థానమునందుఁ బ్రవేశపెట్టె. అట్లు ద్రోణాచలమును యథాస్థానమునందుఁ బ్రవేశపెట్టి వచ్చునపుడు మార్గమధ్యమునందు భరతునిజూచి లక్ష్మణుఁడు జీవించినవృత్తాంతమునుచెప్పి యధికవేగముతో మరల లంకాపట్టణమునకుఁబోయె. అంత నక్కడ భరతుఁడు సకలరాజులను సైన్యసమేతముగరప్పించి రామునకు సహాయముగఁ బోఁదలఁచె. అంత నిక్కడ రావణుఁడు తనమంత్రులగు రాక్షసులను బిలిచి యిట్లనియె. ఓదూతలారా! మీరు శీఘ్రముగఁబొండు. పోయి పాతాళలోకమునందు నివసించియున్నవారును మహాబలవంతులును నైన యైరావణమైరావణు లనువారితో నాయుద్ధవృత్తాంతమును సర్వమును చెప్పుఁడనియె. అంతట రావణునిదూతలుపోయి యావృత్తాంతమును ఐరావణ మైరావణులకుఁ దెలిపిరి. అంతట నయ్యిరువురును మిత్త్రుఁడగు రావణునకుఁగలిగిన యాపదనువిని విహ్వలమనస్కులై లంకాపట్టణమునకు వచ్చిరి. మఱియు నయ్యిరువురును రామలక్ష్మణులను చంపఁదలఁచిరి. అట్లుతలఁచివచ్చి యారాత్రియందు హనుమంతునితోఁకచేత వానరసైన్యముచుట్టును కట్టఁబడియున్న కోటనుచూచిరి. చూచి యాకోటయందుఁ బ్రవేశించుటకు నాకాశమున కెగిరి యాకోటయందుఁబడిరి. పడి వానరసైన్యమునందు యుద్ధాయాసముచేత నొక్కశిలయందుఁబడి నిద్రించుచున్న రామలక్ష్మణులను చూచిరి. అంతట నారామలక్ష్మణులను ఆశిలతోఁగూడ మెల్లగఁ దమపాతాళలోకమునకుఁ దీసికొనిపోయిరి. అంతలోపల హనుమంతుఁడు వానరసైన్యమునందు రామలక్ష్మణులు లేకుండుటకుఁజింతించి యైరావణమైరావణులు రామలక్ష్మణులను దీసికొనిపోవుటను దెలిసికొని పాదమార్గముచేత పాతాళలోకమునకుఁ బోయె. అట్లు హనుమంతుఁడు పోవుటకుముందు మైరావణునిభార్యయగు [illegible]

యిట్లనియె. ఓ మనోనాయకుఁడా! ఇప్పుడు మానవమాంసమును భుజించుటకిచ్ఛయించుచున్నావా? అనిన నామైరావణుఁ డిట్లనియె. ఓతరుణీ! మానవులగు నీరామలక్ష్మణులను ఈ రసాతలలోకమునందలి మహాదేవికి బలియిచ్చుటకుఁ దీసికొని వచ్చితిని. అట్లుచేసి యనంతరమా దామాంసమును భుజించెదననియె. హనుమంతుఁ డావాక్యమునువిని కొంచెముగ సంతోషముకలవాఁడై పోవుచు మైరావణునిద్వారమునందుఁ గావలియున్న మకరధ్వజుఁ డనువానినిజూచె. ఆ మకరధ్వజుఁ డాహనుమంతునిజూచి పట్టుకొనియిట్లనియె. ఓరీ! నీవెవ్వఁడవు? నీవృత్తాంతమును సర్వమునుచెప్పుమనిన హనుమంతుఁడిట్లనియె. నేను రామదూతను, లంకాపట్టణమునుండి రామలక్ష్మణు లిక్కడకుఁదేఁబడిరి. మఱియు నారామలక్ష్మణులు నిద్రనుపొందుచున్న సమయమునందు ఇరువురు రాక్షసులుగొనివచ్చిరి. కావున నా రామలక్ష్మణులను వెదకుచు నిక్కడకువచ్చితిని. ఆరామలక్ష్మణు లెక్కడనున్నదియును నీకుఁ దెలిసినయెడలఁ జెప్పుమనినవిని యామకరధ్వజుఁ డనువాఁడిట్లనియె. ఓరామదూతా! రామునిసైన్యమునందు మాతండ్రియగు నంజనానందనుఁడు కలఁడఁట. అతఁడు సుఖముగనున్నాఁడా? అనినవిని హనుమంతుఁడు చకితుఁడై యామకరధ్వజునితో నిట్లనియె. ఓమకరధ్వజుఁడా! హనుమంతునకు భార్యయే లేదే? భార్యలేనివానికి పుత్త్రుఁ డెట్లుగలుగుననిన నామకరధ్వజుఁ డిట్లనియె. ఓవానరోత్తమా! హనుమంతుఁడు లంకాపట్టణమునుకాల్చి తోకను చల్లార్చుకొనుటకు సముద్రముదగ్గరకు వచ్చియున్నకాలమునందు ఆవానరుని శరీరమునందలిచెమట సముద్రమునందుఁబడె. ఆచెమటబిందువు నొక్కమొసలిమ్రింగె. అందువలన నామొసలి గర్భవతియై కొన్నిదినములకు నన్నుఁగనియెనని యామకరధ్వజుఁడు చెప్పినవాక్యమును హనుమంతుఁడు విని నేనే హనుమంతుఁడననియె. అప్పుడు మకరధ్వజుఁడు తండ్రియగు హనుమంతునకు నమస్కరించి సకలవృత్తాంతమును తెలియఁజేయఁదలఁచి ఇట్లనియె. ఓతండ్రీ! హనుమంతుఁడా! ఆరామలక్ష్మణులను కామాక్షీదేవికి బలియిచ్చుటకొఱకునై రావణుఁడు నిశ్చయించె. రేపటిదిన మాకార్యమును నిశ్చయించియున్నాఁడు. కావున రేపటిప్రాతఃకాలమునం దారామలక్ష్మణులను దేవాలయములోనికిఁ దీసికొనివచ్చును. ఆసమయమునందు నీవు దేవాలయములోనుండి యారామలక్ష్మణులను గైకొనుమనియె. అంతట హనుమంతుఁడు అణుమాత్రరూపమును ధరించి దేవాలయమునందుఁ బ్రవేశించి కవాటములనుబంధించె. ఆసమయమునందు ఆరాక్షసులిరువురును దేవీపూజనిమిత్తము దేవాలయములోనికి వచ్చిరి. అప్పుడు హనుమంతుఁడు కామాక్షీదేవిచెప్పినవిధముగ సన్ననికంఠధ్వనితో నిట్లనియె. ఓరాక్షసోత్తములారా! ఇప్పుడు గవాక్షమునుండి నన్నుఁబూజింపవలయును. మఱియు నోరాక్షసోత్తములారా! ఈరామలక్ష్మణులను వనమునందుఁబుట్టిన ఫలపుష్పాదులచేత పూజించి వనమునందలి పు

ష్పాదులచేతనే యలంకరించి దేవాలయముయొక్క కవాటమును కొంచెముగనెత్తి యారామలక్ష్మణులను లోపల విడిచిపెట్టవలయును. అట్లుచేసినయెడల నే నారామలక్ష్మణుల నారగించెదను. నన్ను నాసమయమునందుఁ జూచినవాఁ డంధుఁడగునని యె. ఈవిధముగాఁజెప్పిన దేవీవచనమునువిని కామాక్షిని సంతుష్టురాలినిగాఁ దలఁచి యారాక్షసులు గవాక్షమునుండియే దేవికిఁ బూజనుజేసి పక్వాన్నాదులను నివేదించిరి. మఱియును పంచామృతఘటాదులనుకూడ నొసంగిరి. అంతట హనుమంతుఁడు వానినన్నిటినిభుజించి యిట్లనియె. ఓరాక్షసులారా! మీరొసంగినయాహారమువలన నాయాఁకలితీరలేదు. ఇంకను నాకాఁకలియగుచున్నదనియె. ఆవచనమును ఆరాక్షసులు విని మిగుల నాశ్చర్యముకలవారై తమపట్టణమునందలి యాహారపదార్థములనన్నిటిని తెచ్చిసమర్పించిరి. ఆపదార్థములనన్నిటిని భుజించె. ఆసమయమునందు పట్టణమునందంతటను సర్వో బాలురకుఁగూడ నాహారము లేదే యనుకలకలధ్వనికలిగె. అప్పటికిని నాదేవియొక్క యాఁకలితీరకపోవుటచేత రామలక్ష్మణులను వనపుష్పాదులచేత నలంకరించి గవాక్షములద్వారమునఁ బడవైచిరి. అప్పుడు హనుమంతుఁ డారామలక్ష్మణులకు నమస్కారమునుచేసి కౌఁగిలించుకొని యావృత్తాంతమును సర్వమును రామలక్ష్మణులకుఁ దెలిపె. అంతట కవాటమును దెఱచె. అప్పు డారామలక్ష్మణులు దేవాలయమునుండి బయలువెడలివచ్చి క్షణమాత్రములో బాణవర్షముచేత నారాక్షసుల సైన్యమును సర్వమును నశింపఁజేసిరి. పిమ్మట నారాక్షసుల నిరువురిం జంపిరి. అంతట మరల నయ్యిరువురునుజీవించిరి. ఇవ్విధముగ నూఱుపర్యాయములు చంపఁబడియును జీవించిరి. అట్లగుటచే రామలక్ష్మణులు మిగులనాశ్చర్యమునుపొందుచుండిరి. ఆసమయమునందు హనుమంతుఁడు మారురూపముతో నిటునటుతిరుగుచు మైరావణునిభార్యయొద్దకుఁబోయి యారాక్షసు లేవిధముగ మరణమునుపొందుదురని యడిగిన నతనిభార్య యిట్లనియె. ఓ వానరోత్తమా! నేను నాగకన్నియను. నన్నీరాక్షసుఁడు బలాత్కారముగ గ్రహించె. మఱియు నీమైరావణుఁడు ఎల్లప్పుడును నన్ను దుష్టబుద్ధిచేతఁ జూచుచున్నాఁడు. మఱియు నారాక్షసులిరువురును నాతో క్రీడించుచుందురు. నాకాయిరువురితోడను క్రీడించుటకుఁదగినశక్తిలేకయున్నది. మఱియు నాయిరువురిలో నొకఁడు మిత్త్రుఁడు, మఱియొక్కఁడు శత్రువునునై యుండును. ఈవిధముగా నిరువురును శత్రుమిత్రత్వములను మార్చుకొనుచుందును. కావున వీరిరువురును మరణమునెప్పుడు పొందుదురా? అనినేనుతలఁచుచుందును. ఓ హనుమంతుఁడా! రాముఁడు నన్ను భార్యనుగాఁగ్రహించినయెడల నైరావణమైరావణు లిరువురును మరణమునుపొందువిధమును నేను చెప్పెదననియె. హనుమంతుఁ డావృత్తాంతమునువిని శ్రీరామునితోఁజెప్పి తగినయుత్తరమునుగైకొని యానాగకన్నియయొద్దకుఁబోయి యిట్లనియె. ఓతరుణీ! శ్రీరాముఁడు నీకుభర్తయగుటకంగీకరింపక మరణ

ముసుపొందిన నీభర్తయగు మంచకుఁడు మరలజీవించి నీకుభర్తయగునట్లు చేసెద
ననియె నని హనుమంతుఁడు చెప్పినవిని యానాగకన్నియ యందులకంగీకారమును
పొందియిట్లనియె. ఓయాంజనేయా! పూర్వ మొకనాఁడు బాలకులచేత సూలా
రోపణము చేయఁబడిన తుమ్మెదల నీరాక్షసు లిరువురును బ్రదికించిరి. అందువలన
నాతుమ్మెదలు తృప్తినిపొంది మమ్ములను మరణమునుండి కాపాడితిరి కనుక మి
మ్ములను మరణమునుండి మేమురక్షించెదమనియె. అందువలన నాతుమ్మెదలు అమృ
తమునుతీసికొనివచ్చి మృతులయినయారాక్షసులరక్తమునందుఁబెట్టును. అందువలన
నారాక్షసు లెన్నిపర్యాయములు చంపినను జీవించుచుందురు. ఆతుమ్మెద లిప్పు
డెక్కడనున్నవి. ఓ యాంజనేయా! ఆతుమ్మెద లిప్పుడు నిద్రాస్థానమునుపొందియు
న్నవి. వానిని సంహరింపుమనిన విని హనుమంతుఁ డాతుమ్మెదలనన్నిటిని మర్దించు
చుండె. అట్లు మర్దించుచుండఁగా నొక్కతుమ్మెద శరణమునుపొందఁగా హనుమం
తుఁ డిట్లనియె. ఓభ్రమరమా! మంచకగర్భమును ఏనుఁగు మ్రింగిన వెలగపండువ
లెఁ జేయుమనినవిని యాభ్రమర మావిధముగానేచేసె. అంతట రాముఁ డారాక్షసు
లనిరువురిం జంపి వారిస్థానమునందు మకరధ్వజునకభిషేకమునుచేసి మరల లంకాపట్ట
ణమునకు బయలువెడలిపోదలఁచె. అప్పుడు హనుమంతుఁడు ప్రార్థింపఁగా శ్రీరా
ముఁడు నాగకన్నియగృహమునకునచ్చె. ఆసమయమునం దానాగకన్నియ రాముని
హస్తమునుపట్టుకొని తనయభిప్రాయమును తెలిపిన శ్రీరాముఁడు నవ్వుచునిట్లనియె.
ఓనారీమణీ! నీవు ఈదేహాంతమందు భూలోకమునందలి బ్రాహ్మణకులమునందుఁ
బుట్టి నన్నుగుఱించి ఘోరమగుతపస్సునుచేసి ద్వాపరయుగమునందు మఱియొకజ
న్మమును పొందుదువు. అప్పుడు నీవునాకు భార్యవుకాఁగలవనియె. అట్లుచెప్పిన శ్రీ
రామునివచనమును విని యానాగకన్నియ శ్రీరాముఁడు చూచుచుండఁగానే యగ్ని
యందుఁబ్రవేశించె. అనంతరమం దాకన్య సముద్రపుగట్టునఁ గన్యాకుమారియను
నామధేయమునువహించె. అంతట శ్రీరామలక్ష్మణులు హనుమంతునిభుజములమీఁ
దనెక్కి మిగుల సంతోషముతో బయలువెడలి క్షణమాత్రములోపల లంకాపట్ట
ణమునకువచ్చిరి. అక్కడ మకరధ్వజుఁడు లక్ష్మణుఁడనువానిని మంత్రిగాఁజేసికొని రాజ్య
మునుపాలించుచుండె. అట్లువచ్చిన రామలక్ష్మణులనుజూచి సుగ్రీవాదివానరులు పర
మానందముకలవారై రామలక్ష్మణులను నాలింగనమును చేసికొనిరి. మఱియు నా
వానరులందఱును మాటిమాటికిని రామలక్ష్మణులకు పలుమారులు నమస్కారము
లనుజేసి యానందించిరి. అప్పుడు శ్రీరాముఁడు పాతాళలోకమునందు జరిగినవృత్తాం
తమును సర్వమును సుగ్రీవాదులకుఁ దెలిపె. అంత నక్కడ రావణుఁడు తనమిత్రు
లు రామునిచేఁ జంపఁబడి రనువృత్తాంతమును విని మిగులభయమునుకలవాఁడై
తనవారలతో నిట్లనియె. ఓ రాక్షసోత్తములారా! బ్రహ్మదేవుఁడు పూర్వమునందు
నాకు మానవునిచేతనే మరణము కలుగునని చెప్పెను. కావున రాముఁడు మా

నపుఁడు కాఁడనియును సాక్షాన్నారాయణుఁ డనియును తలఁచుచున్నాఁడను. ఆనారాయణుఁడు దశరథరాముఁడై నన్నుఁజంపుటకు జన్మించెను. పూర్వము యజ్ఞదీక్షితుఁడగు ననరణ్యుఁ డనురాజు నాచేతఁజంపఁబడియె. అప్పుడు ఆయనరణ్యుఁడు సూర్యవంశమునందుఁ బుట్టినవానివలన నీకు మరణముకలుగునని శపించె. మఱియును పరమాత్మయగు నారాయణుఁడు మావంశమునందుఁ బుట్టునని యును, ఆపురుషుఁడు నిన్నుఁ బుత్త్రమిత్త్రాదులతోఁగూడఁ జంపునని యుఁజెప్పె. ఇవ్విధముగ నాయనరణ్యుఁడు శపించి స్వర్గలోకమునకుఁబోయె. అట్టిసమయ మిప్పుడువచ్చినది. నిజముగ రాముఁడనువాఁడు యుద్ధమునందు నన్నుఁజంపుటకు వచ్చె. కావున నిశ్చయముగ నా కీరామునివలన మరణముకలుగును. కావున నోరాక్షసోత్తములారా! కుంభకర్ణుని నిద్రనుండి లేపి నన్ను గారవింపుఁడనియె. ఆవాక్యమును విని రాక్షసులందఱును కుంభకర్ణుని నిద్రలేపుటకుఁ బోయి యతనియుచ్ఛ్వాస నిశ్వాసవాయువులచేత నాకుంభకర్ణునిపొట్టలోనికిఁ బోవుచు వచ్చుచునుండిరి. అంతటఁ గొంతసేపటికి రాక్షసులు బాహుపాశములచేత బలమునుధరించి వృక్షములచేతను పాదములచేతను ఆకుంభకర్ణుని గొట్టుచుండిరి. మఱియు ననేకములగు శిలలచేతను ఒంటులచేతను సలుగఁగొట్టిరి. మఱియును కాష్ఠభారములకు నగ్నినంటించి మహాదాహమును గల్పించిరి. అంతటఁ గొంతసేపటి కాకుంభకర్ణుఁడు మేల్కాంచి యనేకకోట్ల మహిషాదిజంతువులనుభక్షించి యనేకములగు సరస్సులలోనిజలమును ద్రావి రావణాసురునొద్దకుఁ బోయి నమస్కరించి యిట్లనియె. ఓయీరాక్షసోత్తమా! నేనొక్కనాఁ డరణ్యమునందు సంచరించుచు నారదమునివరుని జూచి యోమునివర్యా! ఎక్కడనుండి పోవుచున్నావనిన నమ్మునివరుఁ డిట్లనియె. ఓరాక్షసోత్తమా! నేను దేవలోకమునుండి యయోధ్యాపట్టణమునకుఁ బోవుచున్నాఁడను. రావణాదులను యుద్ధమునందుఁజంపుటకు నారాయణుఁడు మానవుఁడై యయోధ్యాపట్టణమునందుఁ బుట్టియున్నాఁడు. దేవవాక్యానుసారముగ రామునితోఁ శీఘ్రముగ నీవువచ్చిన కార్యమును చేయుమని చెప్పుటకుఁ బోవుచున్నానని చెప్పిపోయె. అట్లుపోయి యీరామునిపంపె ననినేనువింటిని. కావున నావృత్తాంతమును నీకుఁదెలిపితిని. నీవు వ్యర్థముగ నశింపక రామునకు సీతనుసమర్పించి రామునితో సఖ్యముచేయుము. అట్లు చేయనియెడల సమూలముగ నశింతువనిన విని రావణుఁడిట్లనియె. ఓరీ! కుంభకర్ణా! నీముఖమునందు నిద్రవ్యాపించి కన్నులను మూయుచున్నది. కావున నీవుపోయి సుఖముగనిద్రింపుమని మిగులఁ గ్రూరముగఁ బలుకుచున్న రావణునివాక్యములను విని రావణునకు నమస్కరించి యామేడనుండిదుమికి యతిశీఘ్రముగ యుద్ధమునకు బయలువెడలిపోయె. అట్లు మిగులరోషావేశముతో యుద్ధమునకువచ్చిన కుంభకర్ణునిఁజూచి వానరులందఱును భయవిహ్వలులై రామునిసమీపమునకుఁ బరుగిడిరి. ఆసమయమునందు విభీషణుఁడు కుంభకర్ణునకు నమస్కరించి వినయముతో నిట్లని

డెను. ఓయగ్రజా! కుంభకర్ణా! సీతను రామునకుసమర్పింపుమని నేను రావణున
కనేకవిధములబోధించితిని. అంతట రావణుఁడు కోపోద్దీపితుఁడై ఛీఛీ! పొమ్మనియె.
ఆవచనమునువిని రాఘవుని సేవించుటకు బయలువెడలివచ్చితి ననినవిని కుంభకర్ణుఁ
డిట్లనియె. ఓతమ్ముఁడా! నీవు యుక్తమైనకార్యమును చేసితివి. నీవు యుద్ధమునందు
నాయెదుటనుండకుము. యుద్ధమునందు నీఁవు బంధువనియును నీఁవు మిత్రుఁడ
నియును చూడఁగూడదు. కావున నీవు యుద్ధరంగమునందు నాయెదుటికి రావ
ద్దనియె. అంతట విభీషణుఁడు కుంభకర్ణునకు నమస్కరించి రామునొద్దకుఁ బోయె.
అంతట నక్కడ కుంభకర్ణుఁడు తన సమీపమున నున్నవానరుల నందఱను
హస్తములచేతను పాదములచేతను నలిపివైచె. మఱియును వానరసైన్యము
నందు యథేచ్ఛముగఁ దిరిగి వానరాధిపతి యగు సుగ్రీవుని త్రిశూలముచేతఁ
గొట్టిపట్టుకొని లంకాపట్టణమునకుఁ దీసికొనిపోవుచుండె. అంతట సుగ్రీవుఁడు మార్గ
మధ్యమునందు స్వస్థచిత్తుఁడై గోళ్లచేత ఆకుంభకర్ణుని ముక్కును చెవులను
త్రుంచి యాకుంభకర్ణుని చేతులనుండి యెగిరిపోయి శ్రీరామునొద్దఁజేరె. అప్పుడు
కుంభకర్ణుఁడు లంకాపట్టణములోనికిఁ బోయినయెడల నెల్లవారును నవ్వుదు రనిత
లఁచి మరల యుద్ధభూమికి బయలు వెడలిపోయె. అట్లు మరల యుద్ధభూ
మికి వచ్చిన కుంభకర్ణుని చూచి శ్రీరాముఁడు కోపోద్దీపితుఁడై మిగులఁ దీక్ష్ణ
ములైన బాణముల నాకుంభకర్ణునిమీఁదఁ బ్రయోగించె. అంతట నాకుంభకర్ణుఁ
డు కోపోద్దీపితుఁడై వృక్షములను పర్వతములను రామునిమీఁదఁ బ్రయోగించె.
ఆపర్వతవృక్షాదులనన్నిటిని రాముఁడు మిగులఁదీక్ష్ణములయిన బాణములచే ఛేదించె.
అనంతరమందు వాయవ్యాస్త్రముచేత ఆకుంభకర్ణుని హస్తముల నాయుధముతోఁ
గూడ ఛేదించె. అట్లు బాహువులను ఛేదించినపిమ్మట నాకుంభకర్ణుఁడును ముల్లోక
ములవారును భయమును పొందునట్లు గర్జించుచుండె. అంతట రాముఁ డర్ధచం
ద్రాకారములయిన రెండుబాణములచేత నాకుంభకర్ణుని పాదద్వయమును ఖండించె.
అట్లు హస్తపాదములు ఛేదింపఁబడినపిమ్మటఁగూడ కుంభకర్ణుఁడు మిగులభయంక
రుఁడై యుండె. పిమ్మట నాకుంభకర్ణుఁడు బడబాముఖమువంటి నోరును తెరచికొని
శ్రీరామున కభిముఖముగవచ్చుచుండె. అట్లు వక్త్రమును తెఱచుకొనివచ్చుచున్న కుం
భకర్ణుని నోటినిండ బాణములనుజొనిపె. అప్పుడుకూడఁ కుంభకర్ణుఁడు మిగులభ
యంకరుఁడై యుండె. అనంతరమందు శ్రీరాముఁడు సూర్యునితో సమానమగు కాం
తికల యైంద్రాస్త్రమునుప్రయోగించి యాకుంభకర్ణుని శిరస్సును ఖండించె. ఆసమయ
మునందు దేవదుందుభులు మ్రోఁగె. దేవతలు పుష్పవర్షమును గురిపించిరి. మఱియును
దేవాదులు రాముని ననేకవిధముల స్తోత్రము చేసిరి. ఈవృత్తాంతమును సర్వమును
విని రావణుఁ డత్యధికమగు దుఃఖమును పొందుచుండె. అప్పు డింద్రజిత్తుకూడ పిన
తండ్రిమరణమును పొందినందుకుఁ గొంచెము సేపు దుఃఖించి తండ్రినూరార్చి యిట్లు